
మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th Every Month
Date of Publication: 25.12.2025
Posting at BPC IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001



పద్మ హృదయం

# మిసిమి


చింతనాత్మక సారస్వతం



ఆదిత్య హృదయం

మాసపత్రిక, జనవరి, 2026 ₹ 60/-

ISSN 2454–4329



సహజ చిత్రం



కష్ట ఫలం

# మిసిమి

మాసపత్రిక


సంపుటి 37 సంచిక 1

జనవరి - 2026


సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్


Published by

**BAPANNA ALAPATI**

**1-1-60/5, R.T.C. 'X' Roads,**
**Hyderabad - 500 020.**
**Ph. 040-27645536.**

Editor: V. ASWINI KUMAR
**Ph: 994 951 6567**


**చందా వివరాలు:**

₹ 720/- (సంవత్సర చందా),
₹ 1,440/- (రెండు సంవత్సరాలకు),
₹ 2,160/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : జి. ఉమాసుందరి
040-27645536

Scan QR to Pay
Misimi A Unit of Kalajyothi


LIBRARY OF CONGRESS
LCCN 91-903060

PEER REVIEWED

ISSN
INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
ISSN 2454-4329

misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com
www.misimimonthly.com
YouTube Silver jubilee celebrations of MISIMI Telugu Monthly

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## జనవరి నెల సూచికలు...




కాశీనాథుని నాగేశ్వరరావు


**మిసిమి** డైరి : అశ్వినికుమార్ / సి.ఎస్. రాంబాబు ... 3
జీవన మకరందం : ఆస్కార్ వైల్డ్ ... 10
ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి : ఆచార్య కోదాటి వియ్యన్నరావు ... 11
విలక్షణ విజ్ఞాన వాటికలు : గద్దం దేవీప్రసాద్... 17
అమృతాంజనం : వేలూరి కృష్ణమూర్తి ... 20
క్రిస్టీ బ్రౌన్ : టి.వి. ప్రసాద్ ... 23
ప్రగతిపథంలో తెలుగు జర్నలిజం : డాక్టర్ జీకేడీ ప్రసాదరావు ... 28
దుర్గేశనందిని : ప్రొ. వై. పార్థసారథి ... 32
అప్పాజోస్యుల సత్యనారాయణగారితో : **మిసిమి** ...35
తెలుగు నవల-ప్రయోగ వైవిధ్యం : ఆచార్య కరిమిండ్ల లావణ్య ... 41
భర్తృహరి : ఆచార్య పి. ఆర్. హరినాథ్ ... 45
బెలరూస్-1 : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు ... 47
లలితసంగీత పరిమళం : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 55
తంజావూరు సంస్థానం-తెలుగునాయక రాజులు : డా. సగిలి సుధారాణి ... 58
డా. చార్ల్స్ లూయి ఫాబ్రి : బి.వి. రామిరెడ్డి ... 61
రంగరాజన్-రిజర్వ్ బ్యాంక్ : అలజంగి మురళీధరరావు ...64
జార్జి ఆర్వెల్ : డా.జె. రవీంద్రనాథ్ ...69
సృజనాత్మకతకు ప్రతీకలు-వస్త్రాలు : ప్రొ. తంగెడ కిషన్‌రావు ...71
రైళ్ళు మళ్ళా నడిచాయి-ఘంటికోట బ్రహ్మాజీరావు : రాజా ... 74
అలవోకగా పూర్తి చేసే పుస్తకం : **మిసిమి** ... 75
ప్రాచీన తెలుగు మార్గాన్వేషణి : కన్నీడి మనోహర్ ... 76
చదవండి : **మిసిమి** ... 79




అప్పాజోస్యుల

### అట్టమీద బొమ్మలు




ఆదిత్య హృదయం



సహజ చిత్రం



కష్ట ఫలం



పద్మ హృదయం

# ప్రయాణం నేర్పిన ప్రమాణాలు

మన ఆనందం కోసం చేసే ప్రయాణాల కన్నా, మనుషులను కలిసేందుకు చేసే ప్రయాణాలు మనలో ఆనందంతో పాటు లోకజ్ఞానం కూడా పంచుతాయి..ఆ మనుషులు సాహిత్య జీవులైతే అవి వికాసాన్ని పంచుతూ మన లోచూపును విస్తృతం చేస్తాయి. డిసెంబర్ మూడో తేదీ నుంచి ఏడోతేదీవరకు మేము చేసిన ప్రయాణం ఆ ఎరుకను మనసంతా నింపింది

***డిసెంబర్ మూడవ తేదీ***

మధ్యాహ్నం మూడుగంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి విజయవాడ స్టేషన్‌కు ఆరు గంటల యాభై నిముషాలకు రావలసిన వందేభారత్ ఎక్స్ప్రెస్ ఏడు గంటల ముప్పై నిముషాలకు రావటంతో కాస్త అసహనంగా స్టేషన్ దిగాం. డిసెంబర్ మాసపు చలిగాలులు మెల్లగా పలకరిస్తున్నాయి. విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఏ టైంలోనైనా సరే సందడి ఉదయపు వెలుగై ప్రకాశిస్తూ ఉంటుంది. అంతే కోలాహలం స్టేషన్ బయట కూడా నియాన్ లైట్ల కాంతిలో అలుముకుంది..



రేడియో రాంబాబుని సన్మానిస్తూ తోటకూర ప్రసాద్, బెజవాడ ఆకాశవాణి డైరెక్టర్

బక్క పలచగా కళ్ళద్దాలు ధరించిన ఆటో డ్రైవర్ ఒకతను చనువుగా మా సూట్కేస్ తీసుకున్నాడు.. రండి సార్ అంటూ.. మనోరమా హోటల్‌కి పోనివ్వమని అంతే చనువుగా అడిగారు అశ్విని.. ఎంతో చెప్పలేదు అని ఆ డ్రైవర్‌ని నిష్టూరంగా అడిగితే వందిప్పించండి అని చాలా మృదువుగా అడిగాడు. సరే అని సర్దుకున్నాం ఇద్దరం.. చాకచక్యంగా ట్రాఫిక్‌ను తప్పిస్తూ, అడ్డొచ్చిన వాహనాలను అందంగా విసుక్కుంటూ గమ్యం చేర్చాడు. విజయవాడ ఆటో డ్రైవర్లు విసుక్కున్నా అందంగా ఉంటుందనుకున్నాం..

అదేమిటో మనోరమ హోటల్‌కు ఎప్పుడూ మరమ్మతులు జరుగుతునే ఉంటాయి.. ఈసారి మేనేజ్మెంట్ మారిన సందర్భంగా అని అక్కడి మేనేజర్ టోనీ చెప్పాడు.. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా వచ్చినప్పుడు కొన్ని లాభాలు ఉంటాయి, నష్టాలు ఉంటాయి. లాభం కొంచెం చవగ్గా రూం దొరికితే, నష్టం అది చిన్న రూం అవుతుందని అప్పుడే తెలిసింది.. మేము గట్టిగానే అడిగాం. మమ్మల్ని శాంతపరచడం ఇక్కడున్న కౌంటర్ క్లర్క్‌తో సాధ్యం కాకపోవడంతో మేనేజర్ టోనీ, టోన్ సవరించుకుంటూ ముందుకొచ్చాడు. మాతో ఏకీభవించి, పెద్దగది ఏర్పాటు చేశాడు.. చెక్ అవుట్ ఆరుగంటలు ఆలస్యంగా చేస్తున్నందుకు మరీ ఎక్కువ కాకుండా, మాకు అంగీకారమయ్యే అదనపు రుసుము మాత్రమే కలిపాడు..

చికాకులు లేని రూం సర్వీస్‌తో, కొత్తగా యాజమాన్యం బాధ్యతలు తీసుకున్న Holiday Inn Express స్టాఫ్ అంతా నల్లటి టీషర్ట్‌లు ధరించి ఉల్లాసంగా, ఉత్సాహంగా అతిథులందరినీ చిరునవ్వుతో పలకరించటం ఆశ్చర్యం కన్నా ఆనందాన్ని కలుగచేసింది.. బేస్ మెంట్‌లో ఉన్న రెస్టారెంట్ పలుచగా ఉంది.. పక్కనే ఉన్న వేప్ బార్ మాత్రం కిటకిటలాడుతోంది.. చల్లటి వాతావరణంలో వేడి వేడి సూప్ ఉఫ్ ఉఫ్ అంటూ ఊదుకుంటూ తాగుటమో అనుభూతి..

***డిసెంబర్ 4***

డిసెంబర్ 4 ఉదయాన్నే మిత్రుడు రాజారెడ్డితో కలిసి కాఫీతో కబుర్లు చప్పరిస్తుంటే అశ్విని గారి నుండి ఫోన్.. తొందరగా రండి "తానా" తోటకూర ప్రసాద్ గారొస్తున్నారు.. వారితో అల్పాహారం అనంతరం

ఇంటర్వ్యూ రికార్డు చేయాలంటూ.. సరిగ్గా ఎనిమిది గంటల ముప్పై నిముషాలకు ప్రసాద్ గారు వాహనం దిగగానే కరచాలనాలనంతరం రెస్టారెంట్‌లో ప్రవేశించాం.. సమృద్ధిగా అల్పాహార సేవనం అయ్యాక, వారితో పిచ్చాపాటి కానించి ఇంటర్వ్యూ రికార్డ్ చేసేందుకు సిద్ధమయ్యాం. గంటసేపు ఎలా గడిచిందో తెలీదు.. ఆ సంభాషణలో అనేక విషయాలు దొర్లాయి.. అమెరికాలో ఉన్న తెల్లవారితో మనవాళ్ళు ఎందుకు కలవలేకపోతున్నారు అన్న అంశంపై చర్చించారు ఇరువురు..



సాహితీ ప్రచురణలు : లక్ష్మి గారు

రికార్డింగ్ పూర్తవగానే ప్రసాద్ గారి కారులో సాహితీ ప్రచురణలు లక్ష్మి గారిని కలవటానికి వెళ్ళాం.. ఆవిడో చైతన్య స్రవంతి.. చికాకు, అసహనం మచ్చుకైనా కనిపించవు.. ***మిసిమి*** కవర్ పేజీలు ఎంతగానో పేరొందాయని తెలిసిందే.. అలాంటి ఒక కవర్ పేజీ అక్కడ అందంగా పలకరించసాగింది, ఆ ఫొటో ఫ్రేం పైనే యద్దనపూడి సులోచనారాణి ఏదో ఆలోచిస్తూ కనిపిస్తారు.

చుట్టూ పుస్తకాలు మధ్యలో వారి ఉద్యోగులకు సూచనలిస్తూ మాతో మాట్లాడారావిడ.. కొత్త పుస్తకాలు వాటి అమ్మకాలు.. రాబోయే బుక్ ఫెయిర్.. ఇలా ఎన్నో అంశాలు చర్చకు వచ్చాయి..

తోటకూర ప్రసాద్ గారు ఆకాశవాణి అభిమాని.. ముఖ్యంగా విజయవాడ కేంద్రం అభిమాని. ఆయన యువవాణిలో ఎన్నో ప్రోగ్రాంలిచ్చారు.. ఉషశ్రీ గారిని వారి కాలేజీకి గెస్ట్‌గా తీసుకువెళ్ళానని ఆ సందర్భం గుర్తుచేసుకున్నారు.. డిసెంబర్ ఒకటో తేదీ ఆకాశవాణి విజయవాడ కేంద్రం డెబ్భై ఏడవ వ్యవస్థాపక దినోత్సవం అని చెప్పి నాల్గవతేదీన ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి సేవలందించిన విశ్రాంత ఉద్యోగులను సన్మానించాలని ఆయన ఆర్నెల్ల క్రితమే భావించి అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు.. ఆకాశవాణి విశ్రాంత అనౌన్సర్ ఆవాల శారద గారి సహకారంతో ఒక లిస్ట్ రూపొందించి వ్యక్తిగతంగా ఆహ్వానాలు పంపారు.. విశ్రాంత అధికారులు, అనౌన్సర్లు, స్టాఫ్ ఆర్టిస్ట్‌లతో పాటు డా. రేవూరి అనంత పద్మనాభరావు, డా.నాగసూరి వేణుగోపాల్, డి.వి.మోహనకృష్ణ, సి.యస్.రాంబాబు, బి.ఆర్.ఎస్.సూర్యప్రకాశరావు, బి.జయప్రకాష్, మాడుగుల రామకృష్ణ, ముంజులూరి కృష్ణ కుమారి, పన్నాల సుబ్రహ్మణ్య భట్టు, పుల్లగూర విజయకుమార్ బాబు, మల్లాది సూరిబాబు, మోదుమూడి సుధాకర్ వంటి వారెందరో పాల్గొన్నారు. ఆరోజొక పండగ సౌరభాన్ని తలపించింది.. నవ్వులు, కరచాలనాలు, ఆలింగినాలతో ఆ ప్రదేశం పులకించి పోయింది.. హాజరైన వారిలో ఇద్దరిని ప్రముఖంగా చెప్పుకోవాలి.



శతవర్ష అన్నవరపు రామస్వామి

ఒకరు మాజీ మేయర్ తొంభై ఏళ్ళ యువకుడు డా.జంధ్యాల శంకర్ మరొకరు శతవసంతాల సుందరాంగుడు నాదసుధార్ణవ అన్నవరపు రామస్వామి.. వీరిరువురూ *1948* డిసెంబర్ *1*న ఆకాశవాణి విజయవాడ కేంద్రం ప్రారంభమైనప్పుడు ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు.. మళ్ళీ డెబ్భై ఏడేళ్ల తర్వాత వ్యవస్థాపక దినోత్సవ కోలాహలంలో పాలుపంచుకున్నారు.. వారి మొహాలు ఆరోజున పున్నమి చంద్రబింబాలై వెలిగిపోయాయంటే అతిశయోక్తి కాదు. నిజంగా అదొక చారిత్రాత్మక ఘట్టం.. ఈ ఘట్టాన్ని పదిలం చేస్తూ తోటకూర ప్రసాద్ గారు పెద్దమనసుతో కొంతమంది జానపద కళాకారులకు రేడియో సెట్‌లు బహుకరించారు. విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు.. ఆ ఆనందంలో



90 ఏళ్ల జంధ్యాల శంకర్‌తో....

మునకలు వేస్తూనే హెూటల్ మనోరమ వద్దకు చేరుకున్నాం.. సరిగ్గా ఆరుగంటలకు ముందే బుక్ చేసుకున్న ఉబర్ క్యాబ్‌లో పడ్డాం.. బయటకు వస్తుంటే మనోరమ యంగ్ స్టర్స్ పలకరించారు.. మా సర్వీస్‌తో మీరు హెపీయేనా అని అడిగారు.. వాళ్ళకీ రినోవేషన్ ఇబ్బందులు తెలుసు.. అందుకని కొంత అపాలజెటిక్‌గా జనవరిలో పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంటామని బై చెప్పారు..

కృష్ణానదిపై కనకదుర్గమ్మ వారధి తొంభైల్లో నిర్మించారు.. కేవలం రవాణాకు మరికొంత వీలుంటుందని.. ఆ వారధి మీంచి కలకత్తా -మద్రాసు నేషనల్ హైవే ఎక్కాం.. నలభై నిముషాల్లో గుంటూరు ఎల్.వి.ఆర్.సన్స్ క్లబ్‌కు చేరుకున్నాం.. డ్రైవర్ మహాశయుడు మౌనంగా ఉండటంతో ఎక్కువ మాట్లాడే వీలు కలగలేదు.. ఇంతకీ ఈ ఎలైట్ క్లబ్ చూస్తే ఆశ్చర్యం వేసింది. కావలసిన సదుపాయాలతో విశాలమైన రూమ్‌లు ఉన్నాయి .. ఇంత చక్కని సౌకర్యవంతమైన రూం మాకు ఏర్పాటు చేసిన శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ గారికి ధన్యవాదాలు చెప్పుకున్నాం.. క్లబ్ ఎన్నికల హడావిడితో కోలాహలంగా వుంది!

**డిసెంబర్ 5**

ఉదయాన్నే మార్గశిరం మంచులో తేలియాడినట్లు బయటికొచ్చి చూస్తే ఓ రావిచెట్టు, దాని సమీపంలో ముగ్గేసి, నీళ్ళుచల్లి పొగలు కక్కే ఇడ్లీ, ఘుమఘుమలాడే చట్నీతో ఓ దుకాణమూ కనిపించాయి.. అప్పటికింకా టైం ఏడవ్వబోతోంది.. వేడి వేడి బ్రూ కాఫీ ఊదుకుంటూ తాగాం. శుద్ధమైన గుంటూరు యాస చెవికి సోకుతోంది.. ఆ ఛాయ్ మాస్టర్‌కి కృతజ్ఞతలు చెప్పి తిరిగొస్తూ పరిశీలనగా చూస్తే ఎల్ వి ఆర్ క్లబ్‌లో మంచి డైనింగ్, పార్కింగ్ సౌకర్యాలున్నాయని అర్థమయింది .. దానితోపాటుగా ఎక్కడా చూడని విధంగా ఇక్కడో లైబ్రరీ ఉంది.. ఎక్కువ తెలుగు పుస్తకాలు వాటిని చక్కగా రచయిత ఆధారంగా అమర్చారు.. అక్కడి లైబ్రేరియన్ శర్మ మాకన్నీ చూపించారు.. వివరించారు కూడా..ఈ కాలంలో అలాంటి లైబ్రరీ ఉండటం ఆశ్చర్యం అనిపించింది..


పాపినేని శివశంకర్

మా ప్రణాళిక ప్రకారం కవి, కథకులు, విమర్శకులు పాపినేని శివశంకర్ గారింటికి వెళ్లి వారి ఇంటర్వ్యూ రికార్డు చేయాలి.. కానీ నేనే వస్తానంటూ ఆయనే రూంకు వచ్చారు.. నిజానికి ఆయన అంతర్ముఖుడు.. మితభాషి.. సభల్లో ప్రసంగం చేసేటప్పుడు తప్ప ఎక్కడా ఎక్కువ మాట్లాడరు.. ఆరోజున కథ, కథా విమర్శ, కవిత్వం తన జీవితంలో ఇప్పుడు చోటుచేసుకున్న ఆధ్యాత్మికత.. వీటన్నిటిపై ఆయన రెండు గంటలు అశ్విని గారితో సంభాషించారు. త్వరలోనే ఆ ఇంటర్వ్యూ రాతప్రతి ***మిసిమి***లో వస్తుంది.. వారి లోతైన పరిశీలన, పరిశోధన పాఠకులను తప్పకుండా అలరిస్తాయన్న నమ్మకం మాకుంది..


ఆలపాటి రాజేంద్రప్రసాద్, అప్పాజోస్యుల సత్యనారాయణ, కందిమళ్ల సాంబశివరావు

ఇక ఆరోజు సాయంత్రం ఆరుగంటల ముప్పై నిముషాలకు గుంటూరు లక్ష్మీపురంలో ఉన్న త్యాగరాజ సాంస్కృతిక మండలిలో అలనాటి నాటక ప్రస్థానం శీర్షికతో పాతతరం పద్యనాటక కళాకారులపై పదిగంటల వీడియోని సంక్షిప్తీకరించి గంట వ్యవధి ఉన్న దృశ్య రూపకంగా ప్రదర్శించారు అజోవిభో-కందాళై ఫౌండేషన్ వారు.. నిజానికి ఇది పదిగంటల వీడియో... త్వరలో ఈ పదిగంటల వీడియోని యుట్యూబ్ లో 45-50 నిముషాల భాగాలుగా అప్లోడ్ చేయనున్నారు. ఈ దృశ్య రూపకాన్ని రచన చేసి రూపకల్పన చేసినవారు తెలుగు నాటక రంగంలో తనకో

ప్రత్యేక స్థానం కల్పించుకున్న డా. కందిమళ్ళ సాంబశివరావు.. హాలంతా క్రిక్కిరిసిపోయింది నాటకాభిమానులతో.. ఈకార్యక్రమం ఏర్పాటు చేసినవారు అజోవిభో -కందాళై సంస్థ..


నాటక ప్రయోక్త చాట్ల శ్రీరాములు గారి 94వ జయంతి సందర్భంగా వారి స్మృత్యర్థంగా ఆరోజు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం విశేషం.. దృశ్య రూపకం ప్రదర్శన అనంతరం సభను నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించారు అజోవిభో-కందాళం సంస్థ నిర్వాహకులు అప్పాజోస్యుల సత్యనారాయణ.. ముఖ్య అతిథిగా శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, విశిష్ట అతిథులుగా తానా సంస్థ ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు శ్రీ తోటకూర ప్రసాద్.. ఇతర విశిష్ట అతిథులుగా సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్, స్థానికంగా ఉన్న రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు రామరాజు శ్రీనివాసరావు..

అప్పాజోస్యుల వారు సభను చకచకా పరిగెత్తించారు.. ఆనాటి సభా విశేషమేమిటంటే దుర్యోధన పాత్రకు ప్రసిద్ధులయిన తుర్లపాటి రాధాకృష్ణ మూర్తి గారిని సన్మానించి పాతికవేల రూపాయల నగదు పురస్కారాన్ని అందజేయడం.. రాధాకృష్ణ గారి ప్రసంగం రంగస్థలంపై ఒక పాత్ర చెప్పిన సంభాషణల్లా ఉండి ప్రేక్షకులను ఆశ్చర్యచకితుల్ని చేశాయి.. ఆ నాటి వేదిక చాలా చక్కగా అమిరింది..

అప్పాజోస్యుల సత్యనారాయణ గారిని పలకరించి తరువాతి రోజున చీరాల వస్తామని విన్నవించారు అశ్విని.. అలా ఆరోజు తీరికలేకుండా గడిచింది..

**డిసెంబర్ 6**

ఉదయం చీకట్లు తొలగుతుండగా రూంసర్వీస్ బాయ్ వేడి నీళ్ళ ఫ్లాస్క్‌తో తలుపు తట్టాడు.. కాస్త గొంతును అలా వేడిచేసి దంతధావనం చేయగానే వేడి కాఫీ టీపాయ్‌పై చేరింది.. అశ్విని గారు ఎంత తొందరపెట్టినా అయ్యే ఆలస్యం అవ్వకమానలేదు.. గుంటూరు ఇడ్లీలు గుంటూరులో సేవించి ఆలపాటి వారు పంపిన ఇన్నోవా కదిలేప్పటికి తొమ్మిది గంటల ముప్పై నిముషాలయింది.. మేమనుకున్న సమయానికి గంట ఆలస్యంగా బయల్దేరాం.. గుంటూరు పొలిమేరలో ఒక పళ్ల దుకాణంలో ప్రౌఢ ఇచ్చిన కమలాలు, దానిమ్మ, ఆపిల్స్ తీసుకున్నాం. మా చోదకుడు సలాం ఎంత చాకచక్యంగా నడిపినా గుంటూరు - పొన్నూరు-బాపట్ల-చీరాల రహదారి విపరీతమైన ట్రాఫిక్ కలిగి ఉండటంతో అతని ప్రయత్నాలన్నీ నిష్ప్రయోజనమయ్యాయి.. సలాం పేరు గమ్మత్తుగా ఉండటంతో అదే విషయాన్ని ఆతన్ని అడిగాం.. పద్దెనిమిది మంది ఉన్న కుటుంబంలో తన తాతగారికి అందరూ తనకు (మా వాహన చోదకుడు) సలాం చేయాలన్న కోరికతో ఆపేరు పెట్టారని చెప్పాడు. వారి కుటుంబమంతా క్రీస్తు ఆరాధకులు..



అప్పాజోస్యుల వారిని
**మిసిమి** తరపున సన్మానిస్తూ....

సరే ఈ పిట్టకథ వదిలేస్తే అప్పాజోస్యుల వారిచ్చిన గూగుల్ మ్యాప్స్ చిరునామా ప్రకారం సుమారు పదకొండు గంటల యాభై నిముషాలకు వారింటికి చేరాం.. చిరునవ్వుతో ఆహ్వానం పలికారు వారు.. ఒక బౌల్‌లో యాపిల్ ముక్కలు కోయించి పెట్టారు మాకోసం.. సత్యనారాయణ గారిది ఎనభై రెండేళ్ల ప్రాయం.. రెండో అంతస్తులో ఉంటున్నారు. పిత్రార్జితమైన ఆ ఇంటిని విస్తరించి మొదటి అంతస్తులో కొన్ని గెస్ట్ రూంలు, తమ పబ్లికేషన్స్ తాలుకు గ్రంథాలను భద్రపరిచేందుకు వాడుకుంటున్నారు.. లిఫ్ట్ సౌకర్యం లేదు.. దానికి వారేమీ బెంగపడుతున్నట్లు అగుపించలేదు.. ఇల్లంతా నీట్‌గా సర్దిన పుస్తకాలు ఒకపక్క, వారికి వివిధ సంస్థలు వారు సత్కరించి ఇచ్చిన పెద్ద పెద్ద ఫ్రేములు కట్టిన ప్రశంసా పత్రాలు మరొకపక్క..

ఇంకొకపక్కన బల్లమీద పేర్చిన శాలువాల బస్తా.. రంగురంగుల తోరణాల్లా మెడలలో వేసే మెడల్‌తో కూడటానికి సిద్ధంగా ఉన్న రిబ్బన్లు.. బయట వేదికలపై కనిపించే ఆహార్యానికి భిన్నంగా సత్యనారాయణ గారు

కాశీ తువ్వాలు కట్టుకుని తెల్లటి జుబ్బా ధరించారు.. నిజానికి ఈ అతిథుల రాకకు ఆయన పొంగి పోయారు.. మా రాకలో ఆలస్యం జరగడం ఆయన్ని కొంత కంగారు పెట్టింది.. అందులోంచి తేరుకున్నాక అశ్విని గారు వారిని దుశ్శాలువాతో సత్కరించారు.. దాదాపు మూడు గంటల పాటు ఒక సమాధి స్థితిలో ఉండి ఆయన బాల్యం నుండి కంప్యూటర్ భాషల ఎక్స్పర్ట్‌గా, గణిత మేధావిలగా ఎదిగిన క్రమాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబమంతా అమెరికాలో ఉంటుంది.. ఆయన మటుకు ముప్పైఏళ్ళుగా చీరాలలో ఉండిపోయి సారస్వత సేవ చేస్తున్నారు.. ఆయనది వన్ మ్యాన్ షో.. ఆయనలో సైన్స్, సనాతనం సహజీవనం చేస్తున్నాయి. పురాణాలకన్నా ఉపనిషత్తులు నమ్ముతారు.. విశ్వనాథ వారంటే ప్రాణం. ఇల్లంతా విశ్వనాథ వారి ఛాయాచిత్రాలు అనేకం మనలను పలకరిస్తుంటాయి.. పద్యకావ్యాలపై అజోవిభో-కందాళ సంస్థ ప్రచురించిన పుస్తకాలు అబ్బుర పరుస్తాయి. ప్రత్యేకం **మిసిమి** కోసం అనేక గ్రంథాలను తెప్పించి బహుకరించారు. ఆయనకు నమ్మిన బంటుల్లాంటి ఇద్దరు చీరాలలో ఆయన్ని కంటికి రెప్పలా కాచుకుంటూ ఉంటారు. సత్యనారాయణగారు ఫోన్ చేయగానే క్షణాల్లో ఆయన ముందు వాలిపోతుంటారు..

నిజానికి వేదికలపై కనిపించే సత్యనారాయణ గారు వేరు. ఆరోజు మేము చూసిన సత్యనారాయణ గారు వేరు. ఈ సత్యనారాయణ గారు చాలా రిలాక్స్‌గా, చలోక్తులు వేస్తూ ఒక ఋషి పుంగవుడిలా ఉన్నారు.. ఆయన ఎక్కడా చెప్పని విషయాలు ఆనాటి ఇంటర్వ్యూలో వెల్లడించారు.. త్వరలోనే ఆ వివరాలన్నీ మీరు చదువుతారు.. గంట రికార్డింగ్ కాగానే మాకు వేడి వేడి పప్పు, మూడు పచ్చళ్ళు, రెండు కూరలు, చారుతో కూడిన షడ్రసోపేతమైన భోజనం సిద్ధం చేయించారు..అలా భోజన విరామం తర్వాత కాసేపు కబుర్లు గడిచాక మళ్ళీ రికార్డింగ్ ప్రారంభించాం.. ముప్పై ఏళ్లుగా సాగుతున్న సారస్వత సేవ ఇస్తున్న తృప్తి వారి కళ్ళలో కనిపించింది మాకు.. మాటల్లో పడి సమయం ఎలా చేజారిపోయిందో తెలియరాలేదు.. చివరికి మమ్మల్ని పంపిస్తూ మాకు శాలువాలు కప్పారు.. జనవరి మాసంలో వరంగల్లులో జరగబోయే అజోవిభో – కందాళై పురస్కారోత్సవానికి రమ్మని ఆహ్వానం పలికారు.. ప్రతి సంవత్సరం జనవరి మొదటి గురువారం నాడు జరిపే ఈ పండుగ నాలుగు రోజుల పాటు జరుపుతారు.. ఇందులో కథలను నాటకాలుగా మలిచి జరిపే ప్రదర్శనలు ఉంటాయి.. ప్రతిభా పురస్కారం ఉంటుంది.. ప్రతి సంవత్సరం ఒక్కో ఊరిలో జరిపే ఈ పండుగకు ప్రతిభా పురస్కారం ఆ జిల్లా, లేదా పక్క జిల్లా వారికి ఇచ్చేందుకు కృషి చేస్తారు..ఇదంతా ఆయన ఒక్కరే చేస్తారు. ఆయన కృషిని అభిమానించి స్వచ్ఛందంగా ముందుకొచ్చిన వాలంటీర్ల బృందం ఆయనకు తోడుగా ఉండటం విశేషం.. ముప్పైఏళ్ళుగా సొంత నిధులు వెచ్చించే ఆయన సాహిత్య పురస్కారం కోసం ఎంచుకున్న ప్రక్రియ ఆశ్చర్యం కలిగించేదే.. పబ్లిసిటీకి దూరంగా ఉంటూ తాము చేయగలిగే సాహిత్య కృషిని చేసేవారిని గుర్తించటం ఆయన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది.. ఇది వారెలా చేస్తున్నారో అధ్యయనం చేయదగిన అంశం.. చివరిగా మమ్మల్ని పంపిస్తూ ఆయన, విశ్వనాథ సత్యనారాయణ గారి రామాయణ కల్పవృక్షం వచనం గ్రంథాన్ని కూడా తోడిచ్చి పంపారు..



**మిసిమి** వీరాభిమాని
కోన రమణరావు గారితో

అక్కడినుంచి మా ప్రయాణం **మిసిమి** అభిమాని కోన రమణరావు గారింటివైపు సాగింది. లలిత సంగీత గాయకులు, చీరాలవాసి భాగి కృష్ణమూర్తి గారు శ్రమ తీసుకుని మాకు దారి చూపించారు.. ఆయన అశ్విని గారిని చూసి ఎంత పొంగిపోయారో.. చిన్న పిల్లాడైపోయి నాన్ స్టాప్‌గా మాట్లాడారు. కోన రమణరావు గారు కథకులు, సింగర్, కీబోర్డ్ ప్లేయర్.. ఇన్ని క్వాలిటీస్ ఉన్నాయి ఆయనలో అని తెలిసింది .. మాకోసం ఒక రాగం ఆలపించి వినిపించారు కూడా.. మా అందరికీ ఆయన కథల పుస్తకం కానుకగా ఇచ్చారు.. ఒక అభిమాని ప్రేమను చూశామారోజున...అప్పటికే ఏడు దాటింది.దాంతోటి ఆయన దగ్గర సెలవు తీసుకుని బయల్దేరాం..

నిజానికి ఆరోజు వేటపాలెం గ్రంథాలయం, సూర్యలంక బీచ్ దర్శించాలని ప్లాన్ చేశాం కానీ అప్పాజోస్యుల వారితో అరమరికలు లేని సంభాషణ మాకు దానిని వీలు పడనివ్వలేదు..ఆయన కబుర్లు తలుచుకుంటూ తిరుగు ప్రయాణం పరుచూరు మీదగా సాగించాం.. చుట్టూ చిమ్మ చీకటి, అడపాదడపా వచ్చే ఒకటి అరా వాహనాల రొద తప్ప మరేమీ లేదు.. మధ్యలో కాస్త కాళ్ళు చాచుకునేందుకు కిందికి దిగిన మాకు పత్తిచేలో తిరుగాడుతున్న మిణుగురు పురుగుల వెలుగులు కాస్త సరదాను, ఊరటను కలిగించాయి.. దారిలో చిలకలూరిపేట రోడ్ కనిపించింది కానీ, అదొదిలేసి గుంటూరు రోడ్డు అని కనిపించిన బోర్డు చూసి సాగటం తప్పైపోయింది.. మేము వెళ్ళే బాట ఇబ్బంది పెట్టినా దారిలో తగిలిన చిన్న ఊళ్ళలో వైన్ షాపుల వద్ద కోలాహలం, హడావుడి మనుషుల అలికిడి చూపెట్టింది.. గుంటూరు చేరేటప్పటికి రాత్రి తొమ్మిది గంటలయింది.. గీతా భవన్‌లో టిఫిన్ చేసి ఎల్.వి.ఆర్.క్లబ్ చేరాం.. మరుసటి రోజున ఉదయం ఎనిమిది గంటల ముప్పై నిముషాలకు విజయవాడ బయల్దేరాలని ప్లాన్ చేసుకున్నాం.. ఈసారి ఆలస్యం కాకుండా బయల్దేరాలని నిర్ణయించుకున్నాం.. అనుకున్నట్టే ఉదయం ఎనిమిదికల్లా తయారై పక్కనే ఉన్న మౌర్య టిఫిన్స్‌కి వెళ్ళాం.. ఒకటర్థమయింది.. నెయ్యి, కారప్పొడి కలిసిన ఇడ్లీని గుంటూరు ఇడ్లీ ఎందుకంటారో.. ఎందుకంటే గుంటూరులో మేం పొందిన రుచి మిగిలిన ఊళ్ళలో కనిపించలేదు.. సరే అది పక్కన పెట్టేద్దాం..ఎంత ముందు తయారైనా బయల్దేరేటప్పటికి తొమ్మిది గంటలయింది..

**డిసెంబర్ 7**

మొత్తానికి సిద్ధార్థ కళాశాలకు చేరేటప్పటికి పది గంటల పదిహేను నిమిషాలయింది.. కథ-24 ఆవిష్కరణ సభ కోలాహలంగా ఉంది. ఇది కథా సాహితి వారి 35వ సంకలనం.. పదిహేడు కథలు ఈ సంకలనంలో ఉంటే పన్నెండు మంది రచయితలు హాజరయ్యారు. నిజానికి తన కథ ఈ సంకలనంలో ఉండాలని ప్రతి వామపక్ష రచయిత కోరుకుంటున్నాడు.. అలా కథాసాహితి ప్రచురించే కథ సిరీస్ కొంత గ్లామర్‌ని సంతరించుకుందని చెప్పాలి.



మృణాళిని గారితో ఎడిటర్

ఈ కథాసాహితి సంపాదకులుగా ఉన్న వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్‌లతో పాటు ఈసారి మూడవ సంపాదకులుగా కథా విమర్శకులు రమణమూర్తి కూడా చేరారు

"కథ-24"ని ముఖ్య అతిథి ఆచార్య సి.మృణాళిని ఆవిష్కరించారు తొలిప్రతిని రచయిత్రి సత్యవతి గారికి అందజేశారు.. సిద్ధార్థ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు గారు సభకు అధ్యక్షత వహించారు.. ఇక విశిష్ట అతిథిగా డాక్టర్ గురవారెడ్డి పాల్గొన్నారు "కథ-24" ని జర్నలిస్టు రచయిత ఆర్ఎం ఉమామహేశ్వరరావు సమీక్షించారు.. ఈసారి కథలన్నీ కూడా నిడివి ఎక్కువ ఉండటంతో కాస్త పెద్ద పుస్తకమే వేశారు.. ఎప్పటిలాగా వాసిరెడ్డి నవీన్ కథ సంకలనం తేవటంలో ఎదుర్కొన్నటువంటి ఇబ్బందులు తెలియజేశారు.. కొంతమేర పాపినేని



కథ 2024 ఆవిష్కరణ - సత్యవతి, పాపినేని శివశంకర్, మృణాళిని, వాసిరెడ్డి నవీన్, రమణరావు, డా. గురువారెడ్డి, ఉమామహేశ్వర రావు, రమణమూర్తి

శివశంకర్ కథల గురించి మాట్లాడారు.. ఈ కథల ఎంపికలో ఉన్నటువంటి ప్రమాణాల సడలింపు పట్ల ఎటువంటి రాజీ పడలేదని గుర్తు చేశారు.. ఆర్ ఎం ఉమామహేశ్వరరావు సమీక్షిస్తూ కథల నేపథ్యాన్ని పాత్రల చిత్రణను విశ్లేషించారు .. డాక్టర్ గురువారెడ్డి గారి హాస్య ప్రసంగం అందరిని ఆకట్టుకుంది.. కథల విశ్లేషణ అలాగే ప్రముఖుల ప్రసంగాల తర్వాత రచయితలతో ఈ కథల నేపథ్యాన్ని వివరించేటువంటి కార్యక్రమం కొనసాగింది.. కానీ చాలా క్లుప్తంగా చేశారు.. ఐదు నిమిషాలు దాటకుండా కథా నేపథ్యాన్ని వివరించమన్నారు.. మొత్తం మీద కథ -24 ఆవిష్కరణ సభ 10 గంటల 30 నిమిషాలకు మొదలై ఒంటిగంట 30 నిమిషాలకు ముగిసింది. ఈ సభకు రావటానికి ముఖ్యకారణం - అశ్విని గారి కథ, ఈ సంకలనంలో ఉండటమే!

అయితే గతంలో కథ నేపథ్యాన్ని భోజనం తర్వాత నిర్వహించేవారు .. కానీ ఈ పద్ధతి ఎందుకు మార్చారో తెలియలేదు.. ఒకటి మాత్రం అనిపించింది అదేమిటంటే సంకలనంలోని రచయితల గురించి నాలుగు పరిచయ వాక్యాలు చెప్పి ఉంటే బాగుండేది కదా.. ఉదాహరణకి అశ్వినీకుమార్ గారు అలాగే పతంజలి శాస్త్రి వంటి వారు సీనియర్ కథకులు.. సీనియర్ కథకులు వారి వర్క్ గురించి కొంచెం వివరిస్తే వచ్చిన వారికి ఆ రచయితలు ఏమిరాశారన్న ఒక చిన్న అవగాహన కలిగేది .. కనీసం వచ్చే సంవత్సరం నుంచైనా ఈ జాగ్రత్త తీసుకుంటే బాగుంటుంది.. ఇలా "కథ -24" ఆవిష్కరణలో పాల్గొన్న వారి ప్రసంగాలను, సభికులు ఎంతో ఆసక్తిగా వినడంతో సభ ఆసక్తికరంగా సాగిందనే చెప్పాలి.. సభ అనంతరం కుదిరినంతలో చక్కటి భోజనాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు వారికి కృతజ్ఞతలు తెలియజేయాలి .

ఇక భోజనానంతరం మిత్రుల అందరి దగ్గర సెలవు తీసుకుని మేం బుక్ చేసుకున్నటువంటి టాక్సీలో హైదరాబాద్ బయల్దేరాం.. దారిలో పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ దగ్గర మిత్రుడు వలేటి గోపీచంద్ కూడా మాతో జత కలిశాడు.. దారంతా బోల్డన్ని కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుకుంటూ మధ్యలో ఒక గంట సేపు సెవెన్ రెస్టారెంట్‌లో ఆగి కాస్త రిలాక్స్ అయి, రీఛార్జ్ చేసుకుని బయలుదేరాం.. సెవెన్ రెస్టారెంట్ పెట్టి పదహారు సంవత్సరాలయింది - ఆ విషయాన్ని సెవెన్‌కి పదహారేళ్ల వయసు అని - శ్రీదేవి బొమ్మలు ప్రదర్శించి చక్కని వాతావరణం సృష్టించారు - మేము అభినందిస్తే రుచికరమైన బాసుమతి చక్రపొంగలి ఆప్యాయంగా తినిపించారు. పదహారేళ్ల వయసుని ఆశీర్వదించి మా ప్రయాణం సాగించాము. దారిలో ఫ్లైఓవర్ల నిర్మాణం, అదనంగా ఆదివారం కారణంగా ప్రయాణం మందకొడిగా సాగి చివరికి ఇంటికి చేరే సమయం దాదాపు పది గంటలు అయింది. అలా డిసెంబర్ మూడో తేదీ మధ్యాహ్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రారంభమైన మా ప్రయాణం ఏడో తేదీ రాత్రి 10 గంటలకు ముగిసింది.. ఈ నాలుగు రోజుల ప్రయాణంలో ఎంతో మందితో సంభాషించటం ఒక కొత్త అనుభూతిగా అనిపించింది..



పదహారేళ్ల వయసు

మనకున్న సమయం కొద్దిదే.. ఎక్కువ మంది వ్యక్తులను కలుసుకుని వినటం నేర్చుకుంటే వినయం కూడా మనల్ని ఆశీర్వదించి అక్కున చేర్చుకుంటుందన్న సత్యం బోధపడింది..

**- అశ్వినికుమార్**

**సి.ఎస్. రాంబాబు**

# జీవన మకరందం

- తప్పు చేసినవాడికి నువ్వు తప్పు చేశావు అని చెప్పటం తప్పు !
- స్వేచ్ఛ గమ్మత్తయిన విషయం! స్వేచ్ఛగా వున్నానుకునేవాడు మరో విషయం గురించి ఆలోచించడు.
- డబ్బు స్నేహితుడులాంటిది. అది వున్నప్పుడు విలువ తెలియదు.
- డబ్బుని వృధా చేయటం అంటే – పొదుపు చేసి! దాచిపెట్టటమే!
- మతమంటే – విశ్వాసానికి జలతారు ముసుగు.
- నిరర్ధకంగా – ఎంతకాలమైనా జీవించవచ్చు.
- నిన్ను నువ్వు ప్రేమించుకోవటం జీవికాలపు ప్రేమ కథ!
- హేతువులన్ని నిరర్ధకమైనవే! అర్థం లేనివే!
- సంతోషాలు త్వరగా సమసిపోతాయి.
- ఆధునిక జీవితంలో అన్నీ మినహాయింపులే.
- అనిశ్చతలే ప్రేమ కథకు ప్రాణం



- ఇవాళ రేపు – నీ తెలివితేటలే – నిన్ను పట్టియిస్తాయి!
- ఈ రోజుల్లో దేన్నయినా కొనేయవచ్చు – కీర్తిని కూడా, మాల్‌లో బట్టలు మాదిరి!
- ఆదర్శాలు ప్రమాదకరమైనవి – బాధించినా, నిజాలే నయం!
- మూర్ఖుడు మాటల్తో చంపుతాడు – ధైర్యవంతుడు కత్తితో చంపుతాడు!
- ఆలోచన గొప్పదే – కాని సాహసం మరింత గొప్పది.
- అంతర్ముఖులకు కాలంతో పని ఏముంది?
- న్యాయస్థానాల్లో నిజానికి చోటు వుండదు –
- నిన్ను నువ్వు సంస్కరించుకోవటమే అత్యుత్తమైన ఆదర్శం!
- ఇతరులకు తెలియజెప్పాలనే హడావుడిలో తమను తాము తెలుసుకునే అవకాశం వుండటం లేదు.

Oscar Wilde

– ఆస్కార్ వైల్డ్

# ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి

– ఆచార్య కోదాటి వియ్యన్నరావు



ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి

పద్మవిభూషణ్ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి గారు పేరెన్నికగన్న తత్త్వశాస్త్రజ్ఞులలో ఒకరు. తాత్త్విక చింతనలో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు సరితూగ గలిగినవారు. తత్త్వశాస్త్రాన్నీ, మిగిలిన సామాజిక శాస్త్రాల అధ్యయనంతో జోడించి, దానియొక్క పరిధిని విస్తృతం చేసారు. పాశ్చాత్య, భారతీయ తాత్త్విక ధోరణులను తులనాత్మకంగా అధ్యయనం చేసి, భారతదేశ తాత్త్విక చింతన యొక్క ఔన్నత్యాన్ని ప్రపంచవ్యాప్తం చేసారు. మూర్తిగారు జనవరి 25, 2011లో పరమపదించి నేటికి పదిహేను సంవత్సరాలు గడచిన సందర్భంగా వారిని, వారి ఔన్నత్యాన్ని, తత్త్వశాస్త్రాభివృద్ధికి వారు చేసిన సేవలను స్మరించుకొనే సందర్భంగా వ్రాయబడినదే ఈ వ్యాసం.

ఈ శీర్షిక వారి జీవిత సాఫల్యానికి ప్రతీకగా చెప్పదగినది. వారు నమ్మిన సిద్ధాంతం ఒక్కటే : అదే "నీకు నువ్వే ఒక దీపానివికా. నిజానికి మూర్తిగారు ఈ వాక్యం పైన కూడా సమగ్ర విచారణ చేశారు. 1987లో థియోసాఫికల్ సొసైటీ అడయార్, మద్రాస్ వారు నిర్వహించిన అంతర్జాతీయ సమావేశంలో ఈ వాక్యం యొక్క మూలాన్ని, దీని అర్థాన్ని సోదాహరణంగా వివరించారు. అందరూ భావిస్తున్నట్లుగా ఈ వాక్యానికి మూలమైన ''ఆత్మదీపోభవ'' లేదా ''అత్తదీపోభ'' అన్నది బుద్ధుడు ప్రవచించినట్లుగా చెప్పబడుతున్నది. కాని ఈ వాక్యం బుద్ధిజంకు సంబంధించిన సారస్వతంలో ఎక్కడా లేదు. అయితే తన చివరి దశలో శిష్యుడైన ఆనందుడు, బుద్ధుని సమీపించి, తన చివరి ఉపదేశం ఇవ్వవలసినదిగా కోరాడు. ఆ సందర్భంలో బుద్ధుడు పాళీ భాషలో ఈ విధమైన సందేశం ఇచ్చినట్లుగా ఉందని మూర్తిగారు ఉటంకించడం జరిగింది.

**"తస్మాద్ ఇహ ఆనంద అత్తదీపా విహార్త**
**అత్త–సరణ, అనజ్ఞ సరణా**
**దమ్మ దీపో, దమ్మ సరణో, అనజ్ఞ సరణో."**

కాబట్టి ఆనందా! నిన్ను నువ్వే అనుసరించు, నీ ఆజ్ఞలనే నీవు పాటించు, దమ్మాన్ని శరణు పొందు, నీకు నువ్వే ఆధారంగా ఉండు తప్ప ఇతరులను ఆశ్రయించకు. చర్చను కొనసాగిస్తూ 'దీప' అనే పదానికి రెండర్థాలు ఉన్నాయని చెప్పారు. ఒకటి అందరు భావించే విధంగా వెలుగునిచ్చే సాధనం. రెండవది ద్వీపం. అయితే రెండు అర్థాలు సరైనవికావని, అత్త దీపోభవ అంటే నీకు నువ్వే ఆధారం కమ్ము అన్నదే బుద్ధుని బోధనల సారాంశమని సూత్రీకరించారు.

ఈ వాక్యం ప్రతి వ్యక్తికి ముఖ్యంగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికి తలమానికమని చెప్పాలి. నిజానికి వారి తత్త్వశాస్త్ర అధ్యయనమంతా వివిధ తత్త్వశాస్త్ర సిద్ధాంతాల, భావనల తులనాత్మక పరిశీలనగానే సాగింది. ఈ సందర్భంలో వివిధ దృక్కోణాలు, వాదనలను నిశిత బుద్ధితో, లోతైన అధ్యయనంతో మూలాన్ని బహిరంగపరచి సూత్రీకరించడం వారి అలవాటు. ఈ సందర్భంలో ఏ తత్త్వవేత్త అయినా ఏ ఒక్క వాదాన్ని తప్పనిసరిగా బలపరచాలనిగాని, కొత్తగా సూత్రీకరణ చేయాలనిగాని

నిబంధన ఏదీ లేదని, ఉన్న వాస్తవాన్ని లేదా సత్యాన్ని బహిరంగపరచడమే తత్వవేత్త యొక్క అసలైన విధి అన్నది వారి నమ్మకం.

అసలు తత్వవేత్త అంటే ఎవరు? తత్వశాస్త్రమంటే ఏది? అన్న విషయంగా మూర్తిగారి అభిప్రాయాలు చాలా విలువైనవి. 1889–1951ల మధ్య కాలంలో జీవించిన ఆస్ట్రో-బ్రిటీష్ తత్వవేత్త అయినటువంటి విట్గెన్‌స్టీన్ ప్రకారం ఎవరైతే తనంత తానుగా ఒక కొత్త లేదా అసలు సిద్ధాంతాన్ని మొట్టమొదటిగా ప్రతిపాదిస్తాడో, అతనే తత్వవేత్త. దీని ప్రకారం, ఆధునిక పాశ్చాత్యతత్వ విచారంలో ప్లాటో ఒక్కడినే తత్వవేత్తగా భావించాలి. ఎందుచేతనంటే కొన్ని సవరణలతో అతని తరువాత వచ్చిన సోక్రటీస్ గాని, అరిస్టాటిల్ గాని ప్లాటో ప్రతిపాదనలను కొనసాగించినవారే. అదే విధంగా భారత దేశానికి సంబంధించి శంకరుడుగాని, అరబిందోగాని, రామానుజుడు గాని అప్పటికే ఉన్న వేద వాఙ్మయానికి భాష్యం చెప్పినవారే. మూర్తిగారి ఉద్దేశ్యంలో ఈ అభిప్రాయం సరైనది కాదు. మొత్తంగా నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించకపోయినప్పటికీ తమ మేధాశక్తితో అప్పటికే వ్యాప్తిలో ఉన్న సిద్ధాంతాలను లేదా భావనలను విస్పష్టంగా, అర్థవంతంగా తమదైన శైలిలో వివరిస్తారో లేదా భాష్యం ప్రకటిస్తారో అట్టి వారి నందరిని తత్వవేత్తలుగా అంగీకరించవచ్చు. ఈ వాదన ఆధారంగానే పాశ్చాత్యులైనటువంటి విట్గెన్‌స్టీన్, వైట్‌హెడ్, లొఖీ, హ్యూమ్, ఆంటోనీఫ్లూ, కాంట్, హెగెల్, మార్క్స్ వంటి వారు, భారతదేశానికి సంబంధించి శంకరుడు, రామానుజుడు, మధ్వాచార్యుడు, వివేకానంద, అరబిందో, రామతీర్థ, ఠాగూర్, రాధాకృష్ణన్, సచ్చిదానంద మూర్తి వంటి వారు తత్వవేత్తలుగా పిలువబడుచున్నారు. ఇదే అభిప్రాయం ఆధారంగానే అటు పశ్చిమంలోనూ, తూర్పు దేశాలలోను ఉన్నత విద్యలో అత్యుత్తమ డిగ్రీ అయినటు వంటి పిహెచ్.డి. ప్రదానం చేయబడుతున్నది.

తత్వశాస్త్ర విషయంగా ఆచార్య మూర్తి గారి దృక్కోణాన్ని పరిశీలిద్దాం. అసలు తత్వశాస్త్రమంటే ఏది? అందులో ఉండే అంశాలు లేదా భావనలు ఏమి? అన్న విషయంగా మూర్తిగారి అభిప్రాయాలు విస్పష్టం. భారతదేశంలో వేదకాలం నుండి ఈ అంశాలపై చర్చ జరుగుతున్నా తత్వశాస్త్రం యొక్క పుట్టుక పాశ్చాత్య దేశాలలోనే జరిగినట్లు అచ్చటి తత్వవేత్తలు స్పృశించిన అంశాలే తత్వశాస్త్రమన్నట్లు భారతీయ తత్వవేత్తలు కూడా భావించడం శోచనీయం. ఆనాటికి తత్వశాస్త్రమంటే తర్కము, జ్ఞాన సిద్ధాంతం, నీతి శాస్త్రం వంటి అంశాల అధ్యయనం. ఎక్కువ భాగం అధి భౌతిక శాస్త్రం, ఆధ్యాత్మిక విద్య లేదా పార లౌకిక శాస్త్రం పరంగానే చర్చ నడుస్తుండేది. పశ్చిమ దేశాల తత్వవేత్తలైనటువంటి కాంట్, హెగెల్, ఫి.చె., షెల్లింగ్, హైడెగ్గర్, ఆ తరువాత తెరపైకి వచ్చిన ఆధునిక తత్వవేత్తలుగా చెప్పబడుతున్న రస్సెల్, విట్గెన్‌స్టీన్ వంటి వారి అభిప్రాయం కూడా ఇదే అయి ఉన్నది. భారతీయ తత్వశాస్త్ర అధ్యాపకులు, పరిశోధకులు తత్వశాస్త్రమంటే వారు చెప్పినదేనని, భారతదేశం నుండి ఈ విషయాలపై అదనంగా చేర్చదగినది ఏమీ లేదని భావించడాన్ని మూర్తిగారు గర్హించారు. తమ "రిథమ్ ఆఫ్ ద రియల్ (1951)" అన్న గ్రంథంలో పాశ్చాత్య తత్వవేత్తల కంటే ముందే ఈ అంశాల పై శ్రద్ధ వహించిన దధీచి, శ్వేతాశ్వతర, బాదరాయణ, శంకర వంటి వారి భావనలు పాశ్చాత్యులు ప్రతిపాదించిన సిద్ధాంతాల కన్నా అధికమైనవే. ఈ విషయాన్ని భారతీయ తత్వవేత్తలు గమనించకపోవడం విచారకరం. మూర్తి గారి ఉద్దేశ్యంలో దేశాలు, ప్రాంతాలు, ఖండాలు ఆధారితంగా తత్వశాస్త్రాన్ని విడగొట్టి అధ్యయనం చేయడం తత్వశాస్త్ర అభివృద్ధిని నిరోధిస్తుంది. కాబట్టి విషయం ప్రధానం కాని, అది ఏ ప్రాంతం నుండి చెప్పబడినది అన్నది కాదు. అట్లే ఈ విషయంగా తత్వశాస్త్ర విషయాలపరంగా తులనాత్మక పరిశీలన జరగాలి తప్ప వ్యక్తుల యొక్క జీవితము, సామర్థ్యముల పైన కారాదు. తత్వశాస్త్ర పురోగతికి కృషి చేసిన, చేస్తున్న అందరూ గొప్పవారే. ఈ ఉద్దేశ్యం ఆధారంగానే వివిధ తత్వభావనల పరిశీలన చేశారు. భారతీయ తత్వశాస్త్ర విషయంతోపాటుగా పాశ్చాత్య, ఫార్ ఈస్టర్న్ భావనలపై వారి అవగాహన, అధ్యయనం తిరుగులేనివి. అన్ని రకములైన భావనలు, సిద్ధాంతాలు, వాదనలను సమాదరంతో విశ్లేషించి, విషయాన్ని నిష్కర్షగా, నిర్దుష్టంగా వ్యక్తీకరించిన వ్యక్తి ఒక్క మూర్తిగారే అంటే అతిశయోక్తి కాదు. 1976లో వారు ప్రచురించిన "ఫార్ ఈస్టర్న్ ఫిలాసఫీస్" దీనికొక మచ్చుతునక. చాలా తూర్పు

దేశాలైనటువంటి చైనా, జపాన్, కొరియా, రష్యా, మలేషియా, సింగపూర్, ఇండోనేషియా వంటి దేశాలలో ఫరిడవిల్లిన తత్త్వశాస్త్ర భావనలను ముఖ్యంగా చైనా, జపాన్ దేశాలకు చెందిన కన్ఫ్యూసియనిజం, టావోఇజం, బుద్ధిజం, మాయావాదం, తాంత్రికత వంటి విషయాలపై మూర్తి గారు చేసిన అధ్యయనం చాలా లోతైనది, విలువైనది, అందరూ ఎరిగిన విధంగానే బుద్ధిజం, అద్వైతము, వైదిక భావనలు వారి అభిమాన విషయాలు, బుద్ధిజం పైన వారు రచించినంత విస్తృతంగా మరే తత్త్వవేత్త వ్రాసి ఉండరు. 1971లో నేషనల్ బుక్ ట్రస్ట్ ద్వారా వారు ప్రచురించిన "నాగార్జున" గ్రంథం ప్రామాణికమైనది. నాగార్జునుడు ఎక్కువగా చరించిన గుంటూరు, పల్నాడు ప్రాంతాలకు తలమానికంగా ఉండే విధంగా వారి పేర "నాగార్జున విశ్వవిద్యాలయాన్ని" 1976లో స్థాపించడం, నాగార్జునుడు ప్రభోధించిన 'మహాయాన బౌద్ధ వాదాన్ని' బలపరిచే లక్ష్యంగా ఒక అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ముదావహం. 1980వ సంవత్సరంలో ఇంటర్నేషనల్ తెలుగు ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో "బౌద్ధ తాత్త్విక చింతన-ఆంధ్రుల సేవ" అన్న అంశం పైన వారు చేసిన ప్రసంగ పాఠం చదివి తీరవలసిందే.

అదే విధంగా 'మాయ', 'తాంత్రిక' భావనలపై వారి విశ్లేషణ ఎన్నో నూతన విషయాలను వెలుగులోనికి తీసుకు వచ్చిందని చెప్పవచ్చు. మాయ అంటే సాధారణ పరిభాషలో అర్థం కాని విషయంగా చెప్పబడిందని, కాని దాని మూలాలు భ్రాంతి నుండి వాస్తవానికి ఉండే ప్రయాణాన్ని అర్థం చేసుకోవడంగా భావించాలని తెలియ జెప్పటం జరిగింది. వేదాల ఆధారంగా మాయ మొత్తం దేవుని కల్పన గాను, చరాచర జగత్తు యొక్క కార్యకలాపమంతా మాయచేత కప్పబడి ఉన్నదని, ఈ విషయాన్ని అర్థం చేసుకోగలిగిన వారు మోక్షమార్గం వైపు పయనిస్తారని చెప్పడం కంటే; వాస్తవానికి, అవాస్తవానికి మధ్యన ఉండే తేడాను గమనించడమే మాయను అర్థవంతంగా తెలుసుకోవడమవుతుందని, అదే మూర్తి గారి సూచనయని మనం గమనించవచ్చు.

బుద్ధిజానికి సంబంధించి స్థూలంగా మూడు శాఖలు ఉన్నట్లుగా చెప్పబడుతున్నది. అవి తేరవాద, మహాయాన మరియు వజ్రాయాన. మొదటి శాఖకు చెందినవారు బుద్ధుని యొక్క మూల సూత్రాల బోధనపై మక్కువ చూపిస్తారు. వారి ప్రకారం ఇది పెద్దలు చూపిన మార్గం. వినయ పీఠిక దీనికి ఆధారం. ఇది ఎక్కువగా శ్రీలంక, కొన్ని వాయువ్య ఆసియా దేశాలలో ఎక్కువగా ప్రచారంలో ఉంది. దీని సారస్వతం ఎక్కువగా 'పాళీ' భాషలో ఉంది. దీనిని నికాయ బుద్ధిజంగాను లేదా సంప్రదాయ బుద్ధిజం గాను పిలవడం జరుగుతున్నది. హీనయానంగా పిలువబడే భావన దీనికి చెందినదే. దీనిని అనుసరించేవారు బుద్ధుడు బోధించిన దానినే ప్రమాణంగా స్వీకరిస్తారు. విగ్రహారాధన, మంత్రాలు పఠించడం వీరికి నచ్చదు. వ్యక్తి నిర్వాణాన్ని స్వయంకృషితో సాధించాలనేది వీరి ఉద్దేశ్యం, వాదన. బుద్ధుడు మరణించిన పిదప రెండు వర్గాలుగా విడిపోయిన వారిలో వీరు ఒకరు.

మహాయాన బుద్ధిజం వారి ఆలోచనా విధానం ప్రకారం బుద్ధుడు దైవత్వం కలిగిన వ్యక్తి. అతనిని పూజించవచ్చు, విగ్రహారాధన, మంత్రాలు ఉన్నాయి. ఇది వ్యక్తి నిర్వాణం కంటే జనబాహుళ్యం యొక్క సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది. దీనిని అనుసరించే బౌద్ధులు ఎక్కువగా చైనా, కొరియా, జపాన్, టిబెట్‌లలో ఉన్నారు. మాధ్యమిక మరియు యోగాచార దీని ప్రధాన శాఖలు. ఈ సంప్రదాయాన్ని బహుళ వ్యాప్తిలోనికి తెచ్చిన వారిలో నాగార్జునుడు, ఆర్యదేవుడు, అసంగుడు మరియు వసుబంధుడు ముఖ్యులు. మూడవదిగా చెప్పబడుతున్న వజ్రాయాన పద్ధతి, మహాయాన శాఖ నుండి పుట్టినదే. దీనిననుసరించేవారు తంత్ర విజ్ఞానాన్ని, మంత్రాలను, సంప్రదాయ ఆచరణను నమ్ముతారు. దీనిని పాటించేవారు ఎక్కువగా టిబెట్, నేపాల్, భూటాన్ మరియు మంగోలులో ఉన్నారు. నిర్వాణం సాధించడానికి ఈ వజ్రాయాన మార్గమే సరైనదని వారు నమ్ముతారు. టిబెట్ సంప్రదాయాన్ని అనుసరించి బుద్ధుడు గృధ్రకూట పర్వతంపై పారమితయానను (నిర్వాణం సాధించడంలో కచ్చితత్వాన్ని పొందే మార్గం -ఇందులో ఆరు అంశాలున్నాయి. అవి : దానము, శీలము, ఓర్పు, శ్రద్ధ, ధ్యానము మరియు ప్రజ్ఞ) ఏ విధంగా ధర్మ చక్రాన్ని త్రిప్పి బోధించాడో అదే విధంగా ధర్మ చక్రాన్ని మూడవసారి ధాన్యకటకంలో త్రిప్పి మంత్రయానను

బోధించాడని చెప్పబడింది. ఆ విధంగా మంత్రయానకు ధాన్యకటకమే జన్మస్థలమని రూఢిగా చెప్పవచ్చుననేది మూర్తి గారి అభిప్రాయము. ఈ ధాన్యకటకమే ప్రస్తుతం 'ధరణికోట'గా పిలువబడుతున్నది. ఇది శాతవాహనుల రాజధాని (అమరావతి)గా చెప్పబడుతున్నది. అందుచేతనే 2006లో ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న దలైలామా "కాలచక్ర" తంత్ర విధానాన్ని ఈ ప్రాంతంలో ఆచరించాడు. ఆ సందర్భంలో కొన్ని వేల మంది బౌద్ధ సన్యాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బుద్ధిజం భావనలకు సంబంధించి ఆచార్య మూర్తి గారి నిర్దిష్టమైన అభిప్రాయాలను కొన్ని వాక్యాల రూపంలో మీకు తెలియజేస్తాను.

- ఇంద్రియ భోగాలు, విపరీతమైన కోరికలు, స్వీయ నియంత్రణ, వైరాగ్యము అనే భారతీయ మానసిక, నైతిక విలువల మధ్య పొడచూపే సహజోద్వేగంతో కూడిన ఉద్విగ్నతలను బుద్ధుని మధ్యే మార్గము పరిష్కరిస్తుంది.
- బౌద్ధం అశాశ్వతమైన దానిని, దుఃఖపూరితమైన దానిని మరియు స్వీయ స్వభావం చేత చపలమైన దానిని నిరాకరిస్తుంది. అట్లే నేను, నాది, నా ఆత్మ అనే భావనలను ఆమోదించదు.
- జాగరూకతతోను, నిగ్రహంతోను ఉండమని, అన్ని బంధనాలను విడిచిపెట్టమని, తనకు తాను శరణార్థివి కమ్మని, మార్పులేని స్థితిని అభిలషించమని ఉద్బోధిస్తుంది.
- బుద్ధుడు జీవించి ఉండగానే బౌద్ధం ఆంధ్రలో ప్రవేశించి, క్రీ.శ. 16వ శతాబ్దం వరకు ఉజ్జ్వలమైన చరిత్ర కలిగి ఉంది. కనీసం 12వ శతాబ్ది అంతిమం వరకు ఆంధ్రాలో బుద్ధుని ఆరాధించేవారు కొనసాగారు.
- బౌద్ధంలో 'అంధకులు'గా పిలువబడ్డ కృష్ణా, గోదావరి నదుల పరీవాహక ప్రాంతానికి చెందిన ఆంధ్రులు నాగార్జునునితో సరితూగగలిగిన చింతనాపరులు. వీరే బౌద్ధాన్ని ఆంధ్రప్రాంతం నుండి ఉత్తర భారతదేశానికి విస్తరింపజేశారు.
- బుద్ధుని నిర్వాణానంతరం రెండు వందల సంవత్సరాలకు మహా సాంఘీకులలో మరికొన్ని శాఖలు బయలు దేరినాయి. చైత్య మరియు శైల శాఖలు. దీనికి మహాదేవుడు కారణమని చెప్పబడుతున్నది. పరివ్రాజకత్వం స్వీకరించే విషయంగా జరిగిన వాదోపవాదాల నేపథ్యంలో రెండవ మహాదేవుడు, అతని అనుసరుచులు సంఘం నుండి బహిష్కరింప బడిన తరువాత వారు శ్రీ పర్వతం (ఇదే నాగార్జున కొండ అయి ఉండవచ్చునని అభిప్రాయం) నివాసంగా బౌద్ధ ప్రచారం సాగించారు. ఈ చైత్యులు, శైలులలో అధికులు ఆంధ్రులనడంలో సందేహం లేదు. రెండవ మహాదేవుడు కూడా ఆంధ్రుడై ఉండవచ్చు. అథవా, దక్షిణాత్యుడు అనడంలో సందేహం లేదు.

ఆచార్య మూర్తి గారికి విశేష ఖ్యాతినార్జించిన మరొకటి 1973లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్వాన్స్‌డ్ స్టడీ, సిమ్లావారు ప్రచురించిన "ద రెల్మ్ ఆఫ్ బిట్వీన్ - లెక్చర్స్ ఆన్ ది ఫిలాసఫీ ఆఫ్ రెలిజియన్" గ్రంథం. ఇది మూర్తి గారి యొక్క తాత్త్విక ఆలోచనలకు పరాకాష్టగా చెప్పబడింది. మతం యొక్క తాత్త్విక భావనలను విశ్లేషిస్తూ ఏది అంతర్గతం, ఏది బహిర్గతం రెండింటికి మధ్యన ఉండే సంబంధం ఏది? అన్న విషయాలపరంగా చర్చ జరిగింది. ఒక వ్యక్తి ఏదైనా అంశానికి లేదా ఆసక్తికి సంబంధించిన అంతర్లీనతను అతీతత్వాన్ని కూడా తెలుసుకోగలడు. ఆ విషయాలు మంచి-చెడు గాని వేదన-సంతోషం గాని అయి ఉండవచ్చు. బృహదారణ్యక ఉపనిషత్తులో చెప్పబడిన విధంగా ఒకే వ్యక్తి కనిపించే ప్రస్తుత ప్రపంచంలోను, కనిపించని వేరొక ప్రపంచంలోను మధ్యస్థంగా ఉండగలడు. వ్యాకులత కలిగి ఉండడం, లేకుడా ఉండడం అనే మధ్యస్థ స్థితిని వ్యక్తి పొందగలడు.

ఈ రచనలో రెండు విషయాలపై ప్రధానంగా దృష్టి పెట్టబడింది. మొదటగా 'వేదన' అంటే ఏమిటి? వేదన ఎందువలన ఏర్పడుతుంది, దానికి పరిహారం ఏదైనా ఉందా? వంటి ప్రశ్నలకు జవాబు వెతికే ప్రయత్నం. రెండవది, దేవుని గురించిన భావన.'వేదన' అనే విషయానికి సంబంధించి బుద్ధుని భావనలతో మొదలుపెట్టి, పాశ్చాత్య, చైనా, ఇస్లాం మరియు వేద భావనల ఆధారంగా దాని స్వరూపాన్ని, కారణాలను వెతికే ప్రయత్నం చేశారు. బుద్ధుడు చెప్పినట్లుగా వేదన లేదా

దుఃఖం కలగడానికి కారణం అనారోగ్యం, ముసలితనం, మరణం. ఏదీ శాశ్వతం కాదు అనే భావనే దుఃఖాన్ని కలుగజేయగలదనేది మూర్తి గారి ఆలోచన. సాధారణంగా వేదన వ్యక్తిగతంగా చూడబడింది. దీని కొనసాగింపుగా సామాజిక అంశంగాను, మత అంశంగాను, దేవుని అస్థిత్వానికి చెందినదిగాను కూడా చెప్పబడింది. ఈ విషయంగా బుద్ధుని భావనలతోపాటు అన్ని రకాల ఆలోచనలను వేదన యొక్క అన్ని పార్శ్వాలను తరచి చూసే విధంగా తులనాత్మక పరిశీలను చేయగలగడం మూర్తి గారి యొక్క అసాధారణ ప్రతిభగా చెప్పబడింది. ఆచార్య దయ క్రిష్ణ (వీరు కూడా ప్రముఖ భారతీయ తత్త్వవేత్తలలో ఒకరు : 1924–2007) ఈ గ్రంథాన్ని గూర్చి సమీక్షిస్తూ ఇది ఒక అసాధారణమైన రచన అని, మూర్తి గారి యొక్క పరిశోధక సామర్థ్యం తిరుగులేనిదని, భారతీయ, పాశ్చాత్య భావనల మధ్య సమతౌల్యం సాధనకు చేసిన కృషి అమోఘమని కొనియాడడం జరిగింది.

వ్యక్తిగా ఆచార్యమూర్తి స్ఫూరద్రూపి. అరమరికలు లేని వ్యక్తిత్వం, బయట ఒక విధంగాను, లోపల ఒక విధంగాను, సంశయాత్మకంగా ఉండే అలవాటు ఆయనకు లేదు. ఉన్నది ఉన్నట్లుగా చెప్పడం, చేయడం గురించి చాలామంది మాట్లాడుతుంటారు గాని, ఆచరించేవారు బహు అరుదు. మూర్తి గారితో ఏ కొద్దిపాటి పరిచయమున్న వ్యక్తికైనా గమనంలోనికి వచ్చేది వారి నిర్మొహమాటమైన ముక్కుసూటితనం, కుండబద్దలు కొట్టినట్లు ఉండే మాటతీరు. దానంతట అదే పెల్లుబికే హాస్య చతురత వారి సొంతం. ఈ సందర్భంలో చర్చించదగినది దేవునిపై వారి విశ్లేషణ, ముక్కుసూటి అభిప్రాయాలు. ఇంతకు ముందు ఎంతో మంది తత్త్వవేత్తలు, మేధావులు దేవుని గురించిన ప్రశ్నకు జవాబు వెదికే సందర్భంలో దాటవేత ధోరణే ఎక్కువగా ప్రదర్శించారు. అటువంటివారు లౌకిక వాదాన్ని దాటి ప్రయాణించలేకపోయినారని చెప్పవచ్చు. ఆసక్తికరమైన అంశం ఏమంటే పాశ్చాత్య తత్త్వశాస్త్రంలో దేవుని భావన లేదు. వారికి అది చర్చనీయ అంశం కాదు. భారతదేశ విషయంలో మతానికి, తత్త్వశాస్త్రానికి మధ్యన ఉండే సన్నని గీత వలన, కొన్ని సందర్భాలలో మత వాఙ్మయమే తత్త్వశాస్త్ర జ్ఞానంగా చెల్లుబాటు అవుతున్నది.

ఈ సందర్భంలో మూర్తి గారు దేవుని భావన వ్యక్తిగతమని, అది వ్యక్తి ఎదుర్కొంటున్న పరిస్థితి లేదా సందర్భాన్ని బట్టి ఉంటుందని; అయితే సాధారణ మానవులు వారు విపరీత ఆందోళన స్థితిలో ఉన్నప్పుడు మాత్రమే దేవునిపై నమ్మకం నిలుపుతారని, ఏది ఏమైనా అది కచ్చితత్వం, అనిశ్చితి మధ్య ఊగులాడుతుంటుందని పేర్కొన్నారు. అయితే ఏ సందర్భంలోనైనా, ఏ దేశంలోనైనా జనులందరూ దేవుని అంగీకరించే స్థితి గాని, తిరస్కరించే స్థితి గాని ఉండదు. అదంతా జనులకు అతీతత్త్వంపై ఉండే నమ్మకంపై ఆధారపడి ఉంటుంది. ఇంతకు ముందే చెప్పినట్లు దేవుని ఉనికిని పాశ్చాత్య తత్త్వవేత్తలైనటువంటి నజెషె, హెగెల్, సార్ట్రే, హైడెగ్గర్లు అంగీకరించరు. వారి ఉద్దేశ్యంలో వ్యక్తి తన జీవితానికి ఒక గమ్యాన్ని, పరమార్థాన్ని, విలువను నిశ్చయించుకొంటాడు. దీనికి దేవుని ఉనికి (ఉన్నాడో, లేడో)తో సంబంధం లేదు. అందుచేతనే పాశ్చాత్య ప్రపంచమంతా వ్యక్తి స్వేచ్ఛ కేంద్రంగా తిరుగుతూ ఉంటుంది. ఈ భావన నుంచి కొంత జరిగిన మూర్తిగారు, మనిషికి–దేవునికి, భూమికి – ఆకాశానికి, కచ్చితత్వానికి–అనిశ్చితికి, మానవత్వానికి – దైవత్వానికి మధ్యన ఉన్న (Intermediate) స్థితిని తాను ప్రతిపాదిస్తున్నట్లుగా, దానినే మధ్యే మార్గం (సంధ్య స్థాన)గా గుర్తించవచ్చని వారు తెలియజేశారు. ఈ రచన ద్వారా మూర్తిగారు పంచుకొన్న లేదా వెల్లడి చేసిన అభిప్రాయాల ఆధారంగానే, వారు ఆస్తికత్వం నుండి కొంత జరిగి, పూర్తిగా నాస్తిక వాదం కూడా కాని స్థితికి మళ్ళినారని తెలుస్తుంది. అందుచేతనే ప్రముఖ జర్నలిస్టు అయినటు వంటి నార్ల వెంకటేశ్వరరావు గారు ఆచార్య సచ్చిదానందమూర్తి గారి తాత్త్విక ప్రయాణాన్ని ఉటంకిస్తూ "విగ్రహారాధకునిగా మొదలైన మూర్తి విగ్రహ భంజకునిగా మారడం వింతే" అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఒకానొక వ్యాసంలో మూర్తి గారే తన తాత్త్విక ప్రయాణాన్ని గూర్చి తెలియజేస్తూ ఈ క్రింది విధంగా పేర్కొన్నారు.

> **"నేను జన్మతః విశిష్టాద్వైతిని.**
> **విశేషాధ్యయనము చేసినది అద్వైతమందు.**
> **సంస్కృతాభ్యాసము చేసినది దిగద్దంతులైన**
> **ద్వైతాచార్యుల వద్ద. ఇటుల మత త్రయము**
> **తోడను నాకు బాంధవ్యమున్నది."**

అయితే తత్త్వశాస్త్ర పరంగానూ, వ్యక్తిగతంగానూ మూర్తి గారు వేదాంతంపై ఎక్కువ మక్కువ చూపినట్లు మరణించే సమయం వరకు వేదాంతిగానే జీవితం గడిపినట్లు తెలుస్తుంది. వారి మాటల్లో "స్వేచ్ఛకు మార్గము మరియు ముక్తికి సాధనము ఇంచు మించుగా వేదాంతమేనని నేను ఎక్కువ నమ్మకంతో ఉన్నాను." ఇదే భావన చివరి వరకు కొనసాగిందని చెప్పవచ్చు. చివరిగా చెప్పదగినది ఆచార్య మూర్తి గారు భారతదేశంలో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ తరువాత అంతటి ప్రజ్ఞావంతమైన తత్త్వవేత్త అని చెప్పవచ్చును. అదే వారసత్వాన్ని కొనసాగిస్తూ మరింత నిశితంగా తాత్త్విక విషయాలను బహిరంగపరచినారని చెప్పవచ్చు. అసమాన ప్రతిభ, మేధస్సు, సహజాత హాస్య - వ్యంగ్య చతురత వారి సొంతం. వారితో ఏ కొద్ది పరిచయమున్న వారికైనా ద్యోతకమయ్యే విషయం. వారు తత్త్వశాస్త్రాన్ని కొత్త పుంతలు తొక్కించారనడంలో ఎటువంటి సందేహం లేదు. అప్పటివరకు అధిభౌతిక శాస్త్రం, తర్కం, ఎపిస్టమాలజీ వంటివే కాకుండా; దాని పరిధిని రాజనీతి, విద్య, సామాజిక మార్పులపరంగా ఏర్పడే భావనలనన్నింటిని తనలో ఇముడ్చుకోగలిగినప్పుడే అది ఒక పరిపూర్ణ శాస్త్రంగా రూపుదిద్దుకోగలదు. ఒకానొక సందర్భంలో వారే కాలంతోపాటు ఇతర రంగాలలో ఏర్పడిన మార్పులు, సమకాలీన ఇతర అంశాలకు చెందిన శాస్త్రవేత్తల సమాగం వలన తన దృక్పథంలో ఎంతో మార్పు వచ్చిందని చెప్పారు. ముఖ్యంగా 1980 దశకం తరువాత విద్య, విదేశాంగ విధానం, సామాజిక, ఇత్యాది అంశాల పై వారు చేసిన ప్రసంగాలు, రచనలను పరిశీలిస్తే ఈ అంశం మరింతగా బలపడుతుంది. ప్రారంభంలో పూర్ణ వేదాంత వాదిగా, దైవ సంబంధంగా సాగిన వారి రచనలు క్రమేపీ మత సంబంధం లేని సెక్యులర్ భావనల వైపు మళ్ళినాయని చెప్పవచ్చు. భారతీదాసన్ విశ్వవిద్యాలయం, తిరుచరాపల్లి, శ్రీశరనాదశృత జయంతి జన్మదిన స్మారకోపన్యాస సందర్భంలో "పంచశీల-పంచతంత్ర" అన్న అంశంపై వారు చేసిన ప్రసంగం వారి యొక్క సెక్యులర్ భావాలకు ప్రతీక. భారతదేశ విదేశీ విధానాన్ని చర్చించిన సందర్భంలోను, శాంతి యొక్క మూలాలను తరచి చూచిన విషయంలోను ఇదే ధోరణి వ్యక్తమవుతుంది. అదే విధంగా భారతీయ తత్త్వశాస్త్రాన్ని గూర్చి, తత్త్వవేత్తల గురించి పాశ్చాత్య తత్త్వవేత్తలు, ప్రజలకు ఉన్న తప్పుడు అభిప్రాయాలను నిర్ద్వందంగా ఖండించారు. భారతీయ వాఙ్మయం అసలు తత్త్వశాస్త్రమే కాదని, భారతదేశంలో ఎన్నదగిన తత్త్వవేత్తలు లేదా తత్త్వశాస్త్ర చింతనాపరులు లేనేలేరని వారు అప్పటి వరకు చేసిన వాదనలన్నింటిని ఋజువులతో సహా పరిష్కరించి, తూర్పు దేశాల ఔన్నత్యాన్ని నిలబెట్టారు. ఈ విషయంగా భారతదేశ కృషితోపాటు, చైనా, జపాన్, కొరియా వంటి వాయువ్య దేశాల కీర్తిని కూడా తత్త్వశాస్త్రపరంగా ఇనుమడింప జేశారు. మూర్తిగారు ఎంత నిష్కర్షగా, సూటిగా, దాపరికం లేకుండా ఉంటారు అనే దానికి ఉదాహరణగా ఒకానొక చోట వారి ప్రసంగంలో ఈ క్రింది విధంగా చెప్పుకొన్నారు.

"సత్యాన్ని మీకివ్వడానికి నేను సత్యంతో కూడిన గురువును కాను. ఒక విశేష లేదా అసామాన్య గురువు సత్యాన్ని ఇచ్చాడనే దానిని కూడా నేను విశ్వసించను. శంకరుడు, బుద్ధుడు, మహావీరుడు వంటివారు, మత సంబంధమైన గ్రంథాలు, ఇతర పుస్తకాల నుండి వారి బోధనలను వివరించడానికే ఒక విమర్శనాత్మకుడిగా, పండితునిగా ఇక్కడ ఉన్నాను."

ఈ వాక్యాలు బుద్ధుని యొక్క అంతరంగాన్ని పోలి ఉన్నాయి. సత్యమనేది ఎవరికి వారు తెలుసుకోదగినది. మూర్తిగారి యొక్క విస్తృత తత్త్వ విచారాన్ని ఒక్కటి లేదా రెండు వ్యాసాలలో పొందుపరచడం సాధ్యమయ్యే పని కాదు. వారి ప్రతి రచనను విడమరచి, విశ్లేషించుకోవడం సముచితం. ఈపనిని వారితోపాటు పని చేసిన ఆచార్యులు, విద్యార్థులు, జాతీయ, అంతర్జాతీయ తత్త్వశాస్త్రజ్ఞులు చేసి ఉన్నారు. అయినప్పటికీ, ఆసక్తి కలిగిన ప్రతి విశ్లేషకుడు చేసే ప్రయత్నం మరిన్ని అంశాలను, క్రొత్త ఆలోచనలను రేకెత్తిస్తుంది. ఈ ప్రక్రియ ప్రతి శాస్త్ర విషయంగా సాగవలసిందే. ఆ లక్ష్య సాధన దిశగా ప్రేరేపింపబడినదే ఈ వ్యాసం.

**ఆచార్య కోదాటి వియ్యన్నరావు**
పూర్వ ఉపకులపతి
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.
గుంటూరు, ఫోన్ : 7093260655.

# విలక్షణ విజ్ఞాన వాటికలు

– గద్దం దేవీప్రసాద్

ఆయాకాలాలలో మనిషికి కొరుకుడుపడని వాటికి, అతను అదుపు చేయలేని వాటికి దైవత్వం ఆపాదించేవాడు. ప్రపంచంలోని అనేక నాగరికతలలో ఈ విషయం గోచరితం అవుతుంది. దీనికి భిన్నంగా సనాతన ధర్మం మనిషి మనుగడకు దోహదం చేసే ప్రతి ప్రకృతి అంశాన్నీ దైవంగా భావించి గౌరవించేది. చుట్టూ కనిపించే ప్రతి అంశాన్నే కాకుండా సుదూర గ్రహ గతులను, నక్షత్ర మండలాన్ని కూడా కూలంకషంగా అధ్యయనంచేసే ప్రయత్నం చేసేది. అలా తరాలుగా తాము సముపార్జించిన విస్తృత జ్ఞానాన్ని శ్రుతుల రూపంలో ఆ తరువాతి తరాలకు అందిస్తూ వచ్చారు. మలిదశలో దాన్ని తాళపత్రాల్లో నిక్షిప్తం చేస్తూ లక్షలాదిగా గ్రంథాలను ఏర్పరచారు.

ఏ కారణం చేతనైనా ఆ అపురూప గ్రంథాలు కాలి బూడిదైతే పరిస్థితి ఏమిటనే ఆలోచన నుండి ఆలయాల నిర్మాణం ఊపిరి పోసుకొని ఉండవచ్చు లేదా దీనికన్నా ముందే తాము ఎంతో లోతుగా అధ్యయనం చేసిన వాటిని దేవాలయాల రూపంలో ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో గుడుల నిర్మాణానికి అంకురార్పణ జరిగి వుండవచ్చు. కారణం ఏదైనా తాము సముపార్జించిన జ్ఞాన సంపద తమతో పాటూ మట్టిలో కలిసిపోరాదని "డై ఎంప్టీ" సిద్ధాంతాన్ని ఆచరించారేమో అనిపిస్తుంది.

ఆలయాలు కేవలం మూల విగ్రహానికి పూజలు చేయడానికే కాకుండా మరెంతో విస్తృత ప్రయోజనాలను ఆశించి నిర్మించారు. పూజ కోసమే అయితే నాలుగు స్తంభాలు పాతి మీద కప్పు వేసి,దానిపై గోపురం ఏర్పరచి ఏదో విగ్రహాన్ని నిలిపి వదిలేసేవారు. కానీ చిన్న పరిధిలో కాకుండా అతి విశాలమైన జాగాలో అనేకానేక విషయాలను నేరుగాను,ప్రతీకాత్మకంగాను తెలియ పరిచేలా గుదిగుచ్చి గుడుల నిర్మాణాలు జరిపారు. "దేహో దేవాలయం ప్రోక్తో" అంటే శరీరమే దేవాలయం. జీవుడే సనాతన దేవుడు. ఈ విషయాన్ని తెలియపరుస్తూ దేవళాలు నిర్మించారు. గర్భగుడి తలగానూ, మంటపం ఛాతీగానూ, అంతరాలయం మెడ గానూ, మహా మంటపం పొట్ట గానూ,ధ్వజస్తంభం వెన్నెముక గానూ, గోపురాలు పాదాలు గానూ సూచించారు. ఇక ఆలయాల నిర్మాణం ఆయా కాలాలలో అనేక క్రొత్త పుంతలు త్రొక్కింది. ఏప్రాంతంలో, ఏకాలంలో గుడినిర్మాణం జరిగినా అనేకానేక విజ్ఞాన శాస్త్ర విషయాలను పాటిస్తూ వచ్చారు. ఆయా ప్రాంతాల ప్రజల జీవనవిధానాలను, వేట,యుద్ధం,ఉత్సవాలు, వివాహ క్రతువులు వంటివి రాళ్లపై నేర్పుగా చెక్కారు.

మిగతా ప్రపంచం నాగరికత నేర్వక జ్ఞాన సముపార్జన చేయలేని పరిస్థితిలో ఉంటే సనాతనులు నేడు పరిచయం అయిన విజ్ఞాన శాస్త్రంలోని అన్ని విభాగాల్లోనూ లోతైన, విస్తృతమైన పరిశోధనలు చేశారేమో అనిపిస్తుంది గుళ్ళ నిర్మాణాలను పరిశీలించినప్పుడు. గుడి నిర్మాణంలో గణిత వాస్తు,శిల్ప,నాట్య శాస్త్రాలను,ఖగోళ,లోహ విజ్ఞానాన్ని అద్భుతంగా వినియోగించిన విధానాలు అచ్చెరువును కల్గిస్తాయి.ఆలయ నిర్మాణంలో ప్రతి విషయాన్ని హేతుబద్ధంగా శాస్త్రీయంగా ఆలోచించి సరైన కొలతలతో తీర్చిదిద్దారు. తిరువనంతపురం అనంత పద్మనాభస్వామి ఆలయం సంవత్సరంలోని రోజుల సంఖ్యకు సమానమైన 365.25 విలక్షణమైన శిల్పాలతో కూడిన స్తంభాలతో నిర్మాణం జరిగింది.ఇదో చిన్న ఉదాహరణ.

వేల సంవత్సరాల నాడే నవ గ్రహాలను గుళ్లలో స్థాపన చేశారు. వాటిలో ఛాయా గ్రహాలు రెంటిని వదిలి మిగతా ఏడు గ్రహాల పేర్లతో వారాలు ఏర్పరచారు. ప్లూటోకు గ్రహ లక్షణాలు లేవని దాన్ని ఈమధ్య తొలగించారు. బహుశ నెప్ట్యూన్ కూడా అదే కారణంతో గ్రహం కాదని తొలగిస్తారేమో!పెళ్ళినాడు వధూవరులకు అరుంధతి, వశిష్ఠ నక్షత్రాలను చూపెడుతారు. భూమికి అతి చేరువలోని జంట తారలు అవేనని నాసా సంస్థ ప్రకటించడం ఆశ్చర్యం.

డార్విన్‌కు ఎంతో ముందుగానే జీవ పరిణామ క్రమాన్ని దశావతారాల రూపంలో హేతుబద్ధంగా శిల్పాలతో వివరించారు. భూమి గుండ్రంగానే ఉందనే విషయాన్ని వరాహ విగ్రహంలో స్పష్టపరిచారు. సూర్యుని గమనాన్ని సరిగ్గా అంచనా వేసి ఆయా గుళ్లలో ప్రత్యేకించిన రోజుల్లో కిరణాలు పడేలా నిర్మాణం చేయడం విచిత్రం.

చందేలా రాజులు ఖజురాహోలో 954లోనే పూర్తిచేసిన 89 గుళ్లలో ఇప్పుడు మిగిలిన 23 గుళ్లలోని గర్భాలయం మొత్తం చీకటిగా ఉన్నా విష్ణుఈశ్వర విగ్రహాల పైన మాత్రమే సూర్యుని వెలుతురు పడేలా చేసిన నిర్మాణాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. తూర్పు గంగరాజులు నిర్మించిన కోణార్క్ దేవాలయం పైభాగంలో భారీ అయస్కాంతాన్ని నిలిపి లోపల గర్భగుడిలోని మూలమూర్తిని గాలిలో నిలిపి ఉంచారంటే ఈనాడు మన ఊహకు అందదు. ఆ సముదాయంలో ఒక విగ్రహంలో మనిషి శరీరంలోని 206 ఎముకలను చెక్కారు. అంటే వారికి మనిషి శరీర నిర్మాణంపైనా ( అనాటమీ) అవగాహన ఉన్న విషయం అవగతం అవుతుంది.

తమిళనాడులోని వరమూర్తీశ్వర దేవళంలో సాధారణ సూక్ష్మదర్శిని అంటే తెలియని కాలంలో స్త్రీ గర్భాశయంలో పిండం ఎదుగుదలను దశల వారీగా శిల్పించారు. ఇది ఆరు వేల సంవత్సరాల నాటిదని కొందరు కాదు వేయి వత్సరాల నాటిదని మరికొందరు అంటారు. ప్రమాదకరమైన తొమ్మిది విభిన్న లోహాలను, ధాతువులు కలిపి వేల సంవత్సరాల నాడు పళని గుడిలో విగ్రహాన్ని మలిచారు. పంచలోహాల విగ్రహాలు చేయడం చూస్తే వివిధ లోహాల పట్ల వారికున్న అవగాహన ఆశ్చర్యం కలిగిస్తుంది. ఏడు ప్రాకారాల శ్రీరంగం, కంచి, మదురై, రామేశ్వరం, బలమైన స్తంభం కప్పు నుండి వ్రేలాడదీసిన వీరభద్రుని గుడి, ఏకశిలా నందివిగ్రహం ఉన్న లేపాక్షి, శిల్పాల కణాచి రామప్ప గుడి, శ్రీకాళహస్తి వంటి చాలా గుళ్లలో అనేక ప్రత్యేకతలు కనిపిస్తాయి.

కేవలం ఐదు అడుగుల పునాది మీద ఎనభై వేల కిలోల బరువు గల శిలను చేర్చి కట్టిన ఎత్తైన గుడి బృహదీశ్వరాలయం. అలంపూరు ఆలయం నది ప్రవాహ ఉధృతిని తట్టుకొని నిలిచేలా పది మీటర్లలోతు పునాదులు వేసి నిర్మించారు. పాండవుల రథాలుగా పేరుబడ్డవి ఉన్న మహాబలిపురం గుళ్ళు మరో ఎత్తు. ఇక 401.8 ఎకరాల స్థలంలో విస్తరించిన అంకోర్ వాట్ గుళ్ళ సముదాయానికి మరోటి సాటిరాదు అనడంలో అతిశయోక్తి లేదు. కేవలం గుళ్లను పరిశీలిస్తేనే మన పూర్వీకులు ఎంతటి బహుముఖ విజ్ఞానాన్ని సముపార్జించారో తెలుస్తోంది. మేధావులమని ముద్రలు వేయించుకున్న వారు కొందరు, పురస్కార గ్రహీతలు ఇంకొందరు దోపిడి ముఠాల వలన, దౌర్జన్యంగా దేశంలోకి చొరబడి అధికారాన్ని హస్తగతం చేసుకున్న వంశాల రాజుల వలననే ఈ దేశానికి సంస్కృతి, నాగరికత, విజ్ఞానము అబ్బినాయని అనడం ఎంతటి డొల్ల వాదనో అర్థం అవుతుంది. హంపీలోని గుళ్ళను హిందువులే ధ్వంసం చేసుకున్నారని ఒకరిద్దరు అలాంటివారు అనడం గర్హనీయం. ఈ వాదన ఎలా ఉందంటే పాండవులకు పూర్వుడైన నలుడు వ్రాసిన జగతిలో మొట్టమొదటి వంటల పుస్తకం ''పాక దర్పణం''లో బిర్యానీలు ఎన్ని రకాలుగా వండవచ్చో వ్రాసివున్నా కానీ పర్షియానుండి ఆ ప్రక్రియ దిగుమతి అయ్యిందని సెలవిస్తుంటారు.

హిమాలయ శిఖరం ఎత్తును కనుగొన్న రాధానాద్ శిక్దర్ను కాదని మరొకరికి ఆ ఘనతను ఆపాదించినట్టు వాళ్ళ వ్యవహారం శైలి ఉంటోంది. ఒక్కో అవసరానికి ఒక్కోలా నిర్మాణం చేసే యజ్ఞవాటికలు మరో ప్రత్యేకం. వీటి నిర్మాణాలలో గణితంతో బాటూ రేఖాగణిత సూత్రాలను తూచా తప్పక ఆచరించారు. ఒక అంచనా ప్రకారం ఇప్పుడు నిలిచివున్న గుళ్ళు కాకుండా విశాల హిందూదేశంలో కనీసం నలభై వేల గుళ్ళను ముష్కరులు నేలమట్టం చేశారు. ప్రపంచంలో అతి పెద్ద ఏకైక నలంద విశ్వవిద్యాలయంలో వేలాది మందిని చంపడమే కాకుండా ఆరు నెలలనుండి సంవత్సర కాలం పాటూ అక్కడి గ్రంథాలను తగలబెట్టారని ఆ మూకలకు చెందిన వారే లిఖించారంటే మానవ జాతి ఎంతటి అమూల్యమైన జ్ఞాన సంపదను శాశ్వతంగా కోల్పోయిందో! ఆ విజ్ఞానం కొంతైనా గుళ్ళ రూపంలో నిలిచి ఉంది.

భారీ కొండను పైనుండి చెక్కుతూ ఎల్లోరాలో ఘనమైన శివుని ఆలయం ఏర్పరచిన విధానం నభూతో నభవిష్యతి. కర్ణాటకలోని పట్టడగల్, ఐహోల్, బాదామి, బేలూరు, హళేబీడు గుళ్లలోని శిల్ప వైభవానికి సాటి కలదా! మనపై రుద్దబడిన ఆధునిక విద్యావిధానంలో నలుగుతున్న తరాలు తరగతి గదుల్లో క్లిష్టమైన ప్రశ్నలను పరిష్కరిస్తున్నారు. కానీ జీవన సమరంలో ఎదురయ్యే చిన్న సమస్యలను జటిలం చేసుకొని బెంబేలెత్తిపోతున్నారు. ఫలితంగా తమపై తాము నమ్మకాన్ని కోల్పోయి ఆత్మన్యూనతా భావనలోకి జారిపోతున్నారు. అలాంటి వారు కొందరు చెప్పే మాటలను విని ఎక్కడెక్కడికో వెళ్ళి సమయాన్ని, డబ్బును వృథా చేసుకొని పూజలు చేస్తున్నారు. మన మాటలు, చేతలే

మన కర్మఫలాన్ని నిర్ణయిస్తాయనే విషయం మరచి పాపపరిహారం, పుణ్య సంపాదన కోసం వెంపర్లాడు తుండడం శోచనీయం.

1925లో అప్పటి ఈస్ట్ ఇండియా కంపెనీ విశాల హిందూ దేశంలోని హిందూ దేవాలయాలను మాత్రమే అజమాయిషీ చేసేలా చట్టం రూపొందించింది. ఈ శతాబ్దకాలంలో అన్ని ప్రభుత్వాలు సెక్యులరిజంకు సరిక్రొత్త భాష్యాలు చెబుతూ హిందూ గుళ్ళను తమ కబంధ హస్తాల్లో బంధించాయి. అన్ని గుళ్లలో దర్శనాలకు, రకరకాల పూజలకు భారీ రుసుములు ఏర్పరచి డబ్బులు దండుకోవడం ప్రారంభించాయి. వ్యవస్థల ప్రత్యక్ష, పరోక్ష సహకారాలతో గుళ్ళ చరస్థిరాస్తులు అన్యాక్రాంతమై పోయాయి. భారత పురావస్తు శాఖ సమర్థవంతంగా పనిచేస్తూ గుళ్ళను కాపాడగలగాలి. ప్రభుత్వ అధికారులు ఘరానా భిక్షగాళ్లుగా గుళ్లలో తిష్ట వేసుక్కూర్చున్నారు.

యువతరం ఈ ఉచ్చుల్లో పడకుండా తమ దృష్టిని మరల్చి ఆలయాల చరిత్రలను తెలుసుకొంటూ ఆయాగుళ్ళ నిర్మాణంలోని ప్రత్యేకతలను తెలుసుకొనే ప్రయత్నం చేస్తే మన ఘనమైన వారసత్వం ఏమిటో తెలుస్తుంది. ఆస్తికులు, నాస్తికులు, హేతువాదులు ఎవరైనా తమతమ ఇజాలను ప్రక్కన పెట్టి నిష్పాక్షికంగా గుళ్ళను పరిశీలిస్తే ఎన్నో పరిశోధనాంశాలు దొరుకుతాయి.

1200వ సంవత్సరంలో లియోనార్డో పిసానో ఫైబోనాక్సీ ప్రతిపాదించబడినట్టు చెప్పబడుతున్న స్వర్ణ నిష్పత్తిని (ద్వైవిక నిష్పత్తి అని 200 బీసీలో పింగళ అనే సంస్కృత గణిత శాస్త్రవేత్త పేర్కొన్నారు) తూచా తప్పక పాటిస్తూ మన గుళ్ళ నిర్మాణం ఎలా నిర్మించారు. పన్నెండు ద్వాదశ లింగాలు ఉన్న చోట్లను కలిపితే అవి అన్నీ కూడా ఆ విధంగానే ఎలా నిర్మించారో? శతాబ్దాలుగా, ముఖ్యంగా తొమ్మిది నుండి పదమూడో శతాబ్ది వరకు, లెక్కలేనన్ని గుళ్ళ నిర్మాణంలో ఎదురైన సవాళ్లను, సాధకబాధకాలను ఎలా అధిగమించారో! కనుబొమ్మల వెంట్రుకలను కూడా అత్యంత స్పష్టంగా చూపడానికి ఎలాంటి పరికరాలు వాడారో! కావలసిన రాళ్ళను గుర్తించి వాటిని త్రవ్వి తీసి గుళ్ళు నిర్మాణం జరిగే ప్రాంతాలకు తరలింపు ఎలా చేశారో! రకరకాల శాస్త్రాల విజ్ఞానసారాంశాన్ని శిల్పులకు ఎలా అవగాహన కలిగించారో! ఇప్పటి కర్ణాటకలోని గడగ్ ప్రాంతంలో చాళుక్యులు పదివేలమంది శిల్పులకు తర్ఫీదు ఇచ్చేలా విశ్వ విద్యాలయాన్ని నడిపేవారట. ఇలాంటివి చాలా ప్రాంతాల్లో శిల్పులను వృక్ష శాస్త్రవేత్తలందామా? హిందూ దేశంలో అత్యంత పురాతన శివుని ఆలయంగా గుర్తింపు పొంది తిరుపతికి దగ్గరలోని గుడిమల్లం ఎన్నో విశిష్టతలకు నెలవు. తిరుమల ఆలయ చరిత్ర తెలుసుకోవడంతో బాటూ జగతిలో అత్యంత పురాతనమై అనేక గుళ్ళకు స్థావరమైన కాశీక్షేత్ర దర్శనం అలౌకికానందాన్ని ఇస్తుంది. అలాగే ఇప్పటి వరకు వివిధ గుళ్లలోని శిల్పాలలో 64 సంగీత పరికరాలను, 300 వందల రకాల జడలను, 900 వేర్వేరు ఆభరణాలను,3500 రకాల వస్త్రధారణలను గుర్తించారు. మరెన్నో పక్షులు, జంతువులు శిల్పాలలో కనిపిస్తాయి. నవరసాలను కూడా శిల్పులు చిత్రిక పట్టారు.

ఇవికాక అనేక శాసనాలను తమలో ఇముడ్చుకున్న గుళ్ళు మన చరిత్రను కూడా చెబుతుంటాయి. ఇలా చరిత్ర (హిస్టరీ), అన్ని కళారూపాలు (ఆర్ట్స్), విజ్ఞానశాస్త్రంలోని అన్ని విషయాలు (సైన్సు) అలంకరణ (ఫ్యాషన్) వంటే అనేకానేక విషయాలను తెలియచేసే ఆలయాలకు సాటి మరో ధర్మంలో ఎక్కడాకానరాదు. ప్రాచుర్యంలో లేని మరుగుపడిన గుళ్ళను కూడా పరిశీలిస్తే మరెన్నో సంగతులు వెలికితీయొచ్చు. ఈ పని భారతీయ పురావస్తు శాఖ, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చేయాలి. జక్కన్న, రామప్ప వంటి అతికొద్ది మంది శిల్పుల పేర్లు మాత్రమే మనకు తెలుసు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా ఆకళింపు చేసుకొని వాటిని తమ మనోఫలకాలపై చిత్రించుకొని, వాటిని మనోనేత్రంతో చూస్తూ గండ శిలలలో యధాతథంగా జీవం ఉట్టిపడేలా చెక్కిన అజ్ఞాత శిల్పులకు జాతి యావత్తు రుణపడి ఉంటుంది. వారి ప్రతిభాపాటవాలు ఈ నాటి తాంత్రిక విద్యాధికులకు (ఇంజనీర్లు) అర్థం కాకపోవచ్చు.

దుర్బుద్ధితో విదేశీయులు వక్రీకరించి వ్రాసిన మనదని చెప్పబడే చరిత్ర చదవడం ఆపి మన అసలు చరిత్రను, అదీ ఆలయాల దర్శనం ద్వారా, తెలుసుకోగలిగే విధానానికి బాటలు వేసుకోవాలి. మన సంస్కృతిని తెలుసుకొని కాపాడుకుని మనల్ని మనం గౌరవించుకొంటేనే ఒక జాతిగా సనాతనం నిలిచివుంటుంది. వివేకానందుల వారన్నట్టు ఏ జాతి తన సంస్కృతిని నిర్లక్ష్యం చేస్తుందో ఆ జాతి కాలగర్భంలో కలిసిపోతుంది.

**గడ్డం దేవీప్రసాద్**
రచయిత
బెంగళూరు, ఫోన్ :8971830473




**– వేలూరి కృష్ణమూర్తి**

**'చెస్'** ఆటలో ప్రఖ్యాతి గాంచిన ఆటగాడు బాబీ ఫిషెర్ తనతో పోటీ చేస్తున్న విశ్వనాథన్ ఆనంద్‌తో ఒకమారు యిలా అన్నాడట.'ఇక్కడ అమృతాంజన్' మలాము లభించడం లేదు. మీరు భారత్ దేశం నుండి వచ్చేటపుడు అమృతాంజన్ మలాము తెచ్చి యివ్వండని కోరి తెప్పించుకొన్నాడట. ఈ దంతకథ ఒకప్పుడు చాలీలో వుండేది. ఒకానొక కాలంలో తల నొప్పి, యితర చిన్న చిన్న శరీర నొప్పులకు చలామంది ఇళ్ళలో 'అమృతాంజనం' మలాము, చర్మానికి కలిగే కాల్పులకు, యితర పుండ్లకు 'సైబాల్' మలాము, 'బర్నాల్' మలాము లాంటి మందులు వుండేవి. వీటిలో 'అమృతాంజనం' అగ్రస్థానం ఆక్రమించి వుండేది. దానికి కారణం అమృతాంజనం తల నొప్పికే కాక యితర శరీర నొప్పులకు కూడ 'అమృతాంజనం' వాడేవారు. జలుబు మరియు యితర అన్ని రకాల శరీర నొప్పులను దూరంచేసే మలామని దేశమంతటా 'అమృతాంజనం' గొప్ప పేరు గడించుకొన్నది. ఇప్పటికీ 'అమృతాంజనం' తన అస్తిత్వాన్నీ, ప్రస్తుతను కాపాడుకొంటూ ప్రజల శరీర నొప్పుల నివారణకు ప్రముఖ మందుగా ముందుకు సాగుతున్నది.

శోభనాచల వారు అమృతాంజనం గురించి విడుదల చేసిన షార్ట్ విడియోలో ఆ కాలపు అమృతాంజనం కోసం తీర్చి దిద్దిన అడ్వర్టైజ్‌మెంట్స్ చూస్తుంటే చాలా ముచ్చట వేసింది. భారత దేశంలోనే కాక విదేశాలలోనూ పేరు ప్రఖ్యాతి గడించిన ఈ మలాముకు కర్త ఎవరు? ఈ బహూపయోగి మాంత్రిక నొప్పి బాధ తగ్గించే 'అమృతాంజనం' మలాము తయారు చేసినవారెవరు? దాని కథా కమీషు ఏమిటి? ప్రధాని మోదీ 'ఆత్మ నిర్భరత' పేరుతో ఎన్నో దేశీయ ఉత్పత్తులకు అగ్రస్థానం లభిస్తున్న ప్రస్తుత పరిస్థితిలో 130 సంవత్సరాల క్రితమే ఇలాంటి ఒక ఉత్పత్తిని మన దేశ ప్రజలకు తయారు చేసి వాడుకదారుల ప్రీతిని గడించిన ఘనత ఒక తెలుగు వాడికి చెందుతుంది.


శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు

అతడు వేరెవరో కాదు, 'ఆంధ్ర పత్రిక'ను స్థాపించిన దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు గారు. ఎవరీ నాగేశ్వరరావు?, అతడెలా ఔషధ రంగంలో ఇలాంటి అత్యుత్తమమైన ఉత్పత్తిని ఆవిష్కరించ గలిగారు? అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ భాగమైన కృష్ణా మండలం, గుడివాడ తాలూకా, ఎలకుర్రు అగ్రహారంలో మే 15, 1867న బుచ్చి అయ్యవారు–శ్యామలాంబ దంపతులకు జన్మించాడు. ఆ దంపతులు తమ కుమారుడికి 'నాగలింగం' అని నామకరణం చేశారు. నాగలింగానికి అక్షరాభ్యాసం ఆ కాలపు సంప్రదాయం ప్రకారం సంస్కృతం నాగర లిపిలో జరిగింది. కాని, తల్లి ఆలోచన వేరొక విధంగా వుండేవి. ఆమె కోరిక మేరకు ఇంగ్లీషు చదువుకుగాను అతడిని బందరు ఉన్నత పాఠశాలలో చేర్చి, అక్కడ స్కూల్ ఫైనల్ ముగించాడు. ఇంతలో తండ్రి మరణించడంతో స్వయం కృషి మరియు మిత్రుల సహాయంతో గుంటూరులోని ఎ.ఇ.ఎల్.ఎం కాలేజీలో చేరి ఇంటర్ పాస్ చేసి అనంతరం చెన్నపట్నం (ఇప్పటి చెన్నై) చేరి క్రిస్టియన్ కాలేజీలో బి.ఎ., చదువుతున్న నాగలింగం చెన్నపట్నంలో నివసిస్తున్న రెంటాల వెంకట సుబ్బారావుకు (ఈయన తెలుగునాట మెయిల్ ఆర్డర్ బిసినెస్‌కు వరవడి పెట్టిన మార్గ దర్శకుడు) తన వ్యాపార విషయాల్లో కుడిభుజంగా వుండి సాయపడుతుండేవాడు.

అబ్బాయి వాణిజ్యాభిలాష గుర్తించిన సుబ్బారావు తన మేనకోడలు రామయమ్మ నిచ్చి 1893లో పెళ్ళి చేశాడు. సుబ్బారావు ద్రోణుడు, శిష్యుడు నాగలింగం ఏకలవ్యుడయ్యాడు.

ఆ కాలంలోనే నాగలింగం నాగేశ్వరరావుగా మారాడు. భార్యను పుట్టింటికి పంపి నేరుగా కలకత్తా చేరాడు. అక్కడ ఆయుర్వేద ఔషధాలు తయారు చేస్తున్న బౌమన్ అన్న ఒక తెల్ల దొర స్నేహం సంపాదించి ఆ విద్య కొంత తెలుసుకొని ఆయన ప్రోత్సాహంతో కొంత ఆర్జన కలిగింది. అనారోగ్యంతో స్వగ్రామం ఎలకుర్రు చేరుకొన్నాడు. అక్కడ రెండేళ్ళు గడిపిన నాగేశ్వరరావు మనసు బొంబాయి వైపు మళ్ళింది. బొంబాయిలో ఎగుమతి–దిగుమతి వ్యాపారంచేసే మహారాష్ట్ర వర్తకుడు గణపతివద్ద కొలువుకు కుదురుకొన్నాడు. వ్యాపార నిమిత్తం వేషం మారింది. సూటు బూటు ధరించ సాగాడు.

అలా రెండేళ్ళు గడిపిన మీదట స్వంతంగా వ్యాపారం చేయాలని తలచిన నాగేశ్వర రావు అందరికీ ఉపయోగ మవుతుందన్న కొన్ని మందులు తయారు చేశాడు. తన సంస్థకు William & Company అని పేరు పెట్టాడు. ఆ కాలంలో పల్లెలలో వైద్య సహాయం లభ్యమయ్యేది కాదు. కేటలాగు తయారు చేసి మందుల అమ్మకం ప్రారంభించాడు నాగేశ్వరరావు. ఎక్కడెక్కడినుంచో ఆర్డర్లు కుప్పలు కుప్పలుగా కురిసేవి. వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. అప్పుడు నాగాశ్వరరావు ఆలోచించాడు, ఒక ఐడియా తట్టింది. ఇన్ని మందులెందుకు. ఏదో మంచిమందు ఒకదానిపై దృష్టి పెడితే మంచిది కదా! అలా తలచిన నాగేశ్వరరావు, జనుల అన్ని రకాల నొప్పుల బాధ తగ్గించడానికి ఒక దివ్య ఔషధం తయారు చేశాడు. అలా 1894లో పుట్టింది అద్భుత నొప్పుల నివారిణి మందు 'అమృతాంజనం' మలాము.

నాగేశ్వరరావు కోటికి పడగలెత్తడానికి ఈ మలాము మూల కారణమైంది. నాగేశ్వరరావు తన సంసారాన్ని బొంబాయికి మార్చాడు. పది పధ్నాలుగేళ్ళదాకా రావుగారి దృష్టి అమృతాంజనం మీదనే వుండేది. 1908 నాటికి వ్యాపారంతోపాటు జీవితం కూడ స్తిమితపడింది. ఈ విజయంతో తృప్తిపడని నాగేశ్వరరావు, తాను పుట్టి పెరిగిన తెలుగు నేలకు ఏ విధంగా ఉపకరించగలనని తనను ప్రశ్నించుకొన్నాడు. ఆ సంకల్పం బొంబాయిలోని చికల్వాడి నుండి వెలువడిన తెలుగు పత్రిక 'ఆంధ్ర వారపత్రిక'. దీనితో ఆంధ్రావని ఆశ్చర్యానికి అంతు లేకపోయింది. ఇంతలో వచ్చి పడింది మొదటి ప్రపంచ మహాసంగ్రామం.

ఆంధ్ర పత్రిక సంపాదకుడుగా బాధ్యతలు అధికమయ్యాయి. చెన్నపట్నంలో పత్రిక బ్రాంచి స్థాపించాలని తలచి తను విద్యార్థి దశలో నివసించిన 7, తంబుచెట్టి వీధిలోని ఎర్ర రంగు భవనాన్ని రూ.46,000 కొని దానిని 'ఆంధ్ర పత్రిక' ఆఫీసుగా చేశాడు.

ఆ విధంగా 'ఆంధ్ర పత్రిక'ను బొంబాయి నుండి చెన్నపట్నానికి మార్చి తెలుగు ప్రజలకు దగ్గరయ్యాడు. అదే సమయానికి ఆంధ్ర వారపత్రిక దినపత్రికగా మారింది. అనంతర కాలంలో అత్యంత ప్రఖ్యాతి గడించిన 'భారతి' మాస పత్రికను ప్రారంభించారు. దీనితో నాగేశ్వరరావు పంతులు గారి బాధ్యతలు మరింత అధికమయ్యాయి. కోట్లకు పడగలెత్తిన పంతులుగారు దానకర్ణుడయ్యాడు. ఆ మహాశయుడు అనంతర కాలంలో ఆధునికాంధ్ర దేశోద్ధారక, విశ్వదాత, కళా ప్రపూర్ణ శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు అయ్యారు! మదరాసు ప్రెసిడెన్సీ నుండి ఆంధ్రులకు ఒక ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం నాగేశ్వరరావుగారు చేసిన నిరంతర ప్రయత్నాలు, స్వతంత్ర పోరాటంలో తీవ్రంగా పాల్గొనడం లాంటి చర్యలతో 'దేశోద్ధారక', అన్న పట్టం అతడిని వరించింది.

భారత దేశ స్వాతంత్ర్యం, ఆంధ్రుల ప్రత్యేక రాష్ట్రపు కలలు నిజమయ్యేలోగానే యుగపురుషుడు, ధన్యజీవి 71 ఏళ్ళ వయసులో 1938, ఏప్రిల్ 19న ఆంధ్రావనిని అంధకారంలో ముంచి మనలను విడిచి కైలాస వాసుడయ్యాడు. ఈ విషాద వార్త విన్న గాంధి మహాత్ముడు 'ఈ దానకర్ణుడి స్థానం ఆక్రమించడానికి ఎవరున్నారు'? అని ప్రశ్నించారట. అనంతర కాలంలో బొంబాయినుండి ఆంధ్ర పత్రిక ప్రచురణ, సంపాదక బాధ్యతలు ఎత్తుకొన్న శ్రీ శివలెంక శంభుప్రసాద్ గారు, 1972లో వారు మరణించేవరకు దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు నెలకొల్పిపోయిన తెలుగుజాతి సంస్థలు, ఆంధ్ర పత్రిక, ఆంధ్ర సచిత్రవార పత్రిక, భారతి, అమృతాంజనం స్థాపకులు ఏ ఉద్దేశంతో వాటిని నెలకొల్పారో ఆ లక్ష్యాలు దృష్టిలో పెట్టుకొని వాటిని పెంపుచేయడం, వాటికి ఇంకా విస్తృతినీ, పెరుగుదలనూ సాధించడం, కొన్ని దశాబ్దాల పాటు ఎటువంటి అంతరాయం కలుగకుండా నిర్వహించి

వాటిని శాశ్వత సంస్థలుగా రూపొందించి నిలబెట్ట గలిగారు. 1975 నాటికే అమృతాంజన్ లిమిటెడ్ అన్న ఒక క్రొత్త కంపెనీ స్థాపించబడి ప్రముఖ నగరాలైన బొంబాయి, మదరాసు, కలకత్తా, న్యూఢిల్లీ, హైదరాబాదులలో కంపెనీ శాఖలు పనిచేస్తుండేవి.

అమృతాంజనం మలాము ఉత్పాదించే సంస్థ అయినా, ఇది కేవలం పెయిన్ బామ ఉత్పత్తి చేసే సంస్థగా మాత్రమే వుండిపోలేదు. 2002లో డయాబెటిక్ ఔషధం 'డయాక్యూర్' ఔషధాన్ని ఈ సంస్థ మార్కెట్ చేయసాగింది. 2004లో 'అఫేర్' పేరుతో హెర్బల్ మౌత్ ఫ్రెష్-నర్‌ను కూడ పరిచయం చేసింది. ఇది మాత్రమే కాక 2001లో ఈ సంస్థ సాఫ్ట్‌వేర్ దునియాకు అడుగులు వేసింది. 'అమృతాంజన్ ఇన్ఫోటెక్' సంస్థ ద్వారా చెన్నైలో ఒక కాల్ సెంటర్‌ను నడుపుతున్నది. 2011లో ఫుడ్ సెక్టర్లో తన ప్రభావం చూపాలన్న కోరికతో చెన్నైకు చెందిన 'శివా సాఫ్ట్ డింక్స్ (ప్రై) లిమిటెడ్ సంస్థను రూ.26 కోట్లకు కొన్నది.

ఈ 21వ శతాబ్దంలో అమృతాంజనం మలాముకు ఎన్నో పోటీ మందులు వచ్చివున్నా, తలనొప్పి, యితర నొప్పులకు అమృతాంజనం స్థానం యిప్పటికీ తగ్గలేదు. అమృతాంజన్ సంస్థ ఉత్పత్తి చేస్తున్న మలాము, యితర మందులు గల్ఫ్, ఆఫ్రికన్, ఆగ్నేయ ఆసియా దేశాలలోనూ లభిస్తున్నాయి. అమృతాంజన్ మలాము తన ప్రత్యేకతను ఎప్పటిలా నిలుపుకొంటూ వస్తున్నది. కాలానికి అనుగుణంగా, వినియోగదారుల అవసరాలు మన్నించి ఇపుడు అమృతాంజన్ ఎల్ల కాలపు 'దివ్య ఔషధం'లా వేరు వేరు రూపాలలో వారికి లభిస్తున్నది. 'అమృతాంజన్' ఉన్నంత కాలం శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారి పేరు చిరస్థాయిగా నిలిచివుంటుంది.

**వేలూరి కృష్ణమూర్తి**
మైసూరు, 944 897 7877

## బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి వైశ్య వసతిగృహంలో సాహితీ వేత్తల ఆత్మీయ సమావేశం

*గుంటూరులోని నగరంపాలెంలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి వైశ్య వసతిగృహంలో 16-12-2025 నాడు సాయంత్రం 6 గం.లకు బొమ్మిడాల కృష్ణమూర్తి గారి అధ్యక్షతన, మోదుగుల రవి కృష్ణగారు సమన్వయ కర్తగా ముఖ్య అతిథిగా డా. సగిలి సుధారాణిగారు పాల్గొన్నారు. వీరు "తమిళనాట తెలుగువారి ప్రస్థానం" అనే అంశంపై ప్రసంగించారు. ముఖ్యంగా ప్రాచీన, మధ్య, ఆధునిక ఉత్తరాధునిక యుగాలలో తెలుగువారి వలసలు ఏవిధంగా కొనసాగాయో తెలియజేస్తూ అందుకు సాక్షీభూతాలైన జానపద కథనాలను సోదాహరణంగా వివరించారు. బొమ్మిడాల కృష్ణమూర్తిగారు ప్రసంగిస్తూ "గత కొంతకాలంగా సగిలి సుధారాణిగారు* ***మిసిమి****లో దారావాహికంగా వస్తున్న దక్షిణాది తెలుగు సంస్థానాలు చాలా ఆసక్తికరంగా ఉన్నాయని తాను వాటిని తప్పక చదువుతున్నట్లు" తెలియజేశారు. వీటిని పుస్తకరూపంగా తీసుకొని వస్తే బాగుంటుందని అన్నారు.*



*ఈ కార్యక్రమంలో ప్రముఖ తెలుగు సాహితీ వేత్తలు, కవులు, తెలుగు భాషాభిమానులు సమావేశం అయ్యారు. శ్రీమతి మరియు శ్రీ జస్టిస్ డా. కె. ఇ. శంకర్ గారు, డా. వెలువోలు నాగరాజ్యలక్ష్మి, శ్రీ వశిష్ట, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీతలు డా.పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీ నారాయణ, ఆచార్య సి. హెచ్. సుశీలమ్మ, డా. భూసురపల్లి వెంకటేశ్వర్లు, ఎస్.ఎం. సుభాని, వెన్నసెట్టి సింగారావు, వి.లక్ష్మణ రెడ్డి, వి. విజయలక్ష్మి, టి.ధనంజయ రెడ్డి, ఆర్. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.*

**- సుబ్రహ్మణ్యం**

# క్రిస్టీ బ్రౌన్
## (1932 - 1981)

**- టి.వి. ప్రసాద్**



క్రిస్టీ బ్రౌన్

పసికందుకు స్తన్యం యివ్వడానికి తల్లిచేసిన ప్రయత్నం ఫలించదు. బిడ్డది నోరు తెరిచి పాలు తాగలేని పరిస్థితి. బిడ్డడు నోరు తెరవడానికి తల్లి చేసిన ప్రయత్నంతో నోరు తెరుచుకుంటుంది కానీ మూతపడదు, పెదవులు దగ్గరికి రావు. ఫరవాలేదు క్రిస్టీ, ఇంకోసారి ప్రయత్నం చేద్దాం! అని శిశువును గుండెకు హత్తుకుంటుంది, తల్లి బ్రజెట్ ఫాగన్. క్రిస్టీ పుట్టుకతోనే ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందిపడేవాడు. శరీరం నీలిరంగులో వుండేది. వైద్యులు అతని ఊపిరిని క్రమబద్ధం చేసే ప్రయత్నంలో, కండరాలను నియంత్రించే మెదడు భాగం దెబ్బతింటుంది. చేతులు మెలిదిరిగి పనికిరావు, కూర్చోలేని పరిస్థితి. 1932 నాటికి క్రిస్టీది అర్థం కాని జబ్బు. మెదడుకు వచ్చిన పక్షవాతం వల్ల అతనికి వచ్చింది మానసికలోపం అని నిర్ధారించి తామేమీ చేయలేమని తేల్చి చెబుతారు. ఏదైనా మానసిక వికలాంగుల సంస్థలో చేర్చమని సలహా యిస్తారు. బ్రౌన్ తలిదండ్రులు దీనికి ఒప్పుకోరు. డబ్లిన్ ( ఇర్లండ్ రాజధాని) లోని తమ ఇంట్లోనే, తమ సంతానం మధ్య పెంచాలని నిశ్చయించుకుంటారు. వారిది బహుళ సంతానం గల కుటుంబం. పని చేసుకుని బతికే అతి సాధారణ కుటుంబం. తల్లి తన బిడ్డ పనికిమాలిన వాడు కాదని నిరూపించాలని నిర్ణయించుకుంటుంది.

రోజులు గడిచి పోతాయి. క్రిస్టీ శరీరాన్ని నిమురుతూ తల్లి క్రిస్టీతో ముచ్చట్లు పెడుతూ, కథలు చెబుతూ పెంచుతుంది. తండ్రి పాట్రిక్ బ్రౌన్ ఇటుక పని కార్మికుడు. అతనికి ఎంత పని వున్నా కొడుక్కు స్నానం చేయించి, బట్టలు వేసేవాడు. క్రిస్టీలో ఏ మాత్రం అభివృద్ధి కనిపించదు. స్నేహితులు, బంధువులు క్రిస్టీని ఏదైనా వికలాంగుల సంస్థలో చేర్చితే మంచిదని సలహాయిస్తారు. అప్పటికే (21మందిలో పోయిన వారు పోగా) ఏడుగురు పిల్లలతో సంసార భారం మోయడం కష్టమంటారు. క్రిస్టీకి బాల్యం పీడకలలాగా అనిపిస్తుంది. వినగలడు, చూడగలడు, అనుభూతి చెందగలడు, ఆలోచించగలడు. కానీ ఎవరికీ ఏమీ చెప్పలేడు. తలకూడా తిప్పలేడు. తానున్న విషయాన్ని తెలియ చేయడం పెద్ద సమస్యే.

ఐదేండ్ల వయసులో దిండ్ల నానుకొని కూర్చోగలిగేవాడు. ఒకరోజు వంటగదిలో సోదరి పలక మీద అక్షరాలను దిద్దడం చూస్తాడు. హటాత్తుగా ఎడమ కాలు ముందుకు చాచి మొదటి రెండు వేళ్ళ మధ్య సుద్ద ముక్కను ఇరికించుకుని పలకమీద పిచ్చిగీతలు గీస్తాడు. అంతకు ముందెప్పుడూ అతడు కాలునుపయోగించలేదు. ఇది గమనించిన తల్లి A అక్షరం రాయడం చూపిస్తుంది. కాలితో రాయడం క్రిస్టీకి చాలా కష్టమైన పని, ఐనా ప్రయత్నిస్తాడు. తల్లికి అంతులేని ఆనందంతో కన్నీరు ఉబుకుతుంది. ఇది జరిగిన ఏడాదిలోపు క్రిస్టీ జీవితంలో చాలా మార్పు వస్తుంది. చాక్‌పీసులతో ఏడాదిలోనే A నుండి Z వరకు అక్షరాలు రాయడం నేర్చుకుంటాడు. తల్లి అతనికి గొంతుతో శబ్దాలు చేసే (grunting) భాష నేర్పుతుంది. ఇంట్లో అందరికీ అది అర్థమయ్యేది. ఒక్క కాలు ఆధారంగా (శరీరంలో ఇంకే అవయవమూ పని చేయదు) పాకుతూ ఇల్లంతా తిరగడం, మెట్లు ఎక్కడం,



క్రిస్టీ బ్రౌన్

దిగడం చేయగలిగేవాడు. ఎడమ కాలితోనే తన కోపాన్నీ ప్రదర్శించేవాడు. తండ్రి తయారు చేసిన చక్రాల తొట్టెలో కూర్చోబెట్టుకొని అన్నలు బయట తిప్పేవారు. ఇంటికే పరిమితమైన క్రిస్టీ ఇప్పుడు తన 'రథం'లో బయటి ప్రపంచంలోకి అడుగు పెట్టాడు. పుట్టిన ప్రాంతం క్రమ్మెజీ, డబ్లిన్ వీధులు చూస్తాడు. తినిపించడం, బట్టలు వేయడం లాంటి పనులతో కుటుంబంలోని అందరి ప్రేమాభిమానాలతో తన సమస్యను మరచిపోయేవాడు. కొంత కాలానికి తోపుడు బండి ఇరుసు ఇరిగి పోవడంతో అతని జీవితం ఇంటికి, కిటికీకే పరిమితమై పోతుంది. కిటికీలోంచి బయటి పిల్లల ఆట పాటల్నీ, వారి బలిష్టమైన కాళ్ళుచేతుల్ని గమనించేవాడు. తన స్థితిని తలుచుకుని మెట్లు ఎగబాకి గదిలోని అద్దంలో తన స్థిరత్వం లేని తలను, వికారపు ముఖాన్ని చూసి కోపంతో ఎడమ కాలితో ఒక్క తన్ను తన్ని అద్దాన్ని పగల గొడ్తాడు.


తల్లి ఎంతో కష్టపడి దాచిన డబ్బుతో దృఢమైన, ఆధునికమైన కొత్త చక్రాల కుర్చీని (వీల్ ఛెయిర్) కొంటారు. కానీ క్రిస్టీ బయటికి పోవడానికి యిష్టపడడు. క్రిస్మస్ పండుగ సందర్భంగా కుటుంబంలోని అందరూ ఏదో ఒక బహుమతి అందుకుంటారు. సోదరులలో ఒకడు రంగులు బ్రష్ సెట్ బహుమతినందుకుంటాడు. అతడు రంగులు పులుముతుంటే చూసిన క్రిస్టీ దాన్ని ఇష్టపడి తన కొచ్చిన చిన్న సైనికుల సెట్‌తో మెయింట్ బాక్సును మార్చుకుంటాడు.

ఎడమ కాలి వేళ్ళ మధ్య బ్రష్ పెట్టుకొని అతి కష్టంమీద క్రాస్ బొమ్మను పెయింట్ చేస్తాడు. తను గీసిన బొమ్మను చూసి తెగ ఆనంద పడిపోతాడు. పై అంతస్తులోని బెడ్‌రూంలో రోజుల తరబడి పెయింట్ చేసి క్రిస్టీ రంగుల భాషను, వాటి స్వభావాన్ని తెలుసుకుంటాడు. తను చూసిన వస్తువుల నిశ్చల చిత్రాలు, ప్రకృతి దృశ్యాలు కుటుంబ సభ్యుల పోలికలతో వేసిన పెయింటింగులు కుప్పలు కుప్పలుగా పెరిగి పోతాయి. పెయింటిగులో తన ఒంటరితనాన్ని, బాధను మరచిపోయేవాడు. ఆ క్రమంలో దృఢంగా తయారవుతాడు. పన్నెండేండ్ల వయసులో ఐర్లండ్ జాతీయ పత్రిక ఒకటి నిర్వహించిన 12-16 సంవత్సరాల వయసువారి పెయింటింగ్ పోటీలో పాల్గొంటాడు. రెండు వారాల తర్వాత తండ్రి న్యూస్ పేపర్ ఊపుకుంటూ వచ్చి సంతోషంగా అందులోని వార్తను చూపిస్తాడు. ఐర్లండ్ మొత్తం బాలాబాలికలు పాల్గొన్న పోటీలో క్రిస్టీ గెలుస్తాడు. పెయింటింగులు చేస్తూ, పుస్తకాలు చదువుతూ, సినిమాలు చూస్తూ తనలో దాగి వున్న భావాలకు అక్షరరూపం యివ్వడంలో సఫలుడౌతాడు.

18 సంవత్సరాల వయసునాటికి అందరికీ ఉండే, కలిగే భావాలే క్రిస్టీకీ కలిగేవి. తానేమో తన నిరుపయోగమైన శరీరంలో బందీ! చికాకు, విసుగు, భయంతో గడుపుతున్న రోజుల్లో 'హలో క్రిస్టీ!' అంటూ ఒక సాయం సమయంలో ఒక ప్రత్యేకమైన వ్యక్తి పలకరిస్తాడు. ఆ గొంతులోని అధికారం, మంచితనం, మార్దవం క్రిస్టీకి నచ్చుతాయి. ఆ వ్యక్తే రాబర్ట్ కాలిస్. ప్రఖ్యాత శిశువైద్యుడు. చాలా కాలం క్రితం వికలాంగ పిల్లల ఫంక్షన్‌లో క్రిస్టీ అతని దృష్టిలో పడతాడు.

క్రిస్టీ అందమైన ముఖం, చురుకైన మెరిసే నీలికళ్ళతో వారిలో ప్రత్యేకంగా కన్పిస్తాడు. ఆ తర్వాత మెదడు పక్షవాతం వచ్చిన పిల్లల క్లినిక్ తెరిచిన సందర్భంగా కాలిస్ క్రిస్టీని కలుస్తాడు. అమెరికాలో సెరిబ్రల్ పాల్సీ వారికోసం అభివృద్ధి పరచిన ఎక్సర్‌సైజ్ క్రిస్టీకి ఉపయోగ పడగలదేమోనని సూచిస్తాడు. క్రిస్టీ జీవితంలో ఇదొక గొప్ప అవకాశం. కండరాల బలం కోసం ఫిజియో థెరపీ, మాట్లాడడం కోసం స్పీచ్ థెరపీలను మిగతా తనలాంటి వారితోబాటు నేర్చుకుంటాడు. అన్ని ప్రయత్నాల తర్వాత క్రిస్టీ మాట్లాడంలో కొంచెం అభివృద్ధి కన్పిస్తుంది. కాలితో చేసే పనులు ఆపేస్తే మిగతా కండరాలు మెరుగుపడే అవకాశం ఉంటుందని డాక్టర్ చెప్పిన సలహాను క్రిస్టీ పాటిస్తాడు, కానీ ఫలితం కన్పించదు.

క్లినిక్‌లో ఉన్న సమయంలో వ్యక్తిగా క్రిస్టీలో పరిపక్వత కన్పిస్తుంది. కొత్త స్నేహితులు దొరుకుతారు. ఐనా తన





ప్రతిరూపాల్లాంటి వికలాంగుల నెందర్నో చూసి చలించి పోతాడు. బాధల మధ్య ధైర్యంగా బతకడం నేర్చుకుంటాడు. క్రమంగా తానేమిటో తెలుసుకుంటాడు. శారీరకంగా తానెన్నటికీ కోలుకోలేడు, మామూలు మనిషి కాలేడు, కానీ అనుభూతి చెందగలగడం, ఆలోచించ గలగడం, పైగా రాయగలగడం తన ప్రత్యేకతలుగా గుర్తిస్తాడు. తన భావాల్ని పేపర్ మీద పెట్టడం ఎలా? కాలుని తక్కువగా ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నందువల్ల, తమ్ముళ్ళు, చెల్లెల్లు తను చెప్తుంటే రాసేవారు. కానీ అది చాలా శ్రమలో కూడిన, ఎక్కువ సమయం పట్టే పని. ఒక సంవత్సరకాలం గడుస్తుంది. వందల గంటల శ్రమఫలితం వేల మాటలు, ఐనా అవి ఒక పద్ధతిలో వుండవు. ఎవరిదైనా సాయం అవసరం. అప్పుడు డా. కాలిస్ సాయం తీసుకుంటాడు. రాతప్రతి గందరగోళంగా వున్నా క్రిస్టీ ప్రతిభను గుర్తిస్తాడు కాలిస్. కాలిస్ కూడా రచయితే! పైగా టీచర్ కూడా! సరిగా క్రిస్టీకి కావలసిన వ్యక్తి, ఆధునిక రచయితలను గురించి, సాహిత్యాన్ని గురించి క్రిస్టీతో గంటలు గంటలు చర్చించేవాడు. రాయడంలోని మెలకువలను చెప్పేవాడు.

పాఠశాల చదువు లేకుండానే క్రిస్టీ గడించిన విజ్ఞానం, ఆంగ్ల సాహిత్యం మీద అసాధారణ అవగాహన కలిగి వుండడం కాలిస్‌కు ఆశ్చర్యం కలిగిస్తుంది. క్రిస్టీకి పుస్తకం రాయడం చాలా యిబ్బంది, చికాకు కలిగిస్తుంది. తన ఆలోచనలు, అనుభూతులు రాయబోయే సరికి వెనకబడి పోయేవి. డిక్టేషన్ మానేసి పూర్వంలాగా కాలి వేళ్ళతో రాయడమే మేలనిపిస్తుంది. సంవత్సరాలు కష్టపడి అనేక వడపోతల తర్వాత క్రిస్టీ తన మొదటి పుస్తకాన్ని ఒక ప్రచురణ సంస్థకు పంపిస్తాడు. ఏమాత్రం ఆలస్యం లేకుండా అది అంగీకరించబడి 1954లో ప్రచురించబడుతుంది. మై లెఫ్ట్ ఫుట్ పేరుతో పుస్తకంగా బయటవడుతుంది. అప్పటి క్రిస్టీ వయను 22 సంవత్సరాలు.

**'మై లెఫ్ట్ ఫుట్'** జీవిత చరిత్ర, తర్వాత మరికొన్ని ఇతర రచనలపై ఆదాయం, వికలాంగుల అసోషియేషన్‌లో సభ్యత్వం వల్ల వచ్చే స్టయిపెండ్‌తో క్రిస్టీ ఆదాయం పెరిగిపోతుంది. కొత్తగా కొన్న ఎలక్ట్రిక్ టైప్‌రైటర్‌పై కాలి వేళ్ళ సాయంతో టైప్ చేయడంతో తన ఆలోచనలకు తగిన వేగంతో అక్షరరూపం యివ్వడం సాధ్యపడుతుంది. బయటి ప్రపంచంలో తిరగాలన్న కోరిక, పుస్తకాల ద్వారా కాకుండా నేరుగా జీవితం చూడాలన్న వాంఛతో ఐర్లండ్ పర్యటిస్తాడు ప్రజలను, ప్రకృతిని, ప్రజాజీవన విధానాన్ని గమనిస్తాడు. అంతవరకు పుస్తకాల ద్వారా ముక్కలు ముక్కలుగా తెలుసుకున్న జీవన విధానాన్ని సమగ్రంగా చూడగలుగుతాడు. అతని జీవితంలో అత్యంత అభివృద్ధి జరిగిన దశ అది. ఫలితంగా 1970లో వెలువడిన 'డౌన్ ఆల్ ద డేస్' పుస్తకం.

**'మై లెఫ్ట్ ఫుట్'** అతని కథ ఐతే **'డౌన్ ఆల్ ద డేస్'** అతని జీవిత నిర్మాణం ఆత్మ, హృదయపు లోతుల నుండి వెలువడిన అందమైన కావ్యం లాంటి రచన. ఈ నవల ఐర్లండ్ బీద కుటుంబం, జీవితం, అందులోని వికారం, సౌందర్యం, క్రూరత్వం, ప్రేమ, ఆప్యాయతల నన్నింటినీ తన దృష్టితో చూస్తాడు, వ్యాఖ్యానిస్తాడు. ఈ నవల అంతర్జాతీయంగా బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. (దీన్ని అమేజాన్‌లో తెప్పించు కోవచ్చు). ఒక్కరోజులోనే క్రిస్టీ బ్రౌన్ ప్రముఖ వ్యక్తిగా మారిపోతాడు. విమర్శకులు అతణ్ణి మేధావిగా మెచ్చుకుంటారు. అతడి పుస్తకాలు సాధించిన విజయంతో తలిదండ్రులు గర్వపడతారు. వారి మరణం క్రిస్టీ జీవితాన్ని ఛిన్నాభిన్నం చేస్తుంది. ఆ దుఃఖాన్ని వారి పట్ల కృతజ్ఞతతో మర్చిపోగలుగుతాడు. (తండ్రి 1955లో ఆ తర్వాత తల్లి 1968లో మరణిస్తారు) బాల్యం గడిపిన ఇంటిని వదిలి సోదరి ఇంటిపక్కకు, కొత్తగా కొన్న యింట్లోకి చేరతాడు. సోదరి ఏన్ అతడిని తల్లి అంత బాగా చూసుకుంటుంది. ఎంతో సంతోషంగా గడిపినా అతని జీవితంలో తలిదండ్రులు లేని లోటు పూడ్చలేనిదవుతుంది.




డేవిడ్ ఫ్రాస్ట్‌తో టీవీ ఇంటర్వ్యూ చేసిన సందర్భంగా సోదరుడు షాన్ బ్రౌన్ లండన్‌లో ఓ రాత్రి పార్టీ యిస్తాడు. అక్కడ గదిలో



క్రిస్టీ బ్రౌన్ ది నేటివిటీ చిత్రం (1962)

ఇతరులతో కబుర్లు చెప్తున్న అందమైన అమ్మాయిని చూస్తాడు క్రిస్టీ. ఆమె కూడా అతని వైపు చూసి నవ్వుతుంది. వీల్ ఛైర్లో వున్న క్రిస్టీకి ఆత్మ న్యూనత వల్ల ఇబ్బందిగా అన్పిస్తుంది. అనుకోకుండా ఆమె అతని పక్కన చేరి వలకరిస్తుంది; ఆమే మేరీకార్, మేరీ రూపంలో తనను వరించిన అదృష్టం అని తర్వాత చెప్పుకుంటాడు. క్రిస్టీ లండన్ నుండి తిరిగి వచ్చిన తర్వాత వారి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తాయి. అంతటితో ఆగక ఒకరినొకరు కలుసుకోవడం మొదలౌతుంది. 1972 వీరి వివాహం జరుగుతుంది. మారేజి రిజిస్టర్‌లో క్రిస్టీ ఎడమ కాలితో సంతకం చేస్తాడు. నాకు తెలిసినంతలో క్రిస్టీ చాలా మర్యాదస్తుడు, అతడిని అమితంగా ప్రేమిస్తున్నాను అని క్రిస్టీ చెప్పినట్లుగా న్యూయార్క్ టైమ్స్ పత్రిక ప్రకటిస్తుంది. క్రిస్టీ జీవితంలో మేరీది ప్రముఖమైన పాత్ర. మేరీ రాకతో అతని జీవితంలో నిలకడ ఏర్పడుతుంది. ఆమె అతని సహచరి, ఉత్తమ విమర్శకురాలు కూడా! ఆమె తన జీవితంలో గొప్ప అద్భుతం అని గొప్పగా కొనియాడతాడు.

వారు కలసి జీవించిన కాలం క్రిస్టీకి నమ్మలేనంత ఉల్లాసంగా గడిపినట్లనిపిస్తుంది. పెయింటింగ్ చేయడంతో పాటు మూడు పద్యసంకలనాలు, రెండు నవలలు ప్రచురిస్తాడు. ఏ షాడో ఇన్ సమ్మర్ 1974, వైల్డ్ గ్రోదలిలీస్ 1976, ఏ ప్రామిసింగ్ కెరీర్ 1976లో పూర్తి చేస్తాడు. చివరి పుస్తకం 1982లో అతని మరణానంతరం ప్రచురించబడుతుంది. ఇతరుల మీద ఆధారపడక తప్పని తన పరిస్థితి ఆతని కుంగుబాటుకు ముఖ్యకారణం. ఐనా కష్టాలనన్నిటినీ అధిగమించి, జీవితంలోని ఆటుపోట్లను తట్టుకుని తన ధైర్య సాహసాలతో, తెలివితేటలతో ప్రపంచాన్ని జయిస్తాడు. ఒకనాడు కల, అసాధ్యం అనుకున్న దాన్ని సాధించగలిగిన స్ఫూర్తి అతనిది.

'మన బలహీనతలు అలవాట్లవల్ల కాదు, మనం సాధించిన విజయాలు, మంచి పనులవల్ల బొత్తిగా పరిచయంలేని వారి హృదయాలను తాకి గుర్తింపు పొందుతాము' అని ఒక ఇంటర్వ్యూలో అంటాడు. క్రిస్టీ బ్రౌన్ 6 సెప్టెంబర్ 1981లో 49 సంవత్సరాల వయసులో మరణిస్తాడు. అందులో మేరీతో దాంపత్య జీవితం తొమ్మిది సంవత్సరాలు సాగుతుంది. ప్రేమ వల్ల భారం తగ్గింది. జీవితం తేలిక పడింది అంటాడు.

ఇది రీడర్స్ డైజెస్ట్ అన్ ఫర్ గెటబుల్ పీపుల్ స్టీవెన్ రడ్లి & సి. లైనెన్ రచనకు స్వేచ్ఛానువాదం. రీడర్స్ డైజెస్ట్‌కు, రచయితలకు కృతజ్ఞతలు.

**క్రిస్టీ బ్రౌన్ – బెట్ మూర్‌ల ప్రేమకథ :** మై లెఫ్ట్ ఫూట్ పుస్తకం సాధించిన సాహిత్య విజయాన్ని అభినందిస్తూ క్రిస్టీకి ఎందరో లేఖలు రాస్తారు. వారిలో బెట్‌మూర్ ఒకరు. అమెరికాకు చెందిన ఆమె అప్పటికే వివాహిత. వారిమధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తాయి.

1960లో క్రిస్టీ అమెరికా పర్యటించినప్పుడు మూర్ యింట్లోనే బసచేస్తాడు. 1965లో మళ్లీ కలిసే నాటికి వారిమధ్య ప్రేమ చిగురిస్తుంది. ఏండ్ల తరబడి రాస్తున్న మహత్తర రచన పూర్తి చేయడానికని కనెటి కట్ (ఉత్తర అమెరికా) వెళ్తాడు. మూర్ సాయంతో 1967లో డౌన్ ఆల్ ద డేస్ పుస్తకాన్ని 1970లో ప్రచురిస్తాడు. పుస్తకాన్ని మూర్‌కు అంకితం చేస్తాడు. మూర్ క్రిస్టీ జీవితాన్ని అదుపు చేస్తుంది. అతడి అతిగా తాగే అలవాటును కట్టడి చేస్తుంది. ఈ సమయంలో క్రిస్టీ అంతర్జాతీయంగా పేరుప్రతిష్టలు పెరిగి అతడొక ప్రఖ్యాత వ్యక్తిగా గుర్తింపు పొందుతాడు.

ఐర్లాండ్ తిరిగి వచ్చిన తర్వాత పుస్తకాల మీద వచ్చిన డబ్బుతో డబ్లిన్ నగర శివార్లలో తన సోదరి ఇంటి పక్కన యిల్లు కట్టుకుంటాడు. మూర్‌ను పెండ్లి చేసుకుని కొత్త యింట్లో ఆమెతో కాపురం చేయడానికి ప్లాన్ వేసుకుంటాడు. మూర్ కూడా తన భర్తకు ఈ విషయం తెలియజేస్తుంది. సరిగా ఇదే సమయంలో ఇంగ్లీష్ వనిత మేరీ కార్‌తో పరిచయం పెరగడం, ఆమెతో సంబంధం పెంచుకోవడంతో మూర్‌తో పెండ్లి విషయం మరుగున పడిపోతుంది. క్రిస్టీ



క్రిస్టీ బ్రౌన్ బిల్డింగ్ టాప్స్ చిత్రం (1969)

కార్‌ల పెండ్లి జరిగి వారు కొత్త యింట్లో కాపురం చేస్తారు. పెయింట్ చేయడం, నవలలు, కవిత్వం రాయడం కొనసాగిస్తాడు. 1974 నాటి ఎ షాడో ఆన్ సమ్మర్ నవల మూర్‌తో గల సంబంధం ఆధారంగా రాస్తాడు. మూర్, క్రిస్టీలు స్నేహితులుగా కొనసాగుతారు.

కార్‌తో పెండ్లి ఐన తర్వాత క్రిస్టీ ఆరోగ్యం క్షీణించడం మొదలౌతుంది. చివరి సంవత్సరాల్లో అతడు మరీ ఒంటరిగా గడుపుతాడు. అందుకు కారణం కార్ పెత్తనం. ఆమె అతణ్ణి సరిగా చూసుకోకపోవడం అంటారు. రాత్రి భోజనం చేస్తూ పోరబోయి ఊపిరాడక మరణిస్తాడు. అతని శరీరం కమిలిపోయి వుంటుంది, బహుశా కార్ అతణ్ణి శారీరకంగా హింసించి ఉండవచ్చని అనుకుంటారు. ఈ అనుమానం జార్జీనా హాంబుల్టన్ రాసిన జీవిత చరిత్ర తర్వాత ఇంకా బలపడుతుంది. ఆ పుస్తకంలో వారి సంబంధాన్ని గురించి మరింత నిర్దిష్ట సమాచారాన్ని, వారి మధ్యగల అనారోగ్యకర సంబంధాన్ని బయటపెడ్తుంది. కార్‌ను తాగుబోతుగా, అవిధేయురాలిగా చిత్రిస్తుంది. బ్రౌన్ సోదరుడు షాన్ క్రిస్టీ ఆమెను ప్రేమించినంతగా ఆమె క్రిస్టీని ప్రేమించలేదు, ఆమే అతడిని ప్రేమించివుంటే, ఇతరులతో అక్రమ సంబంధాలు పెట్టుకుని వుండేది కాదు, క్రిస్టీని ఆమె అనేక విధాలుగా వాడుకుంది అన్న మాటలను జార్జీనా ఉటంకిస్తుంది.

క్రిస్టీ తన జీవిత చరిత్రతో పాటు మరో మూడు నవలలు, మూడు పద్య సంపుటాలు, ఒకటి రెండు నాటకాలు కూడా రాశాడు. మై లెఫ్ట్‌ఫుట్‌తో అంతర్జాతీయ ఖ్యాతి నార్జిస్తే, డౌన్ ఆల్ ద డేస్, క్రిస్టీ మాగ్నమ్ ఓపస్ అంతర్జాతీయంగా ఎక్కువ ప్రతులు అమ్ముడుపోతుంది. 14 భాషలలోకి అనువదించబడుతుంది. ఐరిష్ టైమ్స్ పత్రిక యూలి సీజ్ తర్వాత అంత గొప్ప పుస్తకంగా కొనియాడబడుతుంది. మైలెఫ్ట్ ఫుట్ సినిమా రూపంలో జిమ్ షెరిడాన్ నిర్మించగా, డేనియల్, లూయిస్ క్రిస్టీ పాత్రను పోషించగా 1989లో వచ్చి ఆస్కార్ అవార్డు గెలుచుకుంది. ఆంగ్లో-ఐరిష్ రాక్ బేండ్ ఒక పాటకు డౌన్ ఆల్ ద డేన్ పేరు పెట్టి నివాళులర్పించింది.

**పెయింటర్‌గా క్రిస్టీ బ్రౌన్ :** ప్రాథమికంగా ఏ గురువు సాయం లేకుండా స్వయంగా పెయింట్ చేయడం నేర్చుకుంటాడు. అతని కళాప్రస్థానంలో తల్లిది కీలకపాత్ర. ఇంట్లో మిగిలిన వారందరి సహకారం ఉంటుంది. ఆర్ట్ సామగ్రి సేకరించి పెట్టడంలో, ఎడమకాలితో పెయింట్ చేయడంలో తల్లి ప్రోత్సాహం అమితం. ఒక సంఘసేవకురాలు కత్రియోనా క్రిస్టీని ఒక ఆర్టిస్ట్‌కు పరిచయం చేస్తుంది. డా.రాబర్ట్ కాలిస్ కూడా క్రిస్టీ అభిరుచిని, వ్యాసాంగాన్ని మెచ్చుకుంటారు. అందరి కన్నా ఎక్కువ, తన స్వయం కృషితో పెయింటింగ్ నేర్చుకుంటాడు. మొత్తం మీద 80 వరకు కళాకృతులు – అన్ని రకాలవీ వివిధ మాధ్యమాల్లో సృష్టిస్తాడు. నిశ్చలన చిత్రాలు, ప్రకృతిదృశ్యాలు, తన స్వీయ చిత్రాలు, కుటుంబంలోని తల్లి, సోదరుల పోట్రేట్లు, డబ్లిన్ లోని లిటిల్ మ్యూజియం, నేషనల్ లైబ్రరీలు సేకరించి పెట్టాయి. వివిధ కళా వ్యాపార సంస్థలు, గాలరీలు, క్రిస్టీ పెయింటింగులతో వ్యాపారం చేస్తున్నాయి.

స్టిల్ లైఫ్ పెయింటిగులు – గరాజ్ ఇన్ దస్నో, బిల్డింగ్ టాప్స్, విండ్ మిల్, రోమన్ రూయిన్స్, ఎట్ నైట్, గర్ల్ ఎట్ బార్, కాన్‌కాన్ డాన్సర్ మొదలైనవి కొన్నింటిని తైల వర్ణాల్లో మరికొన్నింటిని నీలి రంగుల్లో చిత్రించాడు.

క్రిస్టీ మూర్ జీవిత చరిత్రను రాసిన వారిలో జార్జీనా హాంబుల్డన్, డెన్ కెన్నీలు ముఖ్యులు. మై లెఫ్ట్ ఫుట్ ఫిల్మ్‌ను యూట్యూబ్‌లో చూడవచ్చు.

క్రిస్టీ బ్రౌన్ కొటేషన్లు అతడి జీవిత దృక్పథానికి, అంగ వైకల్యానికి, ప్రేమకు ప్రతిబింబాలు. ఉదాహరణకు, "నా లోపభూయిష్ట జీవితాన్ని నువ్వు నీ సున్నితమైన ప్రేమతో తాకావు – చీకటిలో పైకి లేచే జ్వాలగా మండుతూ నన్ను మండిస్తున్నావు – నన్ను స్వస్థత పరిచావు" "మద్దతు శక్తిని ఎన్నడూ తక్కువగా అంచనా వేయకండి."

**తంగెడ విశ్వేశ్వర ప్రసాద్**
(టి.వి.ప్రసాద్), రిటైర్డ్ ప్రిన్సిపాల్.
హైదరాబాద్, ఫోన్ నెం. 798 139 8250

# ప్రగతిపథంలో తెలుగు జర్నలిజం

**– డాక్టర్ జీకేడీ ప్రసాదరావు**

తెలుగు పత్రికారచన (జర్నలిజం) ప్రగతిపథంలో నడుస్తుందని చెప్పొచ్చు. సాంకేతికంగా వచ్చిన విప్లవం సాంప్రదాయ పత్రికారచనను ఆధునికంగా మార్చేసింది. ముద్రణ నుంచి డిజిటల్ వేదికల మీదకు, సామాజిక మాధ్యమాల్లోకి తీసుకుపోయింది. నాడు సంఘసంస్కరణ, జాతీయోద్యమాల్లో మొదలైన పత్రికారచన భాషా, సాహిత్య, స్వాభిమాన, అస్తిత్వ ఉద్యమాల్లోను కీలకపాత్ర పోషించింది. జాతి నిర్మాణం నుంచి సామాజిక, సాంస్కృతిక, విద్యాభివృద్ధి వరకు ఆంధ్రజాతి జవసత్వాలను పెంచింది తెలుగు జర్నలిజం. 19వ శతాబ్దం మధ్యకాలం నుంచి తెలుగు పత్రికారంగం దినదినాభివృద్ధి చెందుతూ ఆంధ్రుల చైతన్యానికి ప్రేరణగా నిలిచింది. ఆంధ్రభారతి, ఆంధ్రప్రభ, స్వరాజ్యం వంటి పత్రికలు నాటి సామాజిక మూఢాచారాల మీద కులవివక్ష మీద మహిళా హక్కుల మీద అవగాహన పెంచాయి. తెలుగు జర్నలిజం భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రధానపాత్ర పోషించింది. ఆంధ్రపత్రిక, విశాలాంధ్ర, ఆంధ్రప్రభ వంటి పత్రికలు గాంధీజీ ఆలోచనలను, జాతీయ చైతన్యాన్ని ప్రజల్లో వ్యాప్తి చేశాయి. పత్రికలు స్వదేశీ, స్వరాజ్య, అహింసా సిద్ధాంతాలను తీవ్రంగా ప్రచారం చేశాయి. ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావంలో తెలుగు జర్నలిజం గొప్ప పాత్ర పోషించింది. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని వెలుగులోకి తీసుకొచ్చి రాష్ట్ర విభజనకు మద్దతుగా నిలిచాయి. 1953లో ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు జరిగిన ఉద్యమంలో తెలుగు జర్నలిజం అత్యంత ప్రభావవంతమైన పాత్ర పోషించింది. విశాలాంధ్ర వంటి పత్రికలు ఆంధ్రుల ఐక్యతను ప్రోత్సహించి, మద్రాస్ నుంచి ఆంధ్ర రాష్ట్రాన్ని వేరుచేయాలనే ప్రజాస్వరాన్ని వినిపించాయి. పొట్టి శ్రీరాములు ఆత్మత్యాగం తర్వాత పత్రికలు ప్రజాభావోద్వేగాలను ప్రతిబింబించాయి. ఫలితంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడటంలో జర్నలిజం ఒక చారిత్రక శక్తిగా నిలిచింది. తెలుగు పత్రికలు సాహిత్యానికి వేదికలుగా మారాయి. *(వి.లక్షణ రెడ్డి తెలుగు పత్రికల అవతరణ– వికాసం –1986)* వీటితో కవులు, రచయితలు, విమర్శకులు తమ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లారు. ఇవన్నీ సాంస్కృతిక విలువలను పరిరక్షించేందుకు కృషి చేశాయి. సాంస్కృతిక పునరుజ్జీవానికి పురిగొల్పాయి. నేటి డిజిటల్ యుగంలోనూ తెలుగు జర్నలిజం తన ప్రత్యేకతను నిలుపుకుంటోంది. ఆంధ్రజాతి ఆవిర్భావానికి, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక ఐక్యతకు, ఆర్థికాభివృద్ధికి మూలస్తంభంగా నిలిచింది. తెలుగు జర్నలిజం ఆంధ్రుల భావప్రకటనను ప్రతిబింబించే శక్తిగా, ప్రజాస్వామ్యానికి రక్షగా నిలిచింది.

స్వాతంత్ర్యనంతర కాలంలో తెలుగు జర్నలిజం విద్య, అభివృద్ధి, ప్రజాస్వామ్యం పట్ల దృష్టి సారిస్తూ వేగంగా అభివృద్ధి చెందింది. ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, విశాలాంధ్ర, ఆంధ్రజ్యోతి, ప్రజాశక్తి, ఉదయం, ఈనాడు, వార్త వంటి పత్రికలు తెలుగు జర్నలిజానికి కొత్త దిశానిర్దేశం చేశాయి. వార్త, ఆ తర్వాత ఈనాడు ఆధునిక ముద్రణా సాంకేతికతను, వృత్తిపరమైన ఎడిటింగ్ విధానాన్ని, జిల్లా వారీగా సంచికలను ప్రవేశపెట్టి అన్ని ప్రాంతాల ప్రజల గొంతు వినిపించాయి. ఇవిగాక ఇండియా టుడే, సుప్రభాతం వంటి వారపత్రికలు, పక్షపత్రిలు, మాసపత్రిలు ఈ కాలంలో పత్రికలు ప్రజల ఆకాంక్షలు, సమస్యలు, అభిప్రాయాలకు అద్దం పట్టాయి. రాష్ట్ర రాజకీయాలు, ప్రజాభిప్రాయాల మీద ప్రభావం చూపించాయి. ప్రసిద్ధ పాత్రికేయులు, సంపాదకులు ముట్నూరి కృష్ణరావు 1902లో ప్రారంభమైన కృష్ణపత్రిక పత్రికకు చాలా కాలం సంపాదకునిగా వ్యవహరించారు.

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు స్వాతంత్ర్యోద్యమ భావజాలంతో తెలుగు జర్నలిజానికి పునాది వేసిన ప్రముఖుడు. పొత్తూరి వెంకటేశ్వరరావు, నార్ల వెంకటేశ్వర రావు, తుర్లపాటి కుటుంబరావు తెలుగు జర్నలిజానికి జవసత్వాలు కల్పించారు. ఎ.బి.కె. ప్రసాద్, నండూరి రామ్మోహనరావు, సిహెచ్. రామోజీరావు, ఇనగంటి వెంకటరావు, కె. రామచంద్రమూర్తి, సతీష్‌చందర్, కె.శ్రీనివాస్ తదితరులు ఎంతో అంకితభావంతో తెలుగు జర్నలిజం అభివృద్ధి కోసం పనిచేశారు. వీరుకాకుండా మాలతీచందూర్, గొల్లపూడి మారుతీరావు, డాక్టర్ తంబు వంటి కాలమిస్ట్‌లు వర్తమాన విషయాల మీద మంచి రచనలు చేశారు. ఇంకా ఎందరో ఉద్యమ రచయితలు, రాజకీయనాయకులు, సాహితీవేత్తలు తెలుగు జర్నలిజం వికాసానికి కృషి చేశారు. దీంతో తెలుగు జర్నలిజం ఎలాంటి కాలానికైనా నిలిచేవిధంగా శక్తి పుంజుకుంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో చోటుచేసుకున్న అనేక పరిణామాల్లో ప్రాంతీయ భాషల మీద నిరాదరణ తెలుగు భాష మీద ప్రభావాన్ని చూపింది. ఈ సందర్భంలోనే తెలుగుభాష బోధనామాధ్యమంగా అణచివేతకు గురయింది. ఒక్క తెలుగు భాషతో మాత్రమే యువత ఉద్యోగాలు పొందలేరనే భయాన్ని ఒక వర్గం నిండా నింపేసింది. అయితే తెలుగు ప్రజలు ప్రపంచంతో అనుసంధానం కావడానికి అంతర్జాతీయ భాషల అవసరాన్ని గట్టిగా ప్రచారం చేశారు. ప్రధానంగా ఇంగ్లీషు భాష అందరికీ అవసరంగా మారిపోయింది. కాకపోతే ఇంగ్లీషు లేకపోతే జీవితమే లేదనేంత తీవ్రంగా ఇంగ్లీషును ప్రజల మీద గట్టిగా రుద్దేశారు. ఆ తర్వాత ప్రాథమికస్థాయి నుంచి రాష్ట్రంలో ఇంగ్లీషు మీడియం విద్య తీసుకొస్తున్నామని 2019 –2024 మధ్య ప్రభుత్వం కార్యాచరణకు దిగింది. ఈ క్రమంలో వందల సంఖ్యలో పాఠశాలలు మూత పడ్డాయి. చిన్నపిల్లలు బడికెళ్ళే దూరం కూడా పెరిగి పోయింది. ఇలా ఎన్నో పరిణామాలు తెలుగుభాష మనుగడకు అవరోధం కలిగించాయి. ఇటువంటి పరిస్థితుల్లో కూడా తెలుగుభాష, సాహిత్యం, పత్రికారచన వాటి అస్థిత్వాన్ని నిలుపుకున్నాయి. భారతీయ భాషల్లో తెలుగుకు ప్రత్యేక స్థానం చెరిగిపోలేదు. రాజదర్బారుల నుంచి పల్లెపదాల వరకు తెలుగుభాష సాంస్కృతిక సౌందర్యాన్ని కాపాడుకుంటోంది. ఇటువంటి తెలుగుభాషకు ప్రతికారచన మరింత పరిపుష్ఠం చేకూర్చింది. *(Andhra Pradesh Official Language Commission Reports-2022–2024)* తెలుగు పత్రికారచన సంఘ సంస్కరణలో, ప్రపంచ యుద్ధకాలాల్లో, స్వాతంత్ర్యోద్యమంలో, రాజ్యాంగ రచనాకాలంలో, ప్రజాస్వామ్య రాజకీయాల్లో జీవనవాహికగా పరవళ్ళు తొక్కింది. ఇటువంటి తెలుగు పత్రికారచన ప్రత్యేక సబ్జెక్టుగా తెలుగు జర్నలిజం పేరిట కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో బోధించడం చాలా అవసరంగా చెప్పొచ్చు.

నేటి గ్లోబల్, డిజిటల్, కృత్రిమమేధ పరంపరలో నడుస్తున్న ప్రసారమాధ్యమాల్లో తెలుగుభాష తన సుస్థిరస్థానాన్ని పదిలపర్చుకుంటుందనే చెప్పాలి. *(The Hindu 2024, March 15)*. తెలుగు సామాజిక మాధ్యమాల నుంచి యూట్యూబర్లు, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్లు వాళ్ల ప్రాంతాల మాండలికాల్ని, యాసను, ప్రాసను, సామెతల్ని, జాతీయాల్ని కలగలిపి తమ సొంత వ్యాఖ్యానాలతో, జానపద సౌందర్యంతో భాషకు పరిమళాలు అద్దుతున్నారు. సామాజిక మాధ్యమాలు, వివిధ వేదికలుగా వినోదకార్యక్రమాలు తెలుగుభాషకు మరింత బలం చేకూర్చే కారకాలేనని చెప్పాలి. ప్రపంచంలో తెలుగు రాష్ట్రాల కంటే చిన్న దేశాలు చాలా వున్నాయి. వాటిని అంతర్జాతీయ సమాజం ప్రత్యేకంగా గుర్తించడంతో పాటు వాటి భాషల్ని గుర్తించింది. ప్రపంచ ప్రసిద్ధ సెర్చ్ ఇంజన్ గూగుల్ సంస్థ ఇన్‌పుట్‌టూల్స్‌లో ఇప్పటికే సుమారు 140 భాషల్ని అనువాదంలోకి తీసుకొచ్చింది. కృత్రిమమేధ నుంచి సైతం అనువాదాల్ని, విశ్లేషణలను పొందే అవకాశం దక్కింది. *("Digitalization and Indian Languages"–Ministry of Electronics and Information Technology , Government of India-2023)* తొలి తెలుగు పత్రిక 'సత్యదూత' 1835 నుంచి నేటి డిజిటల్ మీడియాలో తెలుగు పత్రికల వరకు తెలుగు జర్నలిజం చరిత్ర అందుబాటులో వుంది. కందుకూరి వీరేశలింగం పంతులు 'వివేకవర్ధని' సామాజిక సంస్కరణకు, తెలుగుభాషకు అంకితమిచ్చారు. *(కందుకూరి వీరేశలింగం 1987– అక్కిరాజు రమాపతి రావు)* ఇలా మొదలైన తెలుగు పత్రికల చరిత్ర, స్వరాజ్య, కృష్ణా పత్రిక,

జన్మభూమి, ఆంధ్ర పత్రిక, ఆంధ్రప్రభ ఇంకా ఎన్నో పత్రికలు స్వతంత్రోద్యమంలోనూ కీలకపాత్ర పోషించాయి. ఇవిగాక తర్వాత వచ్చిన ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, ఉదయం, ఈనాడు, వార్త మొదలయిన పత్రికలు కొన్ని లక్ష్యాలతో సాగాయి. వీటికి సమాంతరంగా వామపక్షపత్రికలు వార్తా ప్రచురణతో పాటు వివిధ రకాల సాహిత్యాన్ని, భావజాలాన్ని ప్రచురిస్తూనే వున్నాయి. వార, మాస, నిర్ణీతకాల పత్రికలతో పాటు, కుల, మత, లింగ ప్రాతిపదికన మరికొన్ని పత్రికలు ముద్రితమవుతున్నాయి. సామాజిక, రాజకీయ, సినిమా, ఆర్థిక సాంస్కృతిక, సాహిత్య పత్రికల ప్రచురణ కూడా కొనసాగుతుంది. వీటిలో కొన్ని ముద్రితం కాగా, మరికొన్ని ఆన్‌లైన్, డిజిటల్ ఎలక్ట్రానిక్ పత్రికలుగా వున్నాయి. ఇవన్నీ తెలుగుభాషా వికాసానికి బాసటగా నిలిస్తున్నాయనే చెప్పాలి.

తెలుగు భాషను పరిరక్షించాలనే సంకల్పం కలిగిన ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల్లో 'తెలుగు జర్నలిజం' కోర్సుని ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా వుంది. ఇతర రాష్ట్రాల విశ్వవిద్యాలయాల్లోని జర్నలిజం కోర్సులను పరిశీలించిన తర్వాత విద్యారంగానికో లేదా మీడియా రంగానికో చెందిన వారిలో ఈ ఆలోచన మరింత బలపడుతుంది. తమిళం, మలయాళం, కన్నడ, ఉర్దూ, ఒరియా, హిందీ, గుజరాతీ, మరాఠీ మొదలైన భాషల్లో ఆయా రాష్ట్రాల్లో విశ్వవిద్యాలయాలు భాషాప్రాతిపదికన జర్నలిజం కోర్సులు నిర్వహిస్తున్నాయి. ఇవి ఆయా రాష్ట్రాల ఉన్నత విద్యా రంగంలో ప్రత్యేకస్థానాన్ని ఆక్రమించాయి. ఉద్యోగ అవకాశాలకు, ఉపాధికి దారి చూపుతున్నాయి. అక్కడి సామాజిక, రాజకీయ, ఆర్థిక సాంస్కృతిక పరిస్థితుల్ని ఆవిష్కరిస్తున్నాయి. అనువాద పుస్తకాలు వెలువడుతున్నాయి. మేధోవర్గం తెలుగు జర్నలిజం చరిత్ర మీద అవగాహన కలిగి ప్రాంతీయభాషల్లో జర్నలిజం విద్య అవసరాన్ని గుర్తించాల్సి వుంది.

దేశంలో పలు విశ్వ విద్యాలయాల్లో ప్రాంతీయ భాషల్లో జర్నలిజం కోర్సులు ఎప్పటి నుంచో సాంప్రదాయ కోర్సులుగా కొనసాగుతున్నాయి. ఈ కోర్సుల్ని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆనాడే గుర్తించింది. జర్నలిజం విలువలు మంటగలిసిపోతున్నాయని కొంతమంది విమర్శకులు గుండెలు బాదుకుంటున్నారు. వీరంతా జర్నలిజం విద్య గురించి కూడా మాట్లాడితే బాగుంటుంది. నైపుణ్యాభివృద్ధి సంస్థల్లోనూ ఈ కోర్సును ప్రవేశపెట్టి బోధించడం అవసరం. ఎందుకంటే నేటి ఎలక్ట్రానిక్ యుగంలో మీడియా అంతా టీవీల్లోకి, స్మార్ట్ ఫోనుల్లోకి, వెబ్ సైటుల్లోకి చేరిపోయింది. సామాజిక మాధ్యమాలు సమాంతర మీడియాగా అవతరించాయి. కృత్రిమమేధ ఊపందుకుంటుంది. తెలుగుభాషకు సాంకేతికంగా చాలా ప్రాధాన్యత సంతరించుకుంది. డిజిటల్ మాధ్యమానికి ఒక మంచి భాష కావాలి. అందివచ్చిన అవకాశాల కోసం యువతకు అవసరమైన విద్యను అందించాలి. దీనిలో అనువాద నైపుణ్యం అభివృద్ధి చెందుతుంది. ఈ కోర్సులను దూరవిద్య ద్వారా, ఆన్ లైన్ ద్వారా నిర్వహించడానికి అనేక అవకాశాలు వున్నాయి. ఈ విద్యావిధానాల వల్ల యువతకు అధిక ప్రయోజనం చేకూరే అవకాశం వుంది. తెలుగు అంటే కేవలం భాష, సాహిత్యం మాత్రమే కాదు, పత్రికారచన సైతం దీనిలో ముఖ్యభాగమని భాషాశాస్త్రజ్ఞులు, పాత్రికేయులు బలంగానే చెప్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు భాషను సాంకేతికంగా అభివృద్ధి చేయడానికి పత్రికారచన ముఖ్య సాధనంగా నిలిచింది. అందుకే తెలుగు పత్రికారచనకు ప్రభుత్వం ఉజ్వల భవిత కల్పించవలసిన అవసరం ఎంతైనా వుంది.


తెలుగు పత్రికారచన ఆంధ్రజాతి సంఘసంస్కరణ, జాతీయోద్యమాల నుంచి నేడు సాంకేతికంగా అంతర్జాతీయంగా ఖ్యాతినార్జించింది. ముద్రణ పత్రికల నుంచి సామాజిక మాధ్యమాల్లో, డిజిటల్ మీడియాలో దూసుకుపోతుంది. కృత్రిమమేధలో కూడా తెలుగుభాష సమాచార, అనువాద ఉపకరణసాధనంగా కొనసాగుతోంది. డిజిటల్ మీడియా గ్రామీణవార్తా సేకరణలోను మెరుగుపడింది. *(The Hindu (2024, April 10). Digital Media Strengthens Rural News Networks in Andhra Pradesh.)* పత్రిక నైతికత సవాళ్లు, ఆర్థిక అస్థిరత వంటి అంశాలు వెలుగుచూశాయి. ఇదే సమయంలో డిజిటల్ మాధ్యమాలు, సామాజిక మాధ్యమాలు, పౌరజర్నలిజం వంటి కొత్త రూపాలు చోటు చేసుకున్నాయి. యువత, ప్రవాస భారతీయులు లైవ్‌వార్తలు, మల్టీమీడియా కంటెంట్ కోసం డిజిటల్ మీడియాలోకి ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. దీని వల్ల

వార్తల తయారీ, ప్రచారం విధానం గణనీయంగా పెరిగిపోయింది. సాంప్రదాయ పత్రికలైన ఈనాడు, ఆంధ్రజ్యోతి, సాక్షి వంటి పత్రికలతో పాటు 'ఈ టీవీ భారత్' మిగతా డిజిటల్ వేదికలు పలు రకాల మాధ్యమాల్లో, విభిన్న ప్రేక్షక వర్గాల కోసం ప్రత్యేక కంటెంట్‌ను అందిస్తున్నాయి. దీంతో వార్తా ప్రపంచం మరింత వైవిధ్యభరితం దిశగా సాగుతున్నట్టుగా సూచిస్తుంది. డిజిటల్ కథనరూపకల్పన, పోడ్‌కాస్ట్‌లు, ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్లు వంటి సరికొత్త పద్ధతులను తెలుగు మీడియా వినియోగిస్తుంది. దీని ద్వారా డిజిటల్ యుగానికి అనుగుణమైన ప్రేక్షకులను ఆకర్షించడం, తప్పుడు సమాచార వ్యాప్తిని అరికడుతోంది. అయితే ఇదే సందర్భంలో తెలుగు జర్నలిజం స్వయంప్రతిపత్తి యాజమాన్య కేంద్రీకరణ, ఆధిపత్యాలు, రాజకీయ ఒత్తిళ్ళతో దెబ్బతింటోంది. దీని ఫలితంగా పాలనపై నిష్పాక్షికంగా విశ్లేషణ చేయలేకపోతున్నారు. కొన్ని సందర్భాల్లో డిజిటల్, సోషల్ మీడియా వృద్ధితో పాటు నకిలీ వార్తలు విస్తరించడం వల్ల నిజమైన సమాచారాన్ని గుర్తించడం కష్టంగా మారింది. ఇది ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తూ నైతిక జర్నలిజానికి సవాలు విసురుతోంది. ప్రకటనల ఆదాయం ఆన్‌లైన్ వైపుకు మారడం, ముద్రిత పత్రికల ఆదాయం తగ్గుతుంది. ఇది నాణ్యమైన జర్నలిజంపై పెట్టుబడులను తగ్గిస్తోంది. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు సామాజిక మాధ్యమాలను విరివిగా వాడుతున్నారు. ప్రాంతీయ ప్రజల అవసరాలను తీర్చేందుకు స్థానిక కంటెంట్ ప్రాధాన్యత పెరుగుతోంది. భారత్ మీడియా అసోసియేషన్ వంటి సంస్థలు నైతిక విలువలను కాపాడుతూ ప్రాంతీయ కథనాలను ప్రోత్సహిస్తున్నాయి. ఈ విధంగా తెలుగు జర్నలిజం కొన్ని సమస్యల్ని, సవాళ్ళను ఎదుర్కొంటుంది. ఐనప్పటికీ తెలుగు జర్నలిజం ప్రగతిపథంలో నడుస్తుందని చెప్పొచ్చు. అనాదిగా ఇది తెలుగు ప్రజల జీవవాహికగా పని చేస్తోందనడంలో ఎటువంటి సందేహం లేదు.

**డాక్టర్ జీకేడీ ప్రసాదరావు**
ఫ్యాకల్టీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం,
ఆంధ్ర విశ్వవిద్యాలయం,
విశాఖపట్నం, మొబైల్ : 939 311 1740.

## కమ్మతెమ్మెర

*డిసెంబరు నెల **మిసిమి**లో వెన్నెల బొమ్మ, నెమలి చెలి, అన్నుల మిన్న అందింది. తెలుగు కవులను ఏకం చేసేలా సాహిత్య ఉత్సవాలుండాలని **మిసిమి** అభిప్రాయపడింది. కాణీ ఖర్చులేకుండా "నార్వే" దేశాన్ని చూపెట్టిన నిమ్మగడ్డ శేషగిరిరావు గారికి ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే లుంబిని విశేషాలు, ఆహారం గురించి, కిస్మస్ వివరాలు తెలియజేయడం చాలా ఆనందదాయకంగా వుంది. పుస్తక పరిచయాలు ఊరిస్తున్నాయి. హనుమంతరావు గారి ఇద్దరు కథకుల కవిత్వం వివరాలు చాలా ప్రశంసనీయం. పులికంటి కృష్ణారెడ్డి గారి సీమభారతం వివరాలు, అభ్యుదయ సాహిత్య విమర్శకుడు ఆచార్యా ఎన్. ఈశ్వరరెడ్డి గారి విమర్శనావిశేషాలు, మనకాలపు కాళిదాసు (స్వర్గీయ అందెశ్రీ) వివరాలు మరింతగా ఈ నెల **మిసిమి**ని మెరిపించాయి. మా మనసులను మురిపించాయి. నాటక నిత్యానందం లంకా సత్యానంద్ గారి గురించి పూర్తీ వివరాలు ఆకట్టుకునే విధంగా తెలిపారు. ఏ నెలకానెల కొత్త అంశాలతో తీర్చిదిద్ది సాహితీప్రియులకు చక్కని విశ్లేషణాత్మకంగా విషయాలను అందిస్తున్నందుకు నిర్వాహకులకు అభినందనాచందనాలు.*



***- దోసపాటి వేంకట రామచంద్ర రావు, విజయనగరం, ఫోన్ : 778 059 4995***


## సాహిత్య రసభరిత
# దుర్గేశనందిని

**– ఆచార్య వై. పార్థసారథి**

సాహిత్య సామ్రాట్‌గా పిలువబడిన, బెంగాలి నవలా పితామహుడు బంకించంద్ర ఛటర్జీ రాసిన *దుర్గేశనందిని* నవల, బెంగాలీలో ప్రత్యేకించి తొలితరం భారతీయ భాషలలో వచ్చిన మొదటి గద్య నవల. ఈ నవలలో ప్రేమ, వీరత్వం, చరిత్ర, రాజకీయ ఎత్తుగడలు, కుట్రలు, కుతంత్రాలు అన్ని సమపాళ్ళలో నిగూఢంగా లీనమై, పాఠకుల్ని సమ్మోహనపరుస్తాయి. 161 సంవత్సరాల క్రింద ప్రచురితమైనా, ఈ నవల ఇప్పటికి ఆద్యంతం చదవాలనే ఉత్సుకతను ఏమాత్రం తగ్గ నివ్వదు.

కథ ఒక ప్రేమ త్రికోణం. మొగల్ సేనాధిపతి రాజపుత్ర యువరాజు జగజీత్‌సింగ్, స్థానిక రాజకుమారి తిలోత్తమ, పఠాను నవాబు కుమార్తె ఆయేషా, తిలోత్తమ సఖి విమలల మధ్య – రాజకీయ ఇతివృత్తంతో మారుతున్న పరిస్థితులు, ఒకరి జీవితంలోకి మరొకరు లోనికి, బయటకు నెట్టబడే ఘటనల మధ్య కథనం సాగుతుంది. ఈ నవలా కాలంలో మొగలులు, రాజపుత్రులు, పఠానులు వాస్తవంగా ఉన్నప్పటికి, ఆనాటి సమాజం ఎలా ఉండేదో రచయిత స్పష్టంగా వివరించడం ఆశ్చర్యం కల్గిస్తుంది. రాజకుటుంబాల స్త్రీలు ఎంతటి రక్షణ లేని జీవితాన్ని గడిపేవారో, యుద్ధం జరిగితే ఒక రాజు నుండి మరొక రాజుకు ఆస్తుల్లా మార్చబడే పద్ధతి, సాంస్కృతికంగా వేరు వేరు జాతులు, కులాల మధ్య అంతర్గతంగా ఉండే బంధాలను ఈ నవల తెలుపుతుంది.

దుర్గేశనందిని నవలలో అత్యంత ముఖ్యమైన అంశం కథను నడిపించే విధానం. కథనం వేగాన్ని, దిశను బంకిం బాబు మార్చే పద్ధతి ఆశ్చర్యకరం, అద్వితీయం. సన్నివేశాలు ఒకచోటి నుండి మరొకచోటికి, ఒక సందర్భం నుండి మరొక సందర్భానికి అనూహ్యంగా మారిపోతుంటాయి. ప్రేమ, వాత్సల్యం, లాలిత్యం, వీరత్వం, యుద్ధం, క్రూరత్వం, దయ, ఉద్వేగం, కరుణ, హాస్యం, మానవీయత ఒకదానిపై మరొకటి మనముందు కదులుతూ, పాఠకుడి హృదయాన్ని భావోద్వేగంతో నింపి వేస్తాయి. యుద్ధ సన్నివేశాలు, ప్రమాదాలు, రక్షణ చర్యలు నవలలో వీర నాటక వాతావరణాన్ని సృష్టిస్తాయి. ప్రతి పాత్రకు ఒక నేపథ్యం ప్రతీకగా నిలుస్తుంది. రాజపుత్ర యువరాజు జగత్సింహుడు వీర పురుషుడిగా, స్థిర నిశ్చయ యోధుడిగా, ప్రేమ ఉన్నా దానికి లొంగే బలహీనత లేకుండా లక్ష్యసాధన కోసం నిలబడే నాయకత్వ లక్షణాలు కల వ్యక్తిత్వం – అందం, ధైర్యం, నైతికత, విశ్వాసంపై ఆధారపడిన తిలోత్తమ ఆదర్శ ప్రేమ – సామాజికంగా అత్యల్ప స్థాయి నుండి వచ్చినప్పటికి కష్టకాలంలో దృఢ సంకల్పంతో, చివరి వరకు ఎత్తులు వేస్తూ కథను మలుపు తిప్పిన విమల – నవల మొత్తంలో సంక్లిష్టతను తెచ్చి కథాగమనాన్ని పూర్తిగా మార్చి వేసి ధైర్యంతో, ప్రేమకు పోరాటం, త్యాగం తప్పదని గ్రహించిన శక్తివంతమైన వ్యక్తిత్వం గల పఠాను రాజకుమారి ఆయేషా – ఈ నవలలో ప్రధాన పాత్రలు.




ఆ కాలంలో పూర్తిగా స్త్రీ ప్రధాన పాత్రల ఇతివృత్తంతో వచ్చిన *దుర్గేశనందిని* ఆధునిక బెంగాలి గద్య రచనకు పునాది వేసిన విప్లవాత్మక రచన. ఈ నవలలోని ప్రతి సన్నివేశాన్ని మనం తరువాత కాలంలో ఏదో ఒక కథలో, నవలలో, సినిమాలో చూసి ఉన్నామంటే, ఆ నవల ప్రభావం అవగతమవుతుంది. బంకింబాబు జీవిత కాలంలోనే బెంగాలీలో 13 ముద్రణలు, ఇంగ్లీష్ (1882), హిందూస్తాని (1876), హింది (1882), కన్నడ (1885) భాషలలో ఈ నవల ప్రచురించబడగా, 1920 మధ్య కాలంలో దాదాపు అన్ని భారతీయ భాషలలోకి అనువదించ బడింది. తెలుగులో దండమూడి మహీధర్ 1966లో అనువదించారు.

దుర్గేశనందిని నవలపై ఆ కాలంలో స్పందనలు భిన్నరూపాలలో వచ్చాయి. భటపారా ప్రాంత సంస్కృత పండితులు నవలని ప్రశంసించగా, కలకత్తా పండితులు విమర్శించారు. సోంప్రకాశ్ పత్రికా సంపాదకుడు ద్వారకానాథ విద్యాభూషణ్ భాషను, సాంప్రదాయ విరుద్ధ శైలిని ఎగతాళి చేశారు. సుకుమార్ సేన్ అభిప్రాయంలో..
*ఈ కథ రసవత్తరమైనది, పూర్తిగా కొత్తది. అర్ధచారిత్రక నేపథ్యం, పెళ్ళి తరువాత ప్రేమ వంటి మరే ప్రేమ కథలు చదవని పఠితుల కోసం రాసిన ఈ స్వచ్ఛమైన ప్రేమ కథ ఒక న్యాయ సమర్ధనం లాంటిది.*

ప్రేమ త్రికోణం తప్ప వాల్టర్ స్కాట్ 'IVANHOE'తో సంబంధం లేదని చాలామందితో పాటు, బంకిం తాను స్వయంగా చెప్పగా, పండితులు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్త పరచారు. ఇది బంకిం చంద్రుడి స్వతంత్ర సృజన.

నవలగా, నాటకంగా కాక ఈ నవల అనేక రూపాంతరాలు చెందింది.

మొదటి బెంగాలి చిత్రం – 1927 – దుర్గాదాస్ బెనర్జీ, అహీంద్ర చౌధురి, ఇంద్రాదేవి, సీతాదేవి నటీనటులు – దర్శకత్వం – ప్రియనాథ్ ఎస్. గంగూలీ.

రెండవ బెంగాలి చిత్రం – 1951 – మనోరంజని భట్టాచార్య, ఛబి బిశ్వాస్, భారతీదేవి, చంద్రబతీదేవి నటీనటులు – దర్శకత్వం అమర్‌ములిక్.

హిందీచిత్రం 1956 – ప్రదీప్ కుమార్, బీనారాయ్, అజిత్, నలినిజయవంత్ నటీనటులు–బి. మిత్ర దర్శకత్వం.

భారతీయ కామిక్ పుస్తకశ్రేణి, అమర్ చిత్ర కథ 824వ సంచిక కోసం ఈ నవలను దేవ్రాని మిత్ర చిత్రకథ (కామిక్) రూపంలో రూపాంతరం చేశారు.

**ఇంతకీ దుర్గేశనందిని ఎవరు?**

ఈ కథ 16వ శతాబ్దం నాటి అక్బర్ కాలంలోని బెంగాల్, ఒరిస్సా ప్రాంతాలలో జరుగుతుంది. మొగల్ సైన్యం, పఠాన్ సేన, రాజపుత్రులు తూర్పు ప్రాంతంపై ఆధిపత్యం కోసం మూడు వర్గాల మధ్య జరిగే పోరాటాల నేపథ్యం. పఠానుల ఆక్రమణలో ఉన్న ఒరిస్సా, బెంగాల్ ప్రాంతాలను పాలించే కతలూఖాన్ మొగలులకు లొంగక స్వతంత్రంగా ఉంటాడు. అక్బర్ సేనాని మాన్‌సింగ్ కుమారుడైన జగజీత్ సింగ్, పఠాను సైన్యాన్ని కకావికలు చేసి విజయాన్ని అందుకునే స్థితికి చేరుకుంటాడు. పఠానుల ఏలుబడిలో సామంతుడిగా వున్న వీరేంద్రసింహుడు, జ్యోతిష్కుడి సలహాతో మొగలు సైన్యాలకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకుంటాడు. అనుకోకుండా ఒక నిశిరాత్రి దేవాలయంలో కలుసుకున్న వీరేంద్రసింహుడి కుమార్తె తిలోత్తమ, జగజీత్‌సింగ్‌ల మధ్య చిగురించిన ప్రేమ నవలలో కీలక అంశం. తిలోత్తమ అనుచరురాలైన విమల మొత్తం కథలో దారంలా, ప్రతి పాత్రకు తీగలా అల్లుకుంటూ నవల చివరి వరకు కీలక పాత్ర పోషిస్తుంది.

తిలోత్తమను ఏదోవిధంగా తన రాణిని చేసుకుంటే, వీరేంద్రసింహుడితో సమస్య ఉండదని, పఠాన్ రాజు కతల్‌ఖాన్ వ్యూహం రచిస్తాడు. విమల సాయంతో తిలోత్తమను రహస్యంగా కలవాలని ప్రయత్నించిన జగజీత్‌సింగ్, వేగుల మార్గంలో వీరేంద్రసింహుని కోటలోకి ప్రవేశిస్తాడు. అదే మార్గాన్ని అనుసరించి పఠాన్ సైనికులు రాజు అంతఃపురాన్ని అధీనంలోకి తీసుకుని, రాజుతో సహా అందరినీ బందీలుగా తమ రాజ్యానికి తీసుకువెళతారు. ఆ పోరాటంలో తీవ్రంగా గాయపడిన జగజీత్‌సింగ్ మొగల్ సైన్యాధికారి కాబట్టి వైద్యం అందించి దాచి ఉంచమని కతల్‌ఖాన్ ఆజ్ఞాపిస్తాడు. పఠాను యువరాణి ఆయేషా జగజీత్‌సింగ్‌ను ప్రత్యేక మందిరంలో ఉంచి, వైద్యం అందించి కాపాడుతుంది. తిలోత్తమ, విమల నవాబు అంతఃపురంలోకి ఇతర రాణివాస స్త్రీలతో కలిపి, ఆనాటి పద్ధతి ప్రకారం రాజు ఆస్తులలో భాగంగా మార్చబడతారు. నవాబు మొగలులతో కలసినందుకు వీరేంద్రసింహుడి తల నరికి వేస్తాడు.

ఆయేషా పరిచర్యలతో జగత్‌సింహుడు కోలుకుంటాడు. అతని దృఢచిత్తం, ధైర్యసాహసాలు గమనించిన ఆయేషా అతనిపట్ల ప్రేమ పెంచుకుంటుంది. ముస్లిములు, రాజపుత్రుల మధ్య ప్రేమ, పెళ్ళిళ్ళు తప్పుకాదని, అది ఆచారాలలో భాగమే అనే విషయాన్ని ఇతర సంభాషణల ద్వారా రచయిత మనకు తెలియ పరుస్తాడు. తన భవనంలోనే జగజీత్‌సింగ్ ఉన్నాడని తెలిసిన కతల్‌ఖాన్ ఖైదు చేయిస్తాడు కాని ఆయేషా అతని బాగోగులు చూస్తూ వుంటుంది. విమల, తిలోత్తమ రాణివాసంలో ఉప పత్నులుగా ఉన్నారని తెలుసుకున్న జగజీత్‌సింగ్ హృదయం కకావికలమవుతుంది. రాణివాసంలో తిలోత్తమ అనారోగ్యంగా ఉండి, విమల

సహాయంతో తప్పించుకుని, జగజీత్‌సింగ్‌ను రహస్యంగా కలుసుకుంటే, ఆమెను నిరాకరిస్తాడు.

ఆయేషా సహాయంతో కారాగారాన్నుండి తప్పించుకున్న జగజీత్‌సింగ్ ఆయేషాకు కృతజ్ఞత తెలిపి, ఆయేషా తన ప్రేమను వ్యక్తపరచినప్పటికి, ఆమె హృదయాన్ని అర్థం చేసుకున్నప్పటికి, తన తక్షణ రాజకీయ అవసరాల దృష్ట్యా తన ప్రేమను ఆయేషాకు తెలియపరచలేకపోతాడు.

కతల్‌ఖాన్ ముందు నృత్యగానాలు సాగుతున్నప్పుడు, విమల చేస్తున్న నాట్యం చూసి, కతల్‌ఖాన్ తన దగ్గరకు పిలుచుకోగా, విమల అతని వద్దకు వెళ్ళి కత్తితో అతని గుండెల్లో గుచ్చి చంపేస్తుంది. అప్పుడు ఏర్పడిన అల్లకల్లోలంలో మొగలులు అంతఃపురంలోకి ప్రవేశించారని కేకలు పెడుతూ విమల తిలోత్తమతో పారిపోతుంది.

చివరి క్షణాల్లో కతల్‌ఖాన్ మొగలులతో సంధి కోరుకుంటాడు. తన కుమార్తె ఆయేషా ఎంత పవిత్రురాలో, తిలోత్తమ కూడా అంతే పవిత్రురాలని చెప్పి ప్రాణాలు వదులుతాడు. జగత్‌సింహుడి మధ్యవర్తిత్వంతో రెండు రాజ్యాల మధ్య సంధి కుదురుతుంది.

ఆయేషా ఉత్తరాల వల్ల, మరికొన్ని సంఘటనల వల్ల, జగజిత్‌సింగ్ తిరిగి అనారోగ్యంతో ఉన్న తిలోత్తమను కలసి సేవలు చేయడంతో కోలుకుంటుంది. ఆయేషా సమక్షంలో తిలోత్తమ, జగజిత్‌సింగ్‌ల వివాహం జరుగుతుంది.

తన కోటలోకి వెళ్ళిపోయిన ఆయేషా, రాజ కుటుంబీకులందరి దగ్గర ఉండే ఉంగరంలోని విషాన్ని తాగి చనిపోదామనుకుని, మళ్ళీ ఆలోచించి,ఈ విషయాన్ని తెలుసుకున్న జగజిత్‌సింగ్ తనను ఎంత బలహీనురాలో అని అనుకుంటాడని వితర్కించుకుని, ఆ ఉంగరాన్ని తటాకంలోకి విసిరేస్తుంది.

ఇంతకీ దుర్గేశనందిని ఎవరు?

దుర్గంలో నివసించే దుర్గేశనందిని తిలోత్తమ?

దుర్గాన్ని కాపాడిన విమల?

దుర్గం అంతా క్షేమంగా ఉండడానికి కారణమైన ఆయేషా త్యాగమా?

ఈ నవల ఇంతగా ఆదరించబడడానికి ప్రధాన కారణం భారతీయ నవలల్లో కనిపించే – నిరపాయ – బలహీన స్త్రీ పాత్రలను – స్వతంత్రంగా, ఆలోచనాత్మకంగా ఉండేటట్లు ఆవిష్కరించడమే – అదీ 1865లో.


**ఆచార్య వై. పార్థసారథి**
ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగం (రిటైర్డ్),
ఉస్మానియా యూనివర్శిటీ, ఫోన్ : 9000438090


## ఆటో కథలు

*ఈరోజు రెండు ఆటో రైడ్స్ గురించి చెప్పాలి.*

**మొదటిది**

*నాతో కూర్చున్నవాడు ఇంపైన బూతులు తిడుతున్నాడు ఫోన్‌లో. ఫోన్ అయిన తర్వాత మనది కృష్ణాజిల్లానా అని అడిగాను. అవును సార్! ఆ లం..... కొడుకు ఇబ్బంది పెడుతున్నాడు సార్. వాడికి కూడా తెలుసు. ఇంత మంచి బూతులు వినిపించినందుకు అతన్ని అభినందించాను. కొత్తగూడ వై జంక్షన్‌లో దిగిపోయాడు. మేము బెంగుళూరు భవన్‌కి వెళ్లిపోయాం.*

**రెండవది**

*ఆటో బుక్‌చేసి ఎక్కాం. అతను స్ఫురద్రూపి – ఆరడగులుంటాడు. అతను మాట్లాడే భాషే వింతగా వుంది – అప్పుడడిగాను – ఏ భాష అని! నా పేరు దిలీప్‌సింగ్ రాథోడ్. మేము రాజస్థానీయులం. మా దైవం మహా రాణా ప్రతాప్‌సింగ్. మేము ఇంగ్లీషు పాలనకు ఎదురెళ్లి పోరాడాం. వాళ్లు మమ్మల్ని "టాల్ ఫెలోస్" అని పిలిచేవారు. మా భాషకు లిపి లేదు. అదే మమ్మల్ని చరిత్ర లేకుండా చేసింది. దేశంలో మా జనాభా 13 కోట్లు పైనే. మాలో దరిద్రులెవరూ ఉండరు. చదువుకున్న వాళ్లు, డాక్టర్లు, ప్రొఫెసర్లు, ఎమ్.ఏలు, ఎమ్‌ఫిల్‌లు కూడా ఉన్నారు. మేము ఎవరి దగ్గర చేయి చాపం. మేమైతే హిందువులమే. శివుడిని పూజిస్తాం. మాకు ఆటా, పాటా బాగా తెలుసు. ఆడవాళ్లను గౌరవిస్తాం. మీలాంటి పెద్దలకు నమస్కరిస్తాం. బంజారాహిల్స్‌లో వ్యవసాయం చేసేవాళ్లం. నిజాం పశువులను తోలేవాడు.*

**– ఎ.కె.**

## సైన్స్, సారస్వతాల కలబోత

# అప్పాజోస్యుల

**– మిసిమి**



అప్పాజోస్యుల సత్యనారాయణ

*గ*త ముప్పై సంవత్సరాలుగా అప్పాజోస్యుల సత్యనారాయణ గారు అజోవిభో సంస్థ ద్వారా ప్రతి సంవత్సరం జనవరి మొదటి గురువారం నుంచి నాలుగు రోజుల పాటు సాహిత్య,నాటకోత్సవాలు నిర్వహిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని పట్టణాల్లో, నగరాల్లో ఈ ఉత్సవం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు.. జూన్ నుంచి డిసెంబర్ వరకు ఇందుకు కావలసిన ఏర్పాట్లు చేసుకుంటారాయన..జనవరి మధ్య నుంచి జూన్ వరకు ప్రచురించాల్సిన పుస్తకాల మీద దృష్టి పెడతారు. ఆయన అతడే ఒక సైన్యం లాంటివారు. ఆయన చేస్తున్న ఈ అవిరళ కృషిని గుర్తించి ఈ ఉత్సవంలో పాలు పంచుకునే వాలంటీర్లు, అభిమానులు తప్ప ఆయనిది ఒంటరి ప్రయాణం..దానికేమీ బాధాలేదు ఆయనకు..

***మిసిమి*** పక్షాన ఆయన్ని కలవడానికి మిత్రుడు రాంబాబుతో కలిసి వెళ్ళినప్పుడు ఆయనొక ఆధునిక ఋషిలా అనిపించారు.. కాశీ తువ్వాలు, తెల్లటి జుబ్బా, చేతిలో పుస్తకం.. ఇదీ ఆయన ఆహార్యం.. అంతకు ముందు రోజే ఆయన గుంటూరులో త్యాగరాయ సాంస్కృతిక మండలి సభలో "అలనాటి నాటక ప్రస్థానం" పదిగంటల వీడియోని సంక్షిప్తీకరించి గంట వ్యవధిలో ప్రదర్శించిన సభకు అధ్యక్షత వహించారు. రంగస్థలనటులు తుర్లపాటి రాధాకృష్ణ మూర్తికి పాతికవేల రూపాయల నగదు పురస్కారాన్ని అందజేశారు.. నిజానికి గుంటూరు–చీరాల ప్రయాణం అంత సౌకర్యంగా లేదు. ఎనభైరెండేళ్ళ వయసులో ఆయనకి ఆ పట్టింపులు లేవు.. సభను నిర్వహించేవేళ సమయపాలనకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే స్కూల్ హెడ్మాస్టర్‌లా అనిపిస్తారాయన.. చీరాలలోని వారింట్లో ముచ్చటించినప్పుడు ఆయన బాల్యం నుండి ఇప్పటివరకు ఒక తాదాత్మ్యంతో మూడున్నర గంటలకు పైగా ముచ్చటించారు.. మాకోసం వండించిన భోజనాన్ని కొసరి కొసరి వడ్డింపచేశారు.. అనేక అరుదైన పుస్తకాలు ***మిసిమి*** కానుకగా ఇచ్చారు..గంగాప్రవాహమై తనలోకి తాను ప్రవహించారు.. వారి జీవితం అనేక మలుపులు తిరిగింది. ఆయన ఎంత ప్రతిభాశాలో మనకర్థమవుతుంది..ఆయన ఎనభైల్లో కంప్యూటర్ రంగంలో పనిచేసిన అకడెమిక్స్‌లో జగత్ర్పఖ్యాతులు..అనే పుస్తకాలకు కో ఆథర్.. అనేక రీసెర్చ్ పేపర్లు పబ్లిష్ చేశారు.. అంతర్జాతీయ పత్రికల్లో అరవైకి పైగా వ్యాసాలు ప్రచురించారు..అది చాలా అరుదు.. ఆయన జీవన గమనాన్ని పరికిస్తే..

అలా వారు ఏర్పాటు చేసిన మృష్టాన్న భోజనం స్వీకరించటంతోపాటు వారి అమృత వాక్కులను వినే అవకాశం కలిగింది...వారితో జరిపిన సంభాషణ నుండి కొన్ని భాగాలు మీకందిస్తున్నాం..

**మిసిమి : నమస్కారం సత్యనారాయణ గారు..మిమ్మల్ని ఇంటర్వ్యూ చేయడానికి హైదరాబాద్ నుంచి వచ్చాను, ఇక్కడికి వచ్చాక మిమ్మల్ని చూశాక.. మీ పుస్తకాలు చూశాక మిమ్మల్ని ఒకటి అడగాలనిపించింది.. మీరు చేసే పని తెలుసు.. దాని గురించి తర్వాత మాట్లాడతాను.. ముందుగా మీరు స్థానికులేనా.. ఇక్కడ ఎప్పటినుంచి ఉంటున్నారు! ఎన్నో తరం వారు మీరు! ఆ విషయాలు చెప్పండి..**

**సత్యనారాయణ :** ముందుగా అశ్విన్ కుమార్ గారు నమస్కారం. మీరు ఇంటర్వ్యూకి వస్తున్నారని తెలియదు.. సరే ఇక నా విషయానికొస్తే నాకు తెలిసి ఇక్కడ నేను ఏడవ తరం వాడిని. మా ముత్తాత గారు గురవయ్య గారు అని తెలుసు కానీ ఆయన గురించి వివరాలు తెలియవు.. ఆయన కుమారుడు అందెయ్యగారు.. ఆయన కుమారుడు

దత్తాత్రేయుడు గారు.. ఆయన కుమారుడిని నేను. ఇక మా కుటుంబంలో మా నాయన గారికి ఐదుగురు కూతుళ్లు ఇద్దరు కొడుకులు నేను కనిష్టుణ్ణి.. మా నాయనగారు నా పదకొండవ ఏట వెళ్లిపోయారు.. మా పెద్దక్కయ్యకి నాకు వయసులో 28 సంవత్సరాలు తేడా.. మా అన్నయ్య గారికి నాకు 17 సంవత్సరాలు తేడా ఉంది (నవ్వు).. నేను చాలా చిన్నవాడిని మా పెద్దక్కయ్య గారి కుమార్తెలు నాకన్నా పెద్దవారు.. నా 14వ ఏట నేను, మా అమ్మగారు చీరాలకి వచ్చాం.. నా డిగ్రీ ఇక్కడే విఆర్ఎస్ కాలేజీలో చేశాను..

**మిసిమి** : మీ నాన్నగారు ఏం చేసేవారు?

**సత్యనారాయణ :** మా నాన్నగారు హోమియో అలాగే అల్లోపతి వైద్యం ప్రాక్టీస్ చేసేవారు. ఆయన ఇంజక్షన్స్ కూడా చేసేవారు..అది నేను చూశాను.. ఆయనకి క్లినిక్ ఉండేది.. ఆ క్లినిక్ మీద "అప్పాజోస్యుల దత్తాత్రేయులు" అని పెద్దక్షరాలతో పేరు ఉండేది.. ఆయన క్లినిక్ బాపట్లలో ఉండేది.. అలా ఏదో జరిగిపోతూ ఉండేది ఆయనకి.. చాలామంది లాయర్ మిత్రులు ఉండేవారు.. మా నాన్నగారు స్వాతంత్ర్య సమరయోధులు కూడా.. రెండు తడవలు జైలుకు వెళ్లి వచ్చారు. ఆయన వెళ్లిపోయిన తర్వాత ఆయన వలన నేను కొంచెం లబ్ది పొందాను..అది ఎలా అంటే నాకు పొలిటికల్ సఫరర్స్ స్కాలర్షిప్ ఇచ్చారు.. నిజానికి ముందు తెలియదు నాకు దాని గురించి..నేను పియుసి చేస్తున్నప్పుడు ఎవరో చెప్పారు నాకు. డిగ్రీ మొదటి సంవత్సరమో, రెండో సంవత్సరమో అప్లికేషన్ పెట్టుకుంటే నాకు ఆ స్కాలర్షిప్ వచ్చింది.. కొద్ది మొత్తమే అనుకోండి కానీ నాకు చాలా ఉపయోగపడింది.. తర్వాత నేను ఆంధ్ర యూనివర్సిటీలో చదువుకున్నప్పుడు కూడా నాకు అది సహాయకారి అయ్యింది.. నిజానికి నాకు దారీ తెన్నూ తెలీని సమయంలో, నాకు పద్యాలు అంటే ఆసక్తి ఏర్పడటానికి కారణం మా అమ్మగారు.. ఆ పెద్దావిడ రాత్రిపూట నాన్నా భాగవతం చదవరా అని చెప్పి నాచేత చదివిస్తూ పద్యాలు వింటూ ఉండేది..నా చిన్నప్పుడు నా ఐదో ఏట మా నాన్న కూడా గుండెల మీద పడుకోబెట్టుకుని పద్యాలు చెబుతూ ఉండేవాడు..

**ఎంత దయయో దాసునిపై / పంతంబున మకరి బట్టి బాధింపంగా / శ్రీకాంతుడు చక్రము పంపెను / దంతావళి రాజుకాయ దత్తాత్రేయా** అని చదివే వారు, ఆయన పేరు దత్తాత్రేయ కాబట్టి.. ఆతర్వాత దాశరథి శతకం పద్యాలు చెప్పాడు.. "మండన భీముడు ఆర్తజన బాంధవుడు" అంటూ. అలా ఆయన ఫ్లో సాగిపోతుండేది.. అదయిన తర్వాత ఆయన శాశ్వతంగా పరలోకాలకు వెళ్ళిపోయారు.. మేము చీరాల వచ్చేసాం. నేను ఇక్కడే మేథమేటిక్స్‌తో బి.యస్సీ చేశాను.. ఆతర్వాత తాడు బొంగరం లేకుండా ఉంటే ఒక మహానుభావుడు బెంగుళూరు తీసుకెళ్ళి నాపేరు ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌లో రిజిస్టర్ చేయించారు.. అక్కడ నాకు సెంట్రల్ గవర్నమెంట్ డిఫెన్స్ ఆర్గనైజేషన్‌లో ఇంటర్వ్యూ వచ్చింది.. ఎలక్ట్రానిక్స్&రేడార్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్.. ఇదీ ఆ సంస్థ పేరు.. అందులో ఓ చిన్న ఉద్యోగం.. నేను చేరిన సంవత్సరం 1965.. నా జీతం డెబ్బై రూపాయలు.. అదేమిటో నేను చేరిన నెలరోజులకు తొంభై రూపాయిలయింది.. బయట ప్రపంచాన్ని చూడటం తెలిసింది.. నాకన్నా పెద్దాయన డా.కె.వి. గోపాలకృష్ణ అని ఉండేవాడు.. ఆయన సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్, గ్రేడ్ వన్‌లో ఉన్నాడు.. అప్పుడు నా వయసు పందొమ్మిది, ఇరవై ఏళ్ళు ఉంటుంది. ఆయన వయసు ఇరవై ఎనిమిదో, ఇరవైతొమ్మిదో ఉండేది.. నేను మీ స్థాయి అందుకోవటానికి ఎంతకాలం పడుతుంది సర్ అని అడిగాను తెలియనితనంతో.. అప్పుడు రహస్యం సినిమాయో ఏదో వచ్చింది.. అందులోంచి ఆయన నాటకీయంగా పాడేవాడు.. "ఈ జన్మ సరిపోదు గురుడా.. వేరొక జన్మమెత్తక తప్పదురా నరుడా".. ఇలా సాగుతుండేది ఆయన పాట.. అదికాదురా, నువ్వు ఆర్డినరీ గ్రాడ్యుయేట్‌వి.. నేను లండన్‌లో పి.హెచ్.డి.చేశానురా.. నువ్వు ఉద్యోగం నిచ్చెనలో కిందున్నావు.. నేను పైనున్నానురా.. అని ఆ ఉద్యోగం గురించి పరమ డీటెయిల్డ్‌గా చెప్పాడు. నాకు దిమ్మ తిరిగి పోయింది..ఆయన ఎమ్మెస్సీ టెక్ చేశాడు ఆంధ్రా యూనివర్సిటీలో.. నాకు వీలవుతుందా అని అడిగాను.. ఎందుకు వీలు కాదు.. ప్రకటన వచ్చినప్పుడు దరఖాస్తు చెయ్యి అని సలహా చెప్పాడు. నాకు జీవితంలో కొన్ని కొన్ని అదృష్టాలు అలా కలిసొస్తాయి..ఆయన చెప్పిన నెలరోజుల్లోనే ప్రకటన వచ్చింది.. అప్లికేషన్ పెట్టుకుంటే, లెటరొచ్చింది, ప్రిన్సిపాల్‌ను కలవమని.. కలిస్తే సీటిస్తారన్నది ఆ లెటర్ సారాంశం.. పరిగెత్తుకుంటూ చీరాల వచ్చాను.. ఇక్కడి నుండి విశాఖపట్నం వెళదామని.. మా అమ్మ తిట్టిన తిట్టు తిట్టకుండా

తిట్టింది (నవ్వు).. సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం మానేస్తావా అంది.. పెన్షన్ ఉంది కదురా అంది.. నిన్ను కాపాడేదెవరురా నాన్నా అని వాపోయింది.. లేదులే అమ్మా మళ్ళీ ఉద్యోగం వస్తుందిలే అని చెప్పి వెళ్ళిపోయాను.. అక్కడ ఎమ్మెస్సీ టెక్ చదువు పూర్తయిపోయింది, 1968 ప్రాంతంలో.. మళ్ళీ ఇక్కడికొచ్చి మా అమ్మకు చెప్పాను.. నాచదువయిపోయింది.. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను.. ఉద్యోగం ప్రయత్నం చేస్తానని తెలియచేశాను. నామాట విన్నదావిడ.. నెల, నెలన్నరకు గతించిదావిడ.. నాకప్పుడు ఇరవైమూడేళ్ళు. అంతకు ముందే, వీడేం చేస్తాడో, ఎలా ఉంటాడో అని ఆవిడ మా బంధువుల్లోంచే ఒక అమ్మాయిని వెతికి పెళ్ళి చేసింది. అప్పటికి నాకు పందొమ్మిది ఏళ్ళు... మా ఆవిడకి పన్నెండేళ్ళు.. అక్కడినుంచి వెళ్ళిపోయి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా చేరాను.. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో ఆటోమేషన్ విభాగంలో చేరాను.. అప్పుడు ఆరొందల రూపాయల జీతం.. ఇది 1969లో.. అక్కడందరూ పి.హెచ్.డి చేసినవారే ఉన్నారు. నాకర్థమయిందేమిటంటే, నేనక్కడే ఉంటే ఏదో డిపార్ట్‌మెంట్‌కు డైరెక్టర్ అవుతాను కానీ అకడెమీషియన్ కాలేనని తెలిసింది.. ఈలోగా ఇంకో అడ్వర్టైజ్‌మెంట్ పడింది.. అది ఇ.సి.ఐ.ఎల్ ప్రకటన.. అప్పుడే ఆ సంస్థలో కంప్యూటర్ డివిజన్ మొదలయింది.. మళ్ళీ మామూలే.. అప్లయ్ చేయటం.. చేరటం.. టెక్నికల్ ఆఫీసర్ ట్రెయినీగా చేరాను. ట్రెయినీగా నీకు జీతం నాలుగొందలే అన్నారు.. అయినా సరే దీనికి పి.హెచ్.డి.అవసరం లేదు.. బుర్రుంటే చాలు.. మంచి పొజిషన్లోకి వెళ్ళిపోవచ్చు అని లెక్కలు వేసుకున్నాను.. మూడేళ్లపాటు పనిచేశాను. డిపార్ట్మెంట్‌ను విపరీతంగా విస్తరించారు.. కొత్తవారిని తీసుకొస్తున్నారు.. సీనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా ఒక కోబాల్ ప్రోగ్రామర్‌ను తీసుకొచ్చారు.. నేను వెళ్ళి మా డైరెక్టర్‌ని అడిగాను. ఏమిటి సర్ ఇది అని.. దానికాయన నీతోపాటు పన్నెండుమంది చేరారు..మీ ప్రమోషన్స్ మీకుంటాయి..ఏమీ చేయలేం అన్నాడు..

ఈలోగా ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీలో ఎక్సిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు పడ్డాయి. అప్లై చేయటం, ఇంటర్వ్యూకు వెళ్ళటం జరిగింది.. నువ్వు చిన్నవాడివి. నీకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్ట్ ఇస్తాం అన్నారు.. నీకు ఇంక్రిమెంట్లిస్తాం అన్నారు, నన్ను ఇంటర్వ్యూ చేసిన చీఫ్ ఇంజనీర్ గారికి చెప్పాను.. నేను రానండీ.. కేవలం పొజిషన్ కోసం వస్తున్నాను నేను.. అని చెప్పాను.. ఇది జరిగింది 1974వ సంవత్సరం మొదట్లో.. అప్పటికి నా వయసు ఇరవై తొమ్మిది సంవత్సరాలు.. నా పట్టుదల చూసి నేనడిగిన పొజిషన్లోనే తీసుకున్నారు.. అక్కడ ల్యాబ్ ఏర్పాటు చేసి డిఫెన్స్ ఎక్విప్‌మెంట్ ప్రపోజల్స్ చూసి, గ్రాంట్స్ తెప్పించటం చేస్తుండేవాడిని. నేను ఆ పొజిషన్లో రెండు సంవత్సరాల మూడు నెలలు పనిచేశాను.ఈలోగా సీనియర్ ఇంజనీర్ పోస్టులు పడ్డాయి. అది నేషనల్ లెవెల్ రిక్రూట్మెంట్.. అప్లికేషన్ పడేశాను.. సెలెక్ట్ అయ్యాను..1976 ఫిబ్రవరి 22న ఆర్డర్స్ వచ్చాయి. నాకెందుకు గుర్తు అంటే నేనప్పుడు ఎక్విప్‌మెంట్ పర్చేజ్ కోసం ఇటలీలోని మిలన్ నగరంలో ఉన్నాను. అక్కడినుంచి నెదర్లాండ్స్, స్వీడన్ వెళ్ళాను.. ఫిబ్రవరి 26న చేరాను. సీనియర్ ఇంజనీర్ అంటే సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయన్నమాట.. నాకింద రెండు వందలమంది ఉద్యోగులుండేవారు.. ఐ.టి.ఐలో బ్రిటిష్ విధానం పాటించేవారు. నాకో కేబిన్, డైరెక్ట్ ఫోనూ, సెక్రటరీ.. ఈ మందీ మార్బలం ఉండేది. ఈ సిస్టం మీద నాకు సదభిప్రాయం లేదు.. మామూలుగా ఉండొచ్చు.. అంతక్కర్లేదని నా అభిప్రాయం.. అమెరికా, యూరోప్ చూశాక, ఈ సిస్టం బాగాలేదని నాకనిపించింది. ఈ కథ ఎంతవరకు నడిచిందంటే 1978 దాకా (నవ్వు)... చాలా లాంగ్ స్టోరీ చెబుతున్నాను ఫర్వాలేదా!

**మూసీ : ఫర్వాలేదు.. ఇంట్రెస్టింగ్‌గా ఉంది చెప్పండి.. ఆనాటి పరిస్థితులను, సామాజిక చరిత్ర రికార్డు చేస్తున్నాం (నవ్వు)**

**సత్యనారాయణ :** బోంబేలో "వాడియా అసోసియేట్స్" అని ఒక కన్సల్టింగ్ కంపెనీ ఉంది. వాళ్ళో పెద్ద ప్రకటన ఇచ్చారు. నా అర్హతలకు, అనుభవానికి సరిపోయే ప్రకటన అది.. నేను పనిచేస్తూనే జెఎన్‌టియులో పరిశోధనకు రిజిస్టర్ అయ్యాను. అందుకోసం నా పనిగంటలు అయ్యాక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ వారి లైబ్రరీలో కూచుని చదువుకుంటూ నోట్స్ తయారు చేసుకుంటూ ఉండేవాడిని. నేను రాసిన ఒక రీసెర్చ్ పేపర్, ఒక ప్రముఖ అమెరికన్ జర్నల్‌లో పబ్లిష్ అయ్యింది. అప్పటికింత కంప్యూటర్ల వ్యవహారం లేకపోయినా నేను ఫోర్ట్రాన్2లో పెద్ద స్పెషలిస్ట్‌ని. కొంతమందికి ఆ లాంగ్వేజ్‌పై పట్టు చిక్కుతుంది. దానికి లాజికల్ బ్రెయిన్ ఉండాలి. అవి నాకున్నాయి(నవ్వు) కొంచెం డీవియేట్ అయ్యాను..నన్ను వాడియా అసోసియేట్స్ వాడు ఇంటర్వ్యూకి పిలిచాడు. వాడు నన్ను టాటా

ఎలక్ట్రిక్ కంపెనీకి పంపాడు. ఆరోజుల్లో అది గవర్నమెంట్ కంపెనీ కన్నా ఎక్కువ.. ఐదువేల రూపాయల జీతం.. బోంబేలో పోస్టింగ్..నన్ను గ్రూప్ లీడర్‌గా ఎంపిక చేశారు. నన్ను ఇంటర్వ్యూ చేసింది నావల్ టాటా.. we need young and energetic people like you.. Welcome to TATA Family అన్నాడు..

ఈలోగా నాకు అమెరికా నుంచి ఒక లెటర్ వచ్చింది.ఒక పెద్ద జర్నల్, నేను పంపిన రెండు పేపర్లను కలిపేసి ఒకటిగా ప్రచురించింది. అందులో ఒక పేపర్ థియరీ గురించి చెబుతుంది. ఇంకో పేపర్ ప్రాక్టీస్ గురించి చెబుతుంది. ఆ రెండు కలిపేసి ఒకటిగా వేశారు. చాలా పెద్ద పేపర్ అది.. చాలా మంచి పేపర్ అని వాళ్ళు కాంప్లిమెంట్ చేశారు. జూన్ 1978లో పబ్లిష్ అయిన ఆ పేపర్‌కు చాలా పేరు, ప్రఖ్యాతులొచ్చాయి.. నా జీవితంలో ఒక టర్నింగ్ పాయింట్ ఆ పేపర్ పబ్లిష్ కావడం.. నేను చేసిన ఆ వర్క్ అంత ప్రముఖమైనది అని నాకు కూడా తెలీదు.. ఆ పేపర్‌లో పధ్నాలుగు థీరమ్స్ ఉన్నాయి. నాకు యూనివర్సిటీ ఆఫ్ కెలిఫోర్నియా, బర్కిలీ నుంచి ఒక ప్రొఫెసర్‌గారు నాకో ఉత్తరం రాశారు. ఆయన నా పేపర్ చదివి, అందులోని అడ్రస్ చూసి రాశారు. ఆయన అప్పటికే ఆపరేషనల్ రీసెర్చ్&మేనేజ్మెంట్ మీద రెండు పుస్తకాలు రాశాడు.. నీ థీరమ్స్ బావున్నాయి. I believe there is a glitch in their proof అన్నాడు. ఎక్కడ ఏ కేస్‌లో అనేది నాకు బోధపడలా.. ఇంకా ఏం రాశాడంటే.. మా రీసెర్చ్ స్టూడెంట్ ఒకతను నీ థీరమ్స్ మీద వర్క్ చేస్తున్నాడు. ప్రతి బుధవారం దానిమీద చర్చ జరుగుతోందని ప్రస్తావించాడు ఆ ప్రొఫెసర్.. నేను బదులుగా ఏం రాశానంటే.. మీరు నాకు సపోర్ట్ చేస్తే వస్తాను.. నెలలో, రెండునెలల్లో ఉంటాను..మీ స్టూడెంట్‌తో కలిసి పనిచేస్తాను అని.. వెంటనే ఆయన దగ్గర్నుంచి జవాబొచ్చింది. రెండునెలలు కాదు.. రెండు సంవత్సరాలు ఉండండి. మా దగ్గర గ్రాంట్ ఉందని.. ఏం చేయాలి మరి నేను.. అప్పటికే నాకు ముగ్గురు పిల్లలు.. ఇద్దరు కొడుకులు.. కూతురు నెలల పిల్ల.. ఆలోచించాను.. నాకు రీసెర్చ్ మీద వ్యామోహం పోలా.. మా చీఫ్‌ని రెండు సంవత్సరాలు సెలవు కావాలని రిక్వెస్ట్ చేశాను. ఆయన కుదరదు పొమ్మన్నారు. కాదండీ మీరు స్టడీ లీవ్ ఇవ్వకపోతే నాకు వీసా రాదు.. అంతకాలముండను.. వచ్చేస్తాను అన్నా.. డి.కె.సచ్ దేవ్ అని చాలా మంచివాడు.. సెలవు మంజూరు చేశాడు.. వాళ్ళే ఎయిర్ టికెట్ పంపించారు. PAN AM ఎయిర్ లైన్స్‌లో వెళ్ళాను. బర్కిలీ యూనివర్సిటీ అంటే టాప్ యూనివర్సిటీ. అదెలాంటిది అంటే మీరు కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ చూస్తే నలుగురు నోబెల్ బహుమతి పొందిన శాస్త్రవేత్తలు అకడెమిక్స్‌గా ఉంటారు. ఇంకో ముగ్గురు ఫిజిక్స్ డిపార్ట్మెంట్‌లో ఉంటారు.. స్టూడెంట్స్ చాలా బ్రిలియంట్. ఒక ఐడియా చెప్పగానే అల్లుకుపోతారు. ముందు అర్థం చేసుకుంటారు. అది చాలా కష్టం.. రెండేళ్ళు సంస్థ నా ఉద్యోగం కాపాడింది. నాకు ఐదుగురు స్టూడెంట్స్ ఉండేవారు. వారికి పాఠం చెప్పినందుకు కొంత డబ్బు అదనంగా ముట్టజెప్పేవారు. నా కుటుంబాన్ని కూడా తీసుకొచ్చేశాను.. అయితే నా వీసా పాఠం చెప్పటానికి పనికిరాదని H వీసా చేశారు. దానివలన బోధన సుళువయింది నాకు..

ఒక కొత్త విషయాన్ని మనం ఓపెన్ చేస్తే దానిలోని ramifications అనంతంగా ఉంటాయి. ఐదుగురిలో ఒక ఆడపిల్ల, ముగ్గురు అమెరికన్లు, ఒక రాజస్థానీ కుర్రవాడు అవినాష్ అగర్వాల్, అతనికి నా దగ్గరే ఐరవైఐదోఏట పి.హెచ్.డి.వచ్చేసింది. అనే పేపర్లు, చాలా జర్నల్స్‌లో పబ్లిష్ చేశాను. రెండేళ్ళు అయ్యాక ఇంకా ఎక్స్టెన్షన్ అడగటానికి మనసొప్పలేదు. ఈలోగా మా ప్రొఫెసర్ గారు Richard Barlow ఇంకా ఎదిగారు. వారిని ఇంటర్నేషనల్ స్టాటిస్టికల్ మేగజీన్‌లో మీరు నన్ను ఇంటర్వ్యూ చేసినట్టు చేశారు (నవ్వు).. ఆ ఇంటర్వ్యూలో is Satya your student అని అడిగారు (సత్యనారాయణ గారిని అక్కడ సత్య అని పిలిచేవారు).

నా స్టూడెంట్ కాదయ్యా. He is hell of a guy అని సమాధానం ఇచ్చాడాయన.. he is no ordinary guy అన్నాడు.. నాకు వచ్చీ రాని ఇంగ్లీషులో there is research in the air అన్నాను నేను. ఈ గాలిలోనే ఒక పరిశోధనాత్మక వాతావరణం ఉందయ్యా అన్నాన్నేను. అది కోట్ చేస్తూ సత్యా చాలా పొయెటిక్‌గా మాట్లాడతాడు అన్నాడాయన..

అక్కడ నేను చాలా కాన్ఫరెన్సెస్‌కి వెళ్ళాను. ఒక కాన్ఫరెన్స్‌లో యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్‌కు చెందిన ఆయన కనిపించాడు.. నేనున్న బ్రాంచ్ అక్కడ పెద్దది కాదు. మిల్వాకీలో మాది పెద్ద బ్రాంచ్ అని చెప్పొచ్చు. స్టీవెన్స్ పాయింట్ అనే ఊర్లో నన్ను ఆహ్వానించారు. మీకు అసిస్టెంట్ ప్రొఫెసర్ షిప్ ఇస్తాము.. మేథమేటిక్స్, కంప్యూటర్

సైన్స్‌లో అని పిలిచారు. నేను రెండింటిలోనూ బోధించగలను కాబట్టి అక్కడ చేరాను.. నాకు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం ఇవ్వటం వలన విస్కాన్సిన్ వెళ్ళాను. అమెరికాలో ఉంటే ఎక్కడికైనా తిరుగుతూ ఉండొచ్చు.. అక్కడికి వెళ్ళాక ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఒకటి న్యూజెర్సీలో పెడుతున్నారు. దానిపేరు Stevens Institute of Technology చాలా పాతది.. పేరున్నది.. అమెరికాలో మొదటిసారి 1874లో మెకానికల్ బ్రాంచ్ అక్కడే పెట్టారు .. స్టీవెన్ అనే ఆయన షిప్ బిల్డింగ్ చేస్తుండేవాడు. ఆయన బాగా సంపాదించాడు. ఆయన యాభై ఐదు ఎకరాల స్థలం ఇచ్చాడు. ఈ ప్రదేశం హడ్సన్ నదికి ఒక పక్కగా ఉంటుంది. ఇంకో పక్కన న్యూయార్క్ నగరం మన్ హాటన్ ఉంటుంది.. ఐఐటీలలాగా అన్నీ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లే ఉంటాయక్కడ. ఆ రోజుల్లో కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కంబైన్డ్‌గా ఉండేవి.. అక్కడ జరిగిన కాన్ఫరెన్స్‌లో నా ప్రసంగం అయిపోయింది.. అక్కడి హెడ్ వచ్చి నన్ను తీసికెళ్ళి provost కి పరిచయం చేశాడు.. provost అంటే డీన్స్‌కి డీన్ లాంటివాడు.. తర్వాత ప్రెసిడెంట్ దగ్గరకు తీసుకెళ్ళాడు. ఆయన నన్ను కాన్ఫరెన్స్‌లో చూశాడు. ఆ సాయంత్రం వైన్&చీజ్ పార్టీకి ఆహ్వానించారు.. అక్కడ నన్ను అమెరికాకు తీసుకువచ్చిన రిచర్డ్ బార్లో ఉన్నారు.. నేను ఏం బోధిస్తున్నానో అడిగి తెలుసుకుని ఆశ్చర్యపోయాడు.. మూడు సబ్జెక్టులు టీచ్ చేస్తూ రీసెర్చ్ పేపర్లు పబ్లిష్ చేస్తున్నావా అని అడిగాడు.. ఎలా చేస్తున్నావు అంటే నాకు ఇంట్రెస్ట్ అని చెప్పాను. అప్పుడు Stevens Institute of Technologyలో అసోసియేట్ ప్రొఫెసర్ షిప్ ఆఫర్ చేశారు. 1984లో విస్కాన్సిన్ నుంచి వచ్చేశాను.. విస్కాన్సిన్‌లో నా జీతం ఇరవై ఎనిమిది వేల డాలర్లు.. ఇక్కడికి వచ్చేటప్పటికి యాభై వేల డాలర్లు అయింది.. అంతే కాదు.. రెండు సార్లు బెస్ట్ టీచర్ అవార్డు ఇచ్చారు.. అది యూనివర్సిటీ మొత్తానికి ఇచ్చే అవార్డు.. అదికాక గౌరవ డిగ్రీ ఇచ్చారు..

యూనివర్సిటీలో సిస్టం ఎలా ఉంటుందంటేనండీ మీరు మంచి యూనివర్సిటీ నుంచి క్వాలిఫికేషన్ పొంది ఉంటే అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం రావటం కష్టమేమీ కాదు. కానీ that is not the end of the story.. ఎందుకంటే తీసేయటం కూడా అలాగే తీసేస్తారు. కారణమేమిటంటే టెన్యూర్ అని ఒకటుంటుంది. అమెరికాలో సుప్రీంకోర్టు జడ్జిలుంటారు. అనేక శల్య పరీక్షలు చేసి వారికా అవకాశం ఇస్తారు. ఆ పోస్ట్ ఇచ్చాక తీసివేయడానికి వీలులేదు. కారణం ఏమిటంటే నిర్ణయాలు ధైర్యంగా తీసుకుంటారని.. అలాగే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరిన తర్వాత ముందు రెండేళ్ళు పనితీరు చూస్తారు. పనితీరును పరిశీలించే బాధ్యత సీనియర్ ఫాకల్టీయే తీసుకుంటారు. రీసెర్చ్ ఎలా ఉందో, టీచింగ్ ఎలా ఉందో చూస్తారు. దానితోపాటు సర్వీస్ టు ది స్కూల్ అంటే అడ్మిషన్స్, ఫండింగ్ విషయాల్లో ఉపయోగపడుతున్నాడో లేదో కూడా చూస్తారు.. ఈ మూడింటినీ గమనిస్తారు. రెండేళ్ళు గమనించి మీకు చెబుతారు. నీ రీసెర్చ్ వర్క్ సరిగ్గా లేదనో, టీచింగ్ సరిగ్గా లేదనో హింట్ ఇస్తారు. పైగా అక్కడ స్టూడెంట్ ఎవాల్యుయేషన్ కూడా ఉంటుంది. వీటి ఆధారంగా రిపోర్ట్ రాస్తారు. కొంచెం ఫరవాలేదనిపిస్తే ఇంప్రూవ్ చేసుకోమని చెబుతారు. ఆరేళ్ళ కాలం పూర్తయ్యేలోపు మిమ్మల్ని ఉంచాలో, తీసేయాలో ఖచ్చితంగా నిర్ణయం తీసుకోవాలి. ఒకసారి మీకు టెన్యూర్ ఇస్తే చేస్తే మిమ్మల్ని సరిగ్గా పాఠం చెప్పటం లేదు అన్న కారణంగా తీసేయటానికి వీలులేదు. ఒక్క ఫ్రాడ్ చేస్తే తప్ప.. నేను అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉన్నప్పుడు నాకు నాలుగేళ్ళకే టెన్యూర్ ఇచ్చారు.

**మిసిమి : ఇంకో రెండేళ్ళు ఉండగానే మీకు టెన్యూర్ ఇచ్చారు?**

**సత్యనారాయణ :** అవును.. రెండేళ్ళు ఉండగానే.. ఆ తర్వాత సంవత్సరంలో నాకు ప్రొఫెసర్ షిప్ ఇచ్చారు. ఇంకొక విషయం ఎప్పుడూ మీ పని మాట్లాడాలి కానీ మీరు మాట్లాడకూడదు.. నేనెప్పుడూ ఒక ఉదాహరణ చెబుతాను.. ఒక ల్యాండ్ స్కేపింగ్ మనం చూస్తే అందులో గరిక ఉంటుంది. మనమందరం ఆ గరిక లాంటివాళ్ళం. అక్కడే బెండ చెట్టు ఉంటుంది. అందంగా ఉంటుంది.. ఏదో ఒకటి రెండు సీజన్లలో మురిపిస్తుంది. ఇంకొంచెం పక్కనే కరివేపాకు మొక్క ఉంటుంది.. కొంచెం దాటితే మునగ చెట్టు ఉంటుంది. నాలుగైదు సీజన్లు కాస్తుంది.. దానివెనకే వేపచెట్టు ఉంటుంది.. చాలా సంవత్సరాలు ఉంటుంది.. దానివెనకే మహావృక్షం మర్రిచెట్టు ఉంటుంది.. ఇంకా పర్వతాలుంటాయి.. పర్వతాలంటే ఎవరు.. ఓ నన్నయ్య భట్టు.. తెలుగు భాష పోయేదాకా నన్నయ్య భట్టు పోడు.. సైన్స్‌లో కూడా అంతే.. వ్యక్తుల కృషి ఆవిధంగా ఉంటుంది

**మిసిమి** : మీరు 1989 కల్లా ప్రొఫెసర్ అయిపోయారు కదా?

**సత్యనారాయణ :** అవును..ఆ తర్వాత రకరకాల కమిటీల్లో మెంబర్‌గా ఉన్నాను. రీసెర్చ్ వర్క్.. ఆ తర్వాత కన్సల్టింగ్ వర్క్ చేసేవాడిని. నేను C++లో మాస్టర్ని.. అంటే 1నుంచి 10వరకు ఉన్న స్కేల్‌లో నా లెవెల్ 9 ఉంటుంది.. మాకు జీతం తొమ్మిది నెలలే ఉంటుంది. మిగితా మూడు నెలలు కన్సల్టింగ్ వర్క్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ కోర్సులు ఇప్పుడొచ్చాయి కానీ, అప్పుడు లేవు. స్టీవెన్స్ తరపునే ఆన్ కేంపస్ కోర్సులు టీచ్ చేసేవాడిని.. డిఫెన్స్ ల్యాబ్స్ వంటి సెన్సిటివ్ ప్లేసెస్ కూడా వెళ్ళి బోధించే వాడిని. ఒకసారి టెన్యూర్ పొజిషన్‌లో ఉంటే రిటైర్మెంట్ లేదు. కానీ నేను రిటైర్మెంట్ తీసుకున్నాను.

చాలా టెక్నికల్ బుక్స్ రాయటంలో నేను నావంతు పాత్ర పోషించాను. అనేక పుస్తకాలకు నేను కాంట్రిబ్యూటర్‌గా ఉండేవాడిని.. అలాగే నేను అనేక పత్రికలకు ఎడిటర్‌గా ఉన్నాను. ఒక పెద్ద జర్నల్‌కు గెస్ట్ ఎడిటర్‌గా ఉన్నాను. అది 1986వ సంవత్సరంలో అనుకోండి. ఈ పుస్తకం చూశారా Network Liability and Algebraic Structures.. ఈ పుస్తకంలో సగంపైగా నేను రాసిన వ్యాసాలే ఉంటాయి. 1987నాటికి మా కంప్యూటర్ ప్రపంచంలో నేను జగత్ప్రఖ్యాతుడిని.. కానీ అలా నేను చెప్పకూడదు. తప్పు..

కంప్యూటర్ రంగం అంటే మేథ్స్, ఫిజిక్సే.. ఈ విషయాలన్నీ నేను ఎవరికీ చెప్పను. ఎందుకంటే ఈరంగం గురించి తెలియని వారికి చెప్పినా అర్థం కాదు.. ఇవన్నీ మీరడిగారు కాబట్టి చెబుతున్నాను.. నేను రిటైర్మెంట్ కూడా మా పిల్లలు సెటిల్ అయ్యాకే తీసుకున్నాను. నేను రిటైర్మెంట్ తీసుకోవటానికి కారణం నాకున్న సాహిత్య వ్యామోహం.. పిచ్చి.. ఇవే కారణాలు.. నాకు అరవై మూడేళ్లు రాగానే రిటైర్ అవ్వాలని ముందే నిర్ణయించుకున్నాను.. రిటైర్ అయ్యాక ఆన్‌లైన్‌లో స్టీవెన్సన్ సంస్థ విద్యార్థులకే బోధించాను. 2008-2013వరకు ఇక్కడే ఉండి బోధించాను..

**మిసిమి : మీరు రిటైర్ అయ్యేనాటికి మీ ఆర్థిక పరిస్థితిని టూకీగా చెప్పాలంటే?**

**సత్యనారాయణ :** నేను రిటైర్ అయ్యేసరికి చాలా సంతృప్తికరమైన స్థితిలోనే ఉన్నాను. నాకు స్టాక్స్ ఉన్నాయి. సోషల్ సెక్యూరిటీ పెన్షన్ వస్తుంది.. నా డబ్బు నా కుటుంబానికి ఖర్చుపెట్టవలసిన అవసరం లేదు.. ఖర్చుపెట్టను కూడా.

డబ్బు అనగానే డబ్బు గురించి భర్తృహరి చెప్పిన మాట గుర్తొస్తుంది.. భర్తృహరి డబ్బు బయటకు వెళ్ళటానికి మూడే మార్గాలున్నాయంటాడు.. మొదటిది దానం.. రెండోది భోగం.. మూడోది.. ఈ రెండూ చేయకపోతే దాని మార్గం అదే చూసుకుంటుంది.. అదే నాశనం అన్నాడు, నేను *సుగుణాఢ్య శతకం* అనే పుస్తకం రాశాను. అది మీరు చదివితే నేనేమిటో, నా మనస్తత్వం ఏమిటో తెలుస్తుంది.. **సాదృశ్యముల్..సుగుణాఢ్య వర్తనల్..** ఇది దాని మకుటం..

**మిసిమి : మీకు మీ శ్రీమతి సహకారం ఎలా ఉంటుంది?**

**సత్యనారాయణ :** ఆవిడ న్యూయార్క్ నగరంలో మన్హేటన్‌లో స్టూడియో అపార్ట్మెంట్‌లో ఉంటుంది. ఆవిడకు దేనికి లోటు లేదు. మా ఇద్దరు అబ్బాయిలు చూసుకుంటారు..

**మిసిమి : మీకు విశ్వనాథ వారంటే చాలా ఇష్టం కదా.. వారిని కలిశారా?**

**సత్యనారాయణ :** కలిశాను కానీ, అప్పటికి ఆయన మేరు పర్వతం అని తెలీదు..

అప్పటికి భోజనవేళ కావటంతో రికార్డింగ్‌కు కాస్త విశ్రాంతినిచ్చి భోజనం కానిద్దామన్నారు సత్యనారాయణ గారు.. అలా రికార్డింగ్‌కు కొంత విరామం ఇచ్చాం.. గుంటూరు జిల్లా చక్కటి తెలుగింటి భోజనం కానిచ్చాము..

అప్పాజోస్యుల సత్యనారాయణ గారింట్లో విశ్వనాథ సత్యనారాయణ గారివి అనేక ఛాయా చిత్రాలు కనిపిస్తాయి. ఇవేకాకుండా అనేక అరుదైన పుస్తకాల సంపద ఎటుచూసినా..

*(వచ్చే సంచికలో "అజోవిభో" ఫౌండేషన్ కార్యక్రమాలు ఏవిధంగా నిర్వహిస్తున్నారు, వారి సాహిత్య వ్యాసంగం ఏమిటి? విపులంగా తెలుసుకుందాం.)*

---

**సంభాషణ : అశ్వినీకుమార్**


**ధ్వని ముద్రణకు రాతప్రతి : సి.ఎస్. రాంబాబు *(అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)***

# తెలుగు నవల-ప్రయోగ వైవిధ్యం

*- ఆచార్య కరిమిండ్ల లావణ్య*

**లో**తైన విషయ పరిజ్ఞానం, సమ్యగ్ దృక్పథంతో కూడిన సూక్ష్మపరిశీలన, విస్పష్టమైన వివరణ నైపుణ్యం, విమర్శనాత్మక విశ్లేషణా సామర్థ్యం, ఫలితాంశాల ప్రకటనలో నిజాయితీ కల్గిన నిష్పక్షపాత వైఖరీ విమర్శకుడికి ఉండాల్సిన మౌలిక లక్షణాలు. ఇవన్నీ నిండుగా ఉన్న సమకాలీన విమర్శకుడు కె.పి అశోక్ కుమార్ గారు. అశోక్ కుమార్ గారి గురించి ఎ.కె. ప్రభాకర్ గారు తెలుగు నవలా ప్రయోగ వైవిధ్యం విమర్శ పుస్తకానికి ముందుమాట రాస్తూ అన్న మాటలు ఇవి.

ఈ బాధిత సమాజం పట్ల సహానుభూతి, ప్రేమ ఇతని విమర్శకు అంతస్సూత్రం. చదవటం వీరి ఆరో ప్రాణం. పుస్తక పరిచయం, గ్రంథ సమీక్ష, విమర్శా వ్యాసం, ఏదైనా సమగ్రతను సాధించటానికి వీరు చేసే ప్రయత్నం చాలా పెద్దది. వీరి ఒక వ్యాస రచనకు ప్రణాళిక ఒక నెల పైగానే ఉంటుంది. నేటి కాలంలో స్పష్టమైన, సూటిగా, నిష్కర్షగా, సద్విమర్శా ప్రకటన చేసేవాళ్ళు కరువైపోయారు. కాని, వీరిలో ఆ ప్రకటన చేసే ధైర్యం మెండు. నేటి కాలంలో వేళ్ళ మీద లెక్కపెట్టుకో గలిగిన సద్విమర్శకుల్లో కె.పి అశోక్ కుమార్‌గారొకరు. సృజనాత్మక రచనల లోతుపాతుల్నే పట్టుకుంటున్నారు. వాటిల్లోని వస్తు, శిల్ప, శైలిల్లో ఉన్న వైవిధ్యాన్ని సూటిగా చెప్తారు. కొన్ని వందల పుస్తకాలను చదివిన తక్కువ మందిలోనూ వీరి పేరు రికార్డు చేసుకున్నారు. నాకు (వ్యాసకర్తకు) వీరిని చూసినపుడు ఎప్పుడు ఏదో చదువుతున్నారన్నట్లనే భావన కలుగుతుంది. సదాశివగారి తర్వాత ఎక్కువ పుస్తకాలు ఎప్పుడూ చదివిన జాబితాలో వీరు చేరుతారు. ప్రతి పదానికి స్పష్టత కోరుకునేంత జాగ్రత్త వీరి రచనా శైలి.




తులనాత్మక అధ్యయనం అంటే ప్రీతి. తెలుగు నవల-ప్రయోగ వైవిధ్యం- విమర్శా వ్యాసాల్లో రెండు విభాగాలున్నాయి. 1) నవల 2) సినిమా.

వారి సూక్ష్మ పరిచయాన్ని చూసినట్లయితే-కె.పి అశోక్ కుమార్ గారు సికింద్రాబాద్ మచ్చబొల్లారంలో జన్మించారు. ఇంటర్ వరకు విద్యాభ్యాసం అక్కడే. సికింద్రాబాద్‌లోని సర్దార్ పటేల్ కళాశాలలో బీకాం చేసారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆర్కియాలజీ, ఆంధ్ర సారస్వత పరిషత్‌లో తెలుగు సాహిత్యం, అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో గ్రంథాలయ సమాచార శాస్త్రంలో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేసారు. సాంకేతిక విద్యాశాఖలో గ్రంథపాలకుడిగా ఎంపికై హైదరాబాదులోని పాలిటెక్నిక్‌లో ఇరవై ఐదు సంవత్సరాలు పనిచేశారు. ప్రస్తుతం పాలపిట్ట వర్కింగ్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సాహిత్య విమర్శ, సినిమాలపై విమర్శ వారి అభిమాన వ్యాపకాలు. హాలీవుడ్ సినిమా, కథావలోకనం, కథావిష్కారం, తెలుగులో మారుపేరు రచయితలు తదితర పుస్తకాలను ప్రచురించారు. తెలుగులో హాలీవుడ్ సినిమా సమీక్షలు వెయ్యికి పైగా, సాహిత్య సమీక్షలు రెండువేలకు పైగా చేసి రికార్డు సృష్టించారు. తెలంగాణ తొలితరం-మలితరం కథకులు, కథనరీతులు, నాటక విమర్శ, సాహిత్య వ్యాసాలు త్వరలో పుస్తకాలుగా రానున్నాయి.

నవలా విమర్శతోనే వీరి వ్యాస రచన ఆరంభమైంది. వీరు నాలుగో తరగతిలోనే "మిహిరకులుడు" చదవడం, పదో తరగతిలో వేయిపడగలు చదవటం వల్ల వీరిలో నవలపై ప్రత్యేక శ్రద్ధ ఆనాడే అంతఃమస్తిష్కంలో

ఉండిపోయింది. తెలుగు నవల-ప్రయోగ వైవిధ్యం ఇరవై ఐదు వ్యాసాలతో సాహిత్య విమర్శలో ప్రధాన పుస్తకంగా నిలిచిపోయింది. ఇందులో అడవి బాపిరాజు నవలల విశ్లేషణ మొదలుకొని, పెద్దింటి అశోక్ కుమార్ నవలల వరకు వ్యాసాలున్నాయి. అంటే నవలా రచన అనువాదం నుండి స్వతంత్ర రచన వరకు మారినప్పటి కాల సమాజం నుండి నేటి వరకు దాదాపుగా 60-70 సంవత్సరాల నవలా ప్రవాహాన్ని పరిశీలించారు (అనువాద కాలాన్ని తీసేద్దాం). నవీన్ గారి అంతఃసూత్ర రచనా ధోరణి, శీలా వీర్రాజు నవలల్లోని శిల్ప రీతులు, మహీధర గ్రంథాలయోద్యమ చిత్రణ.... ఇలా 78 యేండ్ల స్వతంత్ర భారత జీవన చిత్రణ వీరి విమర్శలో కనబడుతున్నది. మహీధర రామమోహనరావు గారి గ్రంథాలయోద్యమ చిత్రణ, అడవి బాపిరాజు నవలల బహుముఖీనత, నవలలు ఆత్మకథలుగా వచ్చాయని చెప్తూ, నేటి ప్రాంతీయ, ముస్లిం, దళిత వాద ధోరణులతో వచ్చిన విభాగాలను విశ్లేషణ చేసారు. 1) సాంఘిక 2) చారిత్రక 3) మనోవైజ్ఞానిక 4) రాజ్యాంగ నైతిక నేపథ్యాలను విడివిడిగా విశ్లేషణ చేసారు.

నవీన్ గారి నవలలైన అంపశయ్య, ముళ్ళపొదలు, అంతఃస్రవంతి, చైతన్యస్రవంతి రచనా విధానంలో సాగాయని ఒప్పుకోక తప్పదంటారు. బెర్గ్ సన్ ప్రతిపాదించిన, 'కాలం' వ్యవధి అనే సిద్ధాంతం చైతన్యస్రవంతికి జీవగర్ర వంటిది. నవలా కాలం కొన్ని గంటలకే పరిమితమై ఉన్న ఈ నవలలు చైతన్యస్రవంతి ప్రయోగాలే. విమర్శకుడు మరో సృజనాత్మక రచనపై విమర్శ చేయడానికి సిద్ధంగా ఉన్నాడని చెప్పడానికి ఈ వ్యాసంలో చివరగా కె.పి గారు ఇలా చెప్పారు. నవీన్ గారి నవలలోని పాత్ర రవి. ఈ పాత్ర నవలలో యువకుడిగా కనిపిస్తాడు. ఆ యువకున్ని కాలం గడచి వృద్ధాప్యంలో రవి జ్ఞాపకాలతో భవిష్యత్తులో మరో నవల వస్తుందని ఊహించటానికి అవకాశం ఉందని చెప్తారు కె.పి గారు. నవలా రచయితలు తమ సమకాలీన కాలాన్ని తమకు ముందున్న కనీసం ముప్పై సంవత్సరాల సామాజిక నేపథ్యాన్ని ఎక్కువగా తీసుకుంటుంటారు. సాంఘిక నవలల దృష్టిలో ఆలోచన చేసినపుడు మహీధర రామమోహనరావు నవలల్లోనూ అంతే. మరో మాట 1) రచయిత ఏదో ఒక పాత్రలో తనకు తెలియకుండానే తను చేరిపోతాడు. కొల్లాయి గట్టితేనేమిలో పుస్తకాల కోసం పరితపించే బాలకృష్ణ అనే విద్యార్థి ఎవరో కాదు రచయితే. రామనాథంలోనూ రచయితే కనిపిస్తాడు. గ్రంథాలయ ఉద్యమ చరిత్రలో ఆనాటి చదువుకున్న వారంతా పుస్తకాలను రాయాలని, ప్రచురించాలని, వాటి సారాంశాన్ని విస్తరించాలని బహు బలీయమైన కోరికలు ఉండేవి. మహీధరలోనూ అంతే. నేటి కె.పి లోనూ అంతే. చేసిన పని బాధ్యతగా మారుతుందని చెప్పడానికి సూక్ష్మ నిర్ణేతలు మహీధర, కె.పి అని చెప్పవచ్చును.

గ్రంథాలయం నుండి సామాజిక, చారిత్రక కోణం వైపు వచ్చినపుడు బాపిరాజు సాదాసీదాగా వారి గురించి చెప్పి వదలరు కె.పి గారు. వారి నవలల్లోని తెలుగువారి గుణశీలాలు, విజ్ఞానం, అభిరుచి, సాంఘిక వ్యవస్థ, గ్రామీణ జీవితాలు, రాజ్యాంగ వ్యవస్థలు, స్థల పురాణాలు, విదేశాల విశేషాలు, శిల్పం, చిత్రకళ, సంగీతం, నాట్యం, సాహిత్యం, రాజకీయం, వైద్యం, హస్తసాముద్రికం, జ్యోతిష్యం ఇలా ఇవన్నీ ఒక్కొక్క సైద్ధాంతిక సూత్రానికి బలమైన ప్రతీకలైన టెక్నికల్ టర్మ్స్. వీటన్నింటినీ సుస్పష్టంగా వివరిస్తారు కె.పి గారు. అడవి బాపిరాజును లోతుగా అధ్యయనం చేసినపుడు మాత్రమే ఇలా రాయటం కుదురుతుంది. ఆనాటి ఆదర్శవాద ధోరణికి ప్రతిబింబం వల్లంపాటి నవలలంటారు కె.పి. ఆనాటి కాలంలో వాదం లేదు. నవలల్లో వాద ప్రతిపాదనలు చాలా తక్కువగా ఉంటాయి. నాటి కాలంలో వాద నేపథ్యంతో రచనలు చేసారా అని లోచన చేసినపుడు కాదని అర్థమవుతుంది. కాని, వల్లంపాటి వారు మార్క్సిస్టు విమర్శకులుగా మారకముందు చేసిన రచనలు వారివి. వీరి నవలల్లో వాదం ఉందని చెప్పి పరిశోధనలకు సరుకు తయారు చేస్తారు కె.పి గారు. ఫ్రాయిడ్‌ను మథించిన ఫలితం వల్లంపాటి నవలలుగా నిర్ధారణ చేసారు.

ఊబిలో దున్న నవలకు సాహిత్య అకాడమీ అవార్డును తిరస్కరించి, పెద్ద సంచలనాన్ని సృష్టించిన వినుకొండ నాగరాజు కమెండో పత్రికా సంపాదకుడు. ఇతడు బంగోరె రూమ్మేట్. ప్రత్యేకంగా చెప్పడం ఎందుకంటే నేటి తరానికి అంతగా తెలియని డెడికేటెడ్ గా సాహిత్య కృషి చేసినవారు వినుకొండ నాగరాజు నవలలపై వ్యాసం రాయటం కె.పి ప్రత్యేకత. శీలా వీర్రాజు గారు అందరికీ తెలుసు. వినుకొండ నాగరాజు ఎంత మందికి తెలుసు. వీరిలో

సృజన సాహిత్య వెలికితీతకు కారకులు, ప్రేరకులు శీలా వీర్రాజు. నన్ను పిలిపించి, తాగుబోతు, ప్రేమికుడు, ఎంతదూరం, ఊబిలో దున్న, సువర్ణ వీరి నవలలు. వీరి రచనా శైలి ఎర్నెస్టు హెమింగ్వే రచనా శైలికి దగ్గరగా ఉంటుందంటారు కె.పి గారు. వినుకొండ రచనాశైలి వడ్డెర చండీదాసు రచనల్లో కనిపిస్తుంది. అందుకే ఆయన రచనలను కూడా చైతన్యస్రవంతి రచనలుగా పొరపడుతుంటారు. తెలుగు నవలకు విలక్షణమైన శైలీశిల్పాలను జోడించిన నాగరాజు రచనలపై పరిశోధన జరుగాల్సిన అవసరం ఉందంటారు కె.పి. ఆరుద్ర గ్రామాయణం జేమ్స్ జాయిస్ ప్రభావంతో వచ్చిందంటారు కె.పి. జేమ్స్ జాయిస్ నవల యలిసెస్ హెూమర్ రాసిన గ్రీకు కావ్యం ఒడెస్సికి సాంఘిక రూపం. ఆరుద్ర వాల్మీకి రాసిన రామాయణాన్ని గ్రామాయణంగా సాంఘికీకరణ చేసారు. రచనా కాలం 1954. కాండం పేరుతోనే శీర్షికలున్నాయని, ఇది చిన్న సైజు పెద్ద నవల. పెద్ద సైజు చిన్న కథ. రేడియోలో గ్రామస్థుల కోసం రాయడం వల్ల ఇది ఈ రూపంలో తయారైందని ఆరుద్ర గారే అన్నట్లు కె.పి.గారు చెప్తూ ఆరుద్ర నవలాకర్త కూడ అంటారు.

బొల్లిముంత శివరామకృష్ణ మృత్యుంజయులు 1947లో వచ్చిన పోరాట నవలను 2005లో వచ్చిన సరిపల్లి కృష్ణారెడ్డి మంటలు మానవత్వంలో తులనాత్మక దృష్టికోణంలో పరిశీలించారు కె.పి. మృత్యుంజయులు నవల వెట్టిచాకిరిని, భూస్వాముల నిరంకుశ దోపిడిని, అణచివేతను ప్రధానంగా చిత్రీకరించింది. మంటలు–మానవత్వం సాయుధ పోరాట విరమణ తర్వాత వచ్చిన కేవలం విన్న జ్ఞానంతో, సమాచార సేకరణతో రాసారు. ఇది రజాకార్ల దురంతాలను వివరించడానికి పరిమితమైంది. రెండు నవలలు తెలంగాణ రైతాంగ పోరాటాన్ని చిత్రించిన నవలలే అయినా, మొదటి దానికి ఉన్న సమగ్రత రెండవ దానికి లేదంటారు కె.పి గారు. అంతేకదా! విన్నదానికి, కన్నదానికి ఉన్న తేడాయే ఈ నవలలోని కథా వస్తువు తయారీ విధానం.

కొలకలూరి ఇనాక్ గారి నవలలు అనంతపురంలోని అతివృష్టిని వివరించే అనంత జీవనం నవల, అనావృష్టి ఫలితాలను వివరించేది సర్కారు గడ్డి నవల. ఈ రెండు నవలలు చదువుతుంటే రావి శాస్త్రి గారి రచనా వ్యాసాంగం జ్ఞాపకం వస్తుందంటారు కె.పి. కథలో భాగంగా పాత్రలు రాకుండా, పాత్రలే కథను నడిపిస్తాయి. అనంతపురం స్థానీయ జీవన వాస్తవికతకు అద్దంపట్టేవి ఈ రెండు నవలలంటారు కె.పి. ఉత్తరాంధ్ర వైపు వెళ్తే అట్టాడ అప్పల్నాయుడు నవలలు ఉత్తరాంధ్ర జనజీవనానికి ప్రతీకలు అంటారు కె.పి. 1978లో పువ్వుల కొరడాతో ప్రారంభించి సృజనాత్మక రచనలు చేస్తున్నారంటారు కె.పి గారు. పునరావాసం నవల అక్కడి గిరిజనుల జీవితానికి ప్రతీకగా వచ్చింది. ఉత్కళం నవలలో నూరేండ్ల ఉత్తరాంధ్ర చరిత్ర ఉన్నది. నూకలిస్తాను నవలలో పులి భయంతో ఆత్మహత్య చేసుకోకూడదని నిర్ణయించుకొన్న పాత్ర పార్వతిది. అనగనగా ఒక రాజద్రోహం నవల ప్రపంచీకరణ వలన వచ్చిన మార్పులు చెబుతుందని ఉత్తరాంధ్ర నూరు సంవత్సరాల చరిత్రను సూక్ష్మంగా కె.పి వ్యాసంలో ప్రతిఫలింపజేసారు.

పెద్దింటి అశోక్ కుమార్ రాసిన జిగిరి నవల మనిషికి, మృగానికి ఉన్న అనుబంధాన్ని చిత్రీకరించింది. దీనితో పాటు సంచార జీవుల జీవన విధానం, మారుమూల తెలంగాణ పల్లెల వాతావరణం, పాత్రోచిత మాండలికం నవలలో కనిపించాయని కె.పి ధృవీకరించారు. సినిమా కథ మూసలో సాగిన దళిత నవల మోహిని. ఇది ననుమాస స్వామి రాసారు. రాజ్యాధికారం మారితే తప్ప బలహీన వర్గాల సమస్యలు పరిష్కరించబడవని రచయిత దృక్పథాన్ని కె.పి డైరెక్ట్‌గా చెబుతారు. సంస్కరణ వైఫల్యాలకు ప్రతిబింబం "అద్దంలో చందమామ" అనే శీర్షికతో చిలుకూరి దేవపుత్ర రాసిన అద్దంలో చందమామ నవల దళితుల ఉద్దరణ కోసం ప్రభుత్వం తలపెట్టిన పథకాలలోని డొల్లతనాన్ని, ఆచరణశూన్యమైన సంస్కరణలలోని బండారాన్ని "అద్దంలో చందమామ"లో చిత్రించ గలిగారంటారు కె.పి. మొదటి ముస్లింవాద నవల వెండి మేఘం అని నిర్ధారణ చేసారు కె.పి. సలీం ఈసారి విస్తృతమైన కాన్వాస్ మీద ముస్లిం కులాల మధ్య విభేదాల నేపథ్యాన్ని ఇతివృత్తంగా తీసుకొని ఒక ముస్లిం మహిళ ఎదుర్కొన్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమస్యలను చిత్రీకరించడానికి వెండి మేఘం నవలను ఎన్నుకున్నారంటారు కె.పి. "ఇప్పటి వాదాలతో, ఇప్పటి చైతన్యంతో అప్పటి స్త్రీని అంచనా వేయడానికి ప్రయత్నించడం అసందర్భం, అవివేకం కూడాను. కొంత మంది సూడో స్త్రీవాదులు భ్రమపడుతున్నట్లుగా లైంగిక స్వేచ్ఛ, కుటుంబ విచ్ఛిత్తి స్త్రీ వాదం అయితే, ఇది

నిస్సందేహంగా స్త్రీవాద నవల కాదు. సంకుచిత వైయక్తిక ప్రయోజనాలకతీతంగా మానవీయ విలువల గొప్పతనాన్ని ఈ నవల తెలియజేస్తుంది". ఇంత నిక్కచ్చిగా ఉంటుంది కె.పి గారి విమర్శ.

వాసిరెడ్డి సీతాదేవి నవల నుండి గీతాంజలి నవలల వరకు స్త్రీలు రాసిన నవలలను పరిశీలిస్తే ఎన్నెన్నో సామాజిక మార్పులు కనిపిస్తాయి. వాసిరెడ్డి సీతాదేవి నవలల్లో వాదాలుగా స్థిరపడకముందు తమకున్న సామాజిక అవగాహనతో-చైతన్యంతో వారు తమ రచనలను చేసారు. ఆమె రాసిన నవలల్లో చదివించే గుణం పుష్కలంగా ఉందంటారు కె.పి. గీతాంజలి రాసిన ఆమె అడవిని జయించింది రచయిత్రి ఆత్మకథే అంటారు. స్త్రీల తక్షణ సమస్యలను పరిష్కరించుకుంటూనే, స్త్రీ విముక్తికై పోరాటంలో భాగస్వామ్యం కావాలని ఈ నవలలోని పాత్ర ఐన సంధ్య మహిళా విమోచన సంస్థలో చేరుతుంది. "తను అడవిని జయించింది" అంటుంది. కాని, కాత్యాయని విద్మహేగారు ముందుమాట రాస్తూ, అన్న మాటలు, తను అడవిని జయించిందా లేదా కీకారణ్యంలోకి ప్రవేశించిందా? అనే ప్రశ్నలు పాఠకులను తప్పకుండా ఆలోచింపజేస్తాయంటారు కె.పి. ఇద్దరు మహిళా రచయితల సమకాలీన పరిస్థితులు వేరు. అందుకే నవలా వస్తువులో మార్పులూ అంతేకదా! వి.ఎస్ రమాదేవి గారు రాసిన ఆత్మ చరిత్రాత్మక నవలా సంపుటాలైన రాజీ మలుపులు, మజిలీలు, అనంతం స్వతంత్ర సాధికారిత మహిళా నేపథ్యం ఈ సంపుటాల్లో ఉందంటారు. రాజీ నవల మొత్తం చదివి ముగించిన తర్వాత ఛార్లెస్ డికెన్స్, టాల్ స్టాయ్, దోస్తవిస్కి వంటి మహారచయితల రచన చదివిన అనుభూతి కలుగుతుంది అన్న శ్రీపతి గారి మాటలతో నేను ఏకీభవిస్తాను అంటారు కె.పి గారు. ఇందులో స్త్రీ స్వీయ ప్రతిభ ప్రధాన ఇతివృత్తం.

దేవులపల్లి కృష్ణమూర్తి ఊరు-వాడ బతుకు ఆత్మ చరిత్రయే. ఇది ఉత్తమ పురుషలలో సాగినది. ఈ పుస్తకానికి వరవరరావు ముందుమాట రాస్తూ అపూలా వలె నిత్య దరిద్రుడు కాదు కృష్ణమూర్తి అంటారు. మనుషులతో బతుకే కృష్ణమూర్తి ఒంటరివాడు కాదంటారు-ఇదీ అంగీకరిస్తారు కె.పి. కాని వరవరరావు గారు పథేర్ పాంచాలితో పోల్చడం బాగాలేదంటారు. కృష్ణమూర్తి గారిపై పరిశోధన కూడ వచ్చింది. తొలి-మలి యాత్రా నవలలు అనే వ్యాసంలో యాత్రా నవలలను ఒకచోట చేర్చి పరిశోధనాంశాన్ని తయారుచేసారు కె.పి గారు. నవల-ప్రయోగాలు వ్యాసంలో సాంఘిక, మనోవిశ్లేషణాత్మక అస్తిత్వవాద, వైజ్ఞానిక, సమాచారాత్మక, పేరడీ, యాత్రా, ప్రతీకాత్మక నవలల విశ్లేషణలు చేసి కరెంట్ అఫేర్స్‌గా అందించారు. తిరుపతయ్య 1987లోనే బతుకు నవల రాసాడు. ఈయన చనిపోయే దశలో జీవన సమరం నవల రాసాడు. పాత్రోచితమైన తెలంగాణ మాండలికంతో తెలంగాణ స్థానీయతను నింపుకున్న నవల ఇవి. బతుకు పోరాటంలో క్యాన్సర్‌తో బాధపడుతూ రచనా పోరాటం చేసాడు తిరుపతయ్య. ఆరు నెలల్లో 600 పేజీల నవల రాసాడు. తిరుపతయ్య తన చిన్ననాటి భయంకర దృశ్యాలను ఈ నవలలో చిత్రించాడని కె.పి గారంటారు.

నవలల్లో వస్తుపరంగా, రూపపరంగా జరిగిన ప్రయోగాలను ఐదు విభాగాలుగా వివరించారు. 1) వస్తు స్వీకరణ విషయికంగా చూపే కొత్తదనాన్ని కూడ ప్రయోగంగా భావించారు. 2) కథన ప్రయోగాల్ని శిల్ప ప్రయోగాల నుంచి, భాషా ప్రయోగాల్ని శైలీ పరమైన ప్రయోగాల నుంచి విడదీసి చూపారు. వాటి మంచి, చెడులను విశ్లేషించారు. 3) పోయిన శతాబ్దం నాలుగో దశకంలో తెలుగు నవలా రచనలో కొత్త శకం ప్రారంభమైందని తీర్మానించారు. 4) గత డెబ్బై సంవత్సరాలుగా ప్రయోగ ప్రయోజనాల మధ్య నవల సాగుతుందని నిర్ధారించారు. 5) వీరు పెట్టిన ఉపశీర్షిక ప్రత్యేక పరిశోధనాంశం అవుతుందని ఈ పుస్తకానికి ముందుమాట రాస్తూ ఎ.కె ప్రభాకర్ గారంటారు.

"తెలుగు నవల-ప్రయోగ వైవిధ్యం" విమర్శా వ్యాసాలు పుస్తక రూపంలో రాకముందు ఉదయం, వాఙ్మయి, వార్త, పాలపిట్ట, ఈ భూమి, దర్పణం, 1980 తర్వాత తెలుగు స్త్రీవాద నవల (రాచపాళెం సర్ సంపాదకత్వం), ఆంధ్రప్రభ, చినుకు వంటి పత్రికల్లో, పుస్తకాల్లో వ్యాసాలుగా వచ్చాయి. నేడు వేళ్లమీద లెక్కపెట్టగలిగే సీరియస్ సద్విమర్శకుల్లో కె.పి అశోక్ కుమార్ గారొకరు. కథను, నవలను, సినిమాను పూర్తిగా అధ్యయనం చేసినవారు. వీరి విమర్శ భావి పరిశోధకులకు ప్రధానమైన భూమికగా ఉపయోగపడుతుంది.

**ఆచార్య కరిమిండ్ల లావణ్య**
డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్, తెలంగాణ విశ్వవిద్యాలయం,
నిజామాబాద్, ఫోన్ : 98484 10244

# వీడని బంధం

**– ఆచార్య పి. ఆర్. హరినాథ్**

నీడైనా వీడి పోతుందేమో కానీ నిజమైన స్నేహితులు వీడరు. వెలుగుంటేనే నీడలు తోడుగా నిలుస్తాయి. చీకట్లో చిన్నెకైనా ఉండవు. ఒంటరిగా వేదనలో, ఓదార్పు కోసం చూసినప్పుడు స్నేహ హస్తం సేవచేస్తుంది. వెన్నెలైనా, వేసవైనా, చీకటైనా, వేకువైనా వెంట నిలిచే తోడూ నీడా మిత్రులే. మనసంతా చింత కమ్ముకుని మసక బారినప్పుడు, రోజురోజుకూ ఏదో అగాధంలోకి కూరుకుపోతున్నట్లు నిరాశలు నిస్తబ్ధ పరచినప్పుడు, వేసిన అడుగల్లా పాతాళంలోకి పడుతున్నప్పుడు, చేతులు పైకి చాచేకొద్దీ ఊబిలోకి జారిపోతున్నప్పుడు మనిషికి సహాయం కావాలి, ఆసరా కావాలి, పక్కన నేను ఉన్నాను భయపడకు అన్న భరోసా కావాలి. అలాంటి సన్మిత్రుల గురించి భర్తృహరి అంటున్నాడు:

**పాపాన్నివారయతి యోజయతే హితాయగుహ్యం నిగూహతి గుణాన్ ప్రకటీ కరోతి**
**ఆపద్గతం చ న జహాతి దదాతి కాలేసన్మిత్ర లక్షణమిదం ప్రవదంతి సంతః**

మంచి స్నేహం పాపాన్ని నివారిస్తుంది. పాపమంటే ఏమిటి? ఇది అంత సులభంగా తేల్చగలిగే ప్రశ్న కాదు. స్థూలంగా గ్రహిస్తే సంఘానికి ఉండే కట్టుబాట్లు దీనిని నిర్ధారిస్తాయి. పాపమంటే ధర్మాధర్మ విచక్షణ కోల్పోయి మర్యాదలను అతిక్రమించడం. ఇతరులను పీడించడం. అలాంటి సందర్భాలలో–ఇది చేయదగినదని, ఇది తగనిదని తేల్చి చెప్పడానికి ఎంత పరిపక్వత కావాలి! అలా దారి చూపే తోడు దొరకడం ఎంత భాగ్యం! మరి ధర్మమంటే ఏమిటి? అది చాలా సూక్ష్మమైన అంశం. ఉదాహరణకు ఒక దృశ్యాన్ని చూద్దాం. ఒక వైద్యుడు ఉన్నాడు. శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. ఆయన తన విధిని తాను నిబ్బరంగా నిర్వహించాలి. తమ బంధువులను ఆపరేషన్ టేబుల్ పైన చూసి–ఈ హింస చేయలేను. ఆయన నన్ను గారాబంగా పెంచిన తాత–ఆమె నన్ను లాలించిన మేనత్త–వీడు ఫలానా–ఆమె ఫలానా–వీరి ఒంటిమీద చిన్న గాయమైనా తట్టుకోలేను. వీళ్ళని కత్తితో ముట్టుకోలేను–అని పరికరాలను పక్కన పడేసి వెళ్లాడనుకోండి. అది ధర్మమెలా అవుతుంది? రోగిని రక్షించడానికి చేసే శస్త్ర చికిత్స హింస కాదు. అది విధి. ధర్మం అతి సూక్ష్మం. మరో సంగతి–మిత్రులతో వ్యక్తులు ఎన్నో రహస్యాలను పంచుకుంటారు. కుటుంబ సభ్యులకు కూడా చెప్పని విషయాలను మిత్రులకు చెప్పుకుంటారు. అలా పంచుకోవాలంటే ఎదుటి వ్యక్తిపై ఎంతో నమ్మకం ఉండాలి. అంతగా నమ్మి ఒక వ్యక్తి తన అంతరంగాన్ని పంచుకున్నప్పుడు ఆ విశ్వాసాన్ని ఛిద్రం చేయకూడదు వాటిని తెలిసిన మిత్రులు ఆ రహస్యాలన్నింటిని బట్టబయలు చేసి నవ్వుల పాలు చేయరాదు. ఆ బలహీనతల గురించి ప్రకటించరాదు. గుణాల గురించేచెప్పాలి. ఒకవేళ ఏదైనా సందర్భంలో కష్టాలు కమ్ముకుని వస్తే ఇకవీరితో మనకేం పని అని మిత్రులను ఒంటరిగా చేసి వదిలేయరాదు. వెంట ఉండి కాపాడాలి. లేమి సమయంలో అవసరమైన వాటిని సమకూర్చాలి. మంచి మిత్రుల స్వభావం ఇది–అని పెద్దలు చెబుతారు. దీనినే ఏనుగు లక్ష్మణ కవి తేట మాటల్లో అన్నాడు :

**అఘము వలన మరల్చు హితార్థ కలితు జేయు గోప్యంబు దాచు బోషించు గుణము**
**విడువ డాపన్ను లేవడి వేళనిచ్చుమిత్రుడీ లక్షణంబుల మెలగు చుండు**

ఈ స్నేహబంధంలో ఎన్నో చిత్రాలు జరుగుతాయి. తమ ఉన్నతికి మిత్రులు వెంట నిలుస్తారు. దీనికి తార్కాణంగా ఒక చారిత్రక ఉదంతాన్ని గుర్తు చేసుకుందాం. 18వ శతాబ్దిలో తమిళనాడులోని శివగంగను రాణి వేలునాచియార్ పరిపాలిస్తూ ఉండేది. ఆమె బ్రిటిష్ వారి పెత్తనాన్ని ఎదిరించిన వీర వనిత. ఆమె భర్తను బ్రిటిష్ వారు విచక్షణా రహితంగా చంపేశారు. తన జీవితాన్ని ముక్కలు ముక్కలు చేసిన ఈ సంఘటనతో రాణి విషాదానికి లోనైంది. అయినా కూడా చెదిరిపోని గుండె ధైర్యంతో బ్రిటిష్ వారిపై ప్రతీకారానికి పూనుకుంది. దానికోసం ఆమె ఒక సైన్యాన్ని తయారు చేసుకుంది. పోరుకు దిగింది . ఇంత ప్రతాపంతో ఎదిరించడానికి

పూనుకున్న ఆ సైన్యాన్ని నడిపినవ్యక్తి ఎవరో కాదు. రాణికి అత్యంత ప్రియతమ మిత్రురాలైన కుయిలీ. తనమిత్రురాలికి ఏ ఆపద రాకుండా పక్కనే నిలబడింది. ఒకరు రాణి, మరొకరు సేనాని. అయినప్పటికీ వారిద్దరి మధ్య అంతరాలను చెరిపిన అద్భుతమైన స్నేహం ఉండేది. రాణికి ఎన్నోసార్లు కుయిలీ రక్షణగా నిలిచింది. అలాగే నాచియార్ రాణికి కూడా కుయిలిపట్ల ప్రేమ ఉండేది.

ఒకానొకసారి నాచియార్‌ను కాపాడడంలో కుయిలికి తీవ్ర గాయం అయింది. వెంటనే రాణి తన చీరను చించి ఆ బట్టతో కట్టు కట్టింది. ఆనాటి వ్యవస్థలో వీరి స్నేహం చర్చనీయాంశం అయింది కూడా. ఇలా ఉండగా ఒకసారి బ్రిటిష్ వారు కోటను ముట్టడించారు. బ్రిటిష్ వారి వద్ద ఆధునిక ఆయుధాలు ఉన్నాయి. ఎదిరించడానికి రాణివద్ద ఉన్న ఆయుధాలు చాలడం లేదు. నమ్ముకున్న ధనుస్సు, కత్తి వంటివి శత్రువుల ముందు నిలబడలేకపోతున్నాయి. రాణి పరిస్థితి ఆపదలో పడింది. ఆమెను కాపాడడానికి కుయిలి ముందు కురికింది. మందు గుండు సామగ్రితో దుందుడుకుగా దూసుకొస్తున్న శత్రు సైన్యాన్ని కుయిలి గమనించింది. వీరిని ఎదిరించడానికి మరో మార్గం లేదనుకుంది. ప్రాణాలకు ప్రమాదమైనా సరే సాహసానికి పూనుకుంది. ఇప్పుడు తాను ఒక వ్యక్తి కాదనుకుంది. శత్రువుల నెదిరించవలసిన భయానకశక్తిననుకుంది. నూనెలో, నెయ్యిలో తడిపిన బట్టలను తెప్పించింది. చుట్టలు చుట్టలుగా తన చుట్టూ కట్టుకుంది. వాటికి మంట పెట్టింది. శత్రువుల వైపు మంటలతో పరుగులెత్తింది. మండే అగ్నిగోళం తమవైపు వస్తుందని, మందు గుండు సామగ్రి అంటుకుంటే మసైపోతామని శత్రు సైన్యం కకావికలై పరిగెత్తింది.

మంటల జుట్టు విరబోసుకున్న మృత్యుదేవిలాగా కుయిలి శత్రు సైన్యంలోకి దూకింది, వారు భయంతో చెదిరిపోయారు. నాచియార్ సైన్యం ఆ దృశ్యాన్ని చూస్తూ అపూర్వమైన కుయిలి శౌర్యానికి జేజేలు పలికింది. ఈ ప్రయత్నంలో ఆమె అగ్నికి ఆహుతయి పోయింది. తన మిత్రురాలయిన రాణిని కాపాడడానికి ప్రాణాన్ని పణంగా పెట్టింది. రాణికి కోట దక్కింది. కానీ కుయిలి మసైపోయింది. ఆపదలో విడువని ఆ మైత్రీ బంధం చరిత్రలో నిలబడిపోయింది.

**క్షీరేణాత్మగతోదకాయ హి గుణా దత్తాః పురా తేఖిలాః**
**క్షీరోత్తాపమవేక్ష్య తేన పయసా స్వాత్మాకృశానౌ హుతః**
**గంతుం పావక మున్మనస్తదభవద్దృష్ట్వా తు మిత్రాపదం**
**యుక్తం తేన జలేన శామ్యతి సతాం మైత్రీ పునస్త్వీదృశీ**

మిత్ర లక్షణాన్ని మరింత వైభవీకరిస్తూ , పాలు నీళ్లను దృష్టాంతంగా చూపి కవి అంటున్నాడు. పాలతో నీళ్లు కలిసినప్పుడు పాలలాగా మారిపోతాయి. పాలలో ఉండే కమ్మదనం నీటికి కూడా కలుగుతుంది. తెల్లదనం కూడా అబ్బుతుంది. జనం నుండి ఆదరణ, అభిమానం కూడా లభిస్తాయి. ఇదంతా మిత్రతా ఫలితం. వాటి బలం వాటి బంధమే. ఇలా ఉండగా, పాలను మరిగించడానికి మంట మీద ఉంచారు. దీనిని గమనించిన నీరు తాళలేకపోయింది. తన మిత్రుడికి కలిగిన ఆపదను గురించి మథనపడింది. 'నాకు ఇంతటి స్థానం కలిగించిన మిత్రుడికి ఎంత చేటు కలుగుతోంది' అని దిగులు పడింది. తపించింది. అగ్నికి తనను తాను అర్పించుకొని ఆవిరైపోయింది. దీనిని పాలు గమనించాయి. దేవుడా నాకు తోడుగా నిలిచిన మా మిత్రుడు ఇక లేడా అని పాలు దిగులు పడింది.

నా మిత్రుడు లేని జీవితం నాకెందుకు నేను అతడిని అనుసరిస్తాను అని పైకి ఎగసి మంటల్లోకి దూకపోయింది. అప్పుడు నీళ్ళు మళ్ళీ చేరాయి. పాలు ఊరడిల్లింది. మిత్రులు ఒకరి బాధను తాళలేక మరొకరు ఆత్మ త్యాగానికైనా వెనకాడరు అని ఈ దృష్టాంతం చెబుతుంది.

**క్షీరము మున్ను నీటికొసగెన్ స్వగుణంబులు దన్ను జేరుటన్**
**క్షీరము దప్తమౌట గని చిచ్చురికెన్ వెతచే జలంబు దు**
**ర్వార సుహృద్విపత్తి గని వహ్ని జొరం జనె దుగ్ధ మంతలో**
**నీరము గూడి శాంతమగు నిల్చు మహాత్ముల మైత్రి ఈ గతిన్**

ఇక్కడ కవి చెప్పినదంతా రోజువారి వ్యవహారమే. పాలు పొంగడానికి సిద్ధమైనప్పుడు నిప్పుల్లోకి దూకబోతున్నట్లు ఉంటుంది. నీళ్ళు చల్లగానే ఆ పొంగు తగ్గి పాలు మళ్ళీ వెనక్కి వెళతాయి. ఆ దృశ్యాన్ని తీసుకుని జీవన సత్యాన్ని కవిచెబుతున్నాడు. ఇంకో చతురత ఉంది. స్నేహమనే మాటకు నూనె అని అర్థం కూడా ఉంది. అది దీపాన్ని వెలిగేలా చేస్తుంది. స్నేహం కూడా అంతే-జీవితాన్ని వెలిగిస్తుంది.

**ఆచార్య పి. ఆర్. హరినాథ్,**
తెలుగు ఆచార్యులు, రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్,
మైసూర్, ఫోన్ : 948 044 3108

# బెలరూస్

(మొదటి భాగం)



బెలరూస్ నగరం

ఆంగ్లం – డా. నిమ్మగడ్డ శేషగిరి రావు

తెలుగు – శ్రీమతి అట్లూరి జయశ్రీ

**ఒ**కానొకప్పుడు.. అంటే మరీ అంత కాదు కానీ.. ఈ మధ్య, ఈ మధ్య కాలం వరకు.. మనలాంటి వాళ్ళ మనసులోకి కూడా రాని.. మరీ మాట్లాడితే అవేవో గ్రహాంతర ప్రదేశాలేమో అనిపించిన దేశాలు కొన్ని ఉన్నాయి. అక్కడికి వెళ్ళటం నాలాంటి సామాన్యులకు కలలో కూడా అందుబాటులో ఉండేది కాదు.

1970లలో.. బాల్యం వీడి.. వివేచన, ఆలోచన పెంచుకునే ప్రాయంలో ఉన్న నాలాంటి వారికి.. భూగోళంలో సగభాగం పొడవునా 'యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్స్' అన్న పేరు చదువుతూ, దాని వైశాల్యం చూసి విభ్రాంతి పడటం, దాని గురించి చదవటం, దాని వైభవం గురించి ఊహించుకోవటం.. అదంతా మామూలే. దానికి తోడు.. ఇండో-సోవియట్ బాంధవ్యం బహు 'బాగు బాగు'గా ఉండేది అప్పట్లో. దళసరి నూనె కాగితం మీద మెరిసే రంగు రంగుల బొమ్మలతో.. దాదాపు ఉచితంగా దొరికే సోవియట్ పత్రికలు, మా ఊహలకు రెక్కలు తొడిగేవి. 15 స్వతంత్ర్య దేశాల కలయికతో ఏర్పాటైన ఆ కమ్యూనిస్టు దేశం ప్రపంచ రాజకీయాలను గుప్పిట బిగించగలిగిన మహాశక్తి అని మాత్రం మాకు అప్పటికే అర్థమయింది. అప్పుడే అమెరికా ఆధ్వర్యాన ఏకమైన పెట్టుబడిదారీ వర్గం, యు.ఎస్.ఎస్.ఆర్. కమ్యూనిస్ట్ పంథాను సమర్థించే వర్గాల మధ్య ఒక ప్రచ్ఛన్న యుద్ధం సాగుతోందని, అందులో భాగంగానే.. పాక్ భారత్‌ల మధ్య ఉన్న కురు-పాండవ మాత్సర్యాలను పురస్కరించుకుని అమెరికా పాకిస్థాన్‌ను సమర్థించటం, యు. ఎస్. ఎస్. ఆర్. భారత్ వైపు నిలబడటం.. ఆనాటి ప్రపంచ రాజకీయ నాటక రంగం మీద మాకు ప్రదర్శితమయ్యాయి. నాలాంటి కుర్రవాళ్లకు యు. ఎస్. ఎస్. ఆర్. మన మిత్రదేశం. ఆ 'గర్జించే రష్యా' మనకు అండా దండా.. అన్నీ. దాని విశాల, విశేష, వైభవం, దాతృత్వం, మిత్రుత్వం, ఉదారత్వం.. వీటన్నిటి దృష్ట్యా... మాకు బుర్ర నిండా ఎర్ర జెండా.

అది 1985వ సంవత్సరం. నాకింకా బాగా గుర్తుంది. అప్పటికి ఇంకా ఈ ఇంటర్నెట్ లేదు. అంతర్జాతీయ వార్తలు అంతగా వెంటనే తెలిసేవి కావు. కానీ అప్పుడే టెలివిజన్ భారత దేశపు గ్రామాల పొలిమేరలకు వచ్చింది. నెమ్మదిగా భారత ప్రభుత్వపు 'దూర దర్శన్' మొదలయింది. అందులో ప్రసారమయ్యే ఇంగ్లీష్ వార్తలను మాత్రం నేను తప్పకుండా చూసేవాడిని. యువకుడు, ఉత్సాహవంతుడు అయిన రాజీవ్ గాంధీ అప్పటి ప్రధానమంత్రి. అతని విదేశీ పర్యటనలు టి.వి.లో ప్రసారమయినప్పుడు, చూపించిన ఆ సుదూర ప్రాంతాలు నాకు చాలా విశేషంగా కనిపించేవి. అట్లా రాజీవ్ గాంధీ బెలరూస్ వెళ్ళినప్పుడు, టి.వి.లో చూపించిన మిన్స్క్, నా మనసులో శాశ్వతంగా నిలిచి పోయింది. బెలరూస్‌తో అదే నా తొలి పరిచయం. ఆ తరువాత చాలాకాలం అది నా ఊహలలో మెదిలే విభ్రమ సామ్రాజ్యం. అప్పట్లో..ఏదో ఒక రోజు నేను కూడా ఈ ప్రాంతాలకు వెళ్ళగలుగుతానని

నేను అనుకోలేదు. బెలరూస్‌కు మరో పేరు 'బైలో రష్యా'. అంటే తెల్లని రష్యా అని.

2019లో, దాదాపు ఈ ప్రయాణానికి ఒక సంవత్సరం ముందు, ఒక వారాంతంలో తీరికగా ప్రపంచ పటం ముందేసుకుని, నా తరువాత ప్రయాణం ఎక్కడికని ఆలోచిస్తుంటే, నాకు మూడు దేశాలు స్ఫురించాయి. ఐరోపా ఖండపు సరిహద్దులలో అప్పటివరకు నేను అడుగుపెట్టని దేశాలు.. బెలరూస్, ఉక్రెయిన్, మాల్డోవా.. రష్యా దేశపు పడమటి అంచు అవి. ప్రవేశించటానికి అంత తేలికగా అనుమతి దొరకని దేశాలు యాత్రికుల ఉత్సాహాన్ని నీరుగార్చటం కద్దు. ఈ దేశాలకు నేను ఇంత వరకు వెళ్లకపోవటానికి ఇదే కారణమై ఉంటుంది.

ఆ పాటికే ఉక్రెయిన్, మాల్డోవాలు, యూరోపియన్ యూనియన్‌లో ఉన్న వారికి, బ్రిటిష్ పాస్ పోర్ట్ ఉన్నవారికి ప్రవేశ నిబంధనలను సడలించాయి. ఇంకా ఈ మధ్య కాలంలోనే, బెలరూస్, మాల్డోవా నుండి విడిపోయిన ట్రాన్సిస్ట్రియా కూడా వీసా నిబంధనలను సరళం చేశాయి. దీనితో నాలాంటి యాత్రికులకు, ఈ దేశాలను చూడాలనే ఉత్సాహం పెరిగింది. ఒక ప్రహేళికలో విడి భాగాలుగా ఉన్న ఈ కారణాలన్నీ, ఆ వారాంతం ఒక చోట కూడి, నా మరుసటి యాత్రగా రూపుదిద్దుకున్నాయి. పైగా అంతరించిన సోవియట్ యూనియన్ అవశేషాలు, బెలరూస్‌లో పటం కట్టబడి భద్రంగా ఉన్నాయట. మాల్డోవాలో భాగంగా ఉండి, తరువాత విడిపోయిన ట్రాన్సిస్ట్రియా, కాలంలో ఘనీభవించిన ఒకప్పటి సోవియట్ యూనియన్‌లానే ఉంటుందని వినికిడి. కాలంలో వెనుకకు వెళ్లగలిగే శక్తి మనకు లేనప్పుడు, ఇటువంటి సౌకర్యం దొరికినప్పుడు వదులుకోకూడదనుకుని.. వెంటనే ఈ దేశాలకు వెళ్ళాలనే నిర్ణయం తీసుకున్నాను. ఈ యాత్రా కాలం ఆగస్ట్ 2019. ఒంటరి ప్రయాణంలో, మన చుట్టూ ఇతర రొద ఏమీ లేకుండా.. చూసిన ప్రదేశాలలో విన్న విషయాల మీద లోతైన ఆకళింపు కలుగుతుంది. ఇది నా అనుభవం. ఈ ప్రయాణం ఒంటరిగానే చేయటానికి నిర్ణయించుకున్నాను. నేను ముందస్తుగా చేసుకున్న ఏర్పాటు, లండన్ నుండి బెలరూస్ రాజధాని మిన్స్క్ నగరానికి, మళ్ళీ రెండు వారాల తరువాత ఉక్రెయిన్‌లోని ఒడెసా నగరం నుండి లండన్‌కు విమాన ప్రయాణం మాత్రమే. మిగిలినవన్నీ ఎక్కడి నిర్ణయాలు అక్కడే.

లండన్ గాట్విక్ విమానాశ్రయంలో నాకొక మిత్రుడు దొరికాడు. అతని పేరు ఆండ్రీ. బెలారశియన్. మిన్స్క్ కేంద్రంగా పనిచేసే ఇపామ్ సిస్టమ్స్ అనే సమాచార సాంకేతిక (ఐ. టి.) సంస్థలో ఉద్యోగి. ప్రస్తుతం ఈ కంపెనీ లండన్ విభాగానికి పనిచేస్తున్నాడట. అతను నేను కూడా ఐ. టి. ఉద్యోగినే అనుకున్నాడట. ఎప్పుడైతే నన్ను నేను, అతని దేశం చూడటం కోసమే వస్తున్న వ్యక్తిగా పరిచయం చేసుకున్నానో, అప్పుడు అతనికి నా మీద ఆసక్తి పెరిగింది. అక్కడ తీసుకోవలసిన జాగ్రత్తలనుండి, చూడవలసిన విశేషాలు, వెళ్ళవలసిన రెస్టారెంట్లు, తప్పకుండా చేయవలసిన కార్య క్రమాలు, ఇలా ఎన్నో విషయాల మీద మా మధ్య సంభాషణ నడిచింది.

నేను ప్రయాణం చేసిన విమాన సంస్థ, బెలరూస్ జాతీయ విమాన సంస్థ అయిన బేలావియ. అదొక చిన్న విమానం. లోపల నడిచే దారికి అటు రెండు, ఇటు రెండు సీట్లు మాత్రమే ఉన్నాయి. సర్దుకుని కూర్చున్న తరువాత, నా ప్రక్క సీటులో హుందాగా కనిపిస్తున్న యువతి, (వయసు ముప్పైలలో ఉంటుంది), బెలరూస్ వ్యాపార నిమిత్తమై వెళుతున్నారా? అంటూ పలకరించింది. కాదు, మీ దేశం చూడటానికి వస్తున్నాను అని నేను చెప్పినప్పుడు, ఆశ్చర్యపోయి, అందుకు ప్రేరేపణ ఏమిటని అడిగింది. అది కేవలం బెలరూస్ చూడాలనే కోరిక మాత్రమేనని నేను చెప్పినప్పుడు కూడా ఆమె పూర్తిగా సమాధాన పడినట్లు నాకు కనిపించలేదు. ఆమె పేరు తతియానా.

తతియానా మిన్స్క్లో పుట్టి పెరిగిన బెలోరశియన్. విద్యార్థినిగా లండన్ వచ్చి, ప్రస్తుతం అక్కడే ఒక బాంకులో పనిచేస్తోందట. తన పిల్లలకు ఇంగ్లీష్, రష్యన్ భాషలు రెండూ నేర్పుతుందట. తతియానా తాను రష్యన్ అని చెప్పుకుంటూ, రష్యన్, బెలోరసియన్లకు పెద్ద తేడా లేదని తను నమ్ముతుందని చెప్పింది. కానీ ప్రస్తుతం ఉన్న బెలోరసియన్లు ముఖ్యంగా అక్కడి యువత ఈ నమ్మకానికి వ్యతిరేకమని చెప్పింది. 90% బెలోరసియన్లు రష్యన్ మాట్లాడగలుగుతారట. ఒక 10% మాత్రమే బెలోరసియన్ భాష ఒక్కటే మాట్లాడుతారట. గ్రామ ప్రాంతాలలో బెలోరసియన్ వాడుక భాష. అయితే, పట్టణాలలో మాత్రం రష్యన్ ఎక్కువగా వినిపిస్తుందట. ఇప్పటికీ కూడా బెలారూస్, రష్యాకు మిత్ర దేశమేనని, చాలా విషయాలలో రష్యా సలహా అనుసరిస్తుందని తతియానా చెప్పింది.

ఆమెకు బ్రిటిష్ పాస్ పోర్టుతో పాటు, బెలోరసియన్ పాస్ పోర్టు కూడా ఉండటంతో, తనకు రష్యా వెళ్ళి రావటం సులభమని చెప్పింది.

మా మూడున్నర గంటల ప్రయాణంలో తతియానా, ఇంకా ఎన్నో కబుర్లు చెప్పింది. నేను వింటూ కూర్చున్నాను. బెలరూస్‌లో పెరిగిన ఆ యువతికి, వయసుతో పాటు అమెరికన్లు, బ్రిటిష్ వారి పట్ల అయిష్టత కూడా పెరుగుతూ వచ్చిందట. కాని బ్రిటన్‌లో చదువుకుంటూ, బ్రిటిష్ యువకుడిని ప్రేమించి, భర్తగా స్వీకరించటం, పోయి పోయి లండన్లో స్థిరపడటం అప్పట్లో ఆమె బంధువులకు, స్నేహితులకు నమ్మశక్యం కాని విషయమయిందట.

స్పర్థ స్నేహితులను విడదీస్తుందని, ప్రేమ శత్రువులను కూడా కలుపుతుందని నేను అనటంతో, ఆమె ముఖంలో చిరునవ్వు విరియటం నేను గమనించాను.

సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమవటం గురించి ఆమె బాధ పడింది. మిఖాయెల్ గోర్బచేవ్ ఒక పాశ్చాత్య దేశాల ప్రతినిధి అంటూ తృణీకరించింది. ఆ కాలంలో వచ్చిన మార్పు రావలసిందే అయితే, సహజంగానే ఎటూ వచ్చి ఉండేదని అంటూ, గోర్బచేవ్ ఈ విషయాన్ని హాస్యాస్పదం చేసి, రష్యా పరపతిని దిగజార్చాడని, జాతి గౌరవాన్ని మంట గలిపాడని వాపోయింది. ఆనాటి సోవియట్ యూనియన్ కోసం తను పరితపిస్తున్నానని చెపుతూ, అది కమ్యూనిస్ట్ వ్యవస్థ గురించి కాకపోయినా, రష్యన్ సామ్రాజ్యంగా విలసిల్లిన యు.ఎస్.ఎస్.ఆర్. ప్రాభవం కోసమని నొక్కి చెప్పింది. ఒక దేశపు అంతర్జాతీయ ప్రాబల్యం, ముఖ్యంగా యు.ఎస్.ఎస్. ఆర్. ఉపమానంతో, అక్కడ నివసించే ప్రజలకు ఎంతటి గర్వ కారణమో నాకు అప్పుడు పూర్తిగా, ప్రత్యక్షంగా అర్థమయింది.

1980–90లలో కమ్యూనిజం ఎదుర్కొన్న సంక్షోభాన్ని, చైనా ప్రభుత్వ నియంత్రణలో నడిచే పెట్టుబడిదారీ రాజ్యంగా మార్చుకుని సమర్థవంతంగా సమర్థించుకు వచ్చిందని, అది రష్యాకు అప్పుడు సాధ్యం కాక, విచ్ఛిన్నమయిందని అంటూ, అప్పుడు గోర్బచేవ్ బదులు పుతిన్ నాయకుడిగా ఉండి ఉంటే, రష్యా న్యూక్లియర్ శక్తితో కూడిన మరొక మహత్తర పెట్టుబడిదారీ దేశం అయి ఉండేదని కూడా ఆమె అభిప్రాయపడింది. నాకు ఇదొక ఆసక్తికరమైన ఆలోచనా విధానంగా అనిపించింది.

రష్యాకు పుతిన్ వంటి నాయకుడు అవసరమని అంటూ.. భారతీయులు ఇంకా వెనుకటి సోవియట్ శకంలో లానే, రష్యాను మిత్ర దేశంగానే భావిస్తున్నారా? అని అడిగింది. అంతర్జాతీయ రాజకీయాలు ఎట్లా ఉన్నా భారతీయులు రష్యాతో సత్సంబంధాలను గౌరవిస్తారని, ప్రత్యేకించి నా తరం భారతీయులకు రష్యా అంటే ప్రత్యేకమైన అభిమానం అని తతీయానాకు మనస్ఫూర్తిగా తెలిపాను. సాధారణంగా నేను క్రొత్త వారితో, ముఖ్యంగా స్థానికులతో మాట్లాడేటప్పుడు రాజకీయ వాదనలకు దూరంగా ఉంటాను. కానీ ఇప్పుడు మాత్రం ఉక్రెయిన్, క్రిమియా దేశాలలో రష్యా ప్రమేయాన్ని గురించి తతీయానాను అడిగాను. తరువాత ఆమె అడిగిన అసంఖ్యాక ప్రశ్నలకు నేను సమాధానం ఇవ్వలేక పోయాను. ఉక్రెయిన్‌లో రష్యా చర్యల గురించి మాట్లాడుకునే ముందు, మెక్సికో, కెనడా దేశాలు రష్యాతో మిత్రుత్వం గరపి, ఆ దేశాలలో రష్యా సైనిక స్థావరాలను ఏర్పాటు చేయనిస్తే, అమెరికా, ఇంకా దాని మద్దత్తు దారులు ఎట్లా మాట్లాడి ఉండేవారని నన్ను అడిగింది. అదే విధంగా, స్కాట్ల్యాండ్, వేల్స్ కూడా చేసి ఉండి ఉంటే, ఇంగ్లాండ్ అభిప్రాయాలు, చర్యలు ఎట్లా ఉండి ఉండేవని కూడా అడిగింది.

సువిశాల సోవియట్ సామ్రాజ్యం కళ్ళముందే కరగి పోయిన వైనం, రష్యన్ల మనోభావాలను దెబ్బతీసి, ప్రపంచ రాజకీయ పటం మీద రష్యా ఒంటరిగా మిగిలిపోయిందనే మనోవైకల్యంతో ఉన్న సమయంలో పుతిన్ నాయకునిగా అవతరించాడనేది తతీయానా అభిప్రాయం. ఇదంతా ఇంకా పూర్తవక ముందే, విమాన సిబ్బంది గమ్యం చేరబోతున్నామని ప్రకటించారు. నేను ఆ మిగిలిన కొద్ది సమయాన్ని, మిన్స్క గురించి తెలుసుకోవలసిన విషయాల మీదకు మళ్లించాను. చాలా విషయాలమీద తతీయానా నాకు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చింది.

విమానం దిగిన తరువాత ఆండ్రీ మళ్ళీ కనిపించాడు. మీ ఇన్సూరెన్స్ కాగితాలు రెడీగా ఉంచుకున్నారా అని నాకు గుర్తుచేశాడు. నా ఇన్సూరెన్స్ నా బ్యాంక్ వారితో కాబట్టి, దానికి సంబంధించిన కాగితాలేమీ నా దగ్గర లేవు. వాటిని చూపించాలంటే నా ఫోన్ ఒక్కటే మార్గం. నా ఫోన్ ఈ దేశంలో పనిచేయదు కనుక విమానాశ్రయ సిబ్బంది నా ఇన్సూరెన్స్ డాక్యుమెంట్లు చూపించవలసిందే అంటే, నాకు తిప్పలు తప్పవు అనుకున్నాను. యు.కె. విదేశీ

వ్యవహార శాఖ వెబ్ సైట్‌లో ఈ విషయం కొంచెం చూసి చెప్పని ఆంద్రీని అడిగాను. అక్కడ చాలా స్పష్టంగా, బెలరూస్ ఇమ్మిగ్రేషన్ వారికి ట్రావెల్ ఇన్సూరెన్స్ ధృవ పత్రాలు చూపాలి అని ఉంది. నేను ఈ ప్రయాణానికి ఎంత నిర్లక్ష్యంగా వచ్చానో నాకు అర్ధమయింది. ఇంకో యూరోపియన్ దేశం వెళుతున్నాను.. అంతే కదా అనుకుని, బాగ్‌లో నాకు అత్యవసరంగా కావలసిన వాటిని మాత్రమే పెట్టుకుని విమానం ఎక్కేసాను. బెలరూస్ ఇంకా సోవియట్ యూనియన్ కాలం నాటి బ్యూరోక్రాటిక్ కట్టుబాట్లను అనుసరిస్తోందని నేను ఊహించలేదు.

ఆంద్రీకి నా పరిస్థితి అర్ధమయింది. తన దేశం చూడటానికి వచ్చిన తన కొత్త మిత్రుడి సమస్య తీర్చాలని, మా ముందున్న వారిలో కొంత మందిని సలహా అడిగాడు. ఇమ్మిగ్రేషన్ వద్ద ఉన్న ఒక బూత్‌లో, నాలాంటి వారికి బెలరూస్లో ఉన్నన్ని రోజులకు ఇన్సూరెన్స్ అమ్ముతారని తెలిసింది. నా అజాగ్రత్తకు తగిన శాస్తి చేయటానికి, నా గోళ్ళూడ గొట్టి ఫీజు వసూలు చేస్తారనేది ఖాయం అనుకున్నా, చేసేది ఏముంది? ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద ఉన్న మహిళ, నన్ను నా పాస్ పోర్టులో ఉన్న ఫోటోతో సరిపోల్చి, సంతృప్తి పడి, ట్రావెల్ ఇన్సూరెన్స్ డాక్యుమెంట్లు చూపించమంది. నా సమస్య చెప్పగానే పక్క కౌంటర్‌కు వెళ్ళి ఇన్సూరెన్స్ తీసుకుని మళ్ళీ రమ్మని చెప్పింది.

ఇక అక్కడికి వెళ్ళక తప్పలేదు. అక్కడ ఫీజు వివరాలు ఒక చిన్న బోర్డు మీద ఉన్నాయి. రోజుకు ఒక యూరో చొప్పున కట్టి ఇన్సూరెన్స్ తీసుకుంటే, 10000 యూరోల వరకు భద్రత లభిస్తుందని ఉంది. అది నాకు అంత తేలికగా నమ్మశక్యం కాలేదు. కాని, అప్పటివరకు ఈ విషయం గురించి నేను పడిన బాధ తీరిపోయింది. బెలరూస్ నాకు బాగా నచ్చటం ఆ క్షణంలోనే మొదలయింది. దానితో, అంతకు ముందు నన్ను అనుమానంగా చూస్తోందనుకున్న వీసా అఫీసర్ ఇప్పుడు నవ్వుతూ నన్ను తన దేశంలోకి ఆహ్వానిస్తున్నట్లు కనిపించింది.

నా మిత్రుడు ఆంద్రీ నాకు వీడ్కోలు చెప్పటానికి కొంచెం దూరంలో ఉన్నాడు. అతనిని కరెన్సీ ఎక్స్ఛేంజి ఎక్కడ ఉంటుందని అడిగాను. సాధారణంగా నేను విమానాశ్రయంలో ఒక 100 యూరోలో, డాలర్లో.. టాక్సీ ఖర్చుల కోసం స్థానిక కరెన్సీలోకి మార్చుకుని, మిగతావి ఊళ్ళోకి వెళ్ళిన తరువాత మార్చుకుంటాను. కాని అప్పటి టైమ్ రాత్రి 9 గంటలు దాటిపోవటం వలన కరెన్సీ ఎక్స్ఛేంజిలు మూసేశారు. మళ్ళీ ఆంద్రీ సహాయం నాకు తప్పనిసరి అయింది. నా దగ్గర ఉన్న కొన్ని యూరోలను తాను తీసుకుని, వాటికి సరిపడా స్థానిక కరెన్సీ నాకు ఇచ్చాడు. అంతే కాకుండా, దిగిన తరువాత మళ్ళీ కరేన్సీ సమస్య రాకుండా, ముందే చార్జి చెల్లించి నన్ను నా హొటల్‌కు చేర్చటానికి టాక్సీ కూడా ఏర్పాటు చేశాడు. నా అనుభవంలో మనం ఏ కొత్త ప్రాంతానికైనా వెళ్ళినప్పుడు, అక్కడ తారస పడిన మొదటి వ్యక్తి, ఆ ప్రాంతం గురించి సరైన అంచనా ఇస్తాడు. ఆంద్రీ నన్ను ఒక అతిధిలా స్వాగతించి గౌరవించాడు. నా హొటల్‌కు దాదాపు 40 కి.మీ. ప్రయాణం. ఒక గంట పట్టింది. నా హొటల్ 'మోనాస్టెరిస్కీ' పాద చారులకు మాత్రమే ప్రవేశం ఉన్న వీధిలో ఉంది. టాక్సీ దిగి, ఆ శుక్రవారం రాత్రి, పది గంటలు దాటాక కూడా జీవంతో వెలిగిపోతున్న 'మిన్స్క్' పాత బస్తీ వీధులు దాటుకుంటూ హొటల్ చేరాను. సుమారు 2 మిలియన్ల జనాభాతో నిండి ఉన్న మిన్స్క్, యూరోప్ పెద్ద నగరాలలో 11వ స్థానంలో ఉంది. బెలరూస్ మొత్తం జనాభా 10 మిలియన్లు.

బెలరూస్ ఒక భూపరివేష్టిత దేశం. ఈశాన్యాన రష్యా, ఉత్తరాన లిథుయేనియా, లాత్వియా, పశ్చిమాన పోలాండ్, దక్షిణాన ఉక్రైన్ దేశాలతో చుట్టబడి ఉంది. వైశాల్యంలో ఈ దేశం, యు. కె. భూభాగంలో 75% ఉంటుంది. అంటే సుమారు మన గుజరాత్ రాష్ట్రమంత. అమెరికాలో నెబ్రాస్కా అంత. సంవత్సరానికి $8000 తలసరి ఆదాయంతో, మధ్య తరగతి దేశంగా పరిగణించబడుతుంది. కానీ, మానవ అభివృద్ధిని ఆయురారోగ్యాలు, విద్య ప్రమాణాలు, జీవన ప్రమాణాలతో కొలిచే సూచిక (హెచ్. డి. ఐ.) ప్రకారం చూస్తే ఈ దేశం ఉన్నత స్థాయిలో నిలుస్తుంది.

నా హొటల్ మోనాస్టెరిస్కీ, ఒక పునరుద్ధరించబడిన 17వ శతాబ్దపు మోనాస్టరీ. ఇక్కడ ఉండటానికి, నాకు అనుకూలమైన హొటళ్ల కోసం వెతికినప్పుడు, ఈ హొటల్ చారిత్రక ప్రాధాన్యత నన్ను ఆకట్టుకుంది. ఉండటానికి ఈ కాలపు సదుపాయాలన్నీ ఉన్నప్పటికీ, ఈ భవనపు నిర్మాణ శైలి, ఎత్తు తక్కువగా, డోమ్ లాంటి పై కప్పుతో ఉన్న నడవాలతో, ఋషులు, సన్యాసులు నివసించిన చిన్న చిన్న గదులతో పాతకాలపు మోనాస్టరీలానే ఉంది. మరుసటి రోజు ఉదయం, ఆ హొటల్ మేనేజర్

చెప్పిన సమాచారం ప్రకారం, ఆ భవనం జార్ చక్రవర్తుల కాలంలో, ఆ తరువాత సోవియట్ల కాలంలో కారాగారంగా వాడబడేదనీ, రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జర్మన్ ప్రభుత్వ రహస్య పోలీస్ శాఖ వారిచే ఉపయోగించు కోబడిందనీ తెలిసింది. ఆ భవనపు పునరుద్ధరణ కార్య క్రమంలో అతనికి చురుకైన పాత్ర ఉందట. ఆ క్రమంలో అక్కడ కొన్ని గుర్తు తెలియని, అనామక అస్తి పంజరాలు దొరికాయని ఆ మేనేజర్ చెప్పాడు. ఆ రాత్రి నేను నా హొటల్ గది చెరేసరికి 10.30 అయింది. రెస్టారెంటు మూసేయబోతున్నారు. హడావుడిగా అక్కడకు చేరి.. ఆంద్రీ, తతీయానల నుండి సేకరించిన సమాచారాన్ని ఉపయోగించి, నా మొదటి బెలరూస్ వంటకాలను ఎంచుకున్నాను. మొదటిది, 'బోర్ష్ట్' అనబడే బీట్రూట్ సూప్, ఇంకా 'డ్రానికి' అనబడే, వేయించిన బంగాళ దుంపలతో తయారు చేసే అట్లు. వీటితో పాటు కొంచెం పులవబెట్టిన మీగడ కూడా ఇచ్చారు. నాకు ఒక చిన్న గ్లాసు వోడ్కా కూడా ఉచితంగా ఇచ్చారు. ప్రయాణపు బడలిక, అలసట, ఆకలి వీటన్నిటితోనో ఏమో కానీ, ఆ భోజనం పసందుగా ఉంది.

మరునాడు ఉదయాన్నే, జిబిట్స్క్ అనే ప్రాంతపు వీధులలో తిరిగాను. కానీ అవన్నీ నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉన్నాయి. ముందు రోజు రాత్రి ఉన్న సందడి అంతా ఏమై పోయిందో!! నా హొటల్ రిసెప్షనిస్టు ఒక చిన్న వయసు యువతి. ఈమె పేరు కూడా తతీయనా. ఆమె, ఉదయం 10.30 కు, టౌన్ హాలు నుండి నడక దారిన నగరాన్ని ఉచితంగా చూపించే టూర్లు మొదలవుతాయని చెప్పింది. అది మొదలవటానికి ఇంకా మూడు గంటలు ఉండటం వలన, నా అంతట నేనే, ఆ చుట్టూ ప్రక్కల తిరిగి చూడటానికి బయలుదేరిపోయాను. అక్కడున్న నదీ తీరం వెంబడే నడుస్తూ యాంకా కుపాల పార్కు చేరాను. 'యాంకా కుపాల' అసలు పేరు ఇవాన్ డమినికవిచ్ లుట్సేవిచ్. ఇతడు 20 వ శతాబ్దానికి చెందిన సుప్రసిద్ధ బెలరూసియన్ కవి. అతని రచనలు బెలరూస్ చరిత్ర, ప్రజా జీవితం, స్వాతంత్ర్యం కోసం వారు చేసిన పోరాటాల చుట్టూ అల్లుకుని ఉంటాయి. ఇతని రచనల వలన, సాహిత్య పరంగా బెలరూసియన్ భాష ఇతర ఐరోపా భాషలకు దీటైన గుర్తింపు పొందింది. ఆ దోవలో చాలామంది నడుస్తూ, పరుగెత్తుతూ నన్ను స్నేహంగా పలకరించారు.



యాంకా కుపాల పార్కు

ఇక్కడ నాకు పరిచయమయిన మరొక కవి, యాకూబ్ కోలాస్. ఈయన యాంకా కుపాల సమకాలికుడు. ఇతని పేరు పెట్టిన నగర కూడలికి ఆ మధ్యాహ్నం, సిటీ టూర్ తరువాత వెళ్ళాను. అక్కడ యాకూబ్ కోలాస్ విగ్రహాలు, అతని రచనలలో చోటు చేసుకున్న పాత్రల ప్రతిరూపాలు ఉన్నాయి. బడుగు వర్గపు రైతు కూలీల జీవితాలను ప్రతిబింబించే ఇతని పద్య, గద్య రచనలు, బెలరూసియన్ భాష సొబగులను పొదవుకుని ఉంటాయి. ఒక విధంగా బెలరూస్ సాహిత్య పరి భాషను క్రొత్త పుంతలు త్రొక్కించిన కవి ఇతడు. 20వ శతాబ్దంలో అక్కడి పాఠశాలలలో బెలరూస్ భాషకు ఇవ్వబడుతున్న ప్రాధాన్యత ఇతని కృషి ఫలితమే. యాంకా కుపాల, యాకూబ్ కోలాస్ లిరువురూ, బెలరూసియన్లు ఎంతో గౌరవించుకునే కవులు. మిన్స్క్ ఎన్నోచోట్ల, ఏదో విధంగా వారిని స్మరించడం నేను చూశాను. నా ప్రయాణాలలో.. చాలా దేశాలలో వారి రచనలతో జాతిని జాగృతం చేసిన కవులకు అత్యంత గౌరవం దక్కటం నేను చూశాను. వీరు భౌతికంగా మట్టిగలసి పోయినా, వారి భావ సంపద మాత్రం ఆ జాతి సంస్కృతిలో భాగంగా ఇంకిపోయి, శాశ్వతమై పోయి ఉంది. యాంకా కుపాల పార్క్ నుండి బయలుదేరి పోయి, అక్కడకు దగ్గరలో, స్విస్లాఖ్ నది వెంబడే విస్తరించి ఉన్న 'ట్రినిటీ హిల్' చేరుకున్నాను. ఇటుకరాళ్ళతో కట్టిన ఇళ్ళు, గులక రాళ్ళు పరచిన వీధులతో ఈ ఊరు విలక్షణమైన వ్యక్తిత్వాన్ని ప్రకటిస్తూ ఉంది. మిన్స్క్‌లో తన పురాతన తత్వాన్ని నిలబెట్టుకుని ఉన్న ప్రాంతానికి ఆ ఉదయం నడచి రావటం ఆహ్లాదంగా ఉంది. మిన్స్క్ ప్రపంచంలోని పరిశుభ్రమైన నగరాలలో ఒకటని చెప్పవచ్చు. వీధులకు ఇరువైపులా శ్రద్ధగా పెంచిన వృక్షాలు బారులు తీరి ఉన్నాయి. అక్కడక్కడా కొన్నిచోట్ల నాకు డోమ్‌లతో ఉన్న సనాతన రష్యన్ చర్చిలు కనిపించాయి.



చర్చి ఆఫ్ హెూలీ స్పిరిట్

ట్రినిటీ హిల్ నుండి వెనుతిరిగి, నెమ్మదిగా నడుస్తూ, టౌన్ హాల్ ముందున్న స్వోబోది స్క్వేర్ చేరుకున్నాను. దగ్గరలో ఉన్న కాఫీ షాప్‌లో ఒక కప్పు కాఫీ కొనుక్కుని, అక్కడున్న ఒక బెంచీ మీద టౌన్ హాల్ కనపడే విధంగా కూర్చుని, క్షణ క్షణానికి జీవం పుంజుకుంటున్న ఆ నగర జీవితాన్ని చూస్తూ కూర్చున్నాను. ఇంకొన్ని కాఫీ షాపులు తెరవటంతో, అవి జనాయస్కాంతాలుగా కనపడుతున్నాయి. ఆ మనుష్యుల రూపురేఖలు చూడటానికి నాకు అవకాశం దొరికింది. వీళ్ళంతా స్థానికులు. తెల్లవాళ్లే కానీ మిగిలిన ఇరోపా దేశాలలో నేను చూసిన వారికి భిన్నంగా ఉన్నారు. ఆ తెల్లటి ముఖాల బెలరూసియన్ సమూహం మధ్య ఉన్న ఒకే ఒక ముదురు రంగు మధ్య వయస్కుడిగా, నేనొక కనపడని ఆకర్షణ శక్తి సంపాదించుకున్నాను.

కాసేపటికి ఇంకొందరు టూరిస్టులు ఇంగ్లీషులో సాగే ఉచిత సిటీ టూర్ కోసం అక్కడకు చేరుకోవటం మొదలు పెట్టారు. అంతలోనే ఆ టూర్ గైడ్, 'స్వెత్లానా' కూడా వచ్చింది. ఆ గుంపులో నేనొక్కడినే బ్రిటిష్ ఇండియన్ని. మిగిలిన వారంతా ఫ్రాన్స్, గ్రీస్, జపాన్, అమెరికా దేశాల వారు. మా టూర్ అక్కడ విలక్షణంగా కనపడుతున్న చర్చి ఆఫ్ హెూలీ స్పిరిట్ వద్ద మొదలయింది. ఈ తెల్లటి భవనపు పై కప్పు, ఆకుపచ్చ రంగులో ఉంది. ఇది తూర్పు ఐరోపా దేశాలలో కనిపించే వైభవోపేతమైన బరోక్ శైలిలో నిర్మించబడి ఉంది. మిన్స్క్ దిగంతపు దృశ్యంలో ప్రధానంగా కనపడే భవనం ఇది. ఈ నగర చిహ్నంగా గుర్తించబడిన అవర్ లేడి ఆఫ్ మిన్స్క్ విగ్రహం ఇక్కడ ఉంది. గాజు పలకల మధ్య సురక్షితం చేయబడిన ఈ విగ్రహాన్ని ముద్దు పెట్టుకోవటం కోసం అక్కడ చేరిన స్థానికుల వరుసలో మేము కూడా చేరాము. ఈ విగ్రహం, మధ్య యుగాలలో, స్విస్లాఖ్ నది వెంబడి, ప్రవాహానికి ఎదురీదుతూ కనపడిందని స్థానికుల కథనం. కమ్యూనిస్ట్‌ల పాలనలో ఈ భవనాన్ని జిమ్‌గా ఉపయోగించే వారని, తరువాత కాలంలో డాక్యుమెంట్ల భండాగారంగా వాడారని, ఆ రోజు మాకు కనిపిస్తున్న పవిత్ర ప్రదేశంగా పునరుద్ధరించ బడటానికి ముందు కొంతకాలం కారాగృహంగా కూడా వాడబడిందని స్వెత్లానా చెప్పింది. అక్కడి నుండి, స్వెత్లానా వెంట నడుస్తూ జిబిట్స్కి వీధిలోకి వెళ్ళాము. అప్పుడు అక్కడ అంత హడావుడి లేదు. వ్యాపారాలు ప్రశాంతంగా జరిగిపోయే చోటులాగా కనిపించింది. సమయం గడుస్తూ సాయంత్రమయ్యే కొద్దీ, ముందు రాత్రి నేను చూసిన వాతావరణం క్రొత్త శక్తి పుంజుకుంటూ ఆవరించుకోవటం నేను గమనించాను.

నదీ తీరం వెంట నడుస్తూ, పాత బస్తీ చేరుకుని అక్కడ స్విస్లాఖ్ నది మీద నిర్మించిన వంతెన దాటి 'ఐలాండ్ ఆఫ్ గ్రీఫ్' చేరుకున్నాము. ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన బెలరూస్ యుద్ధంలో ప్రాణాలర్పించిన 771 మంది బెలరూస్ సైనికుల సంస్మరణార్థం నిర్మితమైన జ్ఞాపక చిహ్నం ఇది. భర్తలను పోగొట్టుకుని వైధవ్యం పొందిన స్త్రీలను, కుమారులను పోగొట్టుకుని విలపిస్తున్న తల్లులను ఇక్కడ రాతిలో విగ్రహాలుగా మలిచారు. వీటితో అక్కడ సృజించిన విదారక వాతావరణం నన్ను విహ్వలుణ్ణి చేసింది.

ఆ కాలంలో బెలరూస్ సోవియట్ యూనియన్‌లో భాగం. 1979లో లియోనిడ్ బ్రెజ్నెవ్ ఆధ్వర్యాన సోవియట్ యూనియన్, అప్పుడే (1978 లో) ఆఫ్ఘనిస్తాన్‌లో క్రొత్తగా అధికారంలోకి వచ్చిన కమ్యూనిస్ట్ ప్రభుత్వానికి మద్దతుగా, ఆఫ్ఘనిస్తాన్‌లోకి సైన్యాన్ని దింపింది. నిజానికి అది, సోవియట్ యూనియన్ వ్యతిరేకి అయిన ముజాహిద్దీన్ మద్దతు దేశమైన అమెరికాతో సోవియట్ యూనియన్ చేసిన ప్రచ్ఛన్న యుద్ధం. దాదాపు ఒక దశాబ్దం పాటు సాగిన ఈ యుద్ధంలో సోవియట్ యూనియన్ నిలబడలేక, వెనుకంజ వేయవలసి వచ్చింది.

ఈ యుద్ధం సోవియట్ యూనియన్ విచ్ఛితికి దారి తీసింది. మరో దశాబ్దం తరువాత, ఈ యుద్ధంలో ఎవరినైతే అమెరికా సమర్ధించిందో, వారే న్యూయార్క్‌లోని ట్విన్ టవర్లను కూలగొట్టారు. మరో 20 ఏళ్ల పాటు ఆఫ్ఘనిస్తాన్ అమెరికాల మధ్య శత్రుత్వం సెగలు కక్కుతూనే

ఉంది. చరిత్ర తిరగతోడితే, ఆఫ్ఘనిస్తాన్ అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకున్న ప్రతి పెద్ద దేశమూ.. 19 వ శతాబ్దంలో బ్రిటన్, 20వ శతాబ్దంలో సోవియట్ యూనియన్, 21వ శతాబ్దంలో అమెరికా... సమస్యలలో కూరుకుపోవటం కనపడుతుంది. ఇది యాదృచ్ఛికం కూడా కావచ్చు కానీ సుదీర్ఘ కాలం పాటు మాత్సర్యం పెంచి పోషించుకుని, దాని కోసం ప్రజా ధనం, ప్రాణాలు వెచ్చించిన దేశాలు సమస్యల ఊబిలో కూరుకు పోవటం అసహజం కాదు.

ఐలాండ్ ఆఫ్ గ్రీఫ్ నుండి మాకు కొన్ని నవీన అపార్ట్మెంట్ భవనాలు కనిపించాయి. వాటిలో స్వెత్లానా అలెక్సీవిచ్ అనే పరిశోధక విలేఖరి నివసిస్తుందని స్వెత్లానా మాకు చెప్పింది. ఆమె ఎవరో మాకు తెలియలేదు. ఆమె నోబెల్ బహుమతి గ్రహీత అని కూడా స్వెత్లానా మాకు తెలియ చెప్పింది. అయినా కూడా మాకెవరికీ తెలియక పోవటంతో కొంచెం సిగ్గుపడ్డాము. పాశ్చాత్య దేశాలలో ఇటువంటి చిన్న దేశాలకు చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలుర గురించి తెలియకపోవటం.. కొంతవరకు... సమాచార, ప్రసార మాధ్యమాల అసమ దృష్టి వలన అనుకుంటాను. మన రవీంద్ర నాథ్ ఠాగోర్ తెలియదని ఎవరైనా అంటే, నాకెలా ఉంటుందో మా టూర్ గైడ్‌కు కూడా అట్లానే అనిపించిందేమో.

స్వెత్లానా అలెక్సీవిచ్ బెలరూసియన్ రచయిత కూడా. విలేఖరిగా వృత్తి సాగిస్తూ, రచయితగా సాహిత్యంలో నోబెల్ బహుమతి పొందిన మొదటి వ్యక్తి ఈమె. వృత్తి పరంగా తాను చేసిన వందలాది ఇంటర్వ్యూలను ఒకభిన్న రాగాల కలయికగా సృజించి, తనదైన శైలిని చాటుకుంది ఈమె. ఆమె పుస్తకాలలో అనేక స్వరాలు వినపడుతూ, చదువరుల మనసులలో జరుగుతున్న చరిత్రను, విభిన్న కోణాల నుండి ఆవిష్కరిస్తూ తారసపడతాయి. తద్వారా కాల్పనిక సాహిత్యానికి ఉన్న హద్దులను ఈమె కూలద్రోసింది. రెండవ ప్రపంచ యుద్ధంలో మానవ మారణ హోమం, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధపు ఆక్రందనలు, చెర్నోబిల్ ఉపద్రవం, సోవియట్ యూనియన్ పతనం,.. వీటన్నిటి జ్ఞాపకాల ఉప్పెనలు, నిష్పాక్షికమైన విషయ పరిశోధన, వ్రాత పూర్వక సాక్షాలు, ఋజువులు ఇవన్నీ ఈమె తన రచనలలో పదిల పరచనట్లయితే, అవి కాల గర్భంలో కలసిపోయి, ఆనవాలు తెలియకుండా కొట్టుకుపోయి ఉండేవి. 2015లో సాహితీ రంగంలో నోబెల్ బహుమతి పురస్కారానికి ఆమెను ఎంచుకున్న సందర్భంలో, ఆమె రచనలను..' ఈ కాలపు దైన్యానికి, స్థైర్యానికి స్థూపాలు'గా అభివర్ణించారు.

ఆ తరువాత మాకు కనిపించిన బోల్షాయ్ ఒపెరా హౌస్ చాలా బాగుంది. దీనిని మాస్కో ఒపెరా హౌస్‌కు దీటుగా కట్టాలని సంకల్పమట. అయితే, దానికి పోటీ రాకూడదనే జోసెఫ్ స్టాలిన్ ఆదేశాల ప్రకారం దీని సైజు తగ్గించారని స్వెత్లానా చెప్పింది.

ఆ టూర్‌లో మరి కొంతమంది ప్రత్యేక వ్యక్తులు నాకు పరిచయమయ్యారు. ముఖ్యంగా, మీఖాలిస్ పాపడకిస్. ఇతడు ఏథెన్స్‌లో పని చేస్తున్న గ్రీక్ సాఫ్ట్ వేర్ ఉద్యోగి. అతను ప్రస్తుతం తూర్పు ఐరోపాలో ఉన్న పూర్వపు సోవియట్ యూనియన్ దేశాలలో పర్యటిస్తున్నాడట. అతని మాటలలో నేను తెలుసుకున్న విశేషం ఒకటుంది. స్లావిక్ భాష మాట్లాడే దేశాలలో అనుసరించే రష్యన్ సనాతన క్రిస్టియానిటీ, గ్రీసువారు అనుసరించే సనాతన క్రిస్టియానిటీ ఒకే విధంగా ఉంటాయుట. ఇవి రెండూ ప్రస్తుతం ఇస్తాంబుల్ అని పిలువబడే, కాన్స్టాంటినోపుల్ కేంద్రంగా విరాజిల్లిన బైజాన్టిన్ సామ్రాజ్యపు సనాతన చర్చిరీతి నుండి ఆవిర్భవించినవేనట. సాంప్రదాయాలు, నమ్మకాలూ కాల క్రమంలో రాజ్యాలు దాటుకుంటూ జన జీవితాలలోకి చొచ్చుకుపోయే విధానం నన్నెప్పుడూ ఆశ్చర్య పరుస్తూనే ఉంటుంది. నేను చూసినంతలో ఒంటరి ప్రయాణంలో, క్రొత్తవారిని కలుసుకోవటానికి, క్రొత్త విషయాలు తెలుసుకోవటానికి వెసులుబాటు ఎక్కువ.

అన్నీ ఒకే విధంగా ఉన్న పసుపుపచ్చ భవనాలున్న ప్రాంతం, ఇదివరకటి కమ్యూనిస్ట్ క్వార్టర్ అట. వాటిని దాటి వెళుతున్నప్పుడు అక్కడున్న ఒక అపార్ట్‌మెంట్ల సముదాయాన్ని చూపిస్తూ, అక్కడ ఒక ప్రముఖ వ్యక్తి ఉండేవాడని చెప్పింది. అతను 'లీ హార్వే ఆస్వాల్డ్'. 1963 నవంబర్ 22న డల్లాస్ నగరంలో అప్పటి అమెరికన్ ప్రెసిడెంట్ జాన్ ఎఫ్ కెన్నెడీని నడి రోడ్డు మీద తుపాకీతో కాల్చి, హత్య చేసాడన్న లీ హార్వే, ఇక్కడ మిన్స్క్‌లో ఉండేవాడని చాలా మందికి తెలియదు. లీ హార్వే ప్రెసిడెంట్ కెన్నెడీ హత్య కేసులో ప్రధాన నిందితునిగా, కస్టడీలోకి తీసుకోబడ్డాడు. కానీ రెండవ రోజున, పోలీస్ కస్టడీలోనే అతను చంపబడ్డాడు. నిజమేమిటో ఎప్పటికీ తెలిసే

అవకాశమే లేదు. పరస్పరం విరుద్ధమయిన ఎన్నో కథనాలు ఈనాటికీ అమలులో ఉన్నాయి. మరి లీ హార్వేకి మిన్స్క్‌తో ఉన్న సంబంధ మేమిటి? అతను కెన్నడీ హత్యకు ముందు రెండు సంవత్సరాల వరకు సోవియట్ యూనియన్‌లో ఉన్న మిన్స్క్‌లో ఇంజనీరుగా పనిచేసాడట. అంతకు ముందు అతను అమెరికన్ సైన్యంలో పనిచేసాడట. ఎలాగో కమ్యూనిజం పట్ల ఆసక్తి పెంచుకుని ఫిన్లాండ్ ద్వారా మాస్కోలో ప్రవేశించాడు. అక్కడ సోవియట్ పౌరసత్వానికి అర్జీ పెట్టుకుని, అమెరికన్ ఎంబసీలో తన అమెరికన్ పాస్ పోర్టును తిరిగి ఇచ్చేసి, స్వయంగా రద్దు చేసుకున్నాడు.



లీ హార్వే ఆస్వాల్

అయితే, ఆ తరువాత సోవియట్ ప్రభుత్వం అతనికి పౌరసత్వం ఇవ్వటానికి నిరాకరించింది. దానితో అతను మణికట్టు మీద గాటు పెట్టుకుని, ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేశాడు. కొంత కాలానికి ప్రభుత్వం అతనికి పౌరసత్వమయితే ఇవ్వలేదు కానీ, ఆ దేశంలో ఉండటానికి అనుమతి ఇచ్చింది. కానీ మాస్కో సెయింట్ పీటర్స్ బర్గ్ లలో మాత్రం ఉండటానికి వీలు లేదని ఆంక్ష విధించటంతో అతను మిన్స్క్ చేరుకున్నాడు. మిన్స్క్‌లో అతనికి ఒక అపార్ట్మెంట్ ఏర్పాటు చేశారు. నిత్యం కేజిబి కన్ను అతని మీద ఉండేదట. అతను ఒక రష్యన్ యువతిని పెళ్లిచేసుకున్నాడు. ఒక కుమార్తె కూడా కలిగింది. స్థానిక ఫ్యాక్టరీలో ఒక మంచి ఉద్యోగం కూడ అతనికి ఏర్పాటు చేశారు. కానీ 18 నెలల తరువాత, ఈ జీవితంతో విసుగు చెంది అమెరికా వెళ్లిపోవాలనుకున్నాడు. అమెరికా ప్రభుత్వం అతనిని భార్య, కుమార్తెతో సహా అమెరికా తిరిగి రావటానికి అనుమతించింది. అందుకు రష్యా ప్రభుత్వం కూడా అంగీకరించింది. అమెరికా వెళ్ళిన తరువాత, ఒకటిన్నర సంవత్సరాలకు అతను ప్రెసిడెంట్ కెన్నెడీ హత్య కేసులో నిందితుడయ్యాడు. ఇక్కడ వినిపించే వాదన... సోవియట్ రష్యా నుండి తిరిగి వెళ్ళిన లీ హార్వే, రష్యా కేజిబి ప్రతినిధి అని, కెన్నెడీ హత్య వెనుక కేజిబి హస్తమున్నదని. లీ హార్వే ఉదంతం వెలుగులోకి వచ్చే వరకు మిన్స్క్ గురించి బయటి ప్రపంచంలో ఎవరికీ పెద్దగా తెలియదు. ఎవరో పన్నిన పన్నాగానికి లీ హార్వేని బలి చేశారని బెలరూస్ ప్రజల నమ్మకమని స్వెత్లాన మాతో చెప్పింది. మిన్స్క్‌లో అతనితో పాటు పని చేసిన ఫ్యాక్టరీ పనివారు అతను ఎంతో నిదానస్తుడని చెపుతారు. పైగా తుపాకీ గురి పెట్టటం రాని లీ హార్వే అంత దూరం నుండి, గురి తప్పకుండా తుపాకీ పేల్చటం కూడా నమ్మ దగ్గ విషయం కాదని చెపుతారు.

లీ హార్వే మిన్స్క్‌లో ఉన్నప్పుడు, రష్యన్ భాష మాట్లాడలేకపోవటం వలన ఇబ్బంది పడి, ఒక టీచర్ కావాలని రష్యన్ అధికారులకు అర్జీ పెట్టుకోవటంతో, వారు ఫ్యాక్టరీలో పని చేసే ఒక యువకుడిని ఆ పని కోసం ఏర్పాటు చేశారట. అతని పేరు స్టానిస్లావ్ షుష్కెవిచ్. తరువాత కాలంలో అతనే సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైనపుడు ఏర్పడిన స్వాతంత్ర్య బెలరూస్ అధ్యక్షుడు అయ్యాడని స్వెత్లానా చెప్పింది.

1994లో జరిగిన ఎన్నికలలో ప్రస్తుత అధ్యక్షుడు, అలెక్సాండర్ లుకషెంకో, షుష్కెవిచ్ మీద గెలుపు సాధించి అప్పటినుండీ పదవిలో ఉన్నాడట. మా టూర్ పూర్తయిన తరువాత, స్వెత్లానాను కొన్ని సూచనలు అడిగాను. ఆమె వాసిలికి, కుచ్మిస్టర్ అనే రెండు రెస్టారెంట్ల పేర్లు చెప్పింది. చారిత్రక అంశాల మీద నాకున్న ఆసక్తిని గమనించిందను కుంటాను.. ఆ మధ్యాహ్నం ఆమె సహోద్యోగి రోమన్ షుబారతో కలసి మిన్స్క్‌లో స్టాలినిస్ట్ టూర్‌కు వెళ్ళమని చెప్పింది. అప్పటికే ఒకటిన్నర అవటంతో, వాసిలికిలో భోజనం చేయటానికే నా మనసు మొగ్గు చూపింది. స్వెత్లానా మా గ్రూప్ సభ్యులకు వీడ్కోలు చెప్పి, దగ్గరలో ఉన్న మెట్రో స్టేషన్ వరకు నాతో పాటు నడచి వచ్చింది. ఆ కొద్ది సమయంలో ఆమె బెలరూస్ దక్షిణ ప్రాంతం నుండి వచ్చిందని, ఆమె కుటుంబం చెర్నోబిల్ రేడియేషన్ గురై, స్వస్థలాన్ని శాశ్వతంగా వదిలి రావలసి వచ్చిందని చెప్పింది. ఇప్పటికీ ఆమె, రేడియేషన్కు గురైన వారు తీసుకోవలసిన జాగ్రత్తలో భాగంగా, తన శారీర స్థితిని తరచూ తరచి చూసుకుంటూనే ఉంటుందట. అదృష్టవశాత్తూ అంత వరకూ ఏ సమస్యా రాలేదని చెప్పింది స్వెత్లానా.

*(ఇంకా ఉంది)*

**ఆంగ్లం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)**
e-mail: srnimmagadda@googlemail.com
**అనువాదం: శ్రీమతి జయశ్రీ అట్లూరి (ఇంగ్లాండ్)**
e-mail: jayasreeatluri@hotmail.com

# లలితసంగీత పరిమళం

## ప్రసిద్ధ లలితగీత విశ్లేషణ

– డా. ఎమ్. పురుషోత్తమాచార్య

### 25. భావికాల మహోదయంలో

రచన : వింజమూరి శివరామారావు

సంగీతం : ఎం.బాలమురళీకృష్ణ

గానం : బాలమురళీకృష్ణ & బృందం.

పహాడీ–మిశ్రచాపు

భావికాల మహోదయంలో
భారతము నీక్షింపరా
రామరాజ్యము విస్తరింపగ
సౌమనసభావమ్ము నింపగ ॥భావి॥

1. ఎడదపై విరిదండ జాహ్నవి
నడుముపై మొలనూలు గౌతమి
అడుగులకు కావేరి, కృష్ణయు
కడియములుగా వెలుగగా ॥భావి॥

2. హిమాలయసానువులు,సేతువు,
సముద్రములు,నదులు,వనులు
భారతీయుల భాగ్యములు సౌ
భాగ్యములు పెంపొందజేయగ ॥భావి॥

3. భేదములు,యుద్ధములు,హింసలు,
ఖేదములు మాయించు స్వర్గము
లోకమున దీపించగా నర
లోకమే సురపాళిగా ॥భావి॥

భారతదేశ భవిష్యత్తు ఎలా ఉండబోతున్నదో, ఎలా ఉండాలో సూచిస్తున్నది ఈ పాట. రామరాజ్యం కావాలన్న ఆకాంక్షను రచయిత ఆశిస్తున్నారు. భారతమాతకు మెడలో పూలదండలాంటిది జాహ్నవి, అంటే గంగానది. భగీరథుడు గంగను భూమిపైకి తెచ్చి పాతాళానికి తీసుకువెళుతూ ఉంటే, గంగానది తనకు మధ్యలో అడ్డంవచ్చిన జహ్నుమహర్షి ఆశ్రమాన్ని కొట్టుకుపోయేలా చేసింది. వెంటనే ముని కోపించి దాన్ని త్రాగేశాడు. భగీరథుని ప్రార్థనను మన్నించి, గంగను నోటినుండి వదిలేస్తే ఎంగిలి అవుతుందని భావించి చెవుల్లోంచి వదిలేశాడు. అందువల్లనే గంగ 'జాహ్నవి' అయింది, భారతమాత నడుముకు మొలనూలుగా చుట్టుకుపోయింది.

గోదావరి గౌతమ మహర్షి వలన ఆవిర్భవించింది కనుక 'గౌతమి' అయింది. భరతమాత పాదాలను అభిషేకిస్తున్న కృష్ణ, కావేరి నదులు ఆమెకు కాళ్ళ కడియాలుగా భాసిస్తున్నాయి. హిమాలయాలు, రామసేతువు మొదలైనవన్నీ భారతీయుల సౌభాగ్యాలను పెంపొందించే భాగ్యనిధులు. కులమతభేదాలు, యుద్ధాలు, హింసాకృత్యాలు మొదలైన వాటిని దరిజేర నీయకుండా సదా కాపాడే భారతభూమి స్వర్గసీమలాంటిదని రచయిత మహోన్నతంగా వర్ణించారు.

ఈ పాటలో రచయిత ఎంతో శ్రద్ధగా యతిని, ప్రాసను రెండిటినీ చక్కగా పోషించారు. సుదీర్ఘసమాసాల తెరువుపోకుండా సూటిగా చిన్న చిన్న పదాలతో అర్థవంతంగా రచించారు. ఈ పాటను మంగళంపల్లి వారు పహాడీ రాగంలో, మిశ్రచాపు గతిలో మనోహరంగా స్వరపరిచారు. బృందంతో కలిసి తావే ఆలపించారు. పల్లవిని, అనుపల్లవిని పూర్తిగా బృందంతో కలిపి ఆలపించినా చరణాలను మాత్రం తామొక్కరే పాడారు.

తబల అనుసరణ తప్ప ఏ వాద్యాలనూ వాడక, బిట్‌వర్కును సమకూర్చక. నిరాడంబరంగా, సుశ్రావ్యంగా ఆలపించారు. పల్లవి, అనుపల్లవులను కలిపి రెండుసార్లు పాడారు. చరణాల్లో ఎక్కడా రిపిటీషన్ లేకుండా ఏకబిగిన పాడడం వల్ల పాట మంచి దండకంలాగా సాగిపోయినా మాధ్యుర్యం దెబ్బ తినకుండా జాగ్రత్తపడ్డారు. చరణాలలో రెండు పాదాల చివరలను తారాస్థాయిలో ఎలుగెత్తి పాడారు. చరణాలు పాడాక ఎత్తుకునే పల్లవిని బృందానికి వదిలేశారు. ఎలుగెత్తి పాడిన చోట్లలో బాలమురళిగారి స్వరముద్ర అందంగా వినిపించి ఆహ్లాదపరిచింది. ఆలపించే విధానంలో దేశభక్తిభావాన్ని చక్కగా రంగరించారు.

## 26. మాదీ స్వతంత్రదేశం

**రచన& సంగీతం : బాలాంత్రపు రజనీకాంతరావు**
**గానం : టంగుటూరి సూర్యకుమారి**

**<u>బిలహరి-ఏక</u>**

**మాదీ స్వతంత్రదేశం**
**మాదీ స్వతంత్రజాతి ॥మాదీ॥**
**భరతదేశమే మా దేశం**
**భారతీయులం మా ప్రజలం ॥మాదీ॥**

1. వింధ్య, హిమవత్, శ్రీనీలాద్రుల
సంధ్యారుణ నవాశలు మావి
గంగా గోదావరి సహ్యజా
తుంగతరంగిత హృదయాల్ మావి ॥మాదీ॥
2. ఆలయమ్ముల శిల్పవిలాసం
ఆరామమ్ముల కళాప్రకాశం
మొగల్ సమాధుల రసదరహాసం
మాకు నిత్యనూతనేతిహాసం ॥మాదీ॥
3. అహింసా పరమో ధర్మః
సత్యం వద, ధర్మం చర
ఆదిఋషుల వేదవాక్కులు మా
గాంధి గౌతముల సువాక్కులు ॥మాదీ॥
4. స్వతంత్రతా భ్రాతృత్వాలు
సమతా మా సదాశయాలు
జననీ! ఓ స్వతంత్రదేవీ!
కొనుమా నివ్వాళులు మావి ॥మాదీ॥

ఒక పరిపూర్ణ దేశానికి అవసరమైన ముఖ్యాంశాలన్నీ నిండుగా తొణకిసలాడుతున్న చక్కని దేశభక్తి గీతం ఇది. పూర్తిగా లాలిత్యధోరణిలో సాగుతూనే భక్తిశ్రద్ధలను మనలో నింపడానికి ఈ పాట శాయశక్తులా ప్రయత్నిస్తున్నది. ఇది రజనిగారి ప్రతిభాసంపద. పర్వతాల ఔన్నత్యం, నదుల జీవశక్తి, శిల్పకళాసజీవవిన్యాసం, ఆదిఋషుల వేదవాగ్వైభవం మొదలైనవాటిని ఘనతలుగా వర్ణిస్తూనే భారతీయుల సదాశయాలను సగర్వంగా ప్రకటిస్తున్నది ఈ గీతం. అతిప్రాచీనులైన గౌతమబుద్ధుడిని, అత్యంత ఆధునికుడైన మహాత్మాగాంధీని జతగా ప్రస్తావించడాన్ని సిద్ధాంత సారూప్యాన్ని సూచించడంగా భావించవచ్చు.

పల్లవి, అనుపల్లవులలో; రెండవ చరణం, చివరి చరణాల మొదటి భాగాలలో యతిని చక్కగా పాటించారు. మొదటి చరణంలో ప్రాసను అందంగా చిత్రించారు. మూడవ చరణంలో యతిప్రాసలేవీ పాటించక స్వేచ్ఛగా సాగిపోయారు. చివరి చరణం రెండో భాగంలో ప్రాసను చూపారు. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి పాటల రచనలో ఒక వ్యావహారిక జానపదముద్ర కనిపిస్తుంది. తమ్మిపూవుల్లు, కొరివి మంటల్లు ఇట్లా ద్విత్వలకారం అసాధారణంగా కనిపిస్తాయి. అట్లాగే రజనిగారు కూడా ఈ పాట చివరలో 'నివ్వాళులు' అని ప్రయోగించారు. ఇది ఒక రచనా సౌందర్యం. మూడవ చరణంలో మొదటి రెండు పాదాల్లో చక్కని సంస్కృతసూక్తులను యథాతథంగా ఉపయోగించడం ఒక నిండు చాతుర్యం. ఈ పాటను రజనిగారే బిలహరి రాగంలో బాణీ చేశారు. తాళాన్ని మాత్రం చాలా క్లిష్టంగా నడిపారు. ఈ పాటను పాడాలనుకునేవారు ఏమాత్రం అశ్రద్ధ చేసినా తాళం తప్పే అవకాశాలు మెండుగా ఉన్నాయి. శాస్త్రీయ సంగీత శాస్త్రంలోని తాళ విభాగంలో 4 రకాల గ్రహపద్ధతులను సూచించారు. ఈ గ్రహ విభజనను రంగరాజు లొల్లభట్టు ఏర్పరచారు.

**1. అతీతం :** అంటే,సాహిత్యం ప్రారంభమైనాక తాళాన్ని అనుసరించడం. ఉదా॥'నీలాల నింగి మెరిసిపడే నిండు చందురుడా'(గండికోటరహస్యం)

**2. అనాగతం :** అంటే,తాళం ప్రారంభమైన తరువాత ఆలస్యంగా సాహిత్యాన్ని పాడడం. దీన్నే అనాహతం అని కూడా పిలుస్తారు. ఉదా॥'బంటురీతి,కంటజూడుమీ' మొదలైన త్యాగరాజుగారి చాలా కృతులు.

**3. సమము :** అంటే, సాహిత్యం,తాళం ఒకేసారిగా ప్రారంభం కావడం. ఉదా॥ 'తోటలో నా రాజు' (ఏకవీర)

**4. విషమము :** ఈ మూడు విధాలుగా కాక ప్రత్యేకరీతిలో నడిచేవి. అంటే సాహిత్యానికి, తాళానికి పొంతన కుదరనట్లు తోచే విధంగా నడకను ఏర్పరచడం. ఈ పద్ధతిని సినిమా సంగీతకర్తలు స్వీకరించరు. ఎందుకంటే, శ్రోతలకు అర్థం కావు కనుక. ఈ పాటలో కొన్ని పాదాలు అతీతంలోను, మరికొన్ని పాదాలు అనాగతంలోను వినిపిస్తాయి. అనుపల్లవిలో విషమగతి కనిపిస్తుంది. మిగిలినవి సమంలో నడుస్తాయి. పాట ప్రారంభంలో వాద్యసంగీతాన్ని వినిపిస్తూ దేశభక్తిని సూచించే 'బాకా' (ట్రంపెట్స్) ధ్వనులను సమకూర్చారు. తరువాత 8 ఆవర్తాలలో వయొలిన్, వేణువులతో బిట్టును వినిపించాక ఈతీతపద్ధతిలో, సుకుమారమైన లేతగొంతుకతో సూర్యకుమారి గారు

పల్లవిని పంచమం నుండి అందుకున్నారు. అనుపల్లవి ఎత్తుగడను అనాగతంలాగ అందుకుని విషమగతిలో నడిపించారు. తరువాత 4 ఆవర్తాలలో బిట్టును సమకూర్చగా మొదటి చరణం 'వింధ్యహిమవత్'ను ఒక మాత్ర జాగా వదిలి అనాగతంలో తారషడ్జమం నుండి ప్రారంభించారు. చరణంలోని రెండవ భాగాన్ని సమంలో ప్రారంభించి తారాస్థాయి సంచారంలో అందంగా ముగించారు. రెండవ చరణానికి ముందు బిట్టును మొదటి చరణానికి విభిన్నంగా సమకూరుస్తూ నాలుగు ఆవర్తాలుగా వినిపించారు. అనాగతపద్ధతిలో 'ఆలయ మ్ములను' మొదటి చరణపు బాణీలోనే ఎత్తుకున్నారు. 'ఆరామమ్ముల' దగ్గర ఆమె గొంతుకలోని సహజసుందరమైన గమకం వినిపిస్తుంది. 'రసదరహాసం' దగ్గర తారాస్థాయిలో 'గపపమమగరిస' అనే సంగతిని శ్రావ్యంగా పాడారు.

మూడవ చరణానికి ముందు మరో విభిన్నమైన శైలితో బిట్టును సమకూర్చి నాలుగు ఆవర్తాలుగా వినిపించగా అతీతపద్ధతిలో దైవతం నుండి చరణాన్ని ప్రారంభించారు. ఈ చరణం అంతటిని అతీతపద్ధతినే అనుసరిస్తూ మరో విభిన్నమైన బాణీలో వినిపించారు. చివరి చరణాన్ని ఆకాశవాణిలోనే పాడారు,కాని రికార్డులో తొలగించారు. ఈ చరణానికి ముందు ఏ బిట్టూ ఇవ్వలేదు. పల్లవి కాగానే నేరుగా ఒక మాత్ర జాగా వదిలి దైవతం మీదుగా చరణాన్ని అందుకున్నారు. 'జననీ' నుండి ఎలుగెత్తి పాడుతూ సమంలో సాగించారు. 'స్వతంత్ర' పదాన్ని ముగ్ధమోహనమైన గమకంతో పాడుతూ 'కొనుమా' ను అర్థింపుగా, గోముగా పాడారు. తరువాత పల్లవి వరకు ఒకసారి పాడి 'జాతి' దగ్గర వదిలేసి పాటనంతా ముగించారు.

**డా. ఎమ్. పురుషోత్తమాచార్య**
*(జాతీయ పురస్కార గ్రహీత)*
పూర్వ ప్రిన్సిపాల్, సంగీత కళాసాల,
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.

## నారదుడి పెళ్ళి


*నారద మహర్షి చెల్లెలి కొడుకు పేరు పర్వతుడు. వాళ్ళిద్దరూ ఒకసారి భూసంచారానికి వెళ్ళారు. మనిద్దరం ఒకరి మనసులో ఉండే అభిప్రాయాలు మరొకరికి చెప్పుకోవాలి. దాపరికం చేస్తే మాత్రం శాపం తప్పదు. ఏం? అన్నాడు పర్వతుడు. సరేనన్నాడు నారదుడు. వాళ్ళిద్దరూ ఒకనాడు సృంజయ మహారాజు దగ్గరకు వెళ్ళారు. ఆయన రాజప్రసాదంలో కొన్నాళ్ళు వుంటామన్నారు. సంతోషంగా అంగీకరించాడాయన. తన కూతురు సుకుమారిని పిలిచి వాళ్ళిద్దరికీ సపర్యలు చేయమని చెప్పాడు. ఆమె శ్రద్ధగా వాళ్ళకు సేవలు చెయ్యసాగింది. ఆమె అద్భుత సౌందర్యరాశి. ఆ రూప లావణ్యాలకు నారదుడు ముగ్ధుడయ్యాడు. నారాయణ జపం మానేశాడు. ఆమె మూర్తి అతని మనస్సులో పీఠం వేసింది. ఆ బరువు మొయ్యలేక కృశించిపోసాగాడు నారదుడు. అది చూసి పర్వతుడు "ఏమిటి మామా! ఏమిటిలా అయిపోతున్నావ్? తరచూ పరధ్యాసలో పడుతున్నావు. దిగులుగా కనిపిస్తున్నావు. ఏమిటి కథ?" అని ప్రశ్నించాడు. సిగ్గుపడ్డాడు నారదుడు. ఏమీ చెప్పలేదు! పర్వతుడు దివ్యదృష్టి సారించాడు. అంతా అర్థమైంది. "ఔరా! అన్నమాట తప్పావు. రాజుగారి కూతురుమీద మనసు కలిగితే ఆ సంగతి నువ్వు నాతో చెప్పలేదు. మనం చేసుకున్న ప్రతిజ్ఞ ప్రకారం నేనిప్పుడు శాపం ఇవ్వాలి నీకు. పెళ్ళి అవగానే నీకు మర్కట రూపం వస్తుంది" అని మేనమామను శపించాడు. "నువ్వు దేవలోకానికి వెళ్ళకుందువుగాక" అని నారదుడు మేనల్లుడికి ప్రతిశాపమిచ్చాడు. పర్వతుడు అక్కడినుంచి నిష్క్రమించాడు. తరువాత నారదుడు సృంజయ మహారాజును అర్థించి ఆయన కూతురు సుకుమారిని పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళికూతురి మెడలో మంగళసూత్రం కట్టగానే కోతిరూపం వచ్చింది నారదుడికి. కాని సుకుమారి మహాసాధ్వి. భర్తను ఏవగించుకోకుండా పూజించింది. కొన్నాళ్ళు గడిచాయి. ఒకనాడు హఠాత్తుగా నారదుడికి పర్వతుడు కనిపించి, "మామా! నా శాపం మరలించవా?" అని అర్థించాడు. ముందు శపించిన వాడివి నువ్వు. అందుకని మొదట నువ్వే నీ శాపం మరలించు అన్నాడు నారదుడు. సరేనని తన శాపాన్ని ఉపసంహరించాడు పర్వతుడు. నారదుడూ శాపం పోగొట్టాడు. ఇద్దరూ కలిసి ఇంటికొచ్చారు.*

*కోతిముఖం లేని నారదుణ్ణి చూసి తన భర్త కాదనుకుంది సుకుమారి. అప్పుడు పర్వతుడు ఆమెతో అమ్మా! ఇతడు నీ భర్తే. నా శాపం తీరి కోతిముఖం పోయింది అని జరిగిన సంగతంతా చెప్పాడు నవ్వుతూ. సుకుమారి ఆశ్చర్యపోయింది. నారదుడు నిజమేనన్నట్లు చిరునవ్వు నవ్వాడు.*

***- భారతంలో చిన్నకథలు - ప్రయాగ రామకృష్ణ***

# తంజావూరు సంస్థానంలో తెలుగునాయక రాజుల ప్రస్థానం

– డా. సగిలి సుధారాణి



తంజావూరు సంస్థానం

**తం**జావూరుకీ, తెలుగు జాతికీ, తెలుగు సంస్కృతికీ బలమైన బంధం ఏర్పడిన కాలం ఒకటుందని చాలామందికి తెలియదు. క్రీ.శ.10వ శతాబ్దంలో దక్షిణా పథాన రాజకీయంగా ఒక ముఖ్య సంఘటన జరిగింది. బలమైన చోళ, చాళుక్య వంశాలు సంబంధం కలుపుకుని ఒక్కటయ్యాయి. రాజరాజ చోళుడు తన కుమార్తెను రాజమహేంద్రవరాన్ని పాలించిన విమలాదిత్యునికిచ్చి వివాహం చేసాడు. విమలాదిత్యుని కుమారుడే రాజరాజ నరేంద్రుడు. చోళ, చాళుక్య మైత్రి కొనసాగే తరుణంలో వారితోపాటు, వారికి సేవ చేయడానికి సేవక కులాలు తెలుగునేల నుండి తరలి వెళ్ళాయి. అపారమైన సాంస్కృతిక సంపదతోపాటు అన్నీ సామాజిక వర్గాలు అటునుండి ఇటు, ఇటు నుండి అటు (తమిళ–తెలుగుసీమలు) తరలి వెళ్ళాయి. అలా గోదావరి ప్రాంతాల నుండి కావేరీ తీరానికి ఎందరో తెలుగువారు వెళ్ళారు. దీనికి చారిత్రకమైన ఆధారాలతో పాటు మౌఖిక తెలుగు జానపద కథనాలు కూడా తమిళనాట ప్రచారంలో ఉన్నాయి. నాడు ఉన్నత వర్గాలతో పాటు జీవనోపాధికోసం సాహిత్యకారులు, కవులు, వినోదాన్ని పంచే కళాకారులు వారితోపాటు అనేకమంది దక్షిణా పథానికి తరలి వెళ్ళారు.

బృహదీశ్వర ఆలయం కొలువుదీరిన తంజావూరును రాజధానిగా చేసుకొని దక్షిణపథాన విశాలమైన సామ్రాజ్యాన్ని క్రీ.శ. 1550 నుండి 1674 వరకు పరిపాలించారు తంజావూరు తెలుగు నాయకరాజులు. వీరిలో రఘునాథనాయకులు, విజయరాఘవ నాయకులు సుప్రసిద్ధులు. శ్రీకృష్ణదేవరాయలనంతరం ఆయన తమ్ముడు అచ్యుతదేవరాయలు విజయనగర సామ్రాజ్యానికి చక్రవర్తి అయ్యాడు. తన భార్య తిరుమలాంబ చెల్లెలు మూర్తాంబను చెవ్వప్ప నాయనికిచ్చి వివాహం చేశాడు. అచ్యుత దేవరాయలవారు స్త్రీధనంగా, కావలసిన వస్తు సామగ్రిలతోపాటు విశ్వనాథ నాయకుడి అధీనంలో ఉన్న చోళదేశ (తంజావూరు ప్రాంతం) అధికారాన్ని చేగొని, చెవ్వప్ప నాయకునికిచ్చి పట్టాభిషిక్తుడిని చేశాడు. చెవ్వప్ప నాయకుడు క్రీ.శ. 1540లో వేయించిన దానశాసనం తంజావూరు రైల్వేస్టేషన్ సమీపంలోని మసీదులో ఉంది. ఇతడు ఉత్తరార్కాటు జిల్లా 'నెడుంగున్నము'వాసి అని శాసనాలాధారంగా తెలియవస్తున్నది. ఈ గ్రామం ఇప్పటికీ అదేపేరుతో తమిళనాట చెంగల్పట్టు జిల్లాలో ఉన్నది.

చెవ్వప్ప నాయకుడు అరుణాచలం (తిరువణ్ణామలై) లోను, వృద్ధాచలం (విరుదాచలం)లోనే అనేక గోపుర ప్రాకార మంటపాదులను నిర్మించి, శివగంగకోట కట్టించి, తనపేర 'చెవ్వప్పనాయని (శివప్పనాయని) గుంట' అనే తటాకం తవ్వించాడు. దేవాలయలకెంతో ప్రాధాన్యత ఇచ్చి చాలాకాలం రాజ్యాన్ని ఏలాడు. తదనంతరం అతని కుమారుడు అచ్యుతప్పనాయకుడు బహుకీర్తి చంద్రుడుగా చోళదేశమందు చాలాకాలం సుభిక్షమైన పాలన చేశాడు. ఇతడు బతికి ఉన్నప్పుడే అతని కుమారుడు అచ్యుతప్ప నాయకునికి క్రీ.శ. 1580 సం.లో రాజ్యాభిషేకం చేశాడు. చెవ్వప్పనాయకుడు నామమాత్రం రాజుగా, యువరాజుగా అచ్యుతప్ప నాయకుడు పాలన చేశాడు. తరువాత అతని కుమారుడు రఘునాథ రాయలు క్రీ.శ. 1600సం. పాలనాపగ్గాలు చేపట్టాడు. సకల శాస్త్రాలలో మహాప్రవీణుడై, సకలధర్మ పారంగతుడై, కుంభకోణంలో రామస్వామి గుడి కట్టించి ఎన్నో అగ్రహారాలు, తటాకాలు ఏర్పాటు చేశాడు.




రఘునాథనాయకుడు

చేమకూర వెంకటకవి విరచితమైన 'విజయ విలాసం' మొదలైన గ్రంథాలు అంకితంగా అందుకొనడమేగాక స్వయంగా రామాయణాది గ్రంథాలు రచించి మహాప్రసిద్ధుడుగా దీర్ఘకాలం రాజ్యాన్ని ఏలాడు. రఘునాథ నాయకునికి ముగ్గురు సంతానం అచ్యుత నాయకుడు, అచ్యుత రామభద్ర నాయకుడు, విజయరాఘవ నాయకుడు. న్యాయంగా తండ్రి మరణానంతరం పెద్ద కుమారుడు రాజు కావాలి. కాని అన్న ఎక్కడ రాజ్యాధికారం చేజిక్కించుకొంటాడోనన్న భయంతో విజయరాఘవ నాయకుడు తన అన్న కళ్ళు పీకించాడని డచ్ చరిత్రకారుల అభిప్రాయం. రామభద్ర నాయకుని వృత్తాంతం తెలియరాలేదు.

విజయ రాఘవనాయకుడు క్రీ.శ. 1633 సం.లో పట్టాభిషిక్తుడై రాజ్యానికి వచ్చినపుడు విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీరంగరాయలు. దక్షిణదేశానికి ఇరుమెరుపు తీగలై విలసిల్లుతున్న తంజావూరు, మధుర నాయకులు ఒకరితో ఒకరు వియ్యమునొంది కొన్నాళ్ళకే కయ్యానికి కాలుదువ్వారు. దీనికి గల ప్రధాన కారణం మధుర తిరుమల నాయకుని పట్టమహిషి తంజాపురాధీశులైన రఘునాథ నాయకుల అనుంగు కుమార్తె అచ్యుత రఘునాయకమ్మ. విజయనగర సామ్రాజ్యాధీశులైన అచ్యుత దేవరాయల పట్టమహిషికి సోదరియైన మూర్తిమాంబకు స్త్రీ ధనంగా తంజాపుర రాజ్యం ఇవ్వబడింది. అందువల్ల మూర్తిమాంబ భర్తయైన పినచెవ్వప్ప నాయకునికి తంజావూరి రాజ్యం సంక్రమించింది. దీనికారణంగా తంజాపురాధీశులు రాజవంశం వారనీ, మధుర రాజన్యులలో ప్రథముడైన విశ్వనాథ నాయకుడి పూర్వులు శ్రీకృష్ణదేవరాయల వారి వద్ద సేనాధిపతులుగా సేవలు అందించి రాజవిశ్వాసానికి పాత్రులై రాజ్యాధికారాన్ని పొందినవారే గానీ, వారు రాజవంశ పరంపరవారు కాదని మధుర నాయక వంశజులను కించపరచడం తంజాపురం వారికి పరిపాటైపోయింది. అంతేగాక మధుర, త్రిశిరపుర రాజన్యులపై అప్పుడప్పుడు దండెత్తే శత్రురాజులకు తంజాపురంవారు సహకరిస్తూ వచ్చారు. ముఖ్యంగా విజయనగర సామ్రాజ్యానికి మధుర పాలకులు అవిధేయులుగా, తంజావూరు పాలకులకు విధేయులుగా మారారు. కప్పం కట్టకుండటమే గాక, తిరుగుబాటు చేసి స్వతంత్రులు కావడానికి మధుర, చెంజి పాలకులు ప్రయత్నిస్తున్నారని తెలుసుకొన్న విజయ నగర పాలకుడు శ్రీరంగరాయలు కొంత సైన్యంతో దక్షిణదేశానికి బయలుదేరాడు. ఆ సమయంలో విజయరాఘవ నాయకుడు శ్రీరంగరాయల పక్షాన నిలచి వారి విజయానికి కారణభూతయ్యాడు. జీర్ణకర్ణాటక సామ్రాజ్య సంస్థాపనాచార్య అనే బిరుదు వారిచే విజయ రాఘవ నాయకుడు పొందాడు. విజయనగర సామ్రాజ్య సహకారంతో తంజావూరు కోటను బలపరచి, ఖజానాకు నగదు విస్తారంగా సమకూర్చుకొన్నాడు. అంతేగాక అరతంగి, పట్టుకోట, రేళాతల్లి (తిరుచునాపల్లి), తిరుపత్తూరు ఈ నాలుగు కోటలను ఒకే ముహూర్తంలో ఆరంభించి రాతి కోటలుగా కట్టించాడు. మన్నారు గుడిలో రాజగోపాల స్వామి గోపుర మంటపాన్ని, ప్రాకారాన్ని పటిష్టపరిచాడు. కావేరిఘట్టాలలో (గట్టులలో) పుష్ప మండపాలు పదివేలు ప్రజ వుండేటట్లు విశాలంగా కట్టించాడు. అనేక దేవాలయాలకు నిరంతర స్థితి కలుగజేశాడు.

ఒకనాడు తిరుమల నాయకుడి పౌత్రులు చొక్కనాథ నాయకులు శ్రీరంగం వెళ్ళి రంగనాథుని సేవించుకొని వచ్చే సమయంలో విజయ రాఘవ నాయకుని కుమార్తె సుందర రూపాన్ని చూసి అచ్చెరువు చెందినారట. విజయరాఘవ నాయకుని వద్దకు మధ్యవర్తుల ద్వారా 'పెండ్లి ప్రస్తావన' వర్తమానం పంపాడు."రాజా పెద్ద వీరప్ప నాయనివారు మొదలుకొని రాజా తిరుమల శౌరిగారి వరకు పాత చుట్టరికమేగాని, కొత్తచుట్టరికము కాదుకదా! దేవరవారు దయచేసి శుభవార్త ఉత్తర్వును చేయవలె" అని అడిగినందుకు విజయరాఘవ నాయకులు చాలాకోపంతో "గతంలో వీరి పితామహుడైన తిరుమల శౌరికి మా అచ్యుత రఘునాథమ్మ గారిని పట్టపు మనిషిగా మావారు వివాహం చేసినారు. అతడు క్రొత్తగా నగరు కట్టించి మా అచ్యుత రఘునాథమ్మకు చూపినపుడు ఆమె హాస్యముగా తమ తండ్రి నగరుకు సాటిరాదని ఒక్కమాట



తంజావూరు బృహదీశ్వరాలయం నాడు - నేడు

అన్నందుకు సహింపలేక బాకుతో పొడిచినాడంట. ఆ సమాచారం విన్నప్పటి మావారందరూ ఇటువంటి దుష్కృత్యులకు తెలియక వివాహం చేస్తిమి! ఇకమీద వారికి మనకు సంబంధం అక్కరలేదని ప్రతిజ్ఞ చేసినారు. ఇట్లా జరిగి ఉండగా తిరిగీ సంబంధం కావలనని ఏ ముఖంతో మావద్దకి మిమ్ములను పంపించినాడని" అగౌరవ పరిచినాడు.

మంత్రి జరిగిన పరాభవం గూర్చి చొక్కనాథునితో విన్నవించుకొన్నాడు. చివరి ప్రయత్నంగా తంజావూరుపై దాడి చేసి విజయరాఘవనాయకునకు పరాజయం చేసియైనా, మోహనాంగిని తెచ్చి తమ రాజుకు కట్టబెట్టాలని మంత్రివర్గంవారు బలంగా నిశ్చయించుకున్నారు.

"ఇప్పటికీ మించినది లేదు. మీరు గతాన్ని మరచి భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని మీ రాకుమారిని మా రాజుగారికిచ్చి వివాహం చేయండి. అనవసరంగా కయ్యం వద్దని" చొక్కనాథని ప్రధాని వేంకట కృష్ణప్ప దూతల ద్వారా కమ్మ పంపాడు. కానీ, విజయరాఘవ నాయకుడు "వియ్యానికి కాకుండా కయ్యానికే సిద్ధం!" అని చెప్పి అంపినాడు. చివరి రాయబారం కూడా వ్యర్థమైనందుకు చాలా వ్యధ చెందినాడు చొక్కనాథుడు. ఇక చేసేదిలేక చొక్కనాథుడు రణభేరిని మ్రోయించాడు. విజయరాఘవ నాయకుడు వృద్ధుడైనా యుద్ధానికి వెరగొందలేదు, వెనుకాడలేదు. తన పుత్రుడు మన్నారుదేవుని ప్రక్కబలం అవసరమని నిశ్చయించి అంతకుముందు ఏదో చిన్న రాజకీయపరమైన కారణంగా కారాగారంలో ఉన్న తమ కుమారుడిని విముక్తుని గావించినాడు. ఆత్మబలం అంతకన్నా అత్యధికంగా విజృంభించింది. తన వీరపుత్రుని వెంటబెట్టుకొని భీష్మాచార్యుని వలె యుద్ధ శంఖాన్ని పూరించినాడు విజయరాఘవ నాయకుడు. యుద్ధం ఘోరరూపం దాల్చినది. ఇరుతరపు సైన్యాలు వీరావేశంతో పోరాడ సాగినవి. చివరి దినం ఇక తమకు విజయం చేకూరేది దుర్లభమని గ్రహించిన విజయరాఘవ నాయకుడు తమ పట్టపు దేవేరులను, పుత్రి మోహనాంగిని పిలిచి వారితో యుద్ధం వీడుకోలు అందుకొంటూ, కుమార్తెను చేరదీసి ప్రేమతో ఆమె తలపై నిమురుతూ "అమ్మా మోహనాంగీ! ఈ రోజు యుద్ధం చివరి ఘట్టం! అటో ఇటో తేలిపోగలదు! ఈ యుద్ధాన్ని నాకై నేను కోరి తెచ్చుకొన్నాను! అయినా చివరి శ్వాస ఉన్నంతవరకు పోరాడి మన వంశ గౌరవాన్ని కాపాడగలను!" అన్నాడు. అప్పుడామె ఉద్రేకపూరితయై "మన కులదైవమైన రాజగోపాల స్వామి మీకు చేదోడుగా కదన రంగమున సహకరించగలడు. మీరు విజయోత్సాహంతో తరలండి!" అని వీరతిలకం దిద్ది పంపింది. ఆమె గంభీరమైన మాటలు విజయరాఘవ నాయకులను రణరంగానికి తిరిగి సమాయాత్త పరిచినవి.

కొన్ని ఘడియలకు యుద్ధం భీకరరూపం దాల్చింది. బ్రహ్మాండమైన చొక్కనాథుని సైన్యం ముందు తంజాపుర వీరులు తట్టుకోలేక పోయినారు. విజయరాఘవ నాయకుడు, అతని పుత్రుడైన మన్నారుదేవుడు వీరస్వర్గ మలంకరించారు. చొక్కనాథుని సైన్యం జయజయ ధ్వానాలు చేస్తూ విజయధ్వానాలతో తంజావూరు కోటలోనికి ప్రవేశించారు. కాని అప్పటికే మోహనాంగితో పాటు అంతఃపుర రాణి వాసమంతా అగ్ని ప్రవేశం చేశారు. అపురూప సౌందర్యం అగ్గిపాలై చివరికి మిగిలినది బూడిద మాత్రమే! "రాజ్యం ధ్వంసమైనా, కుటుంబం అగ్గిపాలైనా, కుల గౌరవమే మిన్న!" అని తంజాపుర నాయకరాజ కుటుంబం సర్వం నాశనమైనది. కానీ, తంజాపురాధీశుల అత్యుత్కృష్టమైన కవితాసృష్టి, వారు పోషించిన వందలాది మంది కవీశ్వరులు, కవయిత్రులు రచించిన కావ్యసంపద మహోన్నతమై తెలుగు భాషా ప్రశస్తి వచ్చినప్పుడల్లా వెలుగొందుతూనే ఉంటుంది.

**డా. సగిలి సుధారాణి**
చరిత్ర పరిశోధకులు, రచయిత్రి
హైదరాబాద్, సెల్ : 949 042 8825

# భారతీయ సంస్కృతిని ప్రేమించిన హంగేరీ దేశస్థుడు డా. చార్ల్స్ లూయి ఫాబ్రి



డా. చార్ల్స్ లూయి ఫాబ్రి

*- బి.వి. రామిరెడ్డి*

**డా.** చార్ల్స్ లూయీ ఫాబ్రి హంగరి దేశస్తుడు. నవంబరు 18, 1889లో హంగరి రాజధాని బుడాపెస్ట్‌లో జన్మించాడు. తండ్రి హెన్రిక్ ఫాబ్రి. హోటల్ బిజినెస్ చేసేవాడు. మొదటి ప్రపంచయుద్ధం తరువాత ఆయన వ్యాపారం దెబ్బతింది. వారిది అప్పర్ మిడిల్ క్లాసు కుటుంబం. తండ్రికి థియేటర్‌కి వెళ్లడం, బాలె డాన్సులు చూడడం, సంగీతం వినడం ఇష్టం. ఫాబ్రి పెద్ద సోదరుడు రాల్ఫ్‌కి కళన్నా, కళా చరిత్ర అన్నా ఇష్టం. వారి ఇద్దరు సోదరీమణులు, తల్లి పియానో వాయించేవారు. ఆరేళ్ల వయసులో ఫాబ్రి స్కూలుకెళ్లడం ప్రారంభించాడు. ఫాబ్రికి కళలమీద ఉన్న ప్రేమను తండ్రి ప్రోత్సహించాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో ఫాబ్రి బ్రిటిషు ఆర్మీలో చేరాడు. అప్పటికి మెట్రిక్యులేషన్ పాసయ్యాడు. తన జీవిత కాలమంతా యుద్ధాన్ని, దాని అర్థంలేనితనాన్నిద్వేషించాడు. యుద్ధం తరువాత వారి కుటుంబ సంపద తరిగిపోయింది. అప్పటికి ఫాబ్రి విశ్వవిద్యాలయంలో చేరవలసి వుంది. ఎలాగో పెక్స్ యూనివర్సిటీలో చేరాడు. యూనివర్సిటీ జీవితం ఆరేళ్లూ ఆర్థిక సమస్యలతోనే నెట్టుకొచ్చాడు.

తత్త్వశాస్త్రంమీద తన డిజర్టేషన్ను 1928లో ప్రచురించాడు. ఆయన ఫిలాసఫీ, సైకాలజీ, జర్మన్ భాషా శాస్త్రాలమీద మూడు డాక్టరేట్లు సాధించాడు. ఆయనకు ఓరియంటల్ సాహిత్యం, కళలమీద ఇష్టం ఉండేది. బేల్టాన్ ఫెల్వింజి లూకాక్స్ 1919లో ఫార్ ఈస్టర్న్ ఆర్ట్స్ స్థాపించి తన కలెక్షన్లని భద్రపరిచేందుకు తన విశాలమైన బుడా పెస్ట్ మాన్షన్‌ను సమాజానికిచ్చేశాడు. ఆ పనిలో అతడు ఫాబ్రి సహాయాన్ని తీసుకున్నాడు. దాని ప్రభావం ఫాబ్రి మీద పడింది. లూకాక్స్ ఇండియాను దర్శించాడు. ఆయనలాగే తను కూడ ఆ కలల దేశాన్ని దర్శించాలని నిర్ణయించుకున్నాడు. ఆ రోజుల్లో ఇండాలజీ, ఇండియన్ ఆర్ట్స్ అధ్యయనానికి హంగరిలో అవకాశం లేదు. 1873లో బుడాపెస్ట్ విశ్వ విద్యాలయం సంస్కృత అధ్యయనాన్ని ప్రారంభించినప్పటికి త్వరలోనే ఆ విభాగాన్ని మూసివేశారు. ఆర్థిక సమస్యలతో ఫాబ్రి కుటుంబం హంగరిని వొదిలి ఇటలీకి వెళ్లిపోవలసి వచ్చింది. అప్పుడు కెర్న్ ఇనిస్టిట్యూట్‌లో చేరాడు. అప్పుడు దాన్ని ప్రొ. జె.పి.హెచ్. వొగెల్ నడుపుతున్నాడు. అప్పుడప్పుడు ప్రొ. సిల్వైన్ లెవి నడుపుతున్న పారిస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ సివిలిజేషన్‌కు వెళ్లి అధ్యయనం చేసేవాడు. లేడెన్‌లో అసిస్టెంట్‌గా, కన్సర్వేపిర్‌గా, కార్యదర్శిగా - యాన్యువల్ బిబ్లియోగ్రఫీ ఆఫ్ ఇండియన్ ఆర్కియాలజీ ఎడిటోరియల్ బోర్డులో పనిచేస్తుండేవాడు. మొదటి వాల్యూము ముందుమాటలో తనకు ఎంతగానో సహకరించిన డా. ఫాబ్రిని గొప్పగా మెచ్చుకున్నాడు. ఆ నిస్టిట్యూట్ మూతపడేవరకు ఫాబ్రి అసోసియేట్‌గా పనిచేశాడు. బ్రిటిషు

మ్యూజియంలో కొన్ని నెలలు గడిపాడు. 1932లో సర్ ఆరెల్‌స్టెయిన్ ఆహ్వానం మీద ఆయనతో యాత్రలో పాల్గొన్నాడు. 1933లో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆహ్వానం మేరకు శాంతినికేతన్‌లో, హిస్టరీ ఆఫ్ ఆర్ట్ మీద ఉపన్యసించేందుకు ఇండియా వచ్చాడు. కలకత్తా ఇతర విశ్వవిద్యాలయాల్లో ఉపన్యసించాడు. పంజాబ్ విశ్వవిద్యాలయంలో ఎక్స్‌టెన్షన్ లెక్చర్లిచ్చేందుకు ఆహ్వానింపబడ్డాడు. ఇదివరలో అక్కడ అరెల్ స్టెయిన్ పనిచేశాడు. హరప్పా, మొహంజోదారో తవ్వకాలమీద అభిమానంతో అక్కడికి వెళ్లాడు. ఆరెల్ స్టెయిన్‌తో కలిసి యాన్యువల్ రిపోర్ట్స్ ఆఫ్ ది ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో పనిచేసిన సంగతి అందరికీ తెలుసు.

1931-34 సంవత్సరాల మధ్య ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా ముఖ్యమైన మెటీరియల్ సేకరించేందుకు ఎందరికో సహాయపడ్డాడు. 1936-37 మధ్య లాహోర్ మ్యూజియంను రి ఎరేంజ్ చేసే అవకాశం ఫాబ్రికి దక్కింది. 1938-39లో ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాను వదిలి, పంజాబ్ ఎక్స్‌ప్లోరేషన్ ఫండ్‌లో ఫీల్డు డైరెక్టరుగా చేరాడు. దేశంలో విస్తృతంగా పర్యటించాడు. ఎందరో గొప్ప వ్యక్తులను కలుసుకున్నాడు. గాంధీని కలుసుకున్నాడు. గంధితో ఫాబ్రి ఇంటర్వ్యూ 1939 ఆగస్టు 19 హరిజన్ పత్రికలో ప్రచురింపబడింది.

రెండో ప్రపంచ యుద్ధం ఆయన పనికి ఆటంకం కలిగించింది. 1937 నుండి ఆయన బ్రిటీషు పౌరుడిగా వున్నాడు. యుద్ధం తరువాత ఆయన లాహోర్‌కు తిరిగి వచ్చాడు. అక్కడి మ్యూజియంలోని హరప్పా, మొహంజోదారోలో లభించిన కొత్త వస్తువులను చక్కగా విడదీసి ఆ మ్యూజియంను, ఇండియన్ ఆర్టును బాగా ప్రసిద్ధిపొందేలా చేశాడు. ఇండియా, పాకిస్తాన్ విభజన ఫాబ్రికొక షాక్. మతపిచ్చి ఆయన స్వభావానికి విరుద్ధం. ఆయన ప్రాపంచికవాది. స్వాతంత్ర్యానికి పూర్వం రెండు మతాలనుండి ఆయనకు స్నేహితులున్నారు. 1947లో రత్నమాథుర్‌ను ద్వితీయ వివాహం చేసుకున్నాడు. ఆమె ప్రొ. సి.ఎల్. మాథుర్ కుమార్తె. అప్పుడు లాహోర్ నుండి ఢిల్లీకి వచ్చేశాడు.

స్వాతంత్ర్యం వచ్చిన మొదటి సంవత్సరంలో ఫాబ్రి ఢిల్లీ నేషనల్ మ్యూజియంలో లెక్చరర్‌గా పనిచేశాడు. ది స్టేట్స్‌మన్ పత్రికలో విమర్శకుడిగా పనిచేశాడు. డ్రామా, ఇండియన్ డాన్స్, బాలె కార్యక్రమాలన్నిటికి తప్పక హాజరయ్యేవాడు. ఢిల్లీ కల్చరల్ లైఫ్‌కు సంబంధించిన అన్ని విషయాలమీద ది స్టేట్స్‌మన్ పత్రికకు వ్రాసేవాడు. ఆయన జడ్జిమెంట్ అందర్నీ ఆకట్టుకునేది.

1950-55 మధ్య ఫాబ్రి ఢిల్లీ పోలీటెక్నిక్‌లో లెక్చరర్‌గా పని చేశాడు. ఆర్కిటెక్చర్ డిపార్ట్‌మెంట్ అధిపతి మెస్సర్స్ ఘుమన్, ఆర్ట్ డిపార్ట్‌మెంట్ అధిపతి బి.ఎస్. సన్యాల్‌తో కలిసి పనిచేశాడు. 1959లో ఆ పదవి నుండి వైదొలిగాడు. అప్పటి నుండి జీవితాంతం వరకు తన పబ్లికేషన్స్ మీద; బోలింగర్ ఫౌండేషన్ సపోర్టు మీద ఆధారపడి జీవించాడు. ఆ రోజుల్లో ఇండియా అంతటా సంచరించాడు. ఒరిస్సాను ఎన్నోమార్లు సందర్శించాడు. ఎనిమిది సంవత్సరాలు కృషిచేసి ఒడిస్సీ నృత్యానికి ఇండియన్ క్లాసికల్ డాన్స్‌లో స్థానం కల్పించాడు. దక్షిణ భారతదేశమంతా పర్యటించాడు. కేరళ యూనివర్శిటీలో ఠాగోర్ ఉపన్యాసాలిచ్చాడు. ఖజురహో, అజంతా, బాదామి, హిమాలయాలు, చంబాలోయ, కాశ్మీర్ మొదలైన ప్రాంతాలన్నీ దర్శించాడు. ఈ ప్రయాణాలు ఆయన అధ్యయనానికి, అధ్యయన రచనలకి ఉపయోగపడ్డాయి 1959లో ఇంగ్లండు వెళ్లాడు, యూరోపులో పర్యటించాడు. అక్కడ సంగీతం మీద ఉపన్యసించాడు. ఫ్రాన్స్, వెస్ట్‌జర్మనీ, పోలెండ్, స్విట్జర్లాండ్, హాలండ్, ఇటలీ, యుగోస్లోవియా, తన మాతృదేశం హంగేరీలను దర్శించాడు. తన పాత మిత్రులు ఆర్థర్ కెలెటి, ఎర్విన్ బాక్టేలను తన కుటుంబ సభ్యులను కలిశాడు. రైపర్స్ క్లబ్ విశ్వవిద్యాలయాలను దర్శించాడు. ఫాబ్రి తండ్రి అయ్యాడు. 1950లో క్రిస్టఫర్ గౌతమ జన్మించాడు. కొడుకంటే విపరీతమైన ప్రేమ. అతణ్ణి విద్యావంతుణ్ణి చేసేందుకు అర్పణాభావంతో కృషి చేశాడు.

తన భార్య రత్న లాహోర్ పెయింటింగ్ స్కూల్లో సన్యాల్ దగ్గర చదువుకుంది. ఢిల్లీలో పెయింటింగ్స్ వేస్తూ, వాటిని ఎగ్జిబిట్ చేస్తూ ఉండేది. ఆమెకు ఫోక్ ఆర్ట్స్ అంటే ఇష్టం. సెంట్రల్ కాలేజ్ ఇండ్రస్ట్రీస్ ఎంపోరియంలో చేరింది. హాండిక్రాఫ్ట్, హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో పనిచేసింది. ఆమె ఇంటీరియర్ డిజైనింగ్‌లో ఎక్స్‌పర్ట్. 1966 నుండి ఫాబ్రి గొంతు సమస్యతో బాధపడ్డాడు. అది చివరికి కేన్సర్‌గా పరిణమించింది.

1967లో ఆరోగ్యం క్షీణించింది. ఆయనకు బొంబాయిలోని టాటా హాస్పిటల్‌లో ఆపరేషన్ జరిగింది. ఇలా ఎంతకాలం నెట్టుకొస్తానో తెలియదు – అని మిత్రులతో అంటుండేవాడ. గొంతును పోగొట్టుకోవడం ఆయన్ని భయపెట్టింది.

1968 జూలైన ఫాద్రి మోర్నింగ్ వాక్‌కు వెళ్లాడు. దారిలో ది స్టేట్స్‌మన్ పత్రిక ఆఫీసుకు వెళ్లి, మరుసటిరోజు ఆర్ట్ కార్యక్రమాలను కవర్ చేస్తానని న్యూస్ ఎడిటర్‌తో చెప్పాడు. ఇంటికి వొచ్చి రెండున్నర గంటలపాటు ఒక డాక్యుమెంట్ మీద పని చేశాడు. పొరుగువారిని, ఇంటి వెనక చెట్టక్రింద కూర్చుని వున్న తన సేవకులను పిలిచి, అందరికి నమస్తే చెప్పాడు. ఆయన అలా ఎందుకు చెబుతున్నాడో వారికి అర్థం కాలేదు. కొన్ని గంటల తరువాత ఆయన లేరు. తన పని మీద ప్రేమ ఆయన్ని బ్రతికించింది. కాని వయసు, అనారోగ్యం ఆయన్ని పనిచేయనీయలేదు. మృత్యువు జీవిత భారాన్నించి ఆయన్ని విముక్తుణ్ణి చేసింది. మరునటి రోజు సాయం సంధ్యాసమయంలో, బౌద్ధ సన్యాసుల మంత్రోచ్ఛాటనల మధ్య ఎంతో నేర్చి, మరెంతో ఇచ్చిన ఆయన జీవితరంగానికి తెరపడింది.

ఎక్కడో హంగరిలో జన్మించిన ఫాద్రి జ్ఞానదేవత ప్రోద్బలంతో, దేశదేశాలు తిరుగుతూ జీవితపు చివరి 30 సంవత్సరాల కాలాన్ని భారతదేశానికి అర్పించాడు. ఇండాలజి అంటే ఆయనకు మక్కువ. భారతీయ శిల్పం, కళలు, నాట్యశాస్త్రాలు, సంగీతం, నాటకరంగానికి సంబంధించిన అన్ని విభాగాలను సమగ్రంగా ప్రేమతో అధ్యయనం చేసి, తన విమర్శల ద్వారా ఎంతో విశాలమైన గుర్తింపు తెచ్చాడు. భారతీయ క్లాసికల్ డాన్స్‌కు సంబంధించి భరతనాట్యం, కథకళి, ఒరిస్సి, మణిపురి, కథక్ నృత్యాలమీద శాస్త్రీయ విశ్లేషణ చేశాడు. ముఖ్యంగా ఒరిస్సికి భారతీయ క్లాసికల్ నృత్యపరంపరలో స్థానం ఏర్పరిచేందుకు ఎనిమిదేళ్లు నిరంతర కృషి చేశాడు. ఆయనకు గాంధి, ఠాగూర్, నెహ్రూ, ఇందిర, డా. జాకీర్ హుస్సేన్, డా. రాధాకృష్ణన్‌లాంటి చాలామందితో ఆత్మీయ బంధం ఏర్పడింది. డా. అంబేద్కర్‌లాగ ఫాద్రికి బౌద్ధతత్త్వం అంటే విపరీతమైన ప్రేమ. అందుకే తన కొడుకుకు క్రిస్టఫర్ గౌతమ అని పేరు పెట్టాడు. రాధాకృష్ణన్ బౌద్ధతత్త్వ మంత్రాలు చదువుతూ అతనికి దీక్ష ఇప్పించాడు. ఆయన జ్ఞాని, దయార్ద్రహృదయుడు. ఈ దేశంలోని ఆర్టిస్టులు, పెయింటర్లు, శిల్పులు, నాట్యకళాకారులు ఆయనకెంతో ఋణపడి వున్నారు. ఇంద్రాణి రెహమాన్, యామిని కృష్ణమూర్తి లాంటి కళాకారుల ప్రత్యేకతను గుర్తించి వెలుగులోకి తెచ్చింది ఆయనే. ఆర్టు హిస్టరీ గురించి పాఠాలు చెబుతూ, తనకు తెలిసిన భాషలను కూడ నేర్పుతుండేవాడు. ఆయన బహుభాషాకోవిదుడు. ఆయనకు ఆంగ్లం, ఫ్రెంచి, జర్మన్, హంగేరియన్, డచ్, ఇటాలియన్, స్పానిష్, హిందుస్తాని, సంస్కృతం, పాళి, లాటిన్, పర్షియన్ భాషలేకాక ఇంకా అనేక భాషలను అభ్యసించాడు.

ఒరిస్సా రాష్ట్రంలోని ఎవ్వరికీ తెలియని ప్రాంతాలను వెలుగులోకి తెచ్చాడు. ఆ రాష్ట్రం మీది ప్రేమతో ఒక మోనోగ్రాఫ్ వ్రాశాడు. కాశ్మీరులోని బుద్ధిస్టు టెర్రకోటాలను వెలుగులోకి తెచ్చాడు. ఫాద్రి ఉన్నత హృదయం. అందరినీ ప్రేమించాడు. అందమైన వస్తువులను ప్రేమించడం నేర్పాడు. ఆయన ఎవ్వరినీ ద్వేషించడం, కోపగించడం చేయలేదు. జీవితంలో ఎప్పుడూ ఒక్క అకృత్యం కూడ చేయలేదు. దాతృత్వం, దయ, మంచితనంలాంటి బౌద్ధ సిద్ధాంతాలు, క్రీస్తు బోధనలు ఏకీభవస్తాయని నమ్మాడు. ఫాద్రి నిత్య అధ్యయనశీలి. మహామహోపాధ్యాయుడు. ఆయన అనేక భారతీయ, విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉపన్యసించాడు. అవి ఆక్స్‌ఫర్డ్, పారిస్, లేడెన్, ఆమ్‌స్టర్‌డామ్, ఎస్సెన్, వియన్నా, రోమ్, బెల్‌గ్రేడ్, బీగ్రెబ్, బుడాపెస్ట్, మద్రాసు, లక్నో, కలకత్తా, ఢిల్లీ, అలీఘడ్, ట్రావన్కోర్, మైసూరు, బెంగుళూరు, అన్నామలై, లూథియానా, హైదరాబాద్, కటక్ మొదలైనవి.

ఫాద్రి సామాన్య జీవితాన్ని గడిపాడు. డబ్బు పోగుచేసుకోవడం ఆయనకు తెలియదు. తనకున్నంతలో సంతృప్తిపడేవాడు. ఆయన అనేవాడు – నేను కొన్ని గొప్ప గ్రంథాలను నా వెనుక వదిలి వెళ్లాలనుకుంటున్నాను.

**బి.వి. రామిరెడ్డి**
ఇంగ్లీష్ లెక్చరర్ (రిటైర్డ్) సిద్ధార్థ కాలేజ్,
విజయవాడ, ఫోన్ : 990 885 6530.

# రంగరాజన్ - రిజర్వ్ బ్యాంక్

*- అలజంగి మురళీధరరావు*

**ము**గ్గురు రిజర్వు బ్యాంక్ గవర్నర్ల ఆత్మ కథలు ఇటీవల వెలువడి ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. భారత దేశం అనుసరిస్తున్న ద్రవ్యవిధానము, కోశవిధానము, ఇతర ఆర్థిక విధానాలకు సంబంధించి అత్యున్నత స్థాయి అధికారులైన భారత రిజర్వు బ్యాంక్ గవర్నర్ ఆత్మ కథల ద్వారా ఎంతో విలువైన సమాచారము తెలుసుకొనుటకు వీలౌతున్నది. వై. వేణుగోపాలరెడ్డి, డి. సుబ్బారావు, డా. సి.రంగరాజన్ గార్లు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్లుగా పనిచేసిన వారి వారి ఉద్యోగ సమయాలలో భారత ఆర్థిక వ్యవస్థ ముఖ్యంగా దాని ద్రవ్య విధానము అందులో చోటు చేసుకున్న మార్పులు, అవి తీసుకొచ్చిన ఫలితాలపై వారు ఫస్ట్‌హాండ్ సమాచారమును అందించుట వలన ఈ ఆత్మ కథలకు నేటి ప్రపంచీకరణ లాంటి ఆర్థిక వాతావరణంలో ఎంతో ప్రాసంగికత ఉంది. వై.వి.రెడ్డి, డి. సుబ్బారావు గార్లు తమ ఆత్మ కథలను ప్రజారంజకమైన శైలిలో రచించి వెలువరించగా వీరికి భిన్నంగా సి.రంగరాజన్ తమ "రిజర్వ్ బ్యాంక్-ఇతర సంస్థలు-నా పాత్ర" అనే పుస్తకాన్ని పూర్తి అర్థశాస్త్ర పారిభాషిక పదాలతో రచించి వెలువరించారు. ప్రస్తుత వ్యాసంలో డా. సి.రంగరాజన్ రిజర్వ్ బ్యాంక్-ఇతర సంస్థలు-నా పాత్ర పుస్తకంలో ఉన్న ముఖ్యాంశాలను తెలియజేసే ప్రయత్నంచేస్తాను.

సి.రంగరాజన్ 1982 నుండి మూడు దశాబ్దాలకు మించిన సుదీర్ఘకాలంలో సగభాగం రిజర్వు బ్యాంక్లో గడపడం జరిగింది. పి.వి. నర్సింహారావు, మన్మోహన్ సింగ్ నాయకత్వంలో దీర్ఘకాలిక ప్రభావము గల ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన సమయములో రంగరాజన్ భారతీయ రిజర్వ్ బ్యాంక్ పదవి చేపట్టారు. సంస్కరణలు ప్రవేశపెట్టిన బృందంలో వారు కూడా ఒక భాగస్వామి. ఆ సమయంలో దేశం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కుంటున్నపుడు, ఆ తరువాత సంస్కరణలను నిర్వహిస్తున్నపుడు మాది సాఫీ ప్రయాణం కాదు, అందులో తీవ్రమైన ఆత్రుత, ఆందోళనలు ఉన్నాయని, 1982-2014 మధ్య నా ముందుకు పరిశీలనకు వచ్చిన అంశాలపై నా ఆలోచనలను, నా చర్యలను మీతో పంచుకోవడానికి ఈ పుస్తకాన్ని రాసానని సి. రంగరాజన్ ఈ పుస్తకానికి రాసిన పరిచయంలో అంటారు. ఈ పుస్తక మొదటి భాగంలో అంతర్జాతీయ ద్రవ్యనిధితో ముందస్తు ఏర్పాటు 1991, 1980లో చెల్లింపుల శేషము-ఉత్పన్నమౌతున్న సంక్షోభము, 1980లలో ద్రవ్య విధానము, సంక్షోభ సంవత్సరాలు : 1990-92, ప్రణాళికా సంఘం వద్ద అనే శీర్షికలు ఉన్నాయి. రెండవ భాగంలో స్వయం ప్రతిపత్తి ప్రారంభము, విదేశీరంగము నిర్వాహణ 1992-97, బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేయడం, బ్యాంక్‌ల సామాజిక బాధ్యత, జ్ఞానపునాదిని విస్తరించడం, ఉద్భవిస్తున్న ద్రవ్యవిధాన రూపురేఖలు, పురుషులు మరియు స్త్రీలు వివరాలు అనే ఉపభాగాలు కనిపిస్తాయి. చివరిదైన మూడవ భాగంలో రాజభవన్ రోజులు, ఆర్థిక సమాఖ్యవాదము, ఆర్థిక సంఘ అధ్యక్షునిగా అనుభవాలు, వ్యవస్థతో సంఘర్షణ, ప్రభుత్వానికి సలహా, కొన్ని జ్ఞాపకాలు అనే విభాగాలు ఉన్నాయి.

సి.రంగరాజన్ విద్యాసంస్థల నుంచి నేరుగా రిజర్వ్ బ్యాంక్ డిప్యూటి గవర్నరుగా నియమింపబడిన వారిలో మొదటి వారు. నూతన ఆర్థిక విధానంలోని ముఖ్యమైన అంశాలను వివరముగా తెలియజేసిన మొదటి డాక్యుమెంటు 8వ ప్రణాళిక. ఈ పత్రాన్ని తయారు చేయడంలో ముసాయిదా అధ్యక్షునిగా సి.రంగరాజన్ అధిక బాధ్యత వహించారు. ఈ ప్రణాళిక గురించి వ్రాస్తూ రంగరాజన్ "మన సామాజిక -సాంస్కృతిక వస్త్రాన్ని ఛిద్రము చేయకుండా కేంద్రీకృత ప్రణాళిక ఆర్థిక వ్యవస్థ నుంచి మార్కెట్ నేతృత్వ ఆర్థిక వ్యవస్థగా పరివర్తన

ప్రణాళిక ఇది అంటారు. అదే విధంగా ప్రభుత్వ రంగ సంస్థల వాటాలలో పెట్టుబడి ఉపసంహరణ గురించి పరిశీలించడానికి నియమించబడిన కమిటీకి సి.రంగరాజన్ గారే అధ్యక్షత వహించారు.

1991లో ప్రారంభించిన సంస్కరణల ప్రక్రియలో భాగంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్, ప్రభుత్వము మధ్య సంబంధము కూడా మారాలని భావించబడినది. ఈ నేపద్యంలో రంగరాజన్ 1997 ఏప్రిల్ 1న తాత్కాలిక ట్రజరీ బిల్లుల స్థానంలో భారత ప్రభుత్వానికి వేస్&మీన్స్ ఋణాలు అందించే పథకాన్ని రిజర్వ్ బ్యాంక్ గవర్నరుగా ప్రవేశపెట్టారు. తాత్కాలిక ట్రెజరీ బిల్లుల వ్యవస్థను తొలగించడం ద్రవ్య విధాన నిర్వహణలో రిజర్వ్ బ్యాంక్కు గల క్రియాశీలత స్వయంప్రతిపత్తిని పెంచడానికి సహాయ పడిందని వారు అంటారు. సంస్కరణలు 1991లో ప్రారంభించబడ్డాయి కాబట్టి సంస్కరణల కోసం చేపట్టిన రంగాలలో ఒకటి వడ్డీరేటు నిర్మితి. ఇందులో భాగంగా డిపాజిట్లు, ఋణాలపై వడ్డీ రేటుకు సంబంధించి వాణిజ్య బ్యాంక్లు వాటి నిర్ణయము అవే తీసుకోవాలని అనుమతించడము.

1997 అక్టోబరు నాటికి 30 రోజులు లేదా అంత కన్నా ఎక్కువ కాలం పరిమితి గల డిపాజిట్లపై వడ్డీ రేటును నిర్ణయించే స్వేచ్ఛ బ్యాంకులకు ఇవ్వబడినది. నగదు నిల్వల నిష్పత్తి, మొట్టమొదట, పరపతి నియంత్రణ సాధనంగా ప్రవేశపెట్టబడినది. అట్లాగే చట్టబద్ధ ద్రవ్య నిష్పత్తి మొట్టమొదట నిర్ణయించిన 25% స్థాయినుంచి 1990 సెప్టెంబరు నాటికి 38.5%నికి పెరిగినది. నగదు నిల్వల నిష్పత్తి, చట్టబద్ధ ద్రవ్య నిష్పత్తులు వాటి అసలు విధిని నిర్వర్తించేలా, హేతు బద్ధమైన స్థాయికి తగ్గించడం సంస్కరణల ప్రక్రియలో ఒక భాగము. సంస్కరణలో భాగంగా స్థూల దేశీయ ఉత్పత్తిలో శాతంగా కోశలోటుని 3% శాతానికి తగ్గించడం, అట్లాగే ద్రవ్య మార్కెట్టు, ప్రభుత్వ సెక్యూరిటి మార్కెట్లను విస్తృతపరచడం ఇతర లక్ష్యాలు. దీంట్లో భాగంగా వాణిజ్య బ్యాంక్లు ద్రవ్య మార్కెట్లో మ్యూచ్యువల్ ఫండ్లను ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించడం అన్నది 1992లో తీసుకోబడిన ఒక ప్రధాన చర్య. అదే విధంగా రెపో ద్రవ్య మార్కెట్లో సమతులన శక్తిగా ఉద్భవించింది. 1997-98లో ప్రభుత్వ సెక్యూరిటీలలో వేలం వ్యవస్థ స్థిరపరచబడినది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ద్రవ్య డిమాండ్ ప్రమేయము సహేతుకముగా స్థిరముగా ఉండడముతో, భారతదేశంలో ధరలను నియంత్రించడంలో ద్రవ్య పరిమాణము ప్రధాన పాత్ర నిర్వహించినది.

1992-97 కాలానికి భారత విదేశాంగ నిర్వాహణకు సంబంధించి చేపట్టిన చర్యలు రెండు. ఒకటి, చెల్లింపుల శేషంలోని సౌకర్యవంతమైన పరిస్థితి దృష్ట్యా 1994 ఆగష్టు 20న భారతదేశము అంతర్జాతీయ ద్రవ్యనిధి ఒప్పందములోని 8వ అధికరణము క్రింద బాధ్యతను అంగీకరిస్తూ వర్తమాన ఖాతా లావాదేవీలపై నిషేధాలను తొలగించింది. ఆవిధంగా వర్తమాన ఖాతాలో భారతీయ రూపాయి పరివర్తన సాధించబడినది. రెండు, మూలధన ఖాతా సరళీకరణ- ప్రపంచ వ్యాప్తంగా మూల ధన ప్రవాహంలో అధిక పెరుగుదల పరిణామంగా 1993 నుండి భారత మూలధన ఖాతాలో అంతర్వాహినుల వరద ఏర్పడినది. విదేశాలలోని విద్యాసంస్థలలో ప్రవేశము సంపాదించిన విద్యార్థులందరికి ఉన్నత విద్య కోసం విదేశీమారకద్రవ్యం విడుదల చేయడానికి బ్యాంక్లకు అధికారం ఇవ్వబడినది. ఇది జూలైలో విద్యార్థులు రిజర్వ్ బ్యాంక్ ముందు క్యూలో నిలబడే అవసరాన్ని తప్పించింది. రిజర్వ్ బ్యాంక్ గవర్నరుగా రంగరాజన్ ఆధ్వర్యంలోనే రూపాయి మారకం రేటుకు సంబంధించి మార్కెట్ చేత నిర్ణయించబడే మారకపు రేటు వ్యవస్థ వైపు మొగ్గు చూపడం జరిగినది. 1993 నుండి భారతీయ రిజర్వ్ బ్యాంక్ జోక్యానికి లోబడి ఫ్లోటింగ్ మారకము రేటు యుగంలోకి భారతదేశం ప్రవేశించింది.

బ్యాంకింగ్ సంస్కరణలు 3 ప్రధాన లక్ష్యాలతో జరిగాయని అంటారు రంగరాజన్. మొదటిది, బ్యాంక్ల గణన లెక్కలు పారదర్శకంగాను, పోల్చదగినవిగాను ఉండాలి. గణక నియమాలు ఈ పని చేసాయి. రెండవ లక్ష్యం, భద్రతా నియమాలను ప్రవేశపెట్టడం ద్వారా బ్యాంకుల ఆర్థిక ఆరోగ్యాన్ని బలోపేతము చేయడం, మూల ధన పర్యాప్తి ప్రమాణము మూల ధనాన్ని మరింత పెంచడానికి దారితీసింది. మూడవ లక్ష్యం, కొత్త బ్యాంక్లకు లైసెన్సు ఇవ్వడం ద్వారా బ్యాకింగ్ వ్యవస్థల పోటీ తత్వాన్ని పెంచడం. నమ్మకము, నిబద్ధత ద్వారా సంస్కరణలు నిర్వహించబడ్డాయి అంటారు రంగరాజన్.

పేదలకు పరపతిని అందించడానికి స్వయం సహాయక బృందాలు-బ్యాంక్ పరపతి అనుసంధాన పథకము లాంటివి కొత్త ప్రయోగాలుగా నిలిచాయని ఇవి ఆర్థిక సమ్మిళితానికి ప్రారంభము అని వారు రాసారు. అట్లాగే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకము వంటి అనేక కార్యక్రమాల ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు చెల్లించడానికి వీలు కల్పించే ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ఒక ప్రధాన పరిణామంగా అభివర్ణిస్తూ అది ఛిద్రాలను నిరోధిస్తుంది అంటారు రంగరాజన్.

2008 సంక్షోభం ముందు, తరువాత సంవత్సరాలలో, ఆర్థిక స్థిరత్వం మీద రిజర్వ్ బ్యాంక్ దృష్టి కేంద్రకరించింది. 2016లో రిజర్వ్ బ్యాంక్ నూతన ద్రవ్య విధాన చట్రం వైపుకు కదిలింది. దానిని సరళ ద్రవ్యోల్బణ లక్ష్యీకరణగా వర్ణించబడినది. వడ్డీరేటు (రెపోరేటు) క్రియాశీలక లక్ష్యంగా తయారయినది. భారతదేశ ద్రవ్య విధాన లక్ష్యాలను గురించి మాట్లాడుతూ ఒక సందర్భంలో రంగరాజన్ ఇలా చెప్పారు. విస్తృత అర్థంలో, మొత్తం మీద ఆర్థిక విధాన లక్ష్యాలకు ద్రవ్య విధాన లక్ష్యాలు భిన్నంగా ఉండవు. భారతదేశంలో ద్రవ్య విధానం విశాల లక్ష్యాలు: 1. సహేతుకమైన శ్రేణిలో ధరల స్థిరత్వం నిలబెట్టడం.

2. ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి తోడ్పడడం. ధరల స్థిరత్వాన్ని ఆధిపత్య లక్ష్యంగా స్వీకరించడానికి కారణం ద్రవ్యోల్బణం ఆర్థికంగా, సామాజికంగా చాలా వ్యయపూరితమైనది కావడము. ముఖ్యంగా సాంఘిక వ్యయాలను అంచనా వేయడం కష్టం. ద్రవ్యోల్బణం సంపన్నుల కంటే పేదవారిని అధికంగా ఇబ్బంది పెడుతుంది అన్నది సుస్పష్టము. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో కేంద్రబ్యాంకులు ద్రవ్యోల్బణ విషయంలో అప్రమత్తంగా ఉండాలంటారు వారు. భారతదేశం వంటి ఆర్థిక వ్యవస్థలు సరళ ద్రవ్యోల్బణ లక్ష్యీకరణ విధానాన్ని అనుసరించడము ఉత్తమము. అది ధరల స్థిరత్వము, వృద్ధి లక్ష్యాలు రెంటిని సమన్వయ పూర్వక విధానములో తృప్తి పరుస్తుంది అని రంగరాజన్ గారు అభిప్రాయపడ్డారు.

రంగరాజన్ భారతీయ రిజర్వ్ బ్యాంక్ గవర్నరుగా ఉన్న కాలంలోనే స్వయం సహాయక బృందాల ఉద్యమము ఊపందుకొన్నది. బ్యాంకుల సామాజిక బాధ్యతలలో భాగంగా రంగరాజనికి ఈ ఉద్యమం పట్ల సాత్విక భావం ఉంది. ఇటువంటి బృందాలకు ఋణాలు ఇవ్వడం కూడా సాధారణ బ్యాంకింగ్ కార్యకలాపంగానే నిర్వహించడానికి ఆయన అనుమతించారు. భారతదేశంలో ఆర్థిక సమాఖ్యవాదాన్ని బలోపేతం చేసే దిశగా ఆర్థికసంఘం అధ్యక్షునిగా రంగరాజన్ చేసిన ఆలోచనలు ఎన్నదగినవి. రాష్ట్రాల పన్ను విధింపు అధికారాలను పెంచడంలో ఆదాయపన్ను విధించడానికి రాష్ట్రాలను అనుమతించడం ఒకటి, "స్థానిక ప్రాధాన్యత" కలిగిన ఎంపిక చేయబడిన నిర్దిష్ట వస్తు సేవలమీద అదనపు సుంకాన్ని విధించడానికి అనుమతించడం. మూడు దశాబ్దాల తరువాత మాత్రమే భారతదేశ జనాభా స్థిరీకరింపబడుతుంది. అది కూడా 1.6 బిలియన్ల అధికస్థాయి వద్ద. భవిష్యత్తుకు చెందిన తయారీ, సేవా రంగాలకు భిన్నమైన శిక్షణా, నైపుణ్యాలు అవసరము. మన విద్యా వ్యవస్థని పునర్నిర్మించాలంటూ 90లలోనే వెల్లడించిన రంగరాజన్ అభిప్రాయాలు ఎంతటి ప్రాధాన్యత కలిగినవో నేడు మనం అర్థం చేసుకోవలసి ఉంటుంది.

1991లో ప్రవేశపెట్టిన సంస్కరణల అజెండాలోని మౌళిక అంశాలలో ఒకటి కోశ లోటును నిరోధించడం. కోశ బాధ్యత, బడ్జట్ నిర్వాహణ చట్టం-2003 ఆమోదించిన తరువాత ఇది ఒక నిర్దిష్ట రూపం పొందింది. భారతదేశ ప్రభుత్వం యొక్క కోశలోటు స్థూల దేశీయోత్పత్తిలో 3% మించకూడదని అది నిర్దేశించింది. రాష్ట్రాలు కూడా అటువంటి చట్టాలు చేయడానికి కొన్ని ప్రోత్సాహకాలు ఇవ్వడానికి ముందుకు వచ్చిన రంగరాజన్ అధ్యక్షతన గల పన్నెండవ ఆర్థిక సంఘం నివేదిక తరువాత, కొద్ది కాల వ్యవధిలో అన్ని రాష్ట్రాలు కూడా తమ కోశ లోటుకు రాష్ట్ర దేశీయ ఉత్పత్తిలో 3% పరిమితి నిర్ణయిస్తూ చట్టాలు చేసాయి.

2002-2014 మధ్య రంగరాజన్ అధ్యక్షత వహించిన కమిటీల జాబితా పరిశీలిస్తే భారతదేశ ఆర్థిక వ్యవస్థ దశ దిశని నిర్దేశించడంలో రంగరాజన్ పాత్ర, కృషి అర్థమౌతుంది. కమిటీలు వరుసగాపెట్రోలియం ఉత్పత్తుల ధరల నిర్ణయం, పన్ను విధింపు కమిటీ (2006 ఫిబ్రవరి), ఆసియా, పసిఫిక్‌లలో ఎయిడ్స్ స్వతంత్ర కమీషన్

(2006-08), ఆర్థిక సమ్మిళిత కమిటి (2006-08), పొదుపు పెట్టుబడుల అంచనాల ఉన్నతస్థాయి కమిటీ (2008-09), జాతీయ ఆహార భద్రత, నీళ్ళు 2010 మీద నిపుణుల కమిటీ నివేదిక అధ్యక్షుడు, ప్రధాన మంత్రి ఏర్పాటు చేసిన జమ్మూ కాశ్మీర్ కొరకు ఉపాధి ప్రణాళిక రూపకల్పన నిపుణుల కమిటి (2011), ప్రభుత్వ వ్యయ సార్థక నిర్వహణ కొరకు చర్యలు సూచించడం కోసం ఉన్నత స్థాయి నిపుణుల కమిటి (2011), హైడ్రోకార్బన్ అన్వేషణలో భవిష్యత్తు ఉత్పత్తి వాటా ఒప్పందాల డిజైన్కి పరిశీలన కమిటి (2012), పంచదార రంగంపై నియంత్రణ తొలగింపు కమిటి (2012), పేదరికము కొలమాన పద్ధతిపై సమీక్షపై నిపుణుల కమిటి (2014) కొన్ని ఆసక్తికరమైన సంఘటనలు:

1993లో రూపాయి బలహీనపడుతుందనే ఊహాగానాలకు భిన్నంగా రిజర్వ్ బ్యాంక్ గవర్నరుగా రంగరాజన్ తీసుకునే చర్యలు రూపాయి బలోపేతం అవ్వడంతో వారికి బెదిరింపు కాల్స్, బాంబ్ బెదిరింపు కాల్స్ వస్తాయి. అప్పుడు అతను కార్యాలయము వదిలి వెళ్ళవలసి వచ్చింది. అయితే బాంబ్ స్క్వాడ్ వారికి ఏవిధమైన బాంబ్ కనబడలేదు. అది ఉత్తుత్తి బెదిరింపుగా తేలిపోయింది అంటూ రంగరాజన్ రాస్తారు. అలాగే ఇంకో సంఘటన వివరిస్తూ నేను అధ్యక్షత వహించిన రెండు సంఘాల నివేదికలు బ్యాంకింగ్ పరిశ్రమలో కంప్యూటరీ కరణకు పునాది వేసాయి. కంప్యూటరీకరణ పట్ల ఎంత ఎక్కువగా వ్యవతిరేకత ఉన్నదో నేను ఇక్కడ తెలియ జేయాలి. రిజర్వ్ బ్యాంక్ డిప్యూటి గవర్నరుగా నేను ఢిల్లీ భారతీయ స్టేట్ బ్యాంక్ కార్యాలయంలో స్టేట్ బ్యాంక్ బోర్డు సమావేశానికి వెళ్ళినపుడు బ్యాంక్ ఉద్యోగులు నన్ను చుట్టుముట్టారు. నా కోటు చిరిగింది. దానిని ఒక మెమెంటో లాగా చాలా కాలం భద్రపరిచి ఉంచాను" అంటారు.

ఇంకో ఆసక్తికరమైన విషయాన్ని రంగరాజన్ ఈ పుస్తకంలో నమోదు చేసారు. వారి మాటలలోనే "గణతంత్ర దినోత్సవాలలో పాల్గొనడంలోనే నిజమైన సమస్యలు ఎదురైయ్యాయి. సాధారణంగా రాష్ట్రాలలో స్వాతంత్ర దినోత్సవం నాడు ముఖ్యమంత్రి జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. కాని గణతంత్ర దినోత్సవం నాడు గవర్నరు ఎగురవేస్తారు. రెండు రాష్ట్రాలకు ఒకరే గవర్నరుగా ఉన్నప్పుడు ఇది సాధ్యం కాదు" తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలకు వారు గవర్నరుగా ఉండగా ఈ పరిస్థితి తలెత్తినపుడు ఆ సమస్యను ఎలా పరిష్కరించు కున్నారన్నది పుస్తకములో చదివి తెలిసుకుంటే బాగుంటుంది.

ఇంకో ఫన్నీ సంఘటన గురించి ఇలా రాసారు "ఒడిస్సాలో నా పదవీకాలంలో రథోత్సవము సంధర్భంగా నేను పూరి సందర్శించాలని నా కార్యదర్శి చెప్పారు. అందరు గవర్నరులు ఆ పని చేసారని అన్నారు. నేను సంకోచించాను. లౌకిక ప్రజాస్వామ్యంలో ఒక గవర్నరు ఒక మతపరమైన ఉత్సవంలో పాల్గొనవచ్చా అని నాకు సంశయం కలిగినది. నా సంకోచాన్ని గమనించి నా కార్యదర్శి సార్ మీరు వెళ్ళకుండా ఉండవచ్చు. కానీ ఈ సంవత్సరం వానాకాలంలో వర్షాలు పడకపోతే రథోత్సవంలో మీరు పాల్గొనని కారణంగా అలా జరిగిందని మిమ్మల్ని నిందించవచ్చు అని అన్నారు. సంకోచము మాని నేను వెళ్ళాను. ఇలాంటిదే ఇంకోక సంఘటన గుర్తు తెచ్చుకున్నారు ప్రధానమంత్రి వాజ్పేయి పాల్గొన్న ఒక కార్యక్రమానికి వెళ్ళి తరువాత నేను హైదరాబాదు తిరిగి వస్తున్నాను. హైదరాబాదు నుండి ప్రధానమంత్రి పుట్టపర్తి వెళ్తున్నారు సత్యసాయిబాబాని కలవడానికి. హైదరాబాదులో నేను ఆగిపోతాను, నన్ను మన్నించమని ప్రధానమంత్రిని కోరాను. ప్రధానమంత్రి దయతో "సరే" అన్నారు. వారి ముఖం మీద విశాలమైన నవ్వు కనిపించింది.

హైదరాబాదులో ఉన్న రోజులలో ఒక ప్రమాదము గురించి నివేదిస్తూ ఇలా రాసుకున్నారు. రంగరాజన్ 2011లో మేము నిదురపోతున్నపుడు మా పక్కమీది కప్పులో కొంత భాగము నా భార్య మీద, నా మీద రాలి పడింది. నాకు పెద్దగా దెబ్బలు తగలలేదు గాని, నాభార్యకు తగిలినది. మోకాలు కింద ఆమెకు బాగా రక్తస్రావం అయ్యింది. సిబ్బంది శబ్దం విని వెంటనే వచ్చారు. అది వేకువజాము, నా భార్యని వెంటనే ఆసుపత్రికి (నిమ్స్) తరలించ వలసివచ్చింది. చంద్రబాబునాయుడుకి సందేశం వెళ్ళింది. మేము ఆసుపత్రి చేరే సరికే ఆయన అక్కడ ఉన్నారు. నా భార్యకి పిక్కకండరము శుభ్రం చేసి, శస్త్ర చికిత్స చేసి గాయానికి కుట్లు వేసి, కట్టు కట్టేటప్పటికి గంటపైన పట్టింది. ఆసుపత్రి నుంచి మేము రాజభవన్ అతిధి గృహానికి వెళ్ళాము. నేను నా పదవీకాలం

ముగిసేవరకు అక్కడే ఉన్నాము. ఆ ప్రమాదము చాలా మంది దృష్టిని ఆకర్షించింది. ఆంధ్రప్రదేశ్ ప్రజలు మమ్మల్ని ఎంత ప్రేమించారో, గౌరవించారో కూడా ఆ సంఘటన తెలియజేసింది. సున్నం మీద ఉంచిన సిమ్మెంటు అతుకు వలన ఆ ప్రమాదం జరిగిందని మాకు తరువాత తెలిసింది. రాజభవన్ భవనము 1936లో నిర్మించారు. అది అంతా సున్నముతోనే కట్టబడింది. కప్పులోపల పగులును కవరు చేయడానికి ఎవరో ఇంజనీరు సిమ్మెంటు పెట్టించారు. అది పొరపాటు. సిమ్మెంటు, సున్నము స్నేహితులు కావు అవి రెండు అతకవు అని నాకు చెప్పారు. ఆ పొరపాటుకు నాభార్య మూల్యము చెల్లించింది.


ఇంకో ఆసక్తికరమైన విషయాన్ని రంగరాజన్ ఇలా పంచుకున్నారు 1997లో నేను భారతీయ రిజర్వ్ బ్యాంక్‌ని విడిచి వచ్చేటప్పుడు ఆర్థిక మంత్రి పి. చిదంబరం నాకు పద్మవిభూషణ్ పురస్కారం ఇవ్వాలని గట్టిగా సిఫార్సు చేస్తూ దేశీయాంగ మంత్రికి ఉత్తరం రాసారు. ఆ సమయములో ఇంద్రజిత్ గుప్త దేశీయాంగ మంత్రి. ఒక రాష్ట్ర గవర్నరుకు పద్మపురస్కారం ఇవ్వవచ్చునా అని ప్రశ్నిస్తూ అభ్యంతరము లేవనెత్తారు. ఇంద్రజిత్ గుప్తా మీదా గౌరవంతోనే అంటున్నాను, ఇదే వాస్తవ కారణమా లేదా ఒక "సరళీకరణ" వాదికి పురష్కారం ఇవ్వడానికి ప్రాథమిక అభ్యంతరమా నాకు తెలియదు. ఏదిఏమైనా అది జరగలేదు. జీవితంలో అనేక ఇతర విషయాలలోలానే ఇది కూడా ఒక అవకాశ క్రీడ. కొన్నిమార్లు అర్హత గల వారికి పురస్కారాలు రావు, కొన్నిమార్లు అర్హత లేనివారికి వస్తాయి. ఉదాహరణకు ఆర్థిక శాస్త్రంలో పి.ఆర్ బ్రహ్మానంద పద్మవిభూషణ్ పురస్కారానికి మిక్కిలి అర్హత గలవారు. ఆయన వృత్తి రీత్యా విశిష్ఠత గల వ్యక్తి. ఒక ప్రత్యేక ఆలోచనా విధానాన్ని సమర్థిస్తూ ఒంటరిగా నిలబడ్డారు. ప్రణాళికా వ్యూహం మీద ఆయన అభిప్రాయాలు సరైనవని తరువాత ఋజువు చేయబడ్డాయి. ఆయనకు పురస్కారం ఇవ్వాలని నేను పలుమార్లు రాసినప్పటికి అది సఫలీకృతం కాలేదు.

డా. సి.రంగరాజన్ గారి పుస్తకం "రిజర్వ్ బ్యాంక్, ఇతర సంస్థలు – నా పాత్ర" ను తెలుగులోనికి అనువాదము చేసిన డా. ఎ. లీలామోహన్ రావు గారు ఈ పుస్తకం అనువాదంలో కొన్ని ఆంగ్ల పదాలను, కొన్ని అర్థశాస్త్ర పారిభాషిక పదాలను తెలుగు చేసిన విధానము కొత్త ఒరవడిని వేసాయని చెప్పవచ్చు. ఈ పదాలను ఇక ముందు అర్థశాస్త్ర సాహిత్యాన్ని అనువాదం చేసే వారెవరైన ప్రామాణికంగా తీసుకొని వాడుకోవచ్చు.

**అలజంగి మురళీధరరావు**
**ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు,**
**విశాఖపట్టణం, ఫోన్ : 9440335461**

## కమ్మతెమ్మెర

***మిసిమి*** *సంపాదకవర్గానికి నమస్కారములు.*



*అట్టమీద చిత్రాలు వెన్నెల బొమ్మ – అన్నులమిన్న. వెన్నెల చిన్నది పడుచులా మనసు వెన్నెలయ్యింది. అన్నుల మిన్న చిత్రం* ***మిసిమి****కే అందాన్నిస్తుంటే నా మనసు రాగరంజితమయ్యింది.*

*వందేమాతరం భారతదేశ స్వాతంత్ర్య సమరానికి సమరశంఖం పూరించిన గీతం. ఈ నాటికీ వందేమాతరం నినాదం ప్రజాహృదయాలలో స్ఫూర్తిని కల్గిస్తూనే వుంటుంది. ప్రాతఃస్మరణీయులు బంకిమ్‌చంద్రుని కీర్తి ఈ గీతం తరతరముల వారినీ చైతన్యం కల్గిస్తూనే వుంటుంది. రచయితకు ధన్యవాదములు. మహనీయులు దేవులపల్లి రామానుజరావు గారి దేశసేవ–భాషాసేవ–అంకిత భావంతో అపూర్వమైన కృషి సాగించారు. ఇవాళ అలాంటి సేవాతత్పరులున్నారా? అనిపిస్తున్నది. శ్రీమతి వెంకటలక్ష్మి గారు తన రచన ద్వారా రామానుజరావు గారిని దర్శింపచేసారు.*

*నిజంగా మన కాలపు కాళిదాసు అందెశ్రీ. ఆయన లోకమనే విశ్వవిద్యాలయంలో పట్టభద్రుడు. తెలంగాణా రాష్ట్రగీతం ద్వారా గురజాడ–రాయప్రోలు సరసన చేరారు. ప్రతినెలా మొదటివారంలో మాంచి విందు భోజనం అందిస్తున్న* ***మిసిమి****కి నీరాజనం అందిస్తున్నాను.*

***– చెరుకువాడ వెంకటరామయ్య, విస్సాకోడేరు, ఫోన్ : 9542118184***

# జార్జి ఆర్వెల్

– డా.జె. రవీంద్రనాథ్



జార్జి ఆర్వెల్

పెట్టుబడిదారీ దేశాల కూటమి ఆధునిక టెక్నాలజీ వాడి యుద్ధబీభత్సం సాగిస్తున్న ఈనాడు ప్రగతిశీల శక్తులను, ఇతర ప్రతిపక్షాలను రాజకీయంగా నిర్మూలించే ప్రయత్నం చేసి ఏక పక్ష నిరంకుశత్వానికి వేగంగా సాగుతోంది. ఈ సంపూర్ణ నిరంకుశత్వం నిరసన సహించదు. ప్రతి ఉద్యమంలో ప్రజల వెతలు, ఆకాంక్షలను కాకుండా 'విదేశీ హస్తం' బూచిని చూపించి అణచివేయాలని కుటిల, అమానవీయ యత్నం జరుగుతోంది. ఈ సమయంలో జార్జి ఆర్వెల్ రచనల పరిశీలన కొంత ప్రయోజనకరంగా ఉంటుంది.


జార్జి ఆర్వెల్ (ఎరిక్ బ్లెర్ అసలు పేరు) తన నవలలు, ఏనిమల్ ఫార్మ్, 1984ల ద్వారా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన గొంతుకను వ్యంగ్యంగా, బలంగా వినిపించిన రచయిత. గతంలో ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అతని మీద సామ్యవాద వ్యతిరేకి అని ఎన్నో విమర్శలు వచ్చినా ఆర్వెల్ తన్ను తాను ప్రజాస్వామ్య సోషలిస్టుగా చెప్పుకున్నాడు. స్పానిష్ అంతర్యుద్ధంలో రిపబ్లిక్ శక్తుల పక్షాన యుద్ధరంగంలో పోరాడిన ఆర్వెల్ తన అనుభవాల్ని హోమేజ్ టు కాటలోనియా (1947)లో రాశాడు. ఇది నాటి స్పానిష్ అంతర్యుద్ధంలో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన భిన్న శక్తులు, వారి మధ్య విభేదాలు, యుద్ధంలోని అనిశ్చిత స్థితిని బాగా చిత్రించింది. ఆర్వెల్ తన ఏనిమల్ ఫార్మ్ నవలలో వాడిన "అందరూ సమానమే, కానీ కొందరు మిగిలిన వారి కన్న ఎక్కువ సమానం" అనే వాక్యం, 1984 నవలలో వాడిన Doublespeak, Thought Police అనే పదాలు ప్రాచుర్యం పొందాయి.

ఏనిమల్ ఫార్మ్ (1945) నవలలో జంతువులు అన్నీ తమ యజమాని జోన్స్ మీద తిరుగుబాటు చేసి తరిమి వేస్తాయి. తొలుత అందరూ సమానమే అంటాయి. తరువాత నేతలుగా ఉన్న నెపోలియన్ , స్నోబాల్‌ల మధ్య అధికార పెనుగులాటలో స్నోబాల్‌ను తరిమేసి నెపోలియన్ పందుల సాయంతో నియంతగా వ్యవహరిస్తాడు. బాక్సర్ అనే గుర్రం విధేయతతో పని చేసి చివరకు బలి అవుతుంది. స్క్వీలర్ అనే పంది నియంతకు భజ్రాజు పొగడ్తలు చేస్తుంటుంది. చివరకు అనిమల్ ఫార్మ్ పేరు మార్చి మేనర్ ఫార్మ్ అని పెడతారు. అధికారం, అవినీతి, సంపూర్ణ నిరంకుశత్వ వ్యతిరేక నవల ఇది.

1984 (1949) నవలలో ఓషానియా అనే రాజ్యంలో విన్స్టన్ స్మిత్ పార్టీ కార్యకర్త. అతడు జూలియా అనే తోటి కార్యకర్తను మొదట గూఢచారి అని అనుమానిస్తాడు. కానీ తరువాత కాదు అని తెలిసి ప్రేమిస్తాడు. కానీ ప్రేమ, శాంతి, సంస్కృతి ఇలా అన్నింటికి ఆ రాజ్యంలో మంత్రిత్వ శాఖలు ఉంటాయి. ప్రేమ మీద నిషేధం. రాజ్యం ద్వంద్వ వైఖరి, యుద్ధం అంటే శాంతి లాంటి సూక్తులతో రుజువవుతోంది. పాత విప్లవకారుల పైన విచారణ, మరణ శిక్షల అమలు. స్మిత్, జూలియాలను గూఢచారులుగా అన్ని పను చేయించిన ఓ బ్రెయిన్ వారి మాటలు, పను రికార్డు చేయిస్తాడు. అన్నింటి మీద, అందరి మీదా పెద్దన్న నిఘా కన్ను. వ్యవస్థ మీద తిరుగుబాటుగా ప్రేమలో పడి తమ ప్రేమ కలాపం ఎవరికీ తెలియదని స్మిత్, జూలియా భ్రమిస్తారు. చివరికి అరెస్టు అయ్యి చిత్ర హింసల పాలయ్యి ద్రోహం చేసుకుని ఒకరి నొకరు

శాశ్వతంగా విడిచి పెడతారు. వ్యక్తిత్వం కోల్పోయిన స్మిత్ చివరలో 'పెద్దన్న వర్తిల్లాలి' అని నినదిస్తాడు.

ఆర్వెల్ మరో నవల Keep the Aspidistra Flying (1936) దీనిలో వ్యవస్థపై మధ్య తరగతి యువకుని నిరసన ఎలా ముగుస్తుంది చెప్పాడు. నవల్లో నాయకుడు గోర్డాన్ కొంస్టాక్‌కు డబ్బు పొడ అసలు గిట్టదు. తాను గొప్ప కవిని కావాలని, ప్రియురాలు రోజ్ మేరీనీ పెళ్లాడాలి అని, తనను సదా కాపాడే చెల్లెలు జూలియా బాకీ తీర్చాలని అతడి ఆకాంక్ష. తన పుస్తకానికి వచ్చిన బహుమతి డబ్బు చెల్లికి, స్నేహితుడు రావెల్స్టన్‌కి పార్టీ పైన ఖర్చు చేస్తాడు. మిత్రుల, శ్రేయోభిలాషుల సలహాలు పెడచెవిన పెడతాడు. తన కవిత్వ పుస్తకం పారేస్తాడు. రోజ్ మేరీ తన వల్ల గర్భవతి అయిందనే విషయం తెలిసే తిరిగి తన పాత కంపెనీకి వెళ్లి ప్రకటనల కాపీ రైటర్‌గా స్థిర పడి, రోజ్ మేరీనీ పెళ్ళాడి ఇల్లు కొనుక్కొని ఆస్పీడిస్ట్రా మొక్కను కిటికీలో పెడతాడు. వాస్తవ శిలపై ఆదర్శ తరంగం పగిలి ఒక ఎదుగుతున్న కవి, నాన్ కన్ఫార్మిస్ట్, ఆత్మ న్యూనత గల యువకుడి అంతిమ రాజీని ఈ నవలలో ఆర్వెల్ బాగా చిత్రీకరించాడు. ఆర్వెల్ తన ఫాసిజం మరియు ప్రజాస్వామ్యం (1941) అనే చిరు పుస్తకంలో సోషలిస్టులు ప్రజాస్వామ్య శక్తులతో కలిసి పోరాడితేనే ఫాసిజం నాశనం అవుతుందని చెప్పాడు. ఆయన దృష్టిలో ఫాసిజానికి, బూర్జువా ప్రజాస్వామ్యానికి మధ్య వ్యత్యాసం ఉంది. ప్రజల మనసులో అస్పష్ట రూపంలో ఉన్న సోషలిజం కన్నా జాతీయ వాదం బలవత్తరంగా ఉంది. పశ్చిమ ఐరోపాలో సోషలిజం వదిలి వేసిన ఆశయం అయింది. ప్రజాస్వామ్యం మిథ్య కాదని, ప్రజాస్వామ్య విలువలు మార్క్సిజం చెబుతున్నట్లు ఉపరితలంలోనివి లేదా భ్రాంతి కాదని ఆర్వెల్ వాదన.




సంపూర్ణ నిరంకుశత్వం అంటే సాహిత్యానికి చరమ గీతం. ప్రజాస్వామ్యంలో ప్రజలకు స్వేచ్ఛ చట్టం కన్నా ప్రజాభిప్రాయంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. చెడు పోవాలంటే దానితో పోరాడి ఓడించాలి. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జర్మనీ సామూహిక నిర్బంధ శిబిరాలను నడిపింది. అటువంటి ఫాసిజం బ్రిటన్లో రాదని ఉదాసీనంగా ఉండరాదని ఆర్వెల్ హెచ్చరించాడు.

ఆర్వెల్ తన విగాన్ పీర్‌కు రహదారి (1937) అనే పుస్తకంలో మైనింగ్ కార్మికుల కడగండ్లు క్షేత్ర పరిశీలన ద్వారా బాగా చిత్రీకరించాడు. దానిలో సోషలిజంపై తన భావాలకు కొన్నింటికి ఇప్పటికీ ప్రాసంగికత ఉంది. తన విమర్శలో ఆర్వెల్ సోషలిస్టులు వేష భాషల్లో శ్రామిక ప్రజలకు దూరంగా ఉంటున్నారని, మామూలు కార్మికుడికి సోషలిజం అంటే ఆర్థికంగా బాగుపడి తన కుటుంబం, సరదాలు అలాగే ఉండాలని భావిస్తున్నారని అంటాడు. సోషలిస్టు రచయితల నుంచి ఉన్నత స్థాయిలో రచనలు రాలేదని, వారు బూర్జువా వర్గాన్ని తిట్టడమే కానీ తమకు కావలసిన ఆదర్శ సమాజం గురించి చెప్పడం తక్కువ అయిందని ఆర్వెల్ విమర్శించాడు. దీని వల్ల సహజంగానే సోషలిజం వైపు రావాల్సిన వారు కూడా దూరం అవుతున్నారని చెప్పాడు.

సోషలిస్టు సమాజం మరింత యాంత్రికీకరణ, ఎంతో వ్యవస్థీకృత భావిని, ఆత్మ రహిత భౌతికవాద ఉటోపియాను ప్రజల ముందు పెట్టారు. సోషలిజం మన ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా వచ్చే చారిత్రక ఆవశ్యకత అనే వాదం హిట్లర్‌ను ఆపలేకపోయింది అని చెప్పాడు. సోషలిస్టులు ఇప్పటికే మారిన వారిని కాకుండా, ఇంకా మారకుండా ఉన్న తటస్థులను సోషలిస్టులుగా చేయడం వాటినితక్షణ కర్తవ్యం అని ఆయన చెప్పాడు. మామూలు వ్యక్తులు కూడా సంప్రదాయం, క్రమశిక్షణ పేరుతో ఫాసిజం వైపు పోయే అవకాశం ఉంది. దీనిని ఆపాలంటే సోషలిస్టులు న్యాయం, స్వేచ్ఛ నినాదాలను తిరిగి పైకి తెచ్చి వాటి కోసం త్రికరణ శుద్ధిగా నిలబడాలి అని ఆర్వెల్ భావన. ఈనాడు మతతత్వ ఫాసిజం పెరుగుతున్నపుడు సోషలిస్టు శక్తులు సంప్రదాయంలో హేతు రహిత అంశాలను వ్యతిరేకిస్తూనే ఇతర ప్రగతిశీల పార్టీలతో ఐక్య కార్యాచరణతో ప్రజాస్వామ్యంలో విజయం సాధించాలి.

**డా. జె. రవీంద్రనాథ్**
ఫోన్ : 897 813 1585

# సృజనాత్మకతకు ప్రతీకలు - వస్త్రాలు

- ప్రొ. తంగెడ కిషన్‌రావు

**మా**నవుడు ఆటవిక దశలో, చెట్ల - ఆకులను, పండ్లను, దుంపలను, వేర్లను తింటూ, వాటి ఆకులను వస్త్రాలుగా కప్పుకునేవాడు. ఈ విధంగా మనిషికి ఒక దశలో చెట్టు ఆహారమైంది. తర్వాత వస్త్రంగా కూడా ఉపయోగపడింది. వేటాడే దశకు చేరుకున్న పిదప జంతు మాంసాన్ని ఆహారంగా, జంతు చర్మాన్ని వస్త్రంగా చుట్టుకొని జంతువుపైనే ఆధారపడినాడు. ఇదే విషయాన్ని క్రైస్తవుల పవిత్ర మతగ్రంథమైన బైబిల్ కూడా తెలియజేస్తోంది. బైబిల్ ప్రకారం- ఆదాం, అవ్వలు యెహోవా సృష్టించిన మానవులు. మొట్టమొదటగా దుస్తులను చెట్ల ఆకులతో తయారు చేసుకొన్న వారు కూడా వీరే! తర్వాత దేవుడైన యెహోవా చర్మపు చొక్కాలు తయారుచేసి వారికిస్తాడు.

అరణ్యవాసంలో - సీతారామ లక్ష్మణులు చెట్టుకు సంబంధించిన నార వస్త్రాలను ధరించినట్లుగా మనకు పురాణాలు వివరిస్తున్నాయి. చెట్టు బెరడును నేటికీ 'పోలినీషియా' దీవి ప్రజలు వస్త్రాలుగా ఉపయోగిస్తున్నారు. అరణ్యవాసంలోనే - సీత తనకు కన్పించిన మాయలేడిని రామునికి చూపిస్తూ - ఆ మృగం కావాలని ముచ్చట పడింది, దాని అందం చూసి అని శిష్టులు వర్ణిస్తే - జానపదుల కల్పన మరో విధంగా ఉంది. **ఆ లేడి చర్మంబు రయికలు కావాలె / ఆ లేడి చర్మంబు కోకలు కావాలె అంటూ సీత రామునితో పలుకుతుంది. అద్దాలు దాపిన రయికలుండంగా/ ముత్యాలు దాపిన రయికలుండంగా/ పచ్చి తోలుకు సీత ఏల బ్రమసితివే / మురికి తోలుకు సీత ఏల బ్రమసితివే** అంటూ, రాముడు నిరాకరిస్తాడు. అందుకు సీత - నీవు కొట్టకుంటేను నాకు బాణమియ్య రాదా అని, రాముని నిలదీస్తుంది. విషయం ఏదైనప్పటికీ - తోలు వస్త్రాల పట్ల సీత చూపించిన మక్కువను ఆటవిక జీవితంలోని ఒక భాగంగానే గుర్తించాలి. శివుడు కూడా జంతు చర్మాన్ని వస్త్రంగా ధరిస్తాడని పురాణాలు వర్ణిస్తున్నాయి. ఆటవిక జీవితం ద్వారా మనిషికి సంక్రమించిన ఈ చర్మపు దుస్తులను, నేటికీ చలి బారి నుండి తట్టుకునేందుకు 'ఎస్కిమో' జాతి ప్రజలు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఆదిమ, ఆటవిక దశల్లో చెట్ల ఆకులూ, జంతు చర్మాలను వస్త్రాలుగా చుట్టుకున్న మానవుడు తదనంతర కాలంలో దానిని ఒక పరిశ్రమగా స్వీకరించాడు.

చతుష్షష్టి కళల్లో - **'చేనేత'** ఒకటి. దారపు పోగులను ఒక చోట చేర్చి అందమైన వస్త్రంగా నేయడం అద్భుతమైన కళ. దాన్ని ఎన్నో రంగుల్లో నేయవచ్చు. ఆ రంగుల్లో ఎన్నో డిజైన్లు, చిత్రాలు, మనిషిలోని కళాత్మకతకు దర్పణం పడతాయి. ప్రకృతి మార్పుల నుండి కాపాడుకొనేందుకు శరీరానికి తొడుగులుగా ఆవిర్భవించిన ఈ వస్త్రాలు, నేడు మానవ జీవితంలో ఒక ప్రత్యేకతను ఆపాదించుకొని, శ్రమతో కూడిన చేనేత వృత్తి కళగా రూపు దిద్దుకొన్నాయి. అన్నాన్ని ఇచ్చే రైతు తర్వాత, ఒంటికి బట్టను ఇచ్చే నేత పారిశ్రామి కునిదే మానవ మనుగడలో పైచేయి!

వస్త్రాలు - నేతవైనా, మిల్లువైనా అవి ప్రకృతిలోని రంగులను చెట్లు, పూలు, మొగ్గల వంటి డిజైన్లను కల్గి ఉండి మనిషికీ ప్రకృతికీ మధ్య ఉన్న అనుబంధాన్ని తెలుపుతాయి. ఈ వస్త్రాలు - బాలురు, బాలికలు, స్త్రీలు, పురుషులను బట్టి - వయోభేద,లింగభేదాలను అనుసరించి విభిన్నమైనవిధాలుగా ఉంటాయి. వాటిని స్థూల పద్ధతిలో ఈ విధంగా విభజించవచ్చు-

స్త్రీలు - చీరెలు, రవికలను ధరిస్తే, పురుషులు - దోవతి, చొక్కా , రుమాలు, కండువాలను ధరిస్తారు. వస్త్రాలు- లింగ, వయో భేదాలనే కాకుండా ప్రాంతాన్నీ, మతాన్నీ, సాంఘిక, ఆర్థిక స్థితిగతులనూ, వ్యక్తి అభిరుచినీ సూచిస్తాయి. అందుకే ఇవి - మనిషి జీవితంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాబట్టి వీటిని ప్రాచీన

కవులు కూడా తమ కావ్యాల్లో సందర్భానుసారంగా వర్ణించగలిగారు–

పాల్కురికి సోమన (శ్రీ.శ. 13 వ శతాబ్దం పూర్వార్థం) బసవ పురాణ కావ్యంలో **వెంజావళియు, జయ రంజియు, మంచు/ పుంజంబు, మణికట్టు, భూ తిలకంబు / శ్రీ వన్నియయు, మహా చీనియును / వాయు మేఘము, గజవాళంబు... / వారణాసియు.../ పట్టు, మరకత పట్టు, పొంబట్టు** అంటూ వస్త్రాల పేర్లు, భేదాలతో పాటు, విదేశీ వస్త్రాల పేర్లను కూడా తెలియ జేశాడు. దీనివల్ల – ఆనాడు వస్త్రాలను విదేశాల నుండి కూడా దిగుమతి చేసుకున్నట్లు భావించవచ్చు. వస్త్రాలు – శరీర మాన, ప్రాణ సంరక్షణకు సృష్టింప బడినా, అందాన్ని ఇనుమడింప జేసే సాధనాలుగా కూడా బాగా పేరును పొందినాయి. వస్త్రాల్లో ముఖ్యంగా చీరెలు – దర్పానికీ, ఐశ్వర్యానికీ ప్రతీకలుగా నిలువడం వల్ల వస్త్రపరిశ్రమ నైపుణ్యానికి అగ్రతాంబూలాన్ని అందించింది. చీరెల్లో కేవలం నేత చీరలే కాక – పట్టు చీరెలు, సిల్కు చీరెలు, జరీ చీరెలు, నైలాన్ చీరెలు, ముతక చీరెలు – ఇలా ఎన్నో రకాలు ఉన్నాయి.

**చీరె** – నేడు స్త్రీల వస్త్రవిశేషంగానే పేర్కొనబడుతున్నా, పూర్వం స్త్రీ, పురుష భేదం లేని ఒక కట్టు గానే ప్రయోగింపబడింది. **పేరు వలలుండు కూడుం / చీరయు నిడి సాకతంబు సేసిన చాలున్** అంటూ, మహా భారత విరాట పర్వంలో, భీముడు తనను తాను వలలునిగా పరిచయం చేసుకునే సందర్భంలో – కూడూ, గుడ్డా ఇచ్చి నన్ను పోషిస్తే చాలు అని పలుకుతాడు. ఇక్కడ 'చీర' అనే పదాన్ని వస్త్రానికి బదులుగానే కవి ప్రయోగించినాడు. అందువల్ల – స్త్రీలూ, పురుషులూ ధరించే వస్త్ర విశేషాన్ని పూర్వం 'చీర' అనే పేరుతోనే పిలిచి ఉంటారని భావించవచ్చు. కట్టుకునే విధానంలోనే తేడా ఉండి ఉంటుంది. అందుకే 'చీర' అనే పదాన్ని కవులు లింగ భేదాన్ని పాటించకుండా కావ్యాల్లో ఉపయోగించినారు. అదే విధంగా 'కోక' అనే మాట కూడా వాడబడింది.

నేటికీ పూజలు, వ్రతాల సందర్భాల్లో సంపన్న కుటుంబాల పురుషులు పట్టుచీరెల వంటి వస్త్రాన్నే **దోవతి**గా ధరిస్తారు. అంతేకాక కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లోని పురుషులు పెద్ద పెద్ద జరీ అంచులున్న లేతరంగుల ఖాదీ దోవతుల పట్లనే ఎక్కువ మక్కువను చూపిస్తున్నారు. ఇవి ఎం.ఎల్.ఏ దోవతులుగా నేడు ప్రచారంలో ఉన్నాయి.

**వెల్లలు నీటంచు వెలిపముల్ కరకంచు పట్లును ...../ .. మంచి బొమ్మంచు వన్నియలును / మొదటగా చీరలు ముద మెలర్చ...** అని నూతన కవి సూరన (క్రీ. శ. 1410 – 80) ధనాభిరామం కావ్యంలో కుబేరుడు దానం చేసిన స్త్రీలు ధరించే చీరెలను కూడా వర్ణించాడు. *చందన కావులును పట్టెడ కావులును చెంగావులును కదంబ కావులు...* అనే పేర్లతో రాణీ వాసపు స్త్రీలు ధరించే చీరలను – కొఱవి గోపరాజు (క్రీ.శ. 1384– 1429) సింహాసన ద్వాత్రింశిక కావ్యం పేర్కొన్నది. స్త్రీల చీరకట్టులో కొంగులకున్న ప్రాధాన్యం వల్ల కొంగులను అందంగా తీర్చిదిద్దడం నేత పరిశ్రమలో ఒక భాగమైంది. ఇదే విషయం – *కొంగుల నొప్పు దుకూలముల్ కట్టి* అని, రంగనాథ రామాయణం (క్రీ. శ. 13వ శతాబ్దం) వివరిస్తుంది. జానపదులు కూడా ఎన్నెన్నో రకాల చీరెలను తమ సాహిత్యంలో వర్ణించారు. వాటిలో ముఖ్యమైన కొన్ని పేర్లు – బంగారు పూలచీరె, పట్టంచు చీరె, పూలంచు చీరె, నీలంచు చీరె, కరకంచు చీరె, చెరుకాకు చీరె, మల్లెపూల చీరె, ఉల్లి మళ్ళ చీరె, గోరంచు చీరె, పసుపద్దిన చీరె, ఆవపూల చీరె, సెనగపూల చీరె, అంచుల చీరె, నీల చంద్రకావి చీరె, ముంగి వన్నెల చీరె, చిత్ర విచిత్రాల చీరె – ఈ విధంగా చెప్పుకుంటూ పోవాలిగాని ఎన్నెన్నో చీరలు కన్పిస్తాయి.

చీరెలతో పాటు వాటికి తగిన ఎన్నోరకాల **'రవికెలు'** కూడా జానపద సాహిత్యంలో చోటు చేసుకున్నాయి. వాటిలో – భమిడిపూల రవికె, అద్దాల రవికె, ఇంద్రకావి రవికె, చంద్రకావి రవికె, మొగ్గల రవికె, పొగడపూల రవికె, జవ జనాల రవికె, చిలుకరవికె అంటూ రవికెలు విభిన్నమైన పేర్లతో దర్శనమిస్తాయి. రవికెల అంచులు, రంగులు, నాణ్యత కన్పించాలంటే చీరెమాటున ఉన్న రవికెను కన్పించేలా తొడగాలి. ఇది వస్త్రధారణలో ఒక విశేషం! దీనినే " అయికలు కనుపట్టతొడిగి" అని, రంగనాథ రామాయణ కావ్యం కూడా పేర్కొన్నది.

పురుషుల వస్త్రధారణలో జానపదులకు సంబంధించినంత వరకు **దోవతి**కే అధిక ప్రాధాన్యం ఉంది. **.... నీర్కావి / మడుగు దోవతి పింజె విడిచి కట్టి**

అని శ్రీనాథకవి (క్రీ.శ. 1370 – 1450) మంచన శర్మ వేషాన్ని వర్ణించిన సందర్భంలో క్రీడాభిరామంలో వివరిస్తాడు. **మదిరోష మొదవ దోవతి/ వదలిన బిగియంచు కొనుచు** అని పోతన కవి (క్రీ.శ. 1400 – 1450) భాగవత కావ్యంలో దోవతిని గూర్చి పేర్కొంటాడు. ఈ దోవతుల్లో కూడా – సన్న దోతులు, దొడ్డు దోతులు, అంచు దోతులు, పట్టు దోతులు అని ఎన్నో రకాలుగా ప్రచారంలో ఉన్నాయి.

**'రుమాలు'** తలకు చుట్టుకోవడం కూడా జానపదుల్లో అత్యంత సాధారణమైన విషయం. వృత్తి పనుల్లో బయట గడిపే జానపదులను ఈ రుమాలు ఎండ, చలి, వానల బారి నుండి ఎన్నో విధాలుగా కాపాడుతుంది. కొత్త ప్రాంతానికి పనిమీద పోయినప్పుడు కప్పుకునేందుకు ఒళ్ళు తుడుచుకునేందుకు, కట్టుకునేందుకు కూడా ఉపయోగ పడుతుంది. "…. పై/ అడ్డకట్టు, రుమాలు గుడ్డ కట్టి…." అని, సారంగు తమ్మయ్య ( క్రీ.శ. 1580) తన వైజయంతీ విలాస కావ్యంలో దీనిని రుమాలు గుడ్డగానే పేర్కొన్నాడు. *చంద్రకావి రుమాలు చెలువొప్ప గట్టెను* అని కాటమ రాజు కథల్లో గాంభీర్యానికి సంబంధించిన అంశంగా రుమాలు చెప్పబడింది. బాలికలు కట్టే **'పరికిణీ'**ని ప్రాచీన కవులు 'పావడ' అని పేర్కొన్నారు – *తొడవుల పుచ్చి నిర్జర వధూటులు వేలుపు మ్రాని చీని పావడలు ధరించి…* అని, నంది తిమ్మన (క్రీ.శ. 16వ శతాబ్దం) తన పారిజాతాపహరణ కావ్యంలో వర్ణించాడు.


కాలాన్ని, పాలకులను బట్టి సంస్కృతిలో కల్గిన మార్పు వస్త్ర ధారణలో విశేషంగా కన్పిస్తుంది. మన ప్రాంతాన్ని హైందవులే కాకుండా మహ్మదీయులు, ఆంగ్లేయులు కూడా పరిపాలించడం వల్ల, వారి సంస్కృతి ప్రజల వస్త్రధారణలో కూడా ప్రతిబింబించింది. ఈ విధంగా వస్త్రాలు ఎంతో వైవిధ్యాన్ని కలిగి ఇతర సంస్కృతిని ఆదానం చేసుకున్నా – మన జాతి సంస్కృతిని చిత్రీకరిస్తూ ఇతరులకు ప్రదానం చేసే వస్త్ర పరిశ్రమే మనకు ఎక్కువగా ఉంది.

వస్త్రాలపై డిజైన్లు, ప్రకృతికి సంబంధించిన దృశ్యాలే కాకుండా – పౌరాణిక ఘట్టాలు కూడా **'కలంకారీ'** అద్దకాల పేరుతో చిత్రీకరింప బడుతున్నాయి. చిత్రకళను వస్త్రాలపై ప్రయోగించే గొప్ప కళ ఇది! కలంకారీ అద్దకంలో స్థానికంగా దొరికే వృక్షాల నుండి తయారు చేసిన రంగులనే ఉపయోగిస్తారు. రంగులను తయారు చేయాలంటే రసాయన శాస్త్ర సంబంధమైన జ్ఞానం అవసరం. ఈ విధంగా వస్త్రాల తయారీలో కూడా – చిత్ర కళ, రసాయన శాస్త్రాల వంటి ఇతర శాస్త్రాలు మిళితమై – జానపదుల విజ్ఞానానికి తార్కాణంగా నిలుస్తున్నాయి.

వస్త్రాలు – శరీర ధారణకే కాక **'యూనిఫాం'** పేరుతో ప్రత్యేకమైన రంగుల విభజనను కల్గి కొన్ని సమూహాలకు చిహ్నాలుగా ఉండి, ఆ సమూహాలను సులభంగా గుర్తించేందుకు దోహదం చేస్తున్నాయి. ఈ విధంగా వస్త్రాలు… వ్యక్తుల అందాన్ని ఇనుమడింప జేస్తాయి – ఆకర్షణను రేకెత్తిస్తాయి – అభిరుచిని తెలియజేస్తాయి – హుందాతనాన్ని కనబరుస్తాయి – మనస్తత్వాలకు అద్దం పడతాయి – వ్యక్తిత్వాలకు తార్కాణంగా నిలుస్తాయి. ముఖ్యంగా…. వస్త్రాలను నేసే నేత కార్మికుల సృజనాత్మకతకు ప్రతీకలుగా ప్రజ్వరిల్లుతాయి.

**ఆచార్య తంగెడ కిషన్ రావు**
పూర్వ వైస్ ఛాన్స్‌లర్, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,
హైద్రాబాద్, ఫోన్ : 7702414100

## వాల్మీకి రామాయణంలో బాలకాండ కథలు




*శ్రీ అనుమాండ్ల భూమయ్య రచించిన ఈ బాలకాండలో ఎన్నో కథలున్నాయి. ముఖ్యంగా గంగావతరణం, క్షీరసాగరమథనం, విశ్వామిత్రుడు తపస్సు చేసి బ్రహ్మర్షి కావడం ప్రధానమైనవి. బ్రహ్మర్షి కథలో త్రిశంకువు, శునశ్శేపుని వృత్తాంతం, రాముడు తాటకను వధించడం, అహల్యకు శాపవిమోచనం కావించడం కథలున్నాయి. వీటన్నిటికి మూలం విశ్వామిత్రుడు. బ్రహ్మర్షి పాత్ర ఈ బాలకాండలో ప్రధానమైనది. ఈ కథలు ముఖ్యంగా పిల్లలకు ఆశక్తికరంగా, ఉత్సాహపరంగా ఉంటాయి.*

*పేజీలు : 134, వెల : అమూల్యం ప్రతులకు : ఫోన్ : 889 707 3999*

– మిసిమి

# రైళ్ళు మళ్ళా నడిచాయి

**– ఘంటికోట బ్రహ్మాజీరావు**

'తెలుగుదేశానికి చాలా దశాబ్దాలు ఉద్యోగరీత్యా దూరంగా ఉండిపోవటంవల్లో, మౌనంగా రచనలు చేసుకుంటూ మునిలా ఉండిపోవటంవల్లో బ్రహ్మాజీరావు గారికి తగినంత పాచుర్యం, ఖ్యాతి రాలేదు. ఆయన సమకాలీకులు భమిడిపాటి రామగోపాలం (భ.రా.గో) అవసరాల రామకృష్ణారావు, రామకోటి, బలివాడ కాంతారావుల రచనాకృషి కన్నా తక్కువదేం కాదు ఆయన సాహిత్య కృషి. అయినా మరుగున ఉండిపోయారు. ఆయనలాగే ఆయన గొప్ప కథ రైళ్ళు మళ్ళా నడిచాయి కూడా మరుగున ఉండిపోయింది. ఆ కథ గొప్పతనం కొందరికే తెలుసు. ఎంతో నాటకీయత, భీకర భీభత్స సన్నివేశాలు చాలా చాలా దుఃఖంతో మెప్పించిన తెలుగు కథలు చాలానే ఉన్నాయి. కానీ ఇవేవీ లేకుండా, గుండెల్ని పిండేసే బాధని, పిచ్చెక్కించేంత దిగుల్ని అతిసాధారణ పద్ధతిలో చెప్పిన గొప్పకథ రైళ్ళు మళ్ళీ నడిచాయి.

చిన్న కథ. శృంగవరపుకోట, అరకులోయ స్టేషన్ల మధ్యనున్న చిమిడిపల్లి రైల్వేస్టేషన్‌లో అతని ఉద్యోగం. పొద్దున్న ఎగువకిపోయే పాసింజర్ రైలు, సాయంత్ర దిగువకిపోయే పాసింజర్ రైలు. రైలు వచ్చినప్పుడే జనం కనపడుతారు. వారి ద్వారానే బయటి ప్రపంచ దర్శనం వాళ్ళని చూసిన కాస్సేపే మనుష సంపర్కం.

చిమిడిపల్లి చిన్నస్టేషన్. కొద్దిమంది రైల్వే ఉద్యోగులు తప్ప మరెవ్వరూ కనిపించరు. చిమిడిపల్లి గ్రామం కూడా స్టేషన్‌కి దూరంగా కొండల్లో ఉంది. అంతకుముందు అతని ఉద్యోగం విశాఖనగరంలో. చుట్టూ జనమేజనం. బోల్డు వ్యాపకాలు, సరదాలు, సినిమాలు, షికార్లు, స్నేహితులు. ప్రమోషన్ మీద చిమిడిపల్లికి బదిలీ చేశారు. కొత్తలో పిచ్చెక్కినట్లైయింది. అక్కడ నుంచి బదిలీ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. భార్యను తెచ్చుకుని కాపరం పెట్టాడు. ఉన్నంతలో ఆ ఎడారిని అనుకూలంగా మార్చుకున్నాడు. పాసింజర్ రైల్లో దినపత్రిక, వారపత్రికలు శృంగవరపు కోట నుంచి దోశలాంటి టిఫెన్లు ఏర్పాటు చేసుకున్నాడు. ఎటువంటి ఊరైనా, చిమిడిపల్లికి చెందిన కొన్ని సుగుణాలున్నాయి. ప్రశాంతత, విశ్రాంతి, భార్యతో పంచుకునే జీవితం పెరిగాయి. విశాఖలో అప్పులయ్యేవి. ఇక్కడ డబ్బులు మిగిలిపోతున్నాయి. చుట్టాల బాధలేదు. ఇలా సర్దుకు సుఖంగా బతుకుతున్న అతని ఆ జీవితంలో తుఫాను, తీవ్ర వర్షం.

ఆ వర్ష తీవ్రతకి కొండరాళ్ళు దొర్లిపడి ఎగువ దిగువ పట్టాయి. రైల్వే వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ఫలితంగా రైల్వే లైను బాగుపడేదాకా అంటే మూడు నెలలపాటు రైళ్ళ రాకపోకలు నిలిచిపోయాయి. చిన్న స్టేషన్, కొద్దిమంది జనం, స్తంభించినట్టు జీవితం. విడువని వర్షం. నిత్యావసరాల గడ్డుతనం. ఎవరితో ఏం పంచుకోలేని దిగులు అలా ఒంటరి నరకంలా మూడునెలలు గడిచాయి.

చివరికి ఆరోజు రైళ్ళు మళ్ళీ నడుస్తాయి అన్న సమాచారం తెలిసింది. ఒంట్లో అనారోగ్యంగా ఉన్న, తోటివాళ్ళని సాయం చెయ్యమని, పాసింజర్ రైలు వచ్చేటప్పటికి అక్కడికి చేరాడు. మూడు నెలల తరువాత తిరిగి జనం కనిపించారు. తిరిగి కదిలే జీవితం కనిపించింది. కొత్త ప్రాణం, ఊపిరి, చలనం వచ్చినట్లైంది అతనికి. ఈ రైళ్ళు మాకూ బయటి ప్రపంచానికి సంబంధం కలిగించే జీవధారలు... అంటూ కథ ముగుస్తుంది. అతనికి కలిగిన స్వాంతన మనలోకి పాకుతుంది.

రైళ్ళు ఇక్కడ కథాసారానికి ఓ ఆధారం మాత్రమే. నిత్యం జనంతో ఉండటం, జీవితంలో గాలిలాంటి ఓ సహజ చైతన్యం ఉండటం, ఎంతటి తీవ్ర అవసరమో తెలిపే కథ ఇది. అరుదైన అద్భుత సత్యాన్ని పట్టుకు చూపించిన సజీవ జీవన చిత్రం. ఇలాంటి కథలు చాలా చాలా తక్కువగా తారసపడతాయి.

వి. రాజారామమోహనరావు
హైదరాబాద్, ఫోన్ : 9394738805

**ఋగ్విధి**


*పాపము నరునిదౌర్బల్యలోపమె యగు;*
*నొంచు ననుతాప మీశ్వరానుగ్రహమ్ము;*
*పాపివా దుఃఖపడు, కృపావార్ధిఁద్రాత*
*నతనిఁదెగడకు మనుచు బ్రహ్మర్షిమాట.*

*వింతవింతలుగాఁ దోఁచు విధివిధాన*
*మందు నీనాఁటి ఘోరపాపాత్ముఁడేని*
*రేపు తాపసిగా మాఱనోపు ననుచు*
*నలరఁదేనియయూట బ్రహ్మర్షిమాట.*

**కృష్ణశాస్త్రి**

# అలవోకగా పూర్తి చేసే పుస్తకం

కొంతమందికి కొన్ని పనులు ఇష్టముంటాయి.. ఎవరేమనుకున్నా తాము అనుకున్న పని చేసి తీరుతారు. ఈ క్రమంలో తాము చేసే కృషి నిశ్శబ్దంగా చేస్తూ చివరిలో అందరినీ ఆశ్చర్యపరుస్తారు.. ఆ కోవకు చెందిన వ్యక్తి వలేటి గోపిచంద్. ఆకాశవాణిలో మూడు దశాబ్దాల ప్రయాణం అతనికి అనేకం నేర్పింది..ఆ స్ఫూర్తితో గతంలో తను చదివిన బాపట్ల వ్యవసాయ కళాశాల పై నాలుగు పుస్తకాలు తెచ్చేలా చేసింది..




ఇప్పుడు పదవీ విరమణ అనంతరం రైతన్నకు వెన్ను-దన్ను శీర్షికతో కలం-గళం-దృశ్యం ఉపశీర్షికతో ప్రింట్&ఎలక్ట్రానిక్ మీడియాలో కృషి చేసిన యాభైమంది అగ్రిజర్నలిస్టుల కృషిని రికార్డు చేశాడు.. నిజానికి రైతన్నకు సేద్యంలో తోడు నీడగా తొలిరోజుల్లో నిలిచింది ఆకాశవాణే.. హరిత విప్లవం సమయం నాటికే ఆకాశవాణిలో ఫార్మ్ రేడియో యూనిట్లు దేశవ్యాప్తంగా విస్తరించి, రైతు పరిభాషలోనే కార్యక్రమాలు ప్రసారం చేస్తూ ఉండేవి. తమిళనాడులో డెబ్బైల్లోనే వ్యవసాయ పరిశోధనా కేంద్రాలు రూపొందించిన ఒక కొత్త వరి వంగడానికి రేడియో రైస్ అని నామకరణం చేయటం రేడియో కృషిని సూచిస్తుంది..


తొలి రోజుల్లో వ్యవసాయ కార్యక్రమాలకు ఒక ఒరవడి సృష్టించిన గుమ్మలూరి సత్యనారాయణ, కె.వి.సుబ్బారావు, వై.హనుమంతరావు, ఈలప్రోలు లక్ష్మి నారాయణ, సుబ్బన్న, డి.రామస్వామి, తుమ్మల సుభాష్ చంద్రబోస్, కొత్త రత్నాకర బాబు, లక్ష్మీ రెడ్డి, డా.కె. విజయ మొదలు ఇటీవలి ఘంటా విజయకుమార్, జి.వేణుగోపాల్ రెడ్డి, సుధాకరరెడ్డి, ప్రసన్న ప్రభృతుల వరకు ప్రస్తావిస్తారు. ఆలాగే ఆరోజుల్లోనే కొన్ని పత్రికలు కొన్ని పేజీలను వ్యవసాయానికి కేటాయిస్తుండేవి.. ఇది మరింతగా పెరిగి అన్నదాత, పాడీపంటా, రైతు నేస్తం వంటి పత్రికల ప్రచురణకు దోహదం చేసింది.. అనంతరం కాలంలో దృశ్యమాధ్యమాలు విపరీతంగా విస్తరించిన కాలంలో అగ్రిజర్నలిస్టుల కృషిని విస్మరించలేం..

ప్రింట్ మీడియాలో రైతుసేవలో అక్షరాన్ని సమర్పించిన వాసిరెడ్డి నారాయణరావు, మొవ్వా రామారావు మొదలు డి. శ్యాంసుందరరెడ్డి, సాముల రాంచందర్, జిట్టా బాల్ రెడ్డి, అమిర్నేని హరికృష్ణ, పంతంగి రాంబాబు వరకు అనేకుల అక్షర సేద్యం అభినందనీయమంటారు. దృశ్య మాధ్యమంలో ఒరవడి దిద్దిన ఆర్ ఆర్ కె, శ్రీ, బొగ్గవరపు వెంకట్రావు, మండవ విజయసారథి, ఉప్పలపాటి శ్రీదేవి మొదలగువారి కృషి విస్మరింలేనిదంటారు. వీరందరి కృషిని గోపిచంద్ అక్షరబద్ధం చేశాడు.. ఏదిచేసినా నిండుగా చేయటం ఇష్టం కాబట్టి రంగుల్లో ముద్రించాడు. పాతపత్రికలను స్కాన్ చేసి ఆ కాలానికి తీసుకెళ్లాడు. పల్లెసౌందర్యాన్ని ప్రతిబింబించే అనేక రంగులు చిత్రాలను జత చేస్తాడు.. మనసుకు ఆహ్లాదం కలిగిస్తాడు. పుస్తకాన్ని తీసుకురావటమొకెత్తు.. ఆ పుస్తకాన్ని మరిచిపోలేని స్థాయిలో ఆవిష్కరించటం మరొకెత్తు.. హైదరాబాద్‌లోని తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ కామర్స్ వారి హాలులో, ఒక ఉదయం వేళ, కబుర్ల మధ్య, వేడి ఛాయ్ బిస్కెట్‌ల మధ్య సభను నిర్వహించాడు గోపిచంద్.. ఆకాశవాణి విశ్రాంత డైరెక్టర్ డా.పి.ఎస్.గోపాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్, డా.రావి చంద్రశేఖర్, రైతు నేస్తం వెంకటేశ్వరరావు, మందలపర్తి కిషోర్ వంటి అతిరథమహారథులు ప్రముఖులు వేదిక పైనుంటే.. సభలో పాల్గొన్నవారు తక్కువ వారేమీ కాదు .. సభానంతరం అద్భుతమైన విందు భోజనం అందరినీ అలరించింది.. ఏ పుస్తకమైనా చదివించే గుణం కలిగి ఉండాలి. ఆ సుళువు అతనికి తెలుసు.. అందుకే ప్రతి పేజీని అందంగా తీర్చిదిద్దాడు. మొదట రేడియోలో పనిచేసి కృషి చేసినవారి జీవన రేఖలు మాత్రమే పరిచయం చేద్దామనుకున్నవాడు, ఆ కృషిని మరింతగా విస్తరించి ఇప్పుడు ఒక సమగ్రతను పుస్తకానికి చేకూర్చాడు. నిజానికి ఇది సమగ్ర సంకలనం కాదు.. ఈ మార్గంలో నిశ్శబ్దంగా తాము చేయగలిగింది చేస్తూ రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచిన వారిలోని కొంతమంది కృషిని మనముందుకు తెచ్చాడు.. రైతన్నా, సాగన్నా అతనికి ప్రాణం.. రైతు కార్యక్రమాలను ప్రసారం చేసేవారని, అక్షరంతో రైతును జాగృతం చేసేవారని నిశ్శబ్దంగా ప్రేమిస్తాడు..ఆ ప్రేమని అప్పుడప్పుడు ఇలా వ్యక్తీకరిస్తాడు.. ఒకసారి పుస్తకాన్ని చేతిలో తీసుకుని చూడండి.. అలవోకగా పూర్తి చేస్తారు.. *ప్రతులకు : గోపీచంద్, ఫోన్ : 944 127 6770*

**- మిసిమి**

## ప్రాచీన తెలుగు మార్గాన్వేషణ

**సిం**ధూ నాగరికత కాలంలో రాజులున్నారా లేదా అన్నది ప్రశ్న కాదు... వాళ్లకు నాగలి వాడకం తెలుసునా లేదా అన్నది ముఖ్య ప్రశ్న అంటాడు చరిత్ర విశ్లేషకుడు డి.డి కోశాంబి. విషయం తెలియాలంటే లిపి చదవగలిగే వాళ్లు కావాలి.. శాసనాల మీది లిపి సంకేతాలను శోధించగలిగే జిజ్ఞాసువులు రావాలి. తెలుగులోనే కాదు ప్రతి భారతీయ భాషలోనూ చారిత్రక వికాస దిశగా ఇటువంటి పరిశోధనలు సాగాలి. మన దేశంలో ఈ ప్రయత్నం ఇంకా శైశవదశలోనే ఉంది. చరిత్ర తెలుసుకునేందుకు ముఖ్యమైన ఆధారాలు.. రాజులూ, వ్యాపారులు ప్రకటించిన శాసనాలు,నాణేలు వగైరా. శాసనాలు రాళ్లమీద, దేవాలయాల మీద, సమాధుల మీద చెక్కి ఉంటాయి. శాసనాల్లో కాని, నాణాల్లో కాని ఒక వాక్యానికి అర్థం మారినా, ఒక మాట తప్పుగా చదివినా చరిత్ర రూపమే మారిపోతుంది కాబట్టి శాసనలిపి చదవగలిగేవాళ్లు సమర్థులై ఉండాలి. గ్రంథలిపిలో శిక్షణ తీసుకున్నవారైతే...నిర్దిష్టమైన తేదీలతో నిర్దుష్ట సమాచారాన్ని అందించగల్గుతారు... ఈ ఉద్దేశ్యంతోనే ఆరేళ్ల క్రితం (2019,ఫిబ్రవరిలో...) ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, ప్రాచ్య లిఖిత పరిశోధనాలయం సంయుక్తంగా...హైదరాబాద్, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శాసనాలు, తాళప్రతులపై వారం రోజుల శిక్షణా తరగతులు నిర్వహించారు. విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, పరిశోధకులు, ఆచార్యులు.. తెలుగులో ఆయా శాఖలకు చెందిన మేధావులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. తెలుగులో పరిష్కృతం కాకుండా మిగిలిపోయిన తాళపత్రాలూ, శాసనాలు, లిపి గురించి కొన్ని ప్రతిపాదనలు చేశారు. ఈ వారోత్సవాల్లో ప్రాచీన తెలుగు- పరిష్కారణ నేపథ్యంగా సమాలోచనలు చేస్తూ భాషకి సంబంధించిన విషయాలెన్నింటినో చర్చకు పెట్టారు. శాసనమంటే ఏమిటీ? వాటి ఉద్దేశ్యమేంటీ? శాసన లిపి చదవడంలోగల సవాళ్లేంటీ? వాటి పరిష్కరణ మార్గాల గురించి సమాలోచన చేశారు. ఇప్పుడు తెలుగులో శాసనాలూ, తాళపత్రాలు చదివేవాళ్లు తక్కువ. పరబ్రహ్మ శాస్త్రి, సి.పద్మనాభ శాస్త్రి, మునిరత్నంరెడ్డి, ముకుందరావు వంటి శాసన పరిష్కర్తలు తయారుకావాలంటే విస్తృతమైన కృషి జరగాలి. శిక్షణా శిబిరాలు నిర్వహించాలి. సాధ్యమైనంత త్వరలో కొత్త పరిష్కర్తలు రూపుదిద్దు కునేందుకు..ఈ ప్రయత్నం ఒక ప్రారంభ సూచికగా భావిస్తూ..వక్తలంతా అనేక విషయాలు సభాముఖంగా ప్రస్తావించారు. 'లిపి పరిణామం- అధ్యయనం' అనేది సైన్సు అంతటి విస్తృతి కలిగిన అంశం. జిజ్ఞాస దిశగా అడుగులు పడకపోతే నవకల్పనలకి వీలుపడదు. సరైన పరిశోధనలు సాగకపోతే భాషాభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పురోగతి గాడినపడదు. కాబట్టి తెలుగుభాషని సాంకేతిక వికాస దిశగా నడిపేందుకు సుశిక్షితులైన శాసన పరిష్కర్తలు తయారుకావాలి. ఈ సభకి మొదటిరోజు గౌరవ అతిథిగా హాజరైన ఆచార్య జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ... పూర్వకాలపు లిపి, భాష విభిన్నంగా ఉంటాయి. వీటిని అర్థం చేసుకోవడానికి పాండిత్యం కావాలి. ఊరకే వాటి అక్షరాలను గుర్తిస్తే సరిపోదు. ఒక తాళప్రతి వజ్రం కంటే గొప్పది. వజ్రం ఎన్నాళ్లైనా పాడైపోదు.. కాని తాళపత్రం పాడైపోతుంది. పాడైపోయే లక్షణమున్నదాని మీదే మనం దృష్టి పెట్టాలన్నారు.




శాసనాల్లో కథనం, ఇతివృత్తం, భాషా శైలి చాలా గమ్మత్తుగా ఉంటుందంటారు స్థపతి ఈమని శివనాగిరెడ్డి.

శాసనాలు చదవగలిగితే.... వాటిపై మనసు పెట్టగలిగితే వాటిలో కథా సౌందర్యాన్ని తడిమేవాళ్లకి... శాసన పఠనం కూడా ఒక కళాత్మక అనుభవం. శాసనాల్లో గత జీవితం కనబడుతుంది. జాతి నడిచిన దారి తెలుస్తుంది.

బోధిసిరి తెలుగు గడ్డ మీద నిరాశ్రయులుగా బతుకెళ్లదీస్తున్న సింహళ బౌద్ధుల కోసం శ్రీ పర్వత విజయపురిలో చోళదమ్మగిరి అనే విహారం కట్టించిందని మనకు శాసనం వల్లనే తెలిసింది. క్రీ.శ 276 నాటి ఈ శాసనాన్ని నాగార్జున సాగర్ మ్యూజియంలో చూడొచ్చు. పల్లకేతు భూపాలుడు వేయించిన విజయవాడ శాసనంలో విష్ణుకుండిన రాజు మాధవవర్మ ధర్మపాలనను కళ్లముందు నిలపడమేకాదు ఆ రాజన్యుని ధర్మ పాలనకు పరవశించి కనక వర్షం కురిపించి కనకదుర్గగా మారిన గాథ శాసనంలో చెక్కించారు. చీనాంబరంలో నిప్పుల్ని మూటకట్టి, జమ్మిచెట్టుపై పెట్టి స్థానికుల పందెంలో గెలిచిన పండితారాధ్యుని కథ కూడా పల్లకేత భూపాలుని శాసనంలో ఉంది. కేవలం రాజుల విజయాలు.. విభవాలే కాక సామాన్యుల జీవన వెతలకు అక్షర రూపమిచ్చేందుకు శాసనాలు గొప్ప ఉపకరణాలు. ఆనాటి రాజుల విజయ దరహాసాలే నేడు మనకు దొరికిన నాణేలంటారు డా.రాజిరెడ్డి. నాణేలకి వినియోగించిన లోహం. దానిపై కనిపించే ముద్ర, లిపి చిహ్నం...వాటిమీద పొడకట్టే గీతలు కూడా గత చరితకు గవాక్షాలే! తెలుగు ప్రాంతాల్లో దొరికిన రోమన్ నాణేల వల్ల శాతవాహన చక్రవర్తుల వాణిజ్య విభవం, పాలనా వైభవం... ఓడబొమ్మ, ఏనుగు పాదముద్ర, దేవత చేతి పువ్వు ముద్ర కలిగిన నాణేల లిపి సంగతులు... తెలుగు వారి కీర్తి సముద్రాలు దాటి వెళ్లిన గమనాన్ని చూపిస్తాయంటూ..గత చారిత్రక వైభవమంతా నాణాల్లో కనిపిస్తుందంటారు.

లిపి అభివృద్ధి చెందిన దశలో తాటాకు పుస్తకం కనుగొనటం ఒక చారిత్రక అద్భుతమంటారు డా. శ్రీ రంగాచార్య. వీరు తాళపత్రాల గురించి చేసిన ప్రసంగం... ఆసక్తికర అంశాలెన్నింటినో వెలికితీసింది. తాటాకులను రాత ప్రతులుగా సిద్ధం చెయ్యడమొక దశ ఐతే....వ్రాయసగాళ్ల రాతల్లో.. అక్షర విన్యాసాలూ, గంటంతో రాసేటప్పుడు ప్రతి చిరిగిపోకుండా కనబరిచే నిపుణత మరోదశ. చంద్రుడు అని రాయాల్సొస్తే... అక్షరం కింద చంద్రవంక వలె ఒత్తు పెట్టి రాస్తే... (ద్ర) ఆకు పొలుసు లేస్తుందని 'చంద్యుడ్డు' అని వట్రసుడితోనే రాసేవారు. వలపలగిలక అవసరత కూడా ఇలా ఏర్పడిందని చెబుతూ...పలు భాషాంశాలను ప్రస్తావించారు.

నిజానికి..పాఠ పరిష్కరణ కత్తి మీద సాము వంటిది.ఎక్కువ ప్రతులున్నప్పుడు మూల ప్రతిని కనుక్కోవడం కష్టం. ఒకే ప్రతి దొరికితే పరిష్కర్త చిక్కుల్లో పడ్డట్టే! పాఠబేధాలూ, పాఠాంతరాలూ చూసుకుంటూ... పరిష్కరణ దిశగా సాగే పరిశోధకుడికి సంస్కృతాంధ్ర ప్రాకృత భాషల్లో పాండిత్యం ఉండాలంటారు ఆచార్య రవ్వా శ్రీహరి. 'గ్రంథ పరిష్కరణ– స్వరూపం' గురించి మాట్లాడుతూ ఆచార్య ఆర్వీయస్ సుందరం... ఇవాళ చాలా విశ్వవిద్యాలయాల్లో శాసన శాస్త్రం ఒక అధ్యయనాంశంగా ఉంది. లిపి, చదివే పద్ధతి, చారిత్రక అంశాల అవగాహనపై శిక్షణ ఇస్తున్నారు. అలాగే రాతప్రతుల పరిశీలన, గ్రంథ పరిష్కరణ అంటి అంశాలపై కూడా తరగతులు నిర్వహిస్తే. ప్రాచీన సాహిత్యంపై పూర్తి అవగాహనకు దోహదపడుతుందంటారు. ముద్రణాయంత్రం అందుబాటులోకి వచ్చాక విద్యార్థుల ఉపయోగార్థం ప్రాచీన గ్రంథాలను ముద్రించాల్సివచ్చింది. దాంతో పరిష్కర్తలేర్పడి పూర్వ కవి ప్రయోగాలను దిద్దడం మొదలెట్టారు. అప్పుడు పాఠ పరిష్కరణ అనేది చాలా కీలకాంశంగా మారింది. ఏదైని తాళపత్రం పరిశీలనకి వచ్చాక... అందులో ప్రక్షిప్తాలూ... నిక్షిప్తాలకు ఆస్కారం ఉంటుంది. మూలప్రతి ఆధారంగా లేఖకులు ఎత్తిరాసేటప్పుడు దోషాలు రావడం సహజం.. కాబట్టి పాఠ పరిష్కరణ చేసేటప్పుడు, ఖిలమైపోయినవాటిని పూరించేటప్పుడు నేటి పరిష్కర్తలకు ఉండాల్సిన పరిజ్ఞానం గురించి ఆచార్య వెలిదండ నిత్యానందరావు చేసిన ప్రసంగం విలువైనది.

'పురాతన వైద్య విధానం– ఆయుర్వేద పరిష్కారం' అనగానే తాళపత్రాలే గుర్తొస్తాయి.ఆనాటి ఇళ్లల్లో చేసే ప్రసూతి వైద్యం, పిల్లలకి చికిత్స, మూలిక వైద్యం, నాడీ సంబంధిత వ్యాధులకు అక్కరకొచ్చే వివిధ రకాలు చికిత్స పద్ధతులను తెలిపే తాళపత్రాలపై మన పొరుగు భాషల్లో జరిగినంత పరిశోధన తెలుగులో జరగలేదన్నారు డా. భాగవత రామారావు. ఇవి కాక...భాషలో మరికొన్ని విశిష్టాంశాలపై సంగనభట్ల నరసయ్య, బేతవోలు రామబ్రహ్మం, ప్రొద్దుటూరి ఎల్లారెడ్డి...కె.జితేంద్రబాబు చేసిన ప్రసంగాలు భాషపై కొత్త దృష్టిని కలిగించాయి.

ప్రస్తుత పరిస్థితుల్లో తాళపత్రాలు, నాణేలు, శాసనాల పరిష్కరణ గొప్ప సవాలుగా మారింది. ఇదొక పద్మవ్యూహం. తారీఖుల ఆడవిలో శాసనాల సముద్రంలో చారిత్రక సందిగ్ధాల ఊబిలో, ప్రామాణిక గ్రంథాల పర్వత శ్రేణుల మీద,

వాదోపవాదాల ఎడారిలో ప్రయాణం చేసి చివరికి ఒక నిర్ణయానికి రావడం అంటే.... పరిష్కార్తకి విషయ సమగ్రత, చారిత్రక పరిజ్ఞానం ఉండాలి? ఒకొక్క శాసనం ఒక్కో కొత్త విషయం మనకు చెబుతుంది. రేనాటి చోళుల శాసనాల్లో కార్తెల ప్రస్తావన ఉన్నట్లు తెలుస్తోంది. కొండ కార్తెయ అనేదొకటి పుణ్య కుమారుని తిప్పలూరి శాసనంలో కనిపిస్తుంది. ఆ కాలంలో జ్యోతిష్యం, పంచాంగం, కాలమానం, వ్యవసాయ పండుగలూ, వాటి విశేషాలూ...వీటన్నిటినీ ఆనాటి శాసనాల ద్వారా పరిశీలించవచ్చు. ఒకప్పటి సాంఘిక, భాషా చరిత్ర, మన నుడికారపు సొబగులు, వాటి పుట్టుపూర్వోత్తరాలు తెలుస్తాయి.

వారం రోజులపాటు సాగిన ఈ కార్యశాలలో వక్తలు చేసిన ప్రతిపాదనలూ... సూచనలూ... సలహాలూ విషయ ప్రాధాన్యత కలిగినవి. ఈ ప్రసంగ పాఠాలన్నీ ఔత్సాహిక పరిశోధకులకు కరదీపికలూ, తెలుగు భాష మార్గాన్వేషణకి ఉపకరిస్తాయనే ఉద్దేశ్యంతో డా. సగిలి సుధారాణి వీటన్నింటినీ శ్రవణీకరణం చేసి పుస్తకరూపంలో తీసుకొచ్చారు. ఉపన్యాసం కూడా ఒక సాహిత్య ప్రక్రియ అంటారు ప్రసిద్ధ విమర్శకులు రెంటాల. ఉపన్యాసాన్ని రాసి, సభలో చదివి, వ్యాసంగా ముద్రించుకోవడం సాధారణంగా జరిగేదే... కాని ఉపన్యాసాన్ని ఉన్నదున్నట్లుగా రికార్డు చేసి, ఇలా పుస్తకంగా తీసుకురావడమనేది అరుదు. ప్రసంగాలన్నిటినీ క్రోడీకరించి, ప్రూఫులు దిద్ది, అవసరమైన చోట పాదసూచికలు ఇచ్చి ఒక విజ్ఞాన సర్వస్వంగా మలచిన సుధారాణి కృషి అభినందనీయం. ఇవ్వాల సరస్వతీ మహల్లోనే కాదు దేశంలో అనేక ప్రాచీన గ్రంథాలయాల్లో సంస్కృత లిపిలో రాసిన గ్రంథాలు వేలకొద్దీ పోగుబడి ఉన్నాయి. వాటిని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం వెలికితీసి, నిష్ణాతులైన పండితులతో గ్రంథ పరిష్కరణ చేసి, ముద్రించాలి. అలా...ఈ అపార అమూల్య సాహితీ సంపదను భావితరాలకు అందివ్వడమంటే జాతికి మేలు చేసినట్టేనని ఈ సంపాదకురాలి అభిలాష.


ఈ ప్రసంగ పాఠాలన్నీ డా.సగిలి సుధారాణి సంపాదకత్వంలో *'ప్రాచీన తెలుగు– మార్గాన్వేషణ– పరిష్కరణ'* పేరిట పుస్తకరూపంలో వచ్చాయి. ఇటీవల..హైదరాబాదు, తెలంగాణ సారస్వత పరిషత్‌లో గిడుగు రామమూర్తి జయంతి వేడుకల్లో భాగంగా ప్రముఖుల సమక్షంలో ఈ పుస్తక ఆవిష్కరణ జరిగింది. మన సాహిత్యం, కళలు, సంస్కృతి, సాంప్రదాయాలు భావితరాలకు అందించాలనే ఉద్దేశ్యంతో ఇటీవల కేంద్ర ప్రభుత్వం 'జ్ఞాన భారత్ మిషన్' పేరిట ఒక బృహత్తర కార్యక్రమం తలపెట్టింది. ఇదే సమయంలో 'తెలుగు మార్గాన్వేషణ' పుస్తకం పాఠకుల చేతుల్లోకి రావడం ఒక శుభపరిణామం. భాష ఔన్నత్యం, సాంస్కృతిక వైభవం మళ్లీ కొత్త కాంతిని, శక్తిని నింపుకోవడమంటే ఇదే! ఎక్కడా గ్రంథస్థంకాని, చర్చకురాని, ఇప్పటివరకూ ఏ పరిశోధకులూ ప్రస్తావించని చారిత్రక, భాష–సాహిత్యాంశాల సమగ్ర సమాచారం, పోటీ పరీక్షార్థులకు ఉపయుక్తమగు భాషా విజ్ఞానం ఇందులో నిక్షిప్తమై ఉంది.

*ప్రాచీన తెలుగు మార్గాన్వేషణ – పరిష్కరణ (శాసనాలు– నాణేలు– తాళపత్రాలు –లిపి), కూర్పు, సంపాదకత్వం: డా. సగిలి సుధారాణి, పుటలు: 418, వెల: 330, ప్రతులకు : డైరెక్టర్, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్, మానస గంగోత్రి, మైసూరు–570006, చరవాణి: 0821–2345182.*

**- కన్నెడి మనోహర్**

## కమ్మతెమ్మెర

*చిరకాల మిత్రుడు వై. పార్థసారథి వందేమాతరం నవలను విశ్లేషిస్తూ డిసెంబర్ 2025 **మిసిమి**లో రాసిన వ్యాసం ఆకట్టుకుంది. అతను sides తీసుకోలేదు. తెలుగు భాష మీద అతనికి ఇంత పట్టు వున్న సంగతి ఇంతకు ముందు తెలియదు, అని చెప్పడానికి ఈషన్మాత్రం కూడా సిగ్గు పడటం లేదు. ఈ విశ్లేషణలోని మంచి చెడుపై నాకు నిర్దిష్టమైన అభిప్రాయం లేదు. ఇది విశ్లేషణా వ్యాసం. విమర్శనాత్మకం కాదు. "ఒక మంచి మాట చెప్పండి" అని ఇబ్బంది పెడితే, "పరిశోధనాత్మక విశ్లేషణ" అని తప్పించుకుంటా.*




*- ప్రొఫెసర్ నరసయ్య పంజాల, హైదరాబాద్.*

# చదవండి...


**– మిసిమి**

📖 **సిక్కా - శ్రీ ఊహ :** ఈ పదకొండు కథలూ, సూక్ష్మమైన అనుభూతులనూ, స్థూల భావనలనూ రెండింటినీ ఒడిసిపట్టుకున్నవే. వాటిని కథ చేయడంలో ఉన్న ఊహా ప్రతిభను ప్రదర్శించేవే. పెద్ద కాన్వాస్ మీద అయినా, చిన్న కాన్వాస్ మీద అయినా శ్రీ ఊహ తన అనుకున్న బొమ్మను చక్కగా గీయగలదు. కథలు చిన్న అంశాల చుట్టూ రాసినవైనా, మంచి అనుభూతిని ఇచ్చే కథలే.





*పేజీలు : 126, వెల :200/–, ప్రతులకు : బీట్రూట్ బుక్స్, హైదరాబాద్, ఫోన్ : 9381110979 & అన్ని పుస్తక విక్రయ షాపులలో లభించును.*

📖 **యౌగంధరాయుడు - మాళవికాగ్నిమిత్రము - డా. కొండూరి శ్రీదేవి :** ఈ పుస్తకంలో భాసుడు రాసిన స్వప్నవాసవదత్త నాటకం, కాళిదాసు రాసిన మాళవికాగ్నిమిత్రము రెండు సంస్కృత నాటకాలను శ్రీదేవి గారు తెలుగు చేశారు. ముందుమాట రాసిన వెంపటి వృషాద్రిపతి సంస్కృతాంధ్ర పండితులు. వారి ముందు మాటలో డా. శ్రీదేవి గారి గురించి, వారి వచన రచన ప్రతిభ గురించి వివరంగా చెప్పారు. ముఖ్యంగా మహాకవుల నాటకాలను తెలుగు వచనంలో చేయబూనటం ఒక సాహసమే. అయినా శ్రీదేవి గారు ఎంతో నైపుణ్యంతో ఆ కార్యాన్ని పూర్తి చేశారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా చదవవలసిన పుస్తకం.





*పేజీలు : 160, వెల :100/–, ప్రతులకు : డా. కె. శ్రీదేవి, ఫోన్ : 965 210 9974, 996 320 9974.*

📖 **గ్రంథాంతరంగం - ఘట్టమరాజు అశ్వత్థనారాయణ :** ఘట్టమరాజు గారు ఈ వ్యాసాలకు పుస్తకాలను ఎంపిక చేసికోవడం వెనుక ముఖ్యకారణం ఉంది. ప్రస్తుతం సాహిత్య విద్యార్థులు, పరిశోధకులు చదవని ముఖ్యమైన పుస్తకాలను చాలామందికి కనీసం ఆ పుస్తకాల పేర్లు కూడా తెలియవని ఆయన బాధ. ఆ బాధే ఆయనను ఈ గ్రంథ రచనకు పురికొల్పింది. ఊరికే గ్రంథాలను నామమాత్రంగా పరిచయం చేయడం ఆయన ఉద్దేశం కాదు. వాటి అంతరంగాన్ని విప్పిచెప్పడం ఆయన లక్ష్యం. బహుశా ఆ పుస్తకాల పునర్ముద్రణ ఆవశ్యకతను ఉద్ఘాటించడం కూడా ఆయన లక్ష్యంలో ఒక భాగం.




*పేజీలు : 256, వెల : 200/–, ప్రతులకు : ఎమెస్కో బుక్స్, హైదరాబాద్, ఫోన్ : 040–23264028, ఎమెస్కో బుక్స్, విజయవాడ, 0866 – 2436643*

📖 **నలచరిత్ర - గార రంగనాథం :** నలచరిత్ర మహా ప్రబంధాన్ని పద్యరూపంలో రాసినవారు బెహెరా రామకృష్ణ కవి. ఆ గ్రంథాన్ని పరిచయం చేస్తున్నవారు గార రంగనాథం. ఆయన మాటల్లో గ్రంథమంతటా అలంకారాలను విరివిగా వెదజల్లినా, ఎక్కడా వ్యర్థ పదాలు, ఊతపదాలు తారసపడవు. అందుకు బెహెరా రామకృష్ణ కవి నలచరిత్ర మధుర ప్రబంధం. కళింగాంధ్రలో వెలసిన కమనీయ కావ్యం.




*పేజీలు : 316, వెల : 300/–, ప్రతులకు : గార రంగనాథం, ఫోన్ : 9885758123*

# మిసిమి
మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి     బహుమతిగా పంపండి**

ప్రియమైన పాఠకులకు ఒక సూచన : తపాలా ఖర్చులు పెరిగిన మూలంగా పత్రిక వెల **జనవరి 2026 నుంచి రూ. 60/-** చేయవలసి వస్తున్నది. పాఠకులు సహకరించగలరని ఆశిస్తున్నాం.

మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

**A/C Name : Misimi A Unit of Kalajyothi Process P Ltd.**
**HDFC Current Account No. 50200091136242**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**

₹720/- (సంవత్సర చందా),
₹1440/- (రెండు సంవత్సరాలకు),
₹2,160/- (మూడు సంవత్సరాలకు),


**Scan QR to Pay**

Misimi A Unit of Kalajyothi

## మిసిమి ప్రచురణలు



నోబెల్ వ్యాసాలు | మిసిమి పార్థసారథి వ్యాసాలు | చిత్రకళా నీరాజనం | దూరతీరాలలో... | బహుముఖ బనారస్ | ఐరోపా శిల్ప - చిత్రకళావైభవం



పురస్కార సాహిత్యం | వ్యాస మంజూష | సారస్వత వ్యాసాలు | చార్లీ చాప్లిన్ | రజ్జు సర్ప భ్రాంతి | బైరన్ | యాత్రా కథనాలు



షెల్లీ జీవిత కథ | కళా కడలిలో కొత్త కెరటాలు | నృత్యభారతి | పారిజాతం | సిద్ధార్థ | సప్తపర్ణి | ప్రవాస సాహిత్యం

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. **ఫోన్: 994 951 6567.**

Printed & Published by **BAPANNA ALAPATI**
Printed at **Kala Jyothi Process Pvt. Ltd.,** Plot No. CFC-1&2, Survey No. 18, E-City, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, **Telangana - 501 359.**